

ఈనాడు



విజయవాడ 28-1-2026 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 168

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఈయూ - భారత్ చెట్టపట్టాల్

కుదిరిన చరిత్రాత్మక ఒప్పందం

స్వేచ్ఛా వాణిజ్యంతో ఐరోపా కార్లు, మద్యం చౌక

మన వ్యవసాయ ఉత్పత్తులకు ఊతం

భద్రత, రక్షణ రంగంలోనూ బంధం బలోపేతానికి ఒప్పందం



దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ఐరోపా కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్‌తో ప్రధాని మోదీ

దిల్లీ

భారత్, ఐరోపా కూటమి (ఈయూ) మధ్య చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) పురుడు పోసుకుంది. మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా పిలిచే ఈ ఒప్పందాన్ని మంగళవారం దిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఈయూ నేతలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్, ఆంటోనియో కోస్టా సంయుక్తంగా ప్రకటించారు. దీంతోపాటు భద్రత, రక్షణ రంగంలో బంధం మరింత బలోపేతం, భారతీయ నిపుణులకు ఐరోపా దేశాల్లో అవకాశాలను కల్పించే ఒప్పందాలూ కుదిరాయి. ప్రధాని, ఈయూ నేతల శిఖరాగ్ర చర్చల అనంతరం ఒప్పంద వివరాలను నేతలు వెల్లడించారు. భారత్, 27 ఐరోపా దేశాలు సంయుక్తంగా వచ్చే ఐదేళ్లలో ఈ ఒప్పందంపై అనుసరించాల్సిన వ్యూహాత్మక ఎజెండాను ఖరారు చేశాయి. ఎఫ్‌టీఏపై చర్చలతో ప్రారంభించి మొత్తం 13 ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం కారణంగా ఐరోపా కార్లు, మద్యం భారత్‌లో చౌకగా లభించనున్నాయి. భారతీయ రైతులు, చిన్న పరిశ్రమలవారి ఉత్పత్తులకు ఐరోపా మార్కెట్‌లో విస్తృత అవకాశాలు లభించనున్నాయి.

■ ప్రపంచ జీడీపీలో 25శాతానికి, వాణిజ్యంలో మూడో వంతుకు ఈ ఒప్పందం ప్రాతినిధ్యం వహించనుంది.

■ ఎఫ్‌టీఏతో ఈయూ దేశాలకు (మిగతా 2లో)

> ఈ ఒప్పందానికి విశేషమైన ప్రాధాన్యం ఉంది. 200 కోట్ల మందికి మార్కెట్లను సృష్టించే అవకాశం. ఇండో పసిఫిక్‌లో అభద్రతను తొలగించి ప్రజలకు మరింత రక్షణ ఇవ్వడానికి ఇది తోడ్పడుతుంది. - కోస్టా

> ఈ రోజు భారత్ తన చరిత్రలోనే అత్యంత భారీ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇది ఐరోపా మార్కెట్లను మన రైతులకు, చిన్న పరిశ్రమల వారికి మరింత చేరువ చేస్తుంది. భారత్, ఐరోపాల మధ్య పెట్టుబడులకు మార్గం సుగమం చేస్తుంది. నూతన ఆవిష్కరణల భాగస్వామ్యాన్ని సృష్టిస్తుంది. సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ఇది కేవలం వాణిజ్య ఒప్పందమే కాదు. సంపదను పంచుకునే బ్లూప్రింట్. - నరేంద్ర మోదీ

> మేం చేసి చూపించాం. మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌ను సాకారం చేశాం. 200 కోట్ల మంది ప్రజలకు మార్కెట్‌ను సృష్టించాం. - ఉర్సులా

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో రూ.6.9 లక్షల కోట్ల లబ్ధి!

- 90% ఉత్పత్తులకు సుంకమే పడదు
- మన విద్యార్థులు, వృత్తినిపుణులకు సులువుగా వర్క్‌వీసా

ఈబిజినెస్ పేజీలో

దేశీయంగా విమానాల తయారీ



కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకుంటున్న అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ ప్రెసిడెంట్, సీఈఓ ఆశిష్‌రాజవంశీ, ఎంబ్రాయెర్ ప్రెసిడెంట్, సీఈఓ అర్జన్ మెయిజర్. చిత్రంలో పౌరవిమానయాన శాఖ కార్యదర్శి సమీర్‌కుమార్‌సిన్హా, రక్షణశాఖ కార్యదర్శి రాజేష్‌కుమార్‌సింగ్, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ సతీష్‌రెడ్డి ఇతరులు

- ఎంబ్రాయెర్-అదానీ భాగస్వామ్య ఒప్పందం
- పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడి

ఈనాడు, దిల్లీ: దేశంలో అత్యధిక డిమాండ్ ఉన్న 80-150 సీట్ల విమానాలను ఇక్కడే తయారుచేసే వ్యవస్థ ఏర్పాటు కోసం అదానీ గ్రూప్, బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రాయెర్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరినట్లు కేంద్ర పౌరవిమానయాన మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులకు (మిగతా 2లో)

ఏపీలో విమాన తయారీ కేంద్రం?

ఉమ్మడి 'అనంత' జిల్లాలో ఏర్పాటుకు ప్రభుత్వం ప్రయత్నం

భూములు కేటాయించేందుకు సంసిద్ధత

ప్రాజెక్టు దక్కించుకునేందుకు ఏపీ, గుజరాత్ పోటీ

2లో



గ్రూప్-2 ఎంపిక జాబితా విడుదల

ఈనాడు, అమరావతి: గ్రూప్-2 పరీక్షల తుది ఎంపిక జాబితాను ఏపీపీఎస్సీ మంగళవారం అర్ధరాత్రి విడుదల చేసింది. మొత్తం 905 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వగా.. 891 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెల్లడించింది. ఈ పోస్టుల్లో హైకోర్టు తీర్పును అనుసరించి, హారిజంటల్ రిజర్వేషన్ కారణంగా 25 పోస్టుల్లో మార్పులు జరిగే అవకాశముంది. మిగతా 866 పోస్టుల్లో ఏ మార్పూ ఉండదు. క్రీడా కోటాకు సంబంధించిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున జాబితా తయారీలో ఇన్నాళ్లుగా జాప్యం జరిగింది. ప్రకటించని 14 పోస్టుల్లో.. హైకోర్టు తీర్పుతో పక్కన పెట్టిన క్రీడా కోటా పోస్టులు 2 పోనూ.. 7 దివ్యాంగ, 5 రిజర్వేషన్ పోస్టులకు ఆయా కేటగిరీల్లో అభ్యర్థులు లేరు.

మూడు నెలల్లో మెరుగుపడాలి



తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్లమెంట్ కమిటీ వర్క్‌షాప్‌లో శిక్షణ తరగతికి హాజరై మాట్లాడుతున్న పార్టీ అధినేత చంద్రబాబు

- లేదంటే పదవుల్లోంచి పక్కనపెడతా
- తెదేపా లోక్‌సభ నియోజకవర్గ కమిటీల శిక్షణలో చంద్రబాబు
- పలు జిల్లాల నుంచి హాజరు తగ్గడంపై అసంతృప్తి
- వైకాపా విమర్శలను తిప్పికొట్టాలని పిలుపు

ఈనాడు, అమరావతి: 'పదవులు తీసుకున్న వారిని మూడు నెలలు పరిశీలిస్తా. మీ పనితీరు మెరుగుపడకపోతే పక్కనపెడతా. కొత్తవారికి అవకాశమిస్తా. కష్టపడే వారికే పదవులు, ప్రోత్సాహం ఉంటాయి. అంతర్గత గొడవలు, ఆధిపత్య పోరు వద్దు. బూత్, యూనిట్, క్లస్టర్ ఇలా ఎవరి పరిధిలో వారు పనిచేయాలి. ఇతరుల వ్యవహారాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తప్పవు' అని తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ నేతలను హెచ్చరించారు. పార్టీకి చెడ్డపేరు తెచ్చినా, కోవర్టులుగా ఉండి విమర్శలు చేసినా ఊరుకోబోమని తేల్చిచెప్పారు. పార్టీ నిర్ణయాలకు అనుగుణంగా పనితీరు మార్చుకోవాలని సూచించారు. పార్టీ లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షుడు.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితో సమానమని పేర్కొన్న చంద్రబాబు.. ఆయనతో ఆయా జిల్లాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కలిసి పనిచేయాలని ఆదేశించారు. అప్పుడే పొలిటికల్ గవర్నెన్స్ లక్ష్యం సాకారమవుతుందన్నారు. (మిగతా 2లో)

పార్టీలో సంస్కరణలకు కృషి చేస్తున్నా

ఒకరు ఒకే పదవిలో రెండుసార్లకంటే ఎక్కువ ఉండకూడదు

పార్లమెంట్ కమిటీ వర్క్‌షాప్‌లో మంత్రి నారా లోకేశ్

3లో

డ్రగ్స్‌ను పారదోలుదాం



డ్రగ్స్ వద్దు అంటూ ప్రతిజ్ఞ చేయిస్తున్న హోం మంత్రి అనిత. వేదికపై ప్రమాణం చేస్తున్న రాజశేఖర్‌బాబు, డాక్టర్ సమరం, రవికృష్ణ, హరీష్‌కుమార్‌గుప్తా, గద్దె రామ్మోహన్, మంత్రి సత్యకుమార్ తదితరులు

- గంజాయి మూలాలను కూకటివేళ్లతో పెకిలించాం
- మంత్రులు అనిత, సత్యకుమార్ యాదవ్
- 'డ్రగ్స్‌పై దండయాత్ర' ప్రారంభం

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రాన్ని డ్రగ్స్‌రహితంగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున కార్యక్రమాలను నిర్వహిస్తోంది. డ్రగ్స్‌పై యుద్ధం చేయాలన్న ఆలోచనకు మూడేళ్ల కిందట లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రలోనే బీజం పడింది. పాదయాత్రలో ఎంతో మంది తల్లిదండ్రులు డ్రగ్స్‌పై తమ ఆందోళన వ్యక్తం చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో గంజాయి వినియోగం భారీగా ఉండేది. దీనిపై ఉక్కుపాదం మోపాం. ఇప్పుడు ఏపీలో గంజాయి మొక్క లేదు. వీటి మూలాలను గుర్తించి కూకటివేళ్లతో సహా పెకిలించాం' అని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం సాయంత్రం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన 'డ్రగ్స్‌పై దండయాత్ర' (మిగతా 3లో)

రూ.లక్ష కోట్లు దాటిన పన్నుల రాబడి

- 9 నెలల్లో ఇంత వసూలు ఇదే తొలిసారి
- రాష్ట్ర మూలధన వ్యయం రూ.19,224 కోట్లు
- గణాంకాలు విడుదల చేసిన కాగ్



ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో తొలి మూడు త్రైమాసికాల్లోనే పన్నుల రాబడి రూ.లక్ష కోట్లు దాటింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి తొమ్మిది నెలలకు పన్నుల ద్వారా ఆదాయం రూ.1,05,331.07 కోట్లకు చేరింది. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ 9 నెలల కాలానికే ఈ స్థాయిలో పన్నుల రాబడి సాధించింది లేదు. జీఎస్టీ, స్టాంపుల రిజిస్ట్రేషన్ల ఫీజు రూపంలో వచ్చిన మొత్తం, భూమి శిస్తు, అమ్మకపు పన్ను, ఎక్సైజ్ సుంకం, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా, ఇతర పన్నులనూ కలిపి రాష్ట్ర పన్నుల రాబడిగా లెక్కిస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం పన్నుల రాబడి రూ.1,66,573.09 కోట్లుగా అంచనా వేశారు. ఇందులో డిసెంబరునాటికి 63.23 శాతం సమకూరింది. జనవరి సహా రానున్న మూడు నెలల్లో మరో 36 శాతంమేర పన్నులు వసూలైతే లక్ష్యం చేరినట్లు అవుతుంది. 2025-26లో తొలి మూడు త్రైమాసికాల లెక్కలను కాగ్ మంగళవారం విడుదల చేసింది. వివరాలు ఇలా.. (మిగతా 3లో)

రెవెన్యూ లోటు రూ.60,480 కోట్లు

ఈ ఆర్థిక సంవత్సరంలో (డిసెంబరు నెలాఖరుకు) రాష్ట్ర ప్రభుత్వం రూ.85,312 కోట్ల మేర రుణాలు సమీకరించింది. రాష్ట్ర రెవెన్యూ లోటు 60,480 కోట్లకు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రూ.33,185.97 కోట్ల రెవెన్యూ లోటు ఉంటుందని అంచనా వేస్తే అది అంచనాల కన్నా అధికంగా ఉంది. అంచనాలతో పోలిస్తే 182శాతంగా ఉంది. రెవెన్యూ రాబడి రూ.1,18,244.98 కోట్లు కాగా రెవెన్యూ వ్యయం రూ.2,03,557.29 కోట్లుగా కాగ్ లెక్క తేల్చింది.



నేటి నుంచి మేడారం మహా జాతర


31 వరకు కోలాహలం

ఈనాడు, మేడారం: దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర... మేడారం. రెండేళ్లకోసారి కోలాహలంగా జరిగే ఈ మహా జాతరకు వేళయ్యింది. కోట్ల మంది భక్తుల కొంగుబంగారమైన సమ్మక్క, సారలమ్మ తల్లులు గద్దెలపై కొలువుదీరే ఘడియలు ఆసన్నమయ్యాయి. బుధవారం నుంచి ఈ నెల 31 వరకు వైభవంగా జరిగే జాతరకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. రూ.251 కోట్ల నిధులు వెచ్చించి (మిగతా 3లో)



గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత నిధి
కేంద్ర కార్మిక మంత్రి శోభా కరంద్లాజె లోపలి పేజీలో

ఇదీ సంగతి!



నల్లికి ఒకటి.. ఈగకు ఇంకోటి

- విచ్చలవిడిగా రసాయన మందుల పిచికారీ
- చీడపీడల తాకిడితో మిరప రైతుల అవస్థలు
- పెట్టుబడి ఎకరాకు రూ.3.50లక్షల పైమాటే



ఈనాడు - అమరావతి

మనుషులకైతే జ్వరానికో మందుబిళ్ల.. నొప్పులకు మరోటి.. దగ్గు, జలుబుకూ వేర్వేరుగా వేసుకోవాల్సిందే. వీటికితోడు యాంటిబయాటిక్ వాడటం అలవాటైపోయింది. మిరప రైతుల పరిస్థితీ ఇప్పుడంతే. చీడపీడల దాడితో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నల్లి(నల్లతామర) నివారణకు ఒకటి, పైముడతకు మరోటి.. కింది ముడతకు ఇంకోటి.. మొక్క ఎదుగుదలకు మరో మందు.. మిడ్జ ఈగకు సింథటిక్ పైరెథ్రాయిడ్స్... ఇలా ఒక దఫా పిచికారీకి నాలుగైదు మందులు కలబోస్తున్నారు. రూ.4వేలకు పైగా ఖర్చవుతోంది. ఫలితంగా పెట్టుబడి తడిచి మోపెడవుతోంది. వాతావరణం అనువుగా ఉంటే వారానికి ఒకసారి పిచికారీ చేస్తే సరిపోతుంది. ప్రస్తుతం చీడపీడల తీవ్రత అధికంగా ఉండటంతో కొందరు రైతులు వారానికి రెండుసార్లు చొప్పున పిచికారీ చేస్తున్నారు. అంటే నెలకు కనీసం 8 సార్లు పిచికారీ చేస్తే ఎకరాకు రూ.30వేల వరకు అవుతోంది. వేర్వేరు మందులు, అధిక పిచికారీలు, ఎరువుల ధరల వల్ల గతేడాదితో పోలిస్తే ఎకరాకు రూ.50వేల వరకు ఖర్చు పెరిగింది. దుక్కి దున్నకం నుంచి మిరప కోసి మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్మే వరకు ఎకరాకు రూ.3.50లక్షల వరకు పెట్టుబడి అవుతోంది. కోత ఖర్చుల రూపంలోనే ఎకరాకు రూ.1.20లక్షల వరకు వెచ్చిస్తున్నారు. రైతు కుటుంబ శ్రమ కూడా కలిపితే ఎకరాకు సుమారు రూ.4లక్షల వరకు వస్తేనే రైతులు ఒడ్డున పడతారు.

సింగిల్ చాలదు.. డబుల్ డోస్

హైబ్రిడ్ మిరప సాగు ఉమ్మడి గుంటూరు, కర్నూలు, అనంతపురం, కృష్ణా జిల్లాల్లోనే అధికం. 2021 నుంచి రైతుల్ని నలిపేస్తున్న నల్లతామర ఈ ఏడాదీ ఆశించింది. దీంతోపాటు ముడత, ఈగ ఆశించాయి. వాటి నివారణకు రైతులు వేర్వేరు రకాల మందులు చల్లుతున్నారు. (మిగతా 2లో)

(c) eenadu

మూడు నెలల్లో మెరుగుపడాలి

(మొదటి పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో జనసేన, భాజపా నాయకులతో సమన్వయంతో మెలగాలని సూచించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్టీ లోక్‌సభ నియోజకవర్గ కమిటీల శిక్షణలో చంద్రబాబు మాట్లాడారు. వివిధ జిల్లాల నుంచి కమిటీ సభ్యులు గైర్హాజరు కావడం, అనంతపురం జిల్లాలో ఆ సంఖ్య ఎక్కువగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. కమిటీ సభ్యులే రాకపోతే ఇక జిల్లా నాయకత్వాన్ని ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. శిక్షణ తరగతుల్లో పాల్గొన్నవారి హాజరు వివరాల్ని జిల్లాల వారీగా చదివి వినిపించారు.

పనితీరుపై నిరంతరం నివేదికలు

కమిటీల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటానని చంద్రబాబు తెలిపారు. 'జనాభా నిష్పత్తి ప్రకారం బీసీలకు 37.2, ఓసీలకు 31.9, ఎస్సీలకు 19.6, మైనార్టీలకు 7.4, ఎస్టీలకు 3.9 శాతం చొప్పున పదవులు ఇచ్చాం. అన్నివర్గాలకు న్యాయం చేశాం. మీ పనితీరును మెరుగుపరుచుకుంటూ పార్టీని బలోపేతం చేయాలి. అదే మీకు శ్రీరామరక్ష. పార్టీ పెట్టి 44 ఏళ్లు అయ్యింది. సగటున 46 ఏళ్ల వయసున్న వారు నాయకత్వం వహిస్తున్నారు. ఎవరికి ఏ పదవి ఇచ్చినా కార్యకర్తల అభిప్రాయం తీసుకుంటున్నా. పార్టీ కంటే ఏదీ ముఖ్యం కాదు. ఎవరు నిర్లక్ష్యం వహించినా పక్కనపెడతా' అని అన్నారు.

కార్యకర్తే అధినేత..

కార్యకర్తే పార్టీ అధినేత అని చంద్రబాబు స్పష్టం చేశారు. 'కార్యకర్తలకు న్యాయం జరిగినప్పుడే నాయకులుగా మీరు, పార్టీ శాశ్వతంగా ఉంటుంది. వైకాపా ప్రభుత్వంలో వారెన్నో కష్టాలు పడ్డారు. ఏ పని చేసినా కార్యకర్తలకు గుర్తింపు ఉండేలా వారి ద్వారానే జరగాలి' అని తేల్చిచెప్పారు. 'భవిష్యత్తులో ఏ ఎన్నిక జరిగినా పార్టీ గెలవాలి. 2024 ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే పది ఓట్లు ఎక్కువే వచ్చేలా లోక్‌సభ నియోజకవర్గ కమిటీలు ఇప్పటి నుంచే పనిచేయాలి. ప్రభుత్వం చేస్తున్న మంచిని ఇంటింటికీ తీసుకెళ్లండి. హామీలు నెరవేర్చామని గర్వంగా చెప్పండి' అని చంద్రబాబు సూచించారు. భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, అవసరమైతే తగ్గిస్తామని హామీ ఇచ్చారు.

తిప్పికొట్టండి

క్రెడిట్ చోరీ అంటూ వైకాపా వాళ్లు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు దుయ్యబట్టారు. 'వైకాపా శ్రేణులు అడిగిన భూములు ఇవ్వలేదనే అక్కసుతో జగన్ ప్రభుత్వంలో వేల ఎకరాలు 22ఏలో చేర్చి, పేదలను వేధించారు. లోపభూయిష్టమైన ల్యాండ్ టైటిలింగ్ చట్టం తెచ్చారు. భోగాపురం విమానాశ్రయానికి మనం 2,500 ఎకరాలు సేకరిస్తే, అందులో 500 ఎకరాలు కొట్టేయాలని చూశారు' అని మండిపడ్డారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించి, దాన్ని సమర్థించుకోవాలని వైకాపా వాళ్లు చూస్తున్నారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

శిక్షణ తరగతుల్లో... సామాన్య కార్యకర్తలా



వర్క్‌షాప్‌లో శిక్షణ పాఠాలు వింటున్న చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఆయన నాలుగోసారి ముఖ్యమంత్రి.. తెలుగుదేశం అధినేత.. నాలుగున్నర దశాబ్దాలకుపైగా సుదీర్ఘ రాజకీయ అనుభవం... అయినా పార్టీ కార్యక్రమం అనేసరికి సాధారణ కార్యకర్తలా మారిపోయారు. లోక్‌సభ నియోజకవర్గ కమిటీల సభ్యులకు మంగళవారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో చంద్రబాబు సాధారణ కార్యకర్తలా పాల్గొన్నారు. 25 లోక్‌సభ నియోజకవర్గ కమిటీల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు సహా... కమిటీల్లోని సభ్యులు 1,050 మందికి వర్క్‌షాప్ ఏర్పాటు చేశారు. సభ్యుల్ని 11 బృందాలుగా విభజించి... సీనియర్ నాయకుల చేత శిక్షణ తరగతులు నిర్వహించారు. షెడ్యూలు ప్రకారం వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో పాల్గొనేందుకు చంద్రబాబు సాయంత్రం 4 గంటలకు పార్టీ కార్యాలయానికి రావాల్సి ఉంది. సచివాలయంలో సమావేశాల్ని రద్దు చేసుకుని మధ్యాహ్నం 12.30 గంటలకే ఆయన కార్యాలయానికి చేరుకున్నారు. శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్న 11 చోట్లకూ వెళ్లి సభ్యుల మధ్యలో కాసేపు కూర్చున్నారు. సీనియర్ నాయకులు చెబుతున్న దాన్ని శ్రద్ధగా విని, వర్క్‌షాప్ సాగుతున్న తీరును పరిశీలించారు. అన్ని బృందాల సభ్యులతోనూ ముచ్చటించారు.

ఈయూ-భారత్ చెట్టపట్టాల్..

(మొదటి పేజీ తరువాయి)

భారత్ చేసే 99శాతానికిపైగా ఎగుమతులపై సుంకాలు తగ్గుతాయి. అలాగే ఈయూ భారత్‌కు చేసే 97% ఎగుమతులపై సుంకాలు దిగివస్తాయి. భారత్ నుంచి ఎగుమతి చేసే టెక్స్‌టైల్, దుస్తులు, తోలు ఉత్పత్తులు, హస్త కళలు, పాదరక్షలు, సముద్ర ఉత్పత్తులపై సుంకాలు తగ్గుతాయి. ఐరోపా దేశాల నుంచి వచ్చే మద్యం, ఆటోమొబైల్ ఉత్పత్తులు, రసాయనాలు, ఔషధాలు తదితరాలపై సుంకాలు తగ్గుతాయి.

ఎఫ్‌టీఏపై భారత్, ఈయూ చర్చలు ప్రారంభించిన 18 ఏళ్ల తర్వాత తుది ఒప్పందం కుదిరింది. దీనిపై లాంఛనంగా సంతకాలు చేయడానికి 6 నెలలు పట్టే అవకాశముంది. రెండువైపుల నుంచి చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది.



ఉర్సులా వాన్ డెర్ లెయెన్, ప్రధాని మోదీల సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న మారోస్ సెఫ్కోవిక్, కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్

అంతర్జాతీయ సుస్థిరతకు దోహదం: మోదీ

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో భారత్, ఈయూ ఒప్పందం అంతర్జాతీయ సుస్థిరతను మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 'భారత్, ఈయూ సమగ్ర వ్యూహాత్మక ఎజెండా.. స్పష్టమైన దిశా నిర్దేశం చేస్తుంది. ఆవిష్కరణల ద్వారా సంపదను పంచుతుంది. భద్రతా సహకారం పెరుగుతుంది. ప్రజల మధ్య సంబంధాలు బలపడతాయి' అని మోదీ వెల్లడించారు. భారత్, ఈయూ భాగస్వామ్యం ప్రపంచానికి మంచిదని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ వాణిజ్యం, సుస్థిరాభివృద్ధి కోసం కలిసి ఐఎంఈసీ కారిడార్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. తమ భేటీలో ఉక్రెయిన్, పశ్చిమాసియా, ఇండో పసిఫిక్ అంశాలపై చర్చించామని వెల్లడించారు. బహుళత్వం, అంతర్జాతీయ నిబంధనలు తమ ప్రాధాన్యాంశాలని చెప్పారు. ప్రస్తుత సవాళ్లను ఎదుర్కోవడానికి అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు తేవాల్సిన అవసరముందని ఏకగ్రీవంగా నిర్ణయించామని తెలిపారు. ఉక్రెయిన్‌లో సుస్థిర శాంతి కోసం అందరం ప్రయత్నిస్తున్నామని, ప్రస్తుతం కీలక సమయమని మోదీ వెల్లడించారు.

సహకారమే సరైన సమాధానం: ఉర్సులా

భారత్, ఈయూ ఎఫ్‌టీఏను ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు వాన్ డెర్ లెయెన్ ప్రశంసించారు. ప్రపంచ సవాళ్లకు సహకారమే సరైన సమాధానమని ఈ ఒప్పందం గట్టి సందేశాన్ని పంపనుందని వ్యాఖ్యానించారు. అమెరికా, ఈయూ మధ్య విభేదాలు నెలకొన్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'ఇది రెండు దిగ్గజాల కథ. ప్రపంచంలోనే రెండో, నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల పరస్పర ప్రయోజనకారి భాగస్వామ్యం' అని వివరించారు. ఈ ఒప్పందంవల్ల ఈయూ దేశాలకు 4 బిలియన్ యూరోల సుంకాలు ఆదా అవుతాయని, భారత్, ఈయూల్లో లక్షల ఉద్యోగాల సృష్టి జరుగుతుందని తెలిపారు. ఎఫ్‌టీఏవల్ల ఐరోపా టెక్నాలజీ, పెట్టుబడులు, ఆవిష్కరణలకు భారతీయ నైపుణ్యం, సేవలు తోడవుతాయని వెల్లడించారు. ఇవి రెండూ ఒంటరిగా సాధించలేని విజయాలు సాధ్యమవుతాయని వివరించారు. ఈ ఉమ్మడి బలాలతో వాణిజ్యాన్ని ఆయుధంగా మార్చుకునే వ్యవస్థలపై ఆధారపడటం తగ్గుతుందని (ట్రంప్‌నుద్దేశించి) పేర్కొన్నారు. 'మేం మా ఆర్థిక వ్యవస్థలనే బలోపేతం చేసుకోవడం లేదు. ప్రస్తుత అభద్రతా భావ ప్రపంచంలో మా ప్రజల భద్రతను పటిష్ఠం చేస్తున్నాం. ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు రెండు.. తొలిసారిగా భద్రత, రక్షణ భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నాయి' అని ఉర్సులా వివరించారు.

సుస్థిరతకు బలమైన వేదిక: ముర్ము

ఆధునిక సంక్లిష్టతలను పరిష్కరించడంలో భారత్, ఈయూ ఉమ్మడి అంతర్జాతీయ వేదిక ఎంతో అవసరమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాలని, బలహీనపరచవద్దని సూచించారు. అప్పుడే అవి సమకాలీన పరిస్థితులను అర్థం చేసుకోగలవని పేర్కొన్నారు. భారత్ పర్యటనకు వచ్చిన ఈయూ నేతలు ఉర్సులా, కోస్టాల గౌరవార్థం మంగళవారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లో విందు కార్యక్రమాన్ని ముర్ము ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లు.. సంక్లిష్టంగా ఉన్నాయని, అయితే పరిష్కరించే అవకాశాలూ విస్తృతంగా ఉన్నాయని రాష్ట్రపతి స్పష్టం చేశారు. భారత్, ఈయూ భాగస్వామ్యం.. సమతూకం, స్థిరత్వం, ఆశావాదాన్ని పరిరక్షించే శక్తిగా మారుతోందని పేర్కొన్నారు.

నల్లికి ఒకటి.. ఈగకు ఇంకోటి

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభంలో వారానికి ఒకసారి చల్లితే సరిపోయేది. ఇప్పుడు మూడోరోజే పొలంలో మళ్లీ ప్రభావం కన్పిస్తోంది. నిరోధకశక్తి పెంచుకుందని.. అందుకే వారానికి రెండు, మూడుసార్లు చల్లక తప్పడం లేదని రైతులు పేర్కొంటున్నారు.

■ సిఫారసు చేసిన మోతాదులో మందులు చల్లితే నల్లతామర నివారణ కావడం లేదంటూ.. తాడికొండ, పెదకూరపాడు, గురజాల నియోజకవర్గాల్లోని కొందరు రైతులు మోతాదు పెంచుతున్నారు. డబుల్ డోస్ వాడుతున్నారు. అంటే రెండెకరాల్లో చల్లాల్సిన మందును ఎకరాకే వేస్తున్నారు. దీనివల్ల పెట్టుబడి మరింతగా పెరుగుతోంది.

■ రైతులు ఎవరైనా పెట్టుబడి భరించలేమని మందుల పిచికారీలో అశ్రద్ధ చూపితే.. ఆశలు వదులుకోవాల్సిందే. పెట్టుబడి కోల్పోవాల్సిందే.

క్వింటాల్ రూ.22 వేలు ఉంటేనే గట్టెక్కేది

సన్న రకాల మిరప ధరలు సగటున క్వింటాల్ రూ.15వేలు ఉన్నాయి. ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా.. వాతావరణం అనుకూలిస్తే ఎర్ర కాయ 18 క్వింటాళ్లు, తాలు 2 క్వింటాళ్లు వస్తుంది. వర్షాలు కురిస్తే తాలు కాయ మరింత పెరుగుతుంది.

■ రైతు శ్రమ కూడా కలిపితే ఎకరాకు రూ.4లక్షలు వస్తేనే ఒడ్డెక్కుతారు. 18 క్వింటాళ్ల లెక్కన చూస్తే క్వింటాల్‌కు రూ.22వేల వరకు దక్కాలి. కానీ ప్రస్తుతం సగటున రూ.15వేలు మాత్రమే ఉంది. ముడతలు, కారం ఎక్కువగా ఉండేవి, రంగు కాయలకు మాత్రమే రూ.20వేల వరకు దక్కుతోంది. కొన్ని రకాలకు ధరలు పెరుగుతున్నా.. అధికశాతం రైతులు సాగు చేసే రకాలకు మాత్రం అంతంతమాత్రంగానే ఉంది. మిరప ధరలపై ఇప్పటి నుంచే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

ఎరువుల వాడకంలోనూ పోటాపోటీ

అయితే మిరప, లేదంటే పత్తి.. ఇటీవల మొక్కజొన్న సాగు పెరిగింది. భారీగా ఎరువుల వాడకంతో నేలలో ఆమ్లత్వం పెరుగుతోంది. మొక్కలు ఎదగడం లేదు. దీంతో రైతులు అధిక పరిమాణంలో ఎరువులు వాడుతున్నారు. గతంలో నీటితడి(పక్షానికోసారి) ఇచ్చిన ప్రతిసారీ ఎకరాకు బస్తా యూరియా, మరో బస్తా కాంప్లెక్స్ చల్లేవారు. ఇప్పుడు వారం, పదిరోజులకోసారి నీటితడి ఇస్తున్నారు. రెండుకు బదులుగా మూడు బస్తాల ఎరువులు వేస్తున్నారు.

■ గతంతో పోలిస్తే ఎరువుల ధరలు ఈ ఏడాది మరింతగా పెరిగాయి. 28.28.0, 14.35.14, 10.26.26 తదితర రకాల ఎరువుల బస్తా ధర రూ.1,950 వరకు చేరింది. రవాణా కూడా కలిపితే రూ.2వేల పైమాటే. అంటే రెండు కాంప్లెక్స్, ఒక యూరియా వేస్తే ఒక దఫాకు రూ.4,500 వరకు అవుతోంది.

■ ఎరువులు, చీడపీడల నివారణ మందుల వాడకం పెరిగింది. ధరలూ అధికం అయ్యాయి. దీంతో గతేడాదితో పోలిస్తే ఎకరాకు రూ.50వేల వరకు పెట్టుబడి పెరిగింది.

'ఉపాధి'లో రూ.740 కోట్ల మెటీరియల్ నిధుల విడుదల

ఈనాడు, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(నరేగా)లో మెటీరియల్ కాంపోనెంట్ కింద ప్రభుత్వం రూ.740 కోట్లు విడుదల చేసింది. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.480.87 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.259.13 కోట్లుగా పేర్కొంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాలుగో విడతలో మొదటి ట్రెంచి కింద ఈ నిధులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేశాయి. దీంతో గతేడాది అక్టోబర్ వరకు పెండింగులో ఉన్న బిల్లులు చెల్లింపునకు మార్గం సుగమం అయ్యింది. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మెటీరియల్ నిధులు విడుదల చేయడంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
RFP No.2/AEE/DEE/RFP/Planning/Office, Dt.23.01.2026
మయూరి టెక్ పార్క్ (7వ అంతస్తు), మంగళగిరి, గుంటూరు వద్ద ENC,RWS&S శాఖ కొరకు కార్యాలయం నిర్వహణ సహా స్కెలిటల్ ఆఫీసు స్పేస్ మరియు కామన్ ఏరియా కొరకు 24 నెలల వ్యవధికి గానూ "ప్లగ్ అండ్ ప్లే వర్క్ స్టేషన్ మరియు ఇతర సేవల ఏర్పాటు"కు ఆర్ఎఫ్‌పి కోరబడుతున్నది. ఆర్ఎఫ్‌పిలో పాలుపంచుకోగోరు ఏజన్సీలు ఇ-ప్లాట్‌ఫారం www.tender.apeprocurement.gov.inలో 28.01.2026 నుంచి 04.02.2026 వరకు డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. సంప్రదించండి: 91001 20513.
సం/- ఇంజనీర్-ఇన్-ఛీఫ్ & ఛీఫ్ ఇంజనీర్-I, RWS & S Dept., విజయవాడ
DIPR No.18880/CL/ADVT/1/1/2021-22

ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ లిమిటెడ్
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యాజమాన్య సంస్థ)
రిజిస్టర్డు ఆఫీసు: జోడుగుళ్లపాలెం, విశాలక్షి నగర్ సమీపాన, APEPDCL ప్రక్కన, విశాఖపట్నం-530043.
కాఫీ బీన్స్ అమ్మకం ప్రకటన
రిఫ.నెం.4.5.17/Coffee/2025-26/A2, తేది: 24-01-2026
NCDEX ఇ-మార్కెట్స్ లిమిటెడ్ ద్వారా 2025-26 సీజన్‌లోని గ్రేడెడ్ కాఫీ బీన్స్ 06 ఫిబ్రవరి 2026 నుండి ప్రారంభమయ్యే అన్ని శుక్రవారాలలో పరిమాణం విక్రయించబడేంత వరకు ఇ-వేలంలో అమ్మబడును. వేలం షెడ్యూలు ప్రకారం 20.03.2026 (శుక్రవారం), 27.03.2026 (శుక్రవారం) మరియు 03.04.2026 (శుక్రవారం)లలో జరిగే వేలాలు ప్రభుత్వ సెలవు దినాలు ఏక కాలంలో సంభవిస్తున్నందున ఈ దినాలలో జరగవలసిన వేలాలు వరుసగా 21.03.2026 (శనివారం), 28.03.2026 (శనివారం) మరియు 04.04.2026 (శనివారం)లలో నిర్వహించబడును. NeML తో నమోదు, కాఫీ విక్రయాల ప్రత్యేక నియమ నిబంధనలు, విక్రయ తేదీలు మరియు ఇతర తాజా సమాచారం కొరకు వెబ్‌సైట్స్ www.apfdc.com/www.Neml.inను చూడవచ్చును. వివరాలకు సంప్రదించండి: APFDC 8008301628 NeML ఫోన్ నెం. 022-66473153/54 (లేదా) 9885549722, ఇ-మెయిల్: askus@neml.in
సం/- డా. జ్యోతి తుల్లిమెల్లి IFS, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ & రీజినల్ మేనేజర్, A.P.F.D.C లిమిటెడ్, విశాఖపట్నం
DIPR No. 4767 PP/CL/ADVT/1/1/2021-22

అమరావతికి చట్టబద్ధత కల్పించండి

ఈ సమావేశాల్లోనే బిల్లు తీసుకురండి

అఖిలపక్ష సమావేశంలో తెదేపా, జనసేన డిమాండ్

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ బడ్జెట్ సమావేశాల్లో బిల్లు తీసుకురావాలని తెదేపా, జనసేనలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజూ, న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌ల ఆధ్వర్యంలో మంగళవారం పార్లమెంట్ ప్రాంగణంలో జరిగిన అఖిల పక్ష సమావేశంలో తెదేపా, జనసేన పార్లమెంటరీ పార్టీ నేతలు లావు శ్రీకృష్ణదేవరాయలు, వల్లభనేని బాలశౌరి ఈ అంశాన్ని ప్రస్తావించారు. సమావేశానంతరం శ్రీకృష్ణదేవరాయలు విలేకర్లతో మాట్లాడుతూ తాము తెదేపా తరఫున 3 జాతీయ, 5 రాష్ట్ర అంశాలపై పార్లమెంటులో చర్చ చేపట్టాలని కోరినట్లు చెప్పారు. 'రాష్ట్ర అంశాల్లో ప్రధానమైనది అమరావతి. రాష్ట్ర విభజన తర్వాత వచ్చిన తెదేపా ప్రభుత్వం అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా నిర్ణయించినప్పటికీ 2019-24 వరకు ఉన్న వైకాపా ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో అందర్నీ అయోమయంలో పడేసింది. ఇలాంటి పరిస్థితే ఉంటే పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ రారు. రాజధాని కోసం 33 వేల ఎకరాలు ఇచ్చిన రైతులకూ ఇబ్బందులు రావచ్చు. ఈ అనిశ్చితిని తొలగించడానికి అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ప్రకటించే బిల్లును ఈ బడ్జెట్ సమావేశాల్లోనే తీసుకురావాలని విజ్ఞప్తి చేశాం' అన్నారు. అమరావతిపై కేంద్ర ప్రభుత్వం కొత్త బిల్లు తీసుకొస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రానికీ కేంద్ర ప్రభుత్వం రాజధానిని నిర్ణయించలేదన్న వాదనలను ఆయన కొట్టిపారేశారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో తెలంగాణ రాజధానిగా హైదరాబాద్‌ను కేంద్రమే నిర్ణయించిందని గుర్తు చేశారు. గత బడ్జెట్‌లో ప్రకటించిన పూర్వోదయ పథకం కింద నిధులు త్వరగా విడుదల చేయాలని, నదుల అనుసంధానంపై సభలో చర్చించాలని కోరినట్లు చెప్పారు. జలజీవన్ మిషన్ కింద రాష్ట్రానికి రూ.26 వేల కోట్లు వస్తే వైకాపా ప్రభుత్వం కేవలం రూ.2 వేల కోట్లే వినియోగించిందని పేర్కొన్నారు. ఆ పథకాన్ని పునరుద్ధరించి రాష్ట్రానికి రావాల్సిన రూ.26 వేల కోట్లు ఇవ్వడంపై చర్చించాలని కోరామన్నారు. పొగాకు కొనుగోళ్లు చాలాచోట్ల ఆగిపోయాయని, దీనిపై కూడా చర్చకు అనుమతించాలని విజ్ఞప్తి చేశామన్నారు. అవినీతి కేసుల్లో ఉన్న కొందరు నాయకులపై ఛార్జిషీట్లు దాఖలైనా కేసులు ముందుకు సాగట్లేదని, ప్రత్యేక కోర్టులు పెట్టి నేరచరితులకు త్వరగా శిక్షలు పడేలా చేయడంపై సభలో చర్చించాలని కోరినట్లు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. 16 ఏళ్లలోపు పిల్లలపై సామాజిక మాధ్యమాలు దుష్ప్రభావం చూపుతున్నందున వాటిని పిల్లలు ఉపయోగించకుండా నిషేధించే అంశంపైనా చర్చించాలని కోరామన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా బిల్లు

– బాలశౌరి, జనసేన పార్లమెంటరీ పార్టీ నేత

రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును వెంటనే ప్రవేశపెట్టాలని కోరాం. భవిష్యత్తులో అమరావతికి ఇబ్బందులు లేకుండా చేయడానికి ఎలాంటి బిల్లు అవసరమో అలాంటిది తీసుకురావాలన్నాం. పిల్లలు, యువతలో డ్రగ్స్ వాడకంపై చర్చించి, నియంత్రణకు చట్టాన్ని తీసుకురావాలని విజ్ఞప్తి చేశాం. వచ్చే బడ్జెట్‌లో జలజీవన్ మిషన్‌కు ఎక్కువ నిధులు కేటాయించాలని అడిగాం. అమెరికా టారిఫ్‌లు మన ఆక్వా ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపుతున్నందున అందుకు పరిష్కారాలు చూపాలని కోరాం.

అమరావతిని వ్యతిరేకించడం లేదు: మిథున్‌రెడ్డి

అమరావతికి చట్టబద్ధతపై విలేకర్లు అడిగినప్పుడు వైకాపా లోక్‌సభాపక్ష నాయకుడు మిథున్‌రెడ్డి స్పందిస్తూ 'అమరావతిని ఎవరూ వ్యతిరేకించడం లేదు. కాకపోతే రైతులకు న్యాయం చేసేలా బిల్లులో అంశాలు పొందుపరచాలని అడుగుతాం. ఇటీవల జరిగిన సమావేశంలో నష్టపోయిన అమరావతి రైతుల బాధలు చూశాం. అందువల్ల రైతులకు న్యాయం చేసి, తర్వాత అమరావతి చట్టబద్ధత గురించి మాట్లాడాలని మేం డిమాండ్ చేస్తాం' అన్నారు. పోలవరానికి నిధుల విడుదల, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ, నరేగా నిధుల పెండింగ్ గురించి పార్లమెంటులో ప్రస్తావిస్తామని చెప్పారు.

ఏపీలో విమాన తయారీ కేంద్రం?

ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి విమానాల తయారీ కేంద్రం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దీన్ని ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేయించాలని యోచిస్తోంది. బ్రెజిల్‌కు చెందిన విమానాల తయారీ సంస్థ ఎంబ్రాయెర్‌తో అదానీ ఏరోస్పేస్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ మేరకు దేశంలో విమానాల తయారీ కేంద్రాన్ని బ్రెజిల్ సంస్థ ఏర్పాటు చేయనుంది. వ్యాపార, వాణిజ్య, సైనిక విమానాలు, విమానాల విడిభాగాల తయారీలో ఎంబ్రాయెర్‌కు గుర్తింపు ఉంది. దేశంలో చిన్న, మధ్యస్థాయి ప్రయాణికుల విమానాల తయారీ యూనిట్‌ను ఈ సంస్థ ఏర్పాటు చేసే అవకాశం ఉందని సమాచారం. ఈ ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్‌తో పాటు గుజరాత్ పోటీ పడుతున్నాయి. ఏపీలో విమానాల తయారీ ప్రధాన ప్రాజెక్టు లేదా అనుబంధ ప్రాజెక్టును ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన భూములు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సంసిద్ధత తెలిపింది. ఈ పరిశ్రమ ద్వారా రాష్ట్రానికి రూ.వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. దీనిపై వచ్చే నెలలో పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

'అనంత'లో ఎందుకంటే..

అనంతపురం జిల్లాలో వేల ఎకరాల భూములు అందుబాటులో ఉన్నాయి. అవి బెంగళూరుకు సమీపంలో ఉండటం కలిసొస్తుంది. ఈ ప్రాంతాన్ని విమానాల తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా బెంగళూరుకు చెందిన సరళ ఏవియేషన్స్ ఎలక్ట్రికల్ వర్టికల్ టేకాఫ్‌కు ల్యాండింగ్ విమానాల తయారీ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే అనుమతులు ఇచ్చింది. ఆ సంస్థ 6 సీటర్ల విమానాల తయారీ కేంద్రాన్ని రూ.1,300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనుంది. 500 ఎకరాల్లో 'స్కై ఫ్యాక్టరీ'ని అభివృద్ధి చేయనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 2029 నాటికి ఎయిర్ ట్యాక్సీలను అందుబాటులోకి తీసుకురావాలన్నది లక్ష్యం. ఇదే ప్రాంతంలో ఖాళీగా భూములున్నాయి. వాటిని విమానాల తయారీ కేంద్రం కోసం కేటాయించేలా ప్రతిపాదించినట్లు తెలిసింది.

లేపాక్షి భూములైనా సరే..

శ్రీ సత్యసాయి జిల్లా కొడికొండ చెక్‌పోస్టు దగ్గర లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు కేటాయించిన 8,844 ఎకరాల భూములను కలుపుకొని 20 వేల ఎకరాల్లో భారీ పారిశ్రామిక పార్కు అభివృద్ధికి ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనికోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పరిధిలో ఉన్న భూములను వెనక్కు తీసుకునేందుకు చేసిన ప్రయత్నాలు కొలిక్కి వచ్చినట్లు సమాచారం. మరోవైపు చుట్టుపక్కల మండలాల్లో ఇప్పటికే భూసేకరణ ప్రక్రియ మొదలుపెట్టింది. అందులో విమానాల తయారీ ప్రాజెక్టుకు భూములు కేటాయించేలా ప్రతిపాదించింది. ఈ భూములు జాతీయ రహదారి, బెంగళూరు దేవనహళ్లి అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గరగా ఉండటం కలిసొస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. కంపెనీ ప్రతినిధి బృందం ప్రాధాన్యం ఆధారంగా భూములు కేటాయిస్తామని అధికారులు చెబుతున్నారు.

దేశీయంగా విమానాల తయారీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ విషయాన్ని మంత్రి తెలిపారు. 'దేశీయ అవసరాలకు తగ్గట్టు, స్థానికంగా విమానాలు తయారుచేసుకోవాలన్నది మన చిరకాల వాంఛ. తాజా ఎంఓయూ అందులో ఒక కీలకఘట్టం. దీని ప్రకారం అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, ఎంబ్రాయెర్ కలిసి దేశంలో విమాన తయారీ కేంద్రం ఏర్పాటుచేస్తాయి. ఇందుకు పౌరవిమానయానశాఖ సంపూర్ణ మద్దతు ఇస్తోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ విధానాల ద్వారా తయారీని ప్రోత్సహిస్తున్నాం. అందుకే ఎంబ్రాయెర్ ముందుకొచ్చింది. దేశీయంగా రోజూ 5 లక్షలమంది విమానాల్లో ప్రయాణిస్తున్నారు. భవిష్యత్తులో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది కనుక, విమానాశ్రయాలను పెంచుకుంటూ వెళ్తున్నాం. విమానాలను కూడా దేశంలోనే తయారు చేసుకోగలిగితే, ధరల పరంగా సానుకూలతతో కూడా మన యువతకు నాణ్యమైన ఉద్యోగాలు లభిస్తాయి. చిన్న నగరాలకు సర్వీసులు పెరుగుతున్నందున, 80-150 సీట్ల విమానాలు తయారుచేయాలని అదానీ-ఎంబ్రాయెర్ సంస్థలు నిర్ణయించాయి. వచ్చే నెల బ్రెజిల్ అధ్యక్షుడు మనదేశ పర్యటనకు వచ్చినప్పుడు, ప్రధాని మోదీతో కలిసి మరిన్ని నిర్ణయాలు తీసుకుంటారు. ఎంబ్రాయెర్ తయారు చేసిన విమానాన్ని 'బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమయ్యే వింగ్స్ ఇండియాషో'లో ప్రదర్శిస్తాం. దేశీయ విమానయాన సంస్థలు దాన్ని చూసి, ఆర్డర్లు పెట్టేలా ప్రోత్సహిస్తాం. ఎంబ్రాయెర్ విమానాలు ఇక్కడ తయారైతే దేశీయ అవసరాలు తీరడంతో పాటు, ఎగుమతులు చేయడానికీ వీలవుతుంది' అని రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు.

తయారీ కేంద్రం ఎక్కడో?

మనదేశంలో విమానాల తయారీ కోసం ఎంబ్రాయెర్ భాగస్వామ్యంలో ఫైనల్ అసెంబ్లీ లైన్ నెలకొల్పుతామని అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ డైరెక్టర్ జీత్ అదానీ తెలిపారు. ఇందుకు ఎంత పెట్టుబడులు పెట్టేదీ, ప్లాంటును ఎక్కడ నిర్మించేదీ వెల్లడించలేదు. రెండు ప్రాంతాలను పరిశీలిస్తున్నామని.. రెండు నెలల్లో ఏదో ఒక స్థలాన్ని ఎంచుకుంటామని వివరించారు. విమానాల తయారీ, సరఫరా వ్యవస్థ, విక్రయానంతర సేవలు, పైలట్ శిక్షణ వంటి అంశాల్లో ఇరుసంస్థలు సహకరించుకుంటాయి. గుజరాత్ లేదా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ ప్లాంటును నెలకొల్పే అవకాశం ఉందని ఊహాగానాలు వస్తున్నాయి.

సాంకేతికతా బదిలీ అవుతుంది

దేశీయంగా విమానాలను అసెంబ్లింగ్ చేయడమే కాదని, సాంకేతికతను కూడా ఎంబ్రాయెర్ బదిలీ చేస్తుందని పౌరవిమానయాన కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా తెలిపారు. విమానాల కోసం విదేశాలపై ఆధారపడటాన్ని ఇది తగ్గిస్తుందని వివరించారు. విమానాల నిర్వహణ-మరమ్మతు-ఓవర్‌హాలింగ్ (ఎంఆర్‌ఓ) కేంద్రం కూడా నెలకొల్పుతారు కనుక, వ్యయాలు తగ్గుతాయని పేర్కొన్నారు.

■ ప్రస్తుతం మనదేశంలో ఎంబ్రాయెర్ విమానాలు 50 సేవలందిస్తున్నాయి. వైమానికదళం, ప్రభుత్వ ఏజెన్సీలకు సేవలందించడంతోపాటు బిజినెస్‌జెట్‌లుగా ఇవి ఉన్నాయి.

■ రాబోయే 20 ఏళ్లలో దేశీయ విపణికి 80-146 సీట్ల విమానాలు 500 కావాల్సి ఉంటుందన్నది ఎంబ్రాయెర్ అంచనా.

రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలు

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో ఎండ తీవ్రత మొదలైంది. రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మధ్యాహ్నం భానుడు మండిపోతుండగా.. రాత్రి చలిగాలులు ఇబ్బంది పెడుతున్నాయి. పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 3 నుంచి 5 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. నందిగామలో 33.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే 3 రోజుల్లో రాయలసీమలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీలు పెరిగే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగింది. మంగళవారం రాష్ట్రంలోనే అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 7.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. చిత్తూరు, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి.

గ్రహం అనుగ్రహం

28-1-2026 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, శుక్ల పక్షం

దశమి: మ. 2-32 తదుపరి ఏకాదశి

కృత్తిక: ఉ. 7-49 తదుపరి రోహిణి తె. 6-09 తదుపరి మృగశిర

వర్జ్యం: రా. 10-42 నుంచి 12-11 వరకు

అమృత ఘడియలు: ఉ. 7-04 వరకు తిరిగి తె. 3-10 నుంచి 4-39 వరకు

దుర్ముహూర్తం: ఉ. 11-51 నుంచి 12-35 వరకు

రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు

సూర్యోదయం: ఉ.6.38; **సూర్యాస్తమయం:** సా.5.49

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	16.0	28.0
విశాఖపట్నం	17.4	29.2
రాజమహేంద్రవరం	17.5	35.5
శ్రీకాకుళం	18.0	29.0
కడప	19.0	31.0
తాడేపల్లిగూడెం	19.0	32.0
విజయవాడ	20.1	32.2
అనంతపురం	20.2	33.1
నరసాపురం	20.5	31.5
గుంటూరు	21.0	32.0
తిరుపతి	22.1	30.7
కర్నూలు	23.0	32.5
నెల్లూరు	23.2	31.3



అదిగదిగో ఫ్లెమింగో!

కాకినాడ జిల్లాలోని కోరంగి అభయారణ్యం పరిధిలో గ్రేటర్ ఫ్లెమింగో పక్షులు సందడి చేస్తున్నాయి. 2025లో ఒక పక్షి మాత్రమే ఇక్కడకు వలస రాగా.. ఇప్పుడు ఒకసారి 70 వచ్చాయని డీఎఫ్‌వో రామచంద్రరావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ తెలిపారు. ఇక్కడి చిత్తడి నేలలు వీటికి బాగా అనుకూలమని వన్యప్రాణి విభాగ శాస్త్రవేత్త డి.మహేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం ఇవి ఆహారం కోసం అన్వేషిస్తుండగా తీసిన చిత్రమిది.

– న్యూస్‌టుడే, తాళ్లరేవు

పార్టీలో సంస్కరణలకు కృషి చేస్తున్నా

- పార్లమెంట్ కమిటీ వర్క్‌షాప్‌లో మంత్రి నారా లోకేశ్



తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్లమెంట్ కమిటీ వర్క్‌షాప్‌లో నాయకులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్

ఈనాడు, అమరావతి: తెదేపాలో సీనియర్లు, జూనియర్లను సమానంగా గౌరవిస్తానని, పని చేసే వారిని ప్రోత్సహిస్తానని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీలో మార్పులు రావాలని, ఒక వ్యక్తి ఒకే పదవిలో రెండుసార్లకంటే ఎక్కువ ఉండకూడదని సూచించారు. పార్టీ పదవికి కాలపరిమితి ఉండాలని ప్రతిపాదించానని, ఇది తనకూ వర్తిస్తుందన్నారు. మంగళగిరి తెదేపా కార్యాలయంలో పార్లమెంట్ కమిటీ వర్క్‌షాప్‌ను తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి మంత్రి లోకేశ్ మంగళవారం ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతులకు ఇటీవల నియమించిన పార్లమెంట్ నియోజకవర్గాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు హాజరయ్యారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన లోకేశ్.. జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "పార్టీలో సంస్కరణల కోసం కృషి చేస్తున్నా. గ్రామ పార్టీ అధ్యక్షుడు పొలిట్‌బ్యూరో వరకు ఎందుకు రాకూడదు? ఇది మన పార్టీ. మన కుటుంబం. జిల్లా పార్టీ కమిటీల స్థానంలో పార్లమెంట్ కమిటీ తీసుకొచ్చేందుకు 18 నెలల సమయం పట్టింది. పొలిట్‌బ్యూరోలో పోరాడాను. నమ్మిన సిద్ధాంతాల కోసం మనం వందసార్లయినా పోరాడాలి" అని సూచించారు.

బలం.. బలగం కార్యకర్తలే..

"తెదేపా బలం, బలగం కార్యకర్తలు. దేశంలో అభివృద్ధి, సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్ సీఎం చంద్రబాబు. ప్రాంతీయ పార్టీ ఒకసారి ప్రతిపక్షంలోకి వస్తే ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటుందో మనం చూశాం. ఎన్టీఆర్ ఏ ముహూర్తంలో పార్టీ స్థాపించారో గానీ, దేశంలో ఏ పార్టీకీ లేని కార్యకర్తలు తెదేపా సొంతం. వైకాపా పాలనలో పుంగనూరు నియోజకవర్గంలో నామినేషన్ వేసేందుకు వెళ్తే పత్రాలు లాక్కున్నారు. అప్పుడు మీసాలు మెలేసి, తొడగొట్టిన అంజిరెడ్డి తాత నాకు స్ఫూర్తి. మాచర్ల నియోజకవర్గంలో వైకాపా నాయకుల దాడిలో గాయపడి రక్తమోడుతున్నా చివరి ఓటు పడే వరకు పోలింగ్ బూత్‌లో తెగువ చూపిన మంజుల, విజయవాడలో వైకాపా గూండాల దాడిలో కంటిచూపు కోల్పోయినా జై తెలుగుదేశం అని నినదించిన చెన్నుపాటి గాంధీ, మెడపై కత్తిపెట్టి తమ నాయకుడి పేరు చెప్పమంటే జై చంద్రబాబు.. జై తెదేపా అని నినదించి ప్రాణాలు కోల్పోయిన తోట చంద్రయ్య నాకు స్ఫూర్తి" అని వెల్లడించారు.

పార్టీ సొంతిల్లు.. ప్రభుత్వం అద్దె ఇల్లు

"పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం అద్దె ఇల్లు లాంటిది. పార్టీ కార్యాలయానికి సమయం కేటాయించాలి. సీఎం చంద్రబాబుకు ఎంత పని ఒత్తిడి ఉన్నా వారానికోసారి పార్టీ కార్యాలయానికి వస్తున్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవనన్న కలిసికట్టుగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారు. త్వరలో కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తాం. కేంద్ర సహకారం లేకపోతే అనుకున్నవి చేయలేం. గత మహానాడులో 6 తీర్మానాలు చేసుకున్నాం. అందులో మొదటిది కార్యకర్తలదే. కార్యకర్తలను అందరూ గౌరవించాలి. యువతకు ప్రాధాన్యం ఇవ్వాలి. అన్ని పదవుల్లో సామాజిక న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. మహిళలకు సముచిత స్థానం కల్పించాలి. మహిళలను కించపరిచే పదాలను విడనాడాలి. అన్నదాతకు కష్టం వస్తే మనం అండగా నిలవాలి. ప్రపంచంలో తెలుగువారు నంబర్ వన్‌గా ఉండేలా మనం కృషి చేయాలి. అదే మన లక్ష్యం" అని సూచించారు.

నేతలు అలక వీడాలి..

"పార్టీ నేతలు అలక వీడాలి. ఏదైనా ఉంటే పార్టీలో పోరాడాలి. కనీసం 15 ఏళ్లు కూటమి ప్రభుత్వం ఉండాలి. కలిసికట్టుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని పవనన్న చెప్పారు. చిన్న సమస్యలు ఉంటాయి. మనకు విడాకులు లేవు. క్రాస్ ఫైర్స్ లేవు. మనం అప్రమత్తంగా ఉండాలి. మన మధ్య విభేదాలు సృష్టించేందుకు వైకాపా యత్నిస్తోంది. వ్యక్తులు శాశ్వతం కాదు. వ్యవస్థ కింద మనందరం నడుచుకోవాలి. అందరికీ శిక్షణ తరగతులు నిర్వహిస్తాం. పార్టీ బలోపేతానికి కార్యకర్తలా పని చేస్తున్నా. సాంకేతిక పరిజ్ఞానంతో పని చేసే వారిని గుర్తిస్తున్నాం. పదవిని బాధ్యతగా స్వీకరించాలి" అని లోకేశ్ పేర్కొన్నారు.

మాట మార్చడం రక్తంలోనే లేదు..

"మడమ తిప్పడం, మాట మార్చడం మన రక్తంలోనే లేదు. దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది తెదేపా. ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకొని సీఎం చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల బండిలా ముందుకు నడిపిస్తున్నారు. మన నాయకుడు సంక్షేమం, అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ అయితే.. టీం-11 కల్తీ నెయ్యి, కోడికత్తి, కల్తీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్లు" అని అన్నారు.

యువగళం వేడుక

వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు వచ్చిన పార్లమెంటరీ పార్టీ కమిటీ సభ్యులకు మంత్రి లోకేశ్ ఆహ్వానం పలికారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి, ఫొటోలు దిగారు. లోకేశ్ యువగళం పాదయాత్రకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ కేంద్ర కార్యాలయంలో వేడుక నిర్వహించారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న లోకేశ్. చిత్రంలో నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేపాడ చిరంజీవిరావు, అచ్చెన్నాయుడు, రెడ్డప్పగారి మాధవి, కలిశెట్టి అప్పలనాయుడు, పల్లా శ్రీనివాసరావు, బుచ్చయ్య చౌదరి, దేవినేని ఉమ, సత్యానందరావు, రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి

దరఖాస్తు చేసిన వెంటనే వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు

మంత్రి గొట్టిపాటి రవికుమార్



మాట్లాడుతున్న విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్. చిత్రంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తదితరులు

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: రైతులు దరఖాస్తు చేసిన వెంటనే వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు మంజూరు చేయాలని విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితో కలిసి మంగళవారం ఆయన విద్యుత్తుశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్డీఎస్ఎస్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పీఎం సూర్యఘర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. స్మార్ట్ మీటర్లపై ఉన్న అపోహలను తొలగించాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందని స్పష్టం చేశారు.

'పది'లో ఫస్ట్ వస్తే 10 గ్రాముల పసిడి

- ఉంగుటూరు జడ్పీహెచ్ఎస్‌లో 6-9వ తరగతి వారికి సైతం
- పారిశ్రామికవేత్త సుమన్‌కుమార్ ప్రకటన



సుమన్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎంఈవో సాంబశివరావు తదితరులు

గన్నవరం గ్రామీణం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా ఉంగుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి 10 గ్రాముల బంగారాన్ని బహుమతిగా ఇస్తానని పారిశ్రామికవేత్త గుత్తా సుమన్‌కుమార్ తెలిపారు. ఉంగుటూరు మండలంలో సుమన్ ఫౌండేషన్ ద్వారా ఆయన మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉంగుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.లక్ష క్రీడా సామగ్రిని బహూకరించారు. సుమన్‌కుమార్ మాట్లాడుతూ.. పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు ఆయా తరగతుల్లో వార్షిక పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి ఏ తరగతి చదివితే అన్ని గ్రాముల బంగారం అందిస్తానని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రోత్సహించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. సుమన్‌కుమార్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఎంఈవో సాంబశివరావు సత్కరించారు.

రూ.లక్ష కోట్లు దాటిన పన్నుల రాబడి

(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరం (డిసెంబరు నెలాఖరు వరకు)	పన్నుల రాబడి (రూ.కోట్లలో)
2021	69,943.71
2022	79,505.93
2023	91,136.21
2024	98,033.02
2025	1,05,331.07

మూలధన వ్యయం (రూ.కోట్లలో) వివరాలు (డిసెంబరు నెలాఖరునాటికి ఉన్న లెక్కల ప్రకారం)

సంవత్సరం	మూలధన వ్యయం
2021	11,581.42
2022	6,953.25
2023	19,202.54
2024	8,894.98
2025	19,224.34

ప్రాజెక్టులు, రహదారులు, ఇతర మౌలిక వసతుల కల్పన కోసం వెచ్చించే మొత్తమే మూలధన వ్యయం. ఇది ఎంత ఎక్కువగా ఉంటే అభివృద్ధి అంత సాధ్యమవుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 9 నెలల్లో రాష్ట్రంలో రూ.19,224 కోట్లు మూలధన వ్యయం చేశారు. గత ఐదేళ్లలో ఇదే ఎక్కువ అని కూడా కాగ్ లెక్కల ఆధారంగా స్పష్టమవుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.40 వేల కోట్లపైనే ఈ రూపంలో ఖర్చు పెట్టాలని అంచనా వేసినా ప్రస్తుతం సగం మేర మాత్రమే ఖర్చు చేయగలిగారు.

అప్పు తీర్చమన్నందుకు.. ఇంటికి నిప్పంటించాడు

మంటల్లో చిక్కుకొని వృద్ధుడి సజీవదహనం



రామన్నను సజీవదహనం చేసింది ఈ ఇంట్లోనే..



మృతదేహాన్ని డోలీలో మోసుకొచ్చి 108 వాహనంలోకి ఎక్కిస్తున్న స్థానికులు, పోలీసులు

పాడేరు, న్యూస్‌టుడే: వారిద్దరూ మిత్రులు. అవసరాల కోసం ఒకరు మరొకరి దగ్గర అప్పు తీసుకున్నారు. చెప్పిన సమయానికి తిరిగివ్వకపోవడంతో ఇద్దరి మధ్య చెలరేగిన ఘర్షణ చివరికి హత్యకు దారి తీసింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన ఈ దారుణ ఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్థుల వివరాల ప్రకారం.. పాడేరు మండలం ఐనాడ పంచాయతీ పులగరువు ఇరుకురాయి గ్రామానికి చెందిన కొర్రా రామన్న(73) వ్యవసాయం చేస్తూ తాటాకులోని ఇంట్లో నివసిస్తున్నాడు. నాలుగు కిలోమీటర్ల దూరంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన వంతాల సోమన్న కూడా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇద్దరి మధ్య కొన్నేళ్లుగా స్నేహం ఉంది. దీంతో రామన్న వద్ద సోమన్న రూ.5,600 అప్పు తీసుకున్నాడు. ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించాలని ఈ నెల 23న (శుక్రవారం) రామన్న అడిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. మద్యం మత్తులో సహనం కోల్పోయిన సోమన్న అప్పు ఇచ్చిన రామన్నపై అతి కిరాతకంగా దాడి చేశాడు. అంతటితో ఆగకుండా రామన్నను ఆయన ఇంట్లోనే బంధించి ఇంటికి నిప్పుపెట్టాడు. హాహాకారాల మధ్య రామన్న మంటల్లో చిక్కుకొని సజీవదహనమయ్యాడు. ఆదివారం విషయం తెలుసుకున్న పాడేరు పోలీసులు సాయంత్రం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పూర్తిగా కాలిపోయిన రామన్న మృతదేహాన్ని డోలీలో నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న 108 వాహనం వద్దకు చేర్చారు. పరారీలో ఉన్న సోమన్న కోసం గాలిస్తున్నారు.

పదోన్నతి మిమ్మల్ని వరించాలంటే..



ఆఫీసులో బాస్ చెప్పిన పనులను సక్రమంగా చేస్తూ వెళ్తే మీకు నెలనెలా వేతనం వస్తూ ఉంటుంది. కెరీర్‌లో ఉన్నతంగా ఎదగాలనుకుంటే మాత్రం.. బాస్ అప్పగించని పనులను (మీ సంస్థకు ఉపయోగపడేవై ఉండాలి) కూడా చేయండి. అప్పుడే పదోన్నతి త్వరగా వరిస్తుంది. అవసరమైతే భవిష్యత్తులో మీరూ వ్యాపారవేత్తగా మారేందుకు ఈ తరహా పనితీరు దోహదపడుతుంది.

– అనిరుద్ధ మల్పానీ, వైద్యుడు



జోసా కౌన్సెలింగ్‌లోకి ఐఐఎస్సీ

- జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకుల ఆధారంగా బీటెక్ సీట్ల భర్తీ
- తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు మరింత ప్రయోజనం



ఈనాడు, హైదరాబాద్: దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థ అయిన బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ) బీటెక్ సీట్లను ఇక నుంచి జాయింట్ సీట్ ఎలకేషన్ అథారిటీ(జోసా) కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నారు. ఈ మేరకు ఆ సంస్థ కీలక నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ విషయాన్ని జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 పరీక్ష నిర్వహణ బాధ్యతలు చూస్తున్న ఐఐటీ రూర్కీ మంగళవారం వెల్లడించింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకుల ఆధారంగా వచ్చే విద్యా సంవత్సరం(2026-27) బీటెక్ సీట్లను భర్తీ చేస్తామని పేర్కొంది. ప్రస్తుత విద్యా సంవత్సరం(2025-26) వరకు ఐఐఎస్సీలోని బీటెక్ సీట్లను జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకుల ఆధారంగా ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీ చేసేవారు. దానిపై అనేక మంది విద్యార్థులకు అవగాహన లేకపోవడం వల్ల ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవడం లేదు. మెరిట్ విద్యార్థులు సైతం నష్టపోతున్నారు. అందుకే ఇక నుంచి దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నడిచే సాంకేతిక విద్యాసంస్థల్లోని సీట్ల తరహాలోనే ఐఐఎస్సీలోని బీటెక్ సీట్లను కూడా జోసా కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించే వారి సంఖ్య అధికంగా ఉంటోంది. కేవలం 100లోపు ర్యాంకుల్లోనే 20-25 మంది ఉంటున్నారు. ప్రస్తుతం వారందరూ ఐఐటీ బాంబే, దిల్లీ, మద్రాస్, హైదరాబాద్‌లోనే ప్రవేశాలు పొందుతున్నారు. ఇక నుంచి వారిలో కొందరు ఐఐఎస్సీలో చేరే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఇప్పటివరకు ఒక్కటే కోర్సు...

ప్రస్తుత విద్యా సంవత్సరం(2025-26) వరకు ఐఐఎస్సీలో బీటెక్ ఇన్ మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్ కోర్సు మాత్రమే ఉంది. అందులో 52 సీట్లున్నాయి. ఎనిమిది సీట్లను అమ్మాయిలకు సూపర్ న్యూమరరీ కింద కేటాయిస్తారు. మరో నాలుగింటిని విదేశీ విద్యార్థులతో భర్తీ చేస్తున్నారు. జోసాలో చేరినందున బీటెక్ కోర్సులు కూడా పెరగవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

జాతీయ ర్యాంకింగ్‌లో...

బెంగళూరులోని ఐఐఎస్సీలో ప్రధానంగా సైన్స్ కోర్సులుంటాయి. డిగ్రీ నుంచి పరిశోధన ఆధారిత విద్య అందుతోంది. లోతైన పరిశోధన ఇక్కడి ప్రత్యేకత. అందుకే సైన్స్ విద్యార్థులు ఇక్కడ పీహెచ్‌డీ చేయాలని కలలు కంటారు. కేంద్ర ప్రభుత్వం 2016 నుంచి ఇస్తున్న జాతీయ ర్యాంకింగ్‌లో టాప్‌లో నిలుస్తోంది. 2019 నుంచి 2025 వరకు రెండో ర్యాంకులో నిలిచింది. 2017, 2018లో ప్రథమ స్థానాన్ని దక్కించుకుంది. ఆవిష్కరణ విభాగంలో 2025లో మూడో ర్యాంకు సాధించింది. బీటెక్ కోర్సులు మరికొన్ని పెంచి... విద్యార్థుల సంఖ్యను పెంచుకుంటే ర్యాంకు ఇంకా మెరుగుపడుతుందని నిపుణులు భావిస్తున్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

- ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి
- క్రికెట్ పోటీల నిర్వహణలో 'ఈనాడు' కృషికి అభినందనలు



'ఈనాడు స్పోర్ట్స్ లీగ్' క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలను బ్యాటింగ్ చేసి ప్రారంభిస్తున్న ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి, వెనుక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ వైవీ ఆంజనేయులు

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, తాడికొండ: మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి అన్నారు. గుంటూరు సమీపంలోని మోతడక వద్ద చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలను ఆయన ప్రారంభించారు. కొద్దిసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రతినిధి బి.శ్రీనివాసరావు, 'ఈనాడు' మార్కెటింగ్ ఏజీఎం నితీష్ చౌదరి, 'ఈనాడు' ఏపీ బ్యూరో చీఫ్ కనపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుమూర్తి మాట్లాడుతూ క్రీడాకారుల అభ్యున్నతికి 'ఈనాడు' చక్కని వేదిక ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బృందస్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడానికి ఇదో మంచి అవకాశమన్నారు. ఈఎస్ఎల్ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారుల్లోంచి కోహ్లీలు, ధోనీలు తయారుకావాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు యువత ఆటలు, లలితకళల్లో భాగస్వాములు కావాలని.. అప్పుడే వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, బృందస్ఫూర్తి, ఓర్పు, సహనం, క్రమశిక్షణ అలవడతాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో పిల్లలపై ఒత్తిడి పెరుగుతోందని.. దాని నుంచి బయటపడేందుకు ఇలాంటి కార్యక్రమాలు చక్కగా దోహదపడతాయని చెప్పారు. చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఛైర్మన్ వై.వి.ఆంజనేయులు మాట్లాడుతూ 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ క్రికెట్ పోటీలు తమ విద్యాసంస్థల్లో నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. 'ఈనాడు' కేవలం వార్తలకే పరిమితం కాకుండా.. యువ క్రీడాకారుల కోసం ఈఎస్ఎల్ వంటి చక్కని వేదికను ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఎంతోమంది క్రీడాకారులు ఉన్నత స్థితికి ఎదగడం దశాబ్దాలుగా 'ఈనాడు' చేస్తున్న కృషి ఫలితమేనన్నారు. క్రీడాకారులు చక్కని ఆటతీరును ప్రదర్శించి బృంద స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, సానుకూల దృక్పథంతో భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరాలని ఆకాంక్షించారు. 'ఈనాడు' గుంటూరు యూనిట్ మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 'ఈనాడు' కచ్చితమైన వార్తలను అందిస్తూనే.. పిల్లల కోసం ప్రతిభ, హాయ్‌బుజ్జీ, ఛాంపియన్‌తో పాటు 15 ఏళ్లుగా స్పోర్ట్స్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

డ్రగ్స్‌ను పారదోలుదాం

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమాన్ని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాలతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'గత ఏడాది రాఖీ పండుగ రోజు నేను జైలుకు వెళ్లి డ్రగ్స్ కేసులో అరెస్టయిన వారికి రాఖీలు కడితే వారు కన్నీరు పెట్టుకున్నారు. తల్లిదండ్రులు కూడా తమకు బెయిల్ ఇప్పించేందుకు రావడం లేదని చెప్పారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలంటూ 34 రోజులపాటు ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు సైకిల్ యాత్ర చేపడతామని ముందుకొచ్చిన ఐదుగురు మహిళా పోలీసులే నిజమైన సెలబ్రిటీలు. వారికి సెల్యూట్' అని అనిత అన్నారు. కరోనాను మనం సమర్థంగా ఎదుర్కొన్నాం.. డ్రగ్స్‌ను కూడా అదే రీతిలో పారదోలదామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు.



సైకిల్ యాత్ర చేస్తున్న మహిళా పోలీసులు, వారికి మద్దతుగా విద్యార్థుల ర్యాలీ

ఐదుగురు మహిళా పోలీసులతో సైకిల్ యాత్ర: డ్రగ్స్ బారిన పడొద్దు, మత్తుకు దూరంగా ఉండాలంటూ మహిళా ప్రొబేషనరీ ఎస్సై కడలి రేవతి, హెడ్‌కానిస్టేబుల్ గుమ్మడి హైమావతి, కానిస్టేబుళ్లు షేక్ బీబీ శైలజ, చేపు త్రివేణి, వాయిబోయిన ఉషారాణిలు ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 510 కి.మీ. మేర 34 రోజుల పాటు సైకిల్ యాత్ర చేయనున్నారు. దీన్ని మంత్రులు, డీజీపీ ప్రారంభించారు.

నేటి నుంచి మేడారం మహా జాతర

(మొదటి పేజీ తరువాయి)

తల్లుల గద్దెల ప్రాంగణాన్ని పునర్నిర్మించడంతో పాటు భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పించింది. మేడారం మహాజాతర మొదటి రోజు బుధవారం కన్నెపల్లి జాబిల్లిగా భక్తులు కొలిచే సారలమ్మ రానుంది. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి ఆమె తండ్రి పగిడిద్దరాజును తీసుకుని ఇప్పటికే కాలినడకన మేడారానికి బయలుదేరారు. ఏటూరు నాగారం మండలం కొండాయి నుంచి గోవిందరాజును తీసుకొస్తారు. ఈ ముగ్గురూ గద్దెలపై కొలువుదీరుతారు. జాతరలో అత్యంత కీలక ఘట్టం సమ్మక్క ఆగమనం. ఆ వనదేవతను గురువారం కొక్కెర కృష్ణయ్య నేతృత్వంలో మేడారం సమీపంలోని చిలుకల గుట్టపై నుంచి తీసుకొస్తారు. కుంకుమభరిణ రూపంలోని సమ్మక్కను తీసుకొచ్చే క్రమంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ గౌరవసూచకంగా గాల్లోకి కాల్పులు జరుపుతారు. అనంతరం సమ్మక్కను గద్దెపై ప్రతిష్ఠిస్తారు.

కీర్తి చక్ర గ్రహీత రామగోపాలనాయుడికి రూ.1.25 కోట్ల నగదు పురస్కారం

ఈనాడు, అమరావతి: కీర్తి చక్ర పురస్కార గ్రహీత, శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం నగిరిపెంట గ్రామానికి చెందిన మేజర్ మల్లా రామగోపాలనాయుడికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.1.25 కోట్ల నగదు పురస్కారాన్ని ప్రకటించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం మల్లా రామగోపాలనాయుడికి కీర్తి చక్ర పురస్కారాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే.

రీసర్వేకు గ్రామ సర్వేయర్ల సహాయ నిరాకరణ

ఈనాడు, అమరావతి: సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామ రెవెన్యూ సర్వేయర్లు రీసర్వే పనుల్ని పక్కన పెట్టారు. సాధారణ పనులకే పరిమితమయ్యారు. దీంతో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా 20 జిల్లాల్లో రీసర్వే పనులు ముందుకు సాగలేదు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో కొన్నిచోట్ల సర్వేలో పాల్గొన్నారు. మంగళవారం మొత్తం 46,170 ఎకరాల సర్వే లక్ష్యం కాగా.. 4,248 ఎకరాల్లోనే సర్వే జరిగింది.

అప్పటి వరకూ రీసర్వే పనులు నిలిపేస్తాం: తమ సమస్యలు పరిష్కరించే వరకూ రీసర్వేకు హాజరు కాబోమని గ్రామ సర్వేయర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మధుబాబు, మహేశ్ నాయుడు తెలిపారు. ఈ నెల 25న తిరుపతిలో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు రీసర్వేకు సహాయ నిరాకరణ చేస్తున్నామని ఒక ప్రకటనలో వివరించారు. స్వర్ణ గ్రామం కార్యక్రమంలో భాగంగా సాధారణ సర్వే పనులు చేసినట్లు తెలిపారు. 'గ్రామ సర్వేయర్లకు 5 సంవత్సరాల సర్వీస్ పూర్తయిన వెంటనే ఇతర శాఖల ఉద్యోగులకు ఇచ్చినట్లే బేసిక్ రూ.32,000 మంజూరు చేయాలి. జిల్లా వారీగా 70% వరకు గ్రేడ్-1 పదోన్నతులు ఇవ్వాలి. రీసర్వే పనుల్ని ఎస్ఓపీ ప్రకారం నిర్దిష్ట కాలవ్యవధితో నిర్వహించాలి. రేషనలైజేషన్‌లో భాగంగా 4,722 మంది గ్రామ సర్వేయర్లను సర్వే సంబంధిత శాఖల్లో విలీనం చేయాలి. రీసర్వేకు పరికరాలు అందించాలి. పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏ, ఇతర బకాయిలు విడుదల చేయాలి' అని డిమాండు చేశారు.

తెలంగాణ 'పుర' ఎన్నికలకు షెడ్యూలు జారీ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. ఇటీవలే గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తి కాగా రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని మంగళవారం 7 నగరపాలక సంస్థలు, 116 పురపాలక సంఘాల ఎన్నికలకు షెడ్యూలు వెలువరించారు. వెంటనే కోడ్ అమల్లోకి వచ్చింది. 7 నగర పాలక సంస్థల్లోని 414 డివిజన్లు, 116 పురపాలక సంఘాల్లోని 2,582 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 11న ఒకే దఫాలో ఎన్నికలు నిర్వహించనున్నారు. బ్యాలెట్ పద్ధతిన ఆ రోజు ఉదయం 7 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మొత్తం 52,43,023 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 13న ఉదయం 8 గంటల నుంచి ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు. 16న మేయర్, డిప్యూటీ మేయర్, పురపాలక సంఘాల ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఆన్‌కాల్ డ్రైవర్లకు రూ.వెయ్యి

ఆర్టీసీ బోర్డు ఆమోదం

ఈనాడు, అమరావతి: స్త్రీశక్తి పథకం వర్తించే 5 రకాల బస్సుల్లో విధులు నిర్వర్తించే ఆన్‌కాల్ డ్రైవర్లకు చెల్లించే మొత్తాన్ని రూ.800 నుంచి రూ.1,000కి పెంచుతూ గతంలో ఆర్టీసీ యాజమాన్యం తీసుకున్న నిర్ణయానికి ఆర్టీసీ బోర్డు ఆమోదం తెలిపింది. ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఆర్టీసీ బోర్డు సమావేశంలో ఉద్యోగులకు ప్రభుత్వ ఉత్తర్వు మేరకు పదోన్నతులు కల్పించడంపై చర్చించారు.

నిరుద్యోగులకు శుభవార్త

మన క్యాపిటల్ అమరావతిలో ప్రముఖ అపార్టుమెంట్స్ నిర్మాణ సంస్థలో పని చేయుటకు

మార్కెటింగ్ స్టాఫ్ కావలెను.

మంచి జీతంతో పాటు ఇన్సెంటివ్ + TA ఇవ్వబడును.

ఇంటర్వ్యూ తేదీలు: 28 to 31 Jan | Timings: 9 AM to 7 PM

MR CONSTRUCTIONS

J.N.R Complex, 3rd Floor, D.No: 4-4-130/1, Opp. Don Basco, Chandramouli Nagar, Guntur-522007.

Ph: 90001 33866, 89777 43774

నవతరానికి మనోవ్యాధుల ముప్పు!

విద్యార్థులందరినీ ఒకే గాటన కట్టేసి, వారి తెలివితేటలను ఒకే కొలబద్దతో కొలిచి ర్యాంకుల తీర్పులు ప్రకటించడం కాదు చదువు చెప్పడమంటే! తమ బలాబలాలేంటో పిల్లలే స్వయంగా తెలుసుకుని, తమ శక్తిసామర్థ్యాలకు తగిన రంగాన్ని ఎంచుకుని జీవితంలో పైకెదిగేలా ప్రోత్సహించడమే విద్య పరమార్థం. నవతరాన్ని నవీన కొలువులకు సిద్ధం చేయడమే కాదు, కష్టసుఖాలను సమంగా చూస్తూ అర్థవంతంగా జీవించడమెలాగో నేర్పడమే చదువుల లక్ష్యం. వీటికి భిన్నంగా విద్యార్జన అంటే పరీక్షల్లో మార్కులు తెచ్చుకోవడం మాత్రమేనని శాసిస్తూ, అందులో వెనకబడినవారు ఎందుకూ కొరగారని ముద్రవేస్తున్న మన సమాజంలో చిన్నారులు, యువత విపరీతమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. వారిలో చాలామంది ఏదో ఒక బలహీన క్షణంలో- 'అమ్మానాన్నలు గర్వపడేలా చదువుకోలేకపోతున్నా'నంటూ లేఖరాసి మొన్న డిసెంబరులో ఉరిపోసుకున్న హైదరాబాదీ విద్యార్థి సిద్ధార్థలా ప్రాణాలు తీసుకుంటున్నారు. 2013-2023 మధ్యలో దేశవ్యాప్తంగా ఆత్మహత్యలు 23శాతం పెరిగితే- అదే దశాబ్దంలో విద్యార్థుల బలవన్మరణాలు 65శాతం అధికమయ్యాయి. దేశాభివృద్ధికి చోదకశక్తులైన యువతీ యువకులు నేడు మానసికంగా ఎంతటి ఒంటరితనాన్ని అనుభవిస్తున్నారో ఈ గణాంకాలే స్పష్టంగా చెబుతున్నాయి!

'ఒత్తిడి భరించలేకపోతున్నానమ్మా... సెక్షన్ మార్చాలని చెప్పినా ఎవరూ వినట్లేదు' అంటూ తల్లిదండ్రులకు ఫోన్ చేసి బావురుమన్న ఆ ఇంటర్ విద్యార్థిని ఆ వెంటనే తనకు తాను మరణశాసనం రాసుకుంది. ఈ విషాదోదంతం కొద్దినెలల కిందట నెల్లూరులో చోటుచేసుకుంది. అంతకు వారం మునుపు హనుమకొండలో మరో విద్యార్థిని 'మీరు చెప్పిన చదువు నాతోని అయితలేదు... నేను చదువుదాం అనుకున్న చదువుకు మీరు ఒప్పుకుంటలేరు' అని అమ్మానాన్నలను ఉద్దేశించి ఉత్తరం రాసిపెట్టి ఆత్మహత్య చేసుకుంది. ఇలా కన్నవారి ఆశల బరువును మోయలేక కొందరు, చదువుల్లో రాణించగలమా లేదా అని మరికొందరు, ఉద్యోగాలు వస్తాయా రావా అని ఇంకొందరు పిల్లలు తీవ్ర మానసిక వ్యాకులతకు గురవుతున్నారు. తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల్లో చదువుకుంటున్న వారిలో 59శాతం మంది ఇలాంటి ఆందోళననే అనుభవిస్తూ సైకలాజికల్ కౌన్సెలింగ్‌ను కోరుకుంటున్నారని తాజాగా ఒక అధ్యయనంలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా ప్రతి అయిదుగురు హైస్కూల్ విద్యార్థుల్లో ఒకరు జీవితేచ్ఛను కబళించే కుంగుబాటుకు బాధితులవుతున్నారని మరో పరిశోధనలో వెలుగుచూసింది. పిల్లల ప్రవర్తనను గమనిస్తూ, భవిష్యత్తుకు భరోసానిచ్చే మాటలతో వారి భావోద్వేగాలను సరైన మార్గంలోకి మళ్లించాల్సిన ప్రాథమిక బాధ్యత తల్లిదండ్రులూ ఉపాధ్యాయులదే. అలాగే, విద్యాలయాల్లో మానసిక వైద్యనిపుణుల సేవలను అందుబాటులోకి తీసుకురావడమూ అత్యవసరమే!

ఆటపాటలకు ప్రాధాన్యమివ్వని పాఠ్యప్రణాళికలకు తోడు స్మార్ట్‌ఫోన్ల వినియోగంతో పెరుగుతున్న నిద్రలేమి కూడా భావితరాన్ని నీరసింపజేస్తోంది. మాదకద్రవ్యాల వాడకం విపరీతమవుతున్న కొద్దీ యువభారతం మరింతగా మానసిక రుగ్మతల పాలవుతోంది. మనోవ్యాధి పీడితులకు సరైన వైద్యం అందించకపోతే, కుంగుబాటు లాంటి వాటిని నివారించకపోతే 2012-2030 మధ్యకాలంలో ఇండియా లక్ష కోట్ల డాలర్లకుపైగా కోల్పోయే ప్రమాదముందని ప్రపంచ ఆర్థిక సంస్థ గతంలో హెచ్చరించింది. పిల్లల అభిరుచులను బట్టి చదువు చెప్పిస్తూ వారికి వెన్నుదన్నుగా నిలవడం అమ్మానాన్నల వంతు అయితే- మూస విద్యావిధానాన్ని సంస్కరించడం, మత్తుమందుల వ్యాప్తికి అడ్డుకట్ట వేయడం యంత్రాంగం కర్తవ్యం. కుటుంబ స్థాయిలో శ్రద్ధ, సరైన పర్యవేక్షణకు ప్రభుత్వాల చిత్తశుద్ధి జతకలిస్తేనే- భావిభారతం ఆత్మస్థైర్యంతో బతుకుబాటలో ముందడుగేస్తుంది!



హద్దులనేవి మనకు మనం విధించుకునేవే. ఏ పనిలోనైనా శ్రేష్ఠత, సమర్థతలకోసం కృషిచేయడమే మన పని. అప్పుడు విజయం దానంతటదే వస్తుంది. మన పనులే మన మాటలకన్నా బిగ్గరగా వినిపిస్తాయి.

– లాలాలజపత్ రాయ్

మేడారం మహాజాతర

గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు, సామూహిక భక్తి చైతన్యానికి, సమష్టి ఆధ్యాత్మిక ప్రాభవానికి ప్రతీక... మేడారం సమ్మక్క సారలమ్మ వేడుక! ఆదివాసీల విశ్వాసాల ఆలంబనగా వర్ధిల్లే ఈ జాతరలో వెదురు కర్రలు, కుంకుమ భరిణలను వనదేవతల ప్రతిరూపాలుగా ఆరాధిస్తారు. జాతరలో ఆదిఘట్టంగా కన్నెపల్లి నుంచి సారలమ్మ, పులిగొండ్ల నుంచి పగిడిద్దరాజు, కొండాయి నుంచి గోవిందరాజుల ప్రతిరూపాలను మేడారం పీఠాలకు తీసుకొస్తారు. రెండోరోజు మందిరసారె పేరుతో చిలకలగుట్ట నుంచి సమ్మక్క రూపాన్ని ప్రధాన పీఠానికి తరలిస్తారు. 'మండెమెలిగ' పేరిట సమ్మక్కకు తొలిపూజలు చేస్తారు. మూడోరోజు భక్తులు మొక్కుబడులు సమర్పిస్తారు. నాలుగోరోజు సాయంత్రం వనదేవతలను అరణ్యానికి సాగనంపుతారు. ఆహ్వానం, ఆగమనం, ఆరాధనం, నిష్క్రమణం అనే నాలుగు అంశాల సమాహారంగా ఈ వేడుక విలసిల్లుతుంది.



అంతర్యామి

మేడారం జాతరకు సంబంధించి ఎన్నో జానపద గాథలు ప్రచారంలో ఉన్నాయి. దండకారణ్యంలో మేడారం పరగణాకు మేడరాజు సామంత పాలకుడు. ఆయన వేటకు వెళ్లినప్పుడు పులుల మధ్య సంచరిస్తున్న దివ్యాంశతో కూడిన బాలిక కనిపించిందట. జగన్మాత వరప్రసాదంగా భావించి ఆ బిడ్డకు 'సమ్మక్క' అని నామకరణం చేసి పెంచుకున్నాడు. కాలక్రమంలో మేడరాజు తన మేనల్లుడైన పగిడిద్దరాజుతో సమ్మక్క వివాహం చేశాడు. వారి సంతానమే సారలమ్మ, జంపన్న. కాకతీయ రాజులకు సామంతులైన కోయరాజులు కరవు కాటకాల వల్ల కొన్నేళ్లు కప్పం చెల్లించలేకపోవడంతో ఆగ్రహించిన ప్రతాపరుద్రుడు వారిపై దండెత్తాడు. యుద్ధంలో పగిడిద్దరాజుతోపాటు నాగులమ్మ, సారలమ్మ, అల్లుడు గోవిందరాజులు వీరమరణం పొందారు. ఆనాడు జంపన్న ఆత్మార్పణం చేసుకున్న సంపెంగవాగే నేటి జంపన్నవాగు. బిడ్డల మరణవార్త విని అపరకాళికలా కాకతీయ సైన్యంపై విరుచుకుపడిన సమ్మక్కను కాకతీయ సైన్యం వెన్నుపోటు పొడిచింది. తీవ్రంగా గాయపడిన సమ్మక్క రక్తసిక్త దేహంతో, చిలకలగుట్ట పైకి చేరుకుందంటారు. తన రుధిరాన్ని, జీవశక్తికి సాకారంగా కుంకుమభరిణలో నిక్షిప్తం చేసి, వెదురు కర్రగా ఆకృతి దాల్చిందంటారు. సమ్మక్క ధైర్యసాహసాలను ప్రత్యక్షంగా దర్శించిన ప్రతాపరుద్రుడు ఆమెను వనదుర్గగా భావించి, భక్తుడిగా మారి జాతరను ప్రారంభించాడంటారు. ఆనాటి సంప్రదాయమే ఇప్పటికీ కొనసాగుతోంది.

తమ కోసం ఆత్మార్పణ చేసిన తల్లీబిడ్డలు సమ్మక్క- సారలమ్మలను గిరిజనులు ఆరాధ్యమూర్తులుగా కొలుస్తూ, రెండేళ్లకోసారి మహాజాతర నిర్వహిస్తారు. ప్రకృతితో మమేకమై జీవించే అడవి బిడ్డల జీవన సంవిధానానికి, వారి త్యాగమయ దృక్పథానికి ప్రతిబింబమీ మహోత్సవం. మేడారంలో సమ్మక్క సారలమ్మలు వెదురు కర్రలుగా ప్రత్యేక పీఠాలపై గోచరిస్తారు. వెదురు సాఫల్య శక్తికి, రక్షణాత్మక వైఖరికి సంకేతం. శూన్యం నిండిన వెదురులో తమ ప్రాణశక్తిని ఆవాహన చేసి, వాటికి మాతృశక్తులు పవిత్రతను ఆపాదించారు. ఈ జాతరలో భక్తులు వనదేవతలకు బెల్లపుదిమ్మెల్ని మొక్కుబడిగా సమర్పిస్తారు. సమ్మక్క సారలమ్మ వేడుక ఓ ఉత్సవంగా మొదలై, ఆరాధనగా మారి, ఘన సంస్కృతిగా అవతరించి, దివ్య సంబరంగా వర్ధిల్లి, మహా జాతరగా విరాట్ వైభవాన్ని సంతరించుకుంది.

– డాక్టర్ కావూరి రాజేశ్ పటేల్



సందేహాల పునాదిపై శాంతి సౌధం!

రెండో ప్రపంచ యుద్ధం తరవాత అమెరికా, సోవియట్‌ల మధ్య రెండు ధ్రువాలుగా ప్రపంచం చీలింది. సోవియట్ పతనంతో బహుళ ధ్రువ ప్రపంచం సాకారమవుతోందని, సమతుల్యత ఏర్పడుతోందని అనుకున్నారు. కానీ, ట్రంప్ నాయకత్వంలోని అమెరికా వాటిని వమ్ము చేసి, 'బలవంతులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తారు, బలహీనులు గత్యంతరం లేక వారి ఆగడాలను భరిస్తారు' అనే ప్రాచీన గ్రీకు నీతిని అమలులో పెడుతోంది. ఈ తరహా రాజనీతి సుస్థిర శాంతిని నెలకొల్పదు.

రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఎనిమిది దశాబ్దాల పాటు అమెరికా ఊతంతో నడిచిన అంతర్జాతీయ సంస్థలు ఇప్పుడు బలహీనపడిపోయాయి. దానికి కారణం- ట్రంప్ జమానాలో అమెరికా అనుసరిస్తున్న విధానాలే. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైనప్పటి నుంచి ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. ప్రపంచాన్ని ఉదారవాదం నుంచి మితవాదం వైపు నెడుతున్నారు. అంతర్జాతీయ సంబంధాలను వ్యాపార లావాదేవీల స్థాయికి దిగజార్చుతున్నారు. ఈ వాతావరణంలోనే దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల సందర్భంగా గాజాలో శాంతి సాధన మండలిని (బోర్డ్ ఆఫ్ పీస్-బీవోపీ) ఏర్పాటు చేశారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి నిరుడు నవంబరులో ఆమోదించిన 2803వ తీర్మానం ప్రకారమే బీవోపీని పట్టాలకెక్కిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. గాజాలో తాత్కాలికంగా శాంతి రక్షణ సేనను ఏర్పాటుచేయాలని, గాజా పునర్నిర్మాణానికి జాతీయ పాలనా కమిటీని నెలకొల్పాలని ఐరాస తీర్మానం ప్రతిపాదించింది. దాని అమలుకే బీవోపీని నెలకొల్పినట్లు ట్రంప్ ప్రకటించారు. కానీ, ఈ బోర్డుకూ ఐరాస తీర్మానం ఉద్దేశించిన దానికీ పోలికే లేదని విమర్శలు వచ్చాయి. నిజానికి ట్రంప్ తెచ్చిన బీవోపీ ప్రస్తుత అంతర్జాతీయ సంస్థాగత వ్యవస్థను నాశనం చేయడమో లేక దాని పతనానికి బీజం వేయడమో తప్ప సమస్యకు స్థిరమైన పరిష్కారాన్ని చూపదు.

ఐక్యరాజ్య సమితిని కాదని...



అంతర్జాతీయ సంస్థల మధ్యవర్తిత్వంతో సంప్రదింపులతో సమస్యలను పరిష్కరించాల్సింది పోయి ప్రపంచంలో అగ్ర ఆర్థిక, సైనిక శక్తి హోదాలో అమెరికా తానే ఏకపక్షంగా శాంతిని రుద్దుతాననడం సమంజసం కాదు. పశ్చిమాసియా వంటి నిత్యాగ్ని గుండంలో ట్రంప్ ఏర్పరచే శాంతి మండలి సాధించేది ఏమీ ఉండదని, అసలు అది ఆచరణయోగ్యం కాదని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. దీనికి చరిత్రే సాక్ష్యం. పశ్చిమాసియా తరచూ సంక్షోభాల సుడిగుండంలో చిక్కుకుపోతుంది. ఎన్నో దశాబ్దాల నుంచి అక్కడ కొనసాగుతున్న రాజకీయ విభేదాలు ఒక్క మండలి ఏర్పాటుతో సమసిపోయేవి కావు. పశ్చిమాసియాలో అనేకానేక గ్రూపులు అస్తిత్వం కోసం నిరంతర పోరాటం జరుపుతున్నాయి. ట్రంప్ బీవోపీ కాలపరిమితి 2027 వరకే ఉంటుంది. ఈ రెండేళ్లలో గాజా సంక్షోభానికి శాశ్వత పరిష్కారం దొరుకుతుందనుకోవడం పేరాశ అవుతుంది. ఐక్యరాజ్య సమితి మరొక తీర్మానం చేసి బోర్డు పదవీ కాలాన్ని పొడిగించక తప్పదు.

గాజా శాంతి మండలిలో చేరాల్సిందిగా ఈ జనవరి వరకు ట్రంప్ ఆహ్వానించిన 62 దేశాల్లో 20 మాత్రమే అందుకు సమ్మతించాయి. పలు ప్రముఖ ఐరోపా దేశాలు బోర్డుకు దూరంగా ఉండిపోయాయి. ట్రంప్ భారత్‌ను కూడా ఆహ్వానించినా దిల్లీ దీర్ఘాలోచనలో పడింది. గాజా శాంతి మండలిలో చేరితే పశ్చిమాసియాలో, ఇండో-పసిఫిక్‌లో భారత్ ప్రాబల్యం పెరిగే మాట నిజమే. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి బలమైన పశ్చిమాసియా దేశాలతో దిల్లీకి పటిష్ఠ సంబంధాలు ఉన్నాయి కూడా. అయితే, శాంతి మండలి ఐక్యరాజ్య సమితి ప్రత్యక్ష సారథ్యంలో కాకుండా ట్రంప్ అజమాయిషీలో ఉంటుంది. అమెరికాలో అధ్యక్షుడు మారినా, అంతర్జాతీయ పరిణామాల్లో మార్పు వచ్చినా ఆ మండలి మూణ్నాళ్ల ముచ్చటగా మిగలవచ్చని భారత్ సందేహిస్తోంది. అమెరికా సర్కారు ఒత్తిడికి తలొగ్గి ప్రస్తుతానికి పశ్చిమాసియా దేశాలు తాత్కాలికంగానైనా తమ విభేదాలను పక్కనపెట్టి సంప్రదింపుల బల్ల దగ్గర కూర్చుంటున్నాయి. అమెరికా ఒత్తిడి దౌత్యం ఏకాభిప్రాయం సాధించలేకపోయినా, దేశాలను బలవంతంగానైనా సహకారానికి ఒప్పించగలదని దీన్నిబట్టి తేలుతోంది. ట్రంప్ ఆహ్వానించిన దేశాలలో అత్యధికం శాంతి మండలిలో చేరడానికి తటపటాయిస్తున్నాయంటే దానికి పలు కారణాలు ఉన్నాయి. ప్రపంచంలో అత్యధిక దేశాలు ఐక్యరాజ్య సమితి నిబంధనావళికి, సమితి వేదికగా సమస్యలు పరిష్కరించుకోవాలనే సూత్రానికీ కట్టుబడి ఉన్నాయి. మరోవైపు ట్రంప్ ప్రపంచ ఆరోగ్య సంస్థ వంటి సమితి అనుబంధ వేదికల నుంచి నిష్క్రమిస్తున్నారు. సమితిని కాదని తానే సమస్యలను పరిష్కరిస్తానంటున్నారు. ఐరాస ద్వారా సర్వామోదనీయ పరిష్కారం సాధించాలనే సంప్రదాయానికి భిన్నంగా ఒత్తిడి, ఆంక్షల అస్త్రాలతో ఫలితాలు సాధిస్తానంటున్నారు. ట్రంప్ శాంతి మండలిలో చేరితే తమంతట తామే సమితిని బలహీనపరచినట్లు అవుతుందని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి.

ఇండియా ఆచితూచి...

ట్రంప్ ఆహ్వానాన్ని మన్నించి గాజా శాంతి మండలిలో భారత్ చేరితే పశ్చిమాసియా వంటి కీలకమైన ప్రాంతంలో సమితి వంటి అంతర్జాతీయ వేదికలను కాదని స్వతంత్రంగా వ్యవహరించే శక్తిమంతమైన దేశాల క్లబ్బులో చేరినట్లవుతుంది. అదే సమయంలో నిర్దిష్ట పరిమితులు, జవాబుదారీతనం లేకుండా ఇష్టారాజ్యంగా ప్రవర్తించే దేశాలతో భుజం కలిపినట్లూ అవుతుంది. తద్వారా సంప్రదాయ అంతర్జాతీయ వేదికలకు దూరం కావాల్సి వస్తుంది. మరోవైపు శాంతి మండలి పదవీకాలం ముగిసేలోగానే ట్రంప్ దానికి మంగళం పాడినా ఆశ్చర్యం లేదు. ఇజ్రాయెల్ శాంతి మండలిలో చేరినా తుర్కియే, పాకిస్థాన్, ఖతార్ దేశాలూ అందులో సభ్యులుగా ఉండటం చిక్కు పరిస్థితిని తెచ్చిపెడుతోంది. అమెరికా ఒత్తిడితో బలవంతంగా ఆ దేశాలతో సహకారానికి తలొగ్గినా ఎవరు తుమ్మినా ఊడిపోయే ముక్కుగానే శాంతి మండలి మిగిలిపోవచ్చు. భారతదేశం విషయానికొస్తే అమెరికాతో బంధాన్ని కాపాడుకోవడానికి మండలిలో చేరే విషయమై ఆలోచించాల్సి వస్తుంది. పశ్చిమాసియాలో తన ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికీ ప్రాధాన్యం ఇవ్వాల్సి రావచ్చు. కాబట్టి, దిల్లీ ఆచితూచి అడుగేయాల్సి ఉంటుంది.



డాక్టర్ వివేక్ మిశ్రా
డిప్యూటీ డైరెక్టర్,
అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్

ఒక చిన్న స్పర్శ...

ఒక మావటి తన ఏనుగును రోజూ సర్కస్ కంపెనీకి తీసుకెళ్లేవాడు. ట్రక్‌లో ఎక్కిస్తున్నప్పుడు దన్నుగా దాని వెనకాల చేయి వేసేవాడు. ఇది చాలాసార్లు గమనించిన పక్కింటి వ్యక్తి ఉండబట్టలేక 'ఏనుగు ఎంత బలశాలో నీకు తెలియదా? నువ్వు సాయం చేస్తేగానీ అది ట్రక్‌లోకి ఎక్కలేదని అనుకుంటున్నావా?' అని అడిగాడో రోజు. దానికి ఆ మావటి నవ్వి.. 'నా గజరాజుకన్నా నేను అల్పుణ్నే.. కానీ నా స్పర్శ తగిలితేనే దానికి భరోసా. నేను పక్కనుంటే ఎంత దూరమైనా నిస్సంకోచంగా వెళ్తుంది' అని బదులిస్తాడు.

ఈ సూత్రం మనుషులకూ వర్తిస్తుంది. హితైషులు ఎక్కువగా ఉన్న వ్యక్తులు ఎలాంటి బాధలనైనా తేలికగా జయిస్తారు. బలవంతులైనా, బలహీనులైనా.. ప్రతి ఒక్కరికీ ఒక్కోసారి ఇలాంటి ఆత్మీయ స్పర్శ కావాలి. ఒక మంచి మాట ఆత్మవిశ్వాసం కోల్పోయి నీరసించిన మనిషిని నిలబెడుతుంది, నిరాశలో ఉన్న కష్టజీవి గుండెలో ఆశల దీపం



వెలిగిస్తుంది. 'నేనున్నాను' అనే ఒక చిన్నమాట.. 'నీ వల్ల అవుతుంది' అనే ఒక నమ్మకం.. 'ఈ కాలం గడిచిపోతుంది' అనే ఓదార్పు.. కష్టాల్ని మర్చిపోయి మళ్లీ ఉత్సాహంగా అడుగులు వేయిస్తాయి. ఈ మాత్రం లేకే.. ఎన్నో జీవితాలు అర్ధాంతరంగా తెల్లారిపోతున్నాయి. తనను తాను 'జమ్మూకశ్మీర్ గుండెచప్పుడు'గా పిలుచుకునే ఆర్జే, ఇన్‌ఫ్లుయెన్సర్ సిమ్రన్ సింగ్‌కి లక్షలమంది అభిమానులున్నారు. కాలు బయటపెడితే సెల్ఫీల కోసం జనం ఎగబడతారు. డబ్బుకు కొదవే లేదు. లేనిదల్లా బాధల్ని ఎదుర్కొనే తెగువే. చిన్న చిన్న ఇక్కట్లకే కుంగిపోయింది. ఈమధ్యే తనువు చాలించింది. ఆమె ఒక్కరే కాదు.. మార్కులు తగ్గాయని ఓ విద్యార్థి, ప్రేమించిన అమ్మాయి మోసం చేసిందని కాలేజీ కుర్రాడు, ఆఫీసులో సూటిపోటి మాటలకు తట్టుకోలేకపోతున్నానని యువ ఉద్యోగి.. తమను తాము బలి తీసుకున్న వార్తలు చూస్తున్నాం. ఎందుకు...? పిపీలికాల్లాంటి ఈ సమస్యలకన్నా జీవితం ఎంతో విలువైందని వాళ్లకు చెప్పేవాళ్లు లేక! ఉలి దెబ్బలు తగలకుండా శిల శిల్పంగా మారుతుందా? ఎత్తుపల్లాలు చూడకుండా శిఖరం చేరిన విజేతలు ఎవరైనా ఉన్నారా? ఇలాంటి మాటలు వాళ్ల మనసుల్లో నాటితే అంతటి దారుణానికి ఒడిగట్టేవారే కాదేమో! అలాంటి మాటల సాయం.. కోట్ల రూపాయల కన్నా విలువైనది. అదే కష్టాల్లో ఉన్న వారికి జీవితం పట్ల గొప్ప ఆశను నింపుతుంది.

అందరి జీవితమూ నల్లేరు మీద బండినడకలా సాగుతుందనుకోవద్దు. కొందరి చిరునవ్వుల వెనకాల పంటి బిగువున భరిస్తున్న కష్టాలుండవచ్చు. మౌనంగా తమ పని తాము చేసుకుని పోతున్నవాళ్లు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతుండొచ్చు. సుడిగుండంలో చిక్కుకున్న నావికుడి లాంటి పరిస్థితుల్లో ఉన్నవారు మన పక్కనే ఉండొచ్చు. ఎంతటి ధైర్యవంతులైనా పరిస్థితులు అనుకూలించనప్పుడు కుంగిపోతారు. వారిని ఆ వెతల నుంచి బయట పడేద్దాం. మనసు విప్పేలా మాట కలుపుదాం. తీరిక చేసుకుని భుజం తడదాం. కష్టాలు, కన్నీళ్లు, సంతోషాలు పంచుకోగలిగే సాన్నిహిత్యాన్ని అందిద్దాం. ఏమంటారు..?

– అర్జున్

జోరుగా ఆహార శుద్ధి

రైతుల ఆదాయాలను పెంచడానికి ఆహార శుద్ధి ఎంతో తోడ్పడుతోంది. దీన్ని గుర్తించి ప్రభుత్వాలు మెగా ఫుడ్ పార్కుల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నాయి. మరోవైపు రెడీ టూ ఈట్ ఆహార పదార్థాలకు డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో 2024లో దాదాపు 36 వేల కోట్ల డాలర్లుగా ఉన్న దేశీయ ఆహార శుద్ధి పరిశ్రమ పరిమాణం 2032 నాటికి 8.8శాతం వార్షిక చక్రీయ వృద్ధి రేటుతో దూసుకుపోతుందని అంచనా. ఆయా సంవత్సరాల్లో మన ఆహార శుద్ధి విపణి విలువ ఎంత ఉండవచ్చంటే...

(కోట్ల డాలర్లలో)

2025	39,950
2026	43,490
2027	47,150
2028	51,100
2029	55,260
2030	56,640
2031	64,250
2032	73,550

(ది సదరన్ ఇండియా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నివేదిక)

డోపింగ్ ధాటికి ఓడుతున్న క్రీడాస్ఫూర్తి

భారత్ 2036 ఒలింపిక్స్ నిర్వహణకు సన్నద్ధతను వ్యక్తం చేసింది. 2030 కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వబోతోంది. ఇంత పెద్ద క్రీడా సంబరాల ముందు దేశాన్ని కలవరపరుస్తున్న విషయం డోపింగ్! ప్రస్తుత ప్రపంచ క్రీడా రంగంలో డోపింగ్‌లో ఎక్కువ మంది పట్టుబడుతున్న దేశాల్లో ఇండియా ముందుండటం ఆందోళన కలిగిస్తోంది.



ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ 2024లో 7,113 డోపింగ్ పరీక్షలు నిర్వహిస్తే ఒక్క భారత్‌లోనే 260 మంది అథ్లెట్లు పాజిటివ్‌గా తేలారు. రెండు, మూడో స్థానాల్లో ఉన్న ఫ్రాన్స్ (91), ఇటలీ (85) మధ్య అంతరాన్ని గమనిస్తే ఇండియా డోపింగ్‌కు ఆలవాలమవుతున్నట్లు విదితమవుతోంది. గత మూడేళ్లలో డోపింగ్ పరీక్షల్లో పైస్థానంలో నిలవడం భారత్‌కిది వరసగా మూడోసారి. ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో అదరగొట్టి పతకాలు గెలిచిన చాలామంది అథ్లెట్లు నిషేధిత మాదకద్రవ్యాలు ఉపయోగించి పట్టుబడుతున్నారు. 2025లో ఏడుగురు అథ్లెట్లను జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) ప్రాథమికంగా సస్పెండ్ చేసింది. పూర్తి నివేదికలు వచ్చిన తరవాత చాలామంది డోపీలుగా తేలే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో డోపింగ్‌ను నిరోధించడం భారత క్రీడారంగానికి పెద్ద సవాల్‌గా మారింది.

నిర్లక్ష్యం వీడని ఆటగాళ్లు

క్రీడాకారుల్లో కొంతమంది ఉద్దేశపూర్వకంగా శక్తి సామర్థ్యాలను పెంచుకునేందుకు నిషేధిత ఉత్ప్రేరకాలు వాడుతున్నారు. మరికొంతమంది అనారోగ్య సమస్యలతో కొన్నిరకాల మందులు వాడటంతో దొరికిపోతున్నారు. డోపింగ్ పరీక్షల్లో పాజిటివ్‌గా తేలుతున్న వాళ్లలో రెండో రకం అథ్లెట్లే ఎక్కువ. తెలియక చేసిన తప్పిదంతో కెరీర్‌లనే కోల్పోతున్నారు. అనారోగ్య సమస్యల కారణంగా వాళ్లు వాడుతున్న ఔషధాల్లో కొన్ని నిషేధిత ఉత్ప్రేరకాలు ఉంటున్నాయి. అలాంటివి కలగలిసిన మందులను వాడినా, జాతీయ డోపింగ్ నిరోధక సంస్థకు ముందుగా సమాచారం ఇస్తే సరిపోతుంది. అయితే, ఎలాంటి సమాచారం లేకుండా ఇష్టారీతిన ఔషధాలు వాడటం వల్లే సమస్య తలెత్తుతోంది. సాధారణంగా ఒక పెద్ద టోర్నీ ముగిసిన తరవాత జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ క్రీడాకారుల నుంచి రక్త, మూత్ర నమూనాలు తీసుకుంటుంది. అందరి నుంచి కాకుండా కొంతమంది నుంచే ఇలా నమూనాలను సేకరిస్తుంది. దీంతో దొరికిపోయే అవకాశం ఉండకపోవచ్చనే భావనతో చాలామంది అథ్లెట్లు ఉద్దేశపూర్వకంగానే ఉత్ప్రేరకాలు వాడుతున్నట్లు తెలుస్తోంది. ఇలా డ్రగ్స్ వాడి పతకాలు గెలిచిన అథ్లెట్లు, తరవాత ఏదో ఒక సందర్భంలో పట్టుబడి తాము అంతకుముందు సాధించిన పతకాలను, రికార్డులను కోల్పోతున్నారు. ఉద్దేశపూర్వకంగా డోపింగ్ చేసేవాళ్ల వల్ల క్రీడలపై గౌరవం తగ్గుతోంది. బెన్ జాన్సన్ ఎంతో గొప్ప అథ్లెట్. 1988 సియోల్ ఒలింపిక్స్‌లో 100 మీటర్ల పరుగులో సంచలన విజయం సాధించాడు. కానీ, కొన్నాళ్లకు డోపింగ్‌లో దొరికి ఒలింపిక్స్‌లో సాధించిన స్వర్ణాన్ని కోల్పోయాడు. సైక్లింగ్‌లో అతి పెద్ద టోర్నీ అయిన టూర్ డి ఫ్రాన్స్‌లో లాన్స్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఓ దిగ్గజం. ఏడుసార్లు ప్రపంచ ఛాంపియన్. అలాంటి స్టార్ డోపింగ్ చేశానని అంగీకరించి ఖ్యాతిని, టైటిళ్లను పోగొట్టుకున్నాడు. డోపింగ్ వల్ల కలిగే పరిణామాలకు ఈ రెండు సంఘటనలు మచ్చుతునకలు మాత్రమే. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అథ్లెట్లు డోపింగ్ విషయంలో అప్రమత్తత పాటిస్తుండగా, భారత అథ్లెట్లు మాత్రం నిర్లక్ష్యం వీడటం లేదు. ముఖ్యంగా అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్‌లాంటి క్రీడల్లో మన క్రీడాకారులు తరచూ దొరికిపోతున్నారు. విపరీతమైన డోపింగ్ కేసుల కారణంగా రష్యాపై నిషేధమే పడింది. ఆ జట్టు క్రీడాకారులు ఒలింపిక్స్‌కు కూడా దూరమయ్యారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో భారత్ సైతం అలాంటి దుస్థితినే ఎదుర్కొనే ప్రమాదం ఉంది.

కఠిన శిక్షలతోనే అడ్డుకట్ట

నిషేధిత మాదక ద్రవ్యాలు వాడి దొరికిపోతే పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయో క్రీడాకారులకు అర్థమయ్యేలా చేయాలి. కోచ్‌లు, క్రీడా సమాఖ్యలు ఈ బాధ్యత తీసుకోవాలి. సాధారణంగా పెద్ద టోర్నీలు జరిగినప్పుడు మాత్రమే జాతీయ డోపింగ్ సంస్థ పరీక్షలు నిర్వహిస్తోంది. చిన్న టోర్నీల్లోనూ డోపింగ్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలి. మొగ్గ దశలోనే తుంచితే డోపింగ్ మహావిషవృక్షంగా ఎదగకుండా అడ్డుకోవచ్చు. అయిదేళ్ల శిక్ష అనుభవించిన తరవాత పునరాగమనం చేసి డోపింగ్‌కు పాల్పడిన అథ్లెట్లు కూడా ఉన్నారు. శిక్షలు కఠినంగా ఉంటే అలాంటి పరిస్థితి తలెత్తదు. ఒలింపిక్స్‌లో పతకాలు కొల్లగొట్టే అమెరికా, చైనా డోపింగ్‌పై ఇప్పటికే సమరశంఖం పూరించాయి. అందుకే ఆ దేశాల అథ్లెట్లు పరీక్షల్లో నెగెటివ్‌గానే తేలుతున్నారు. ఆ స్ఫూర్తిని భారత్ కూడా అందిపుచ్చుకోవాలి. యాంటీ డోపింగ్ సెంటర్లను పెంచడం, క్రీడాకారులకు అవగాహన కల్పించడం కీలకం. అప్పుడే మన దేశం భారీ టోర్నీలను సమర్థంగా, మచ్చలేకుండా నిర్వహించే అవకాశం ఉంటుంది.

– దాస్యం వెంకట వంశీకృష్ణ

సుబ్బమ్మ తెలివి..!

రంగాపురంలో వైద్యురాలు సుబ్బమ్మ కొడుకు రవితో కలిసి ఉండేది. ఒకరోజు ఏదో పని మీద పక్క గ్రామానికి వెళ్లాడు రవి. పని ఆలస్యం కావడంతో అక్కడే ఉండిపోయాడు. దాంతో ఆరోజు రాత్రి ఇంట్లో సుబ్బమ్మ ఒక్కతే ఉంది. పగలంతా ఆ చుట్టుపక్కలే తిరిగిన ఇద్దరు దొంగలు, రాత్రికి ఆ ఇంట్లోకి చొరబడ్డారు. ఆ శబ్దానికి సుబ్బమ్మకు ఒక్కసారిగా మెలకువ వచ్చింది. లేచి చూసే సరికి ఇద్దరు వ్యక్తులు ఎదురుగా నిలబడ్డారు. పైగా వాళ్ల చేతుల్లో ఏవో వస్తువులూ పట్టుకున్నారు. విషయం అర్థం చేసుకున్న సుబ్బమ్మ.. 'వచ్చారా.. ఇప్పటి వరకు మీకోసమే ఎదురుచూసి, ఇందాకే పడుకున్నాను. మా అబ్బాయి ఊరు వెళ్తూ నగల కోసం ఇద్దరు వ్యక్తులు వస్తారని చెప్పాడు. అది మీరే కదా!' అంది. ఇదే మంచి



అవకాశం అనుకుని.. 'అవును మేమే!' అని జవాబిచ్చారా దొంగలు. 'సరే మీరు కాళ్లూచేతులు కడుక్కుని రండి. భోజనం వడ్డిస్తాను.. తిన్న తరవాత నగలు తీసుకెళ్దురు గానీ..' అంది సుబ్బమ్మ. సరేనంటూ కాళ్లూచేతులు కడుక్కుని వచ్చి కూర్చున్నారు. కాసేపటికి సుబ్బమ్మ ఇద్దరికీ భోజనం వడ్డించింది. కడుపునిండా తిని.. అక్కడే నిద్రపోయారు. వాళ్లకు పెట్టిన భోజనంలో తన దగ్గరి నిద్ర మాత్రలు కలిపింది సుబ్బమ్మ. ఇక వెంటనే బయటికి వెళ్లి.. ఇంటికి తాళం వేసింది. చుట్టుపక్కల వాళ్లందరినీ నిద్ర లేపింది. దొంగలకు మెలకువ వచ్చేసరికి వాళ్లంతా చుట్టూరా నిలబడ్డారు. దాంతో దొరికిపోయామన్న సంగతి వాళ్లకు అర్థమైంది. ఇంతలో రాజ భటులకు సమాచారం తెలిసింది. అక్కడికి వచ్చి దొంగలను తీసుకెళ్లారు. ఇన్నిరోజుల నుంచి ఊళ్లో దొంగతనాలు జరుగుతుంటే ఎవరూ ఆ దొంగలను పట్టుకోలేకపోయారు. కానీ సుబ్బమ్మ సమయస్ఫూర్తితో ఆలోచించి పట్టించినందుకు అందరూ ఆమెని అభినందించారు.

– మొర్రి గోపి

హాయ్! బుజ్జీ!!

ఆ ఒక్కటి ఏది?

కింద ఇచ్చిన పదాల్లో ఒక్కటి మాత్రం మిగతా వాటికి భిన్నంగా ఉంటుంది. ఆ ఒక్కటి ఏదో కనిపెట్టండి.

1. చైత్రం, వైశాఖం, జ్యేష్ఠం, డిసెంబరు
2. కప్ప, పావురం, కాకి, పిచ్చుక
3. ఆసియా, ఆఫ్రికా, ఇండియా, యూరప్
4. ఆకాశం, నీరు, చెట్టు, నిప్పు

జవాబు: 1.డిసెంబరు 2.కప్ప 3.ఇండియా 4.చెట్టు

(c) eenadu

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
బుధవారం జనవరి 28, 2026



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హోంమంత్రి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే గద్దె, సీపీ, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

మత్తు వదలదురా.. భవిత కలదురా..

మాదకద్రవ్యాలను తరిమేస్తాం: సీపీ రాజశేఖరబాబు



స్కేటింగ్‌తో సందడి చేసిన చిన్నారులు

నా కుమారుడిని మార్చారు: అంజమ్మ

మాదకద్రవ్యాలకు అలవాటు పడిన నా కుమారుడిని పోలీసులు మార్చారు. మంచి మనిషిగా చేసి నాకు అప్పగించారు. ఇప్పుడు చక్కగా పని చేసుకుంటున్నాడు. సంతోషంగా ఉంది. నున్న పోలీసుల సహకారం లేకపోతే నా కుమారుడు నాకు దక్కేవాడు కాదు. నా కుమారుడిలా ఎవరూ బాధ పడకూడదన్న ఆలోచనతో ఇలా ముందుకు వచ్చి చెబుతున్నానని అంజమ్మ వివరించారు.

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి నిర్వీర్యం అవుతోందని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా మాదకద్రవ్యాలను నామరూపాలు లేకుండా చేయాలని నిర్ణయించామన్నారు. మంగళవారం సాయంత్రం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి డ్రగ్స్‌పై దండయాత్ర పేరుతో 34 రోజుల మహిళా పోలీసుల సైకిల్‌యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు మాదకద్రవ్యాలతో జరిగే నష్టాలు తెలియాలన్న ఉద్దేశంతో మహిళా పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఇదే స్ఫూర్తితో ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలని అభిలషించారు.

★ కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలను ఎంత త్వరగా కట్టడి చేయగలిగితే అంత వేగంగా సమాజం బాగుపడుతుందని వివరించారు. ఈగల్ టీమ్ ద్వారా [illegible] ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నారని వివరించారు. సైకిల్‌యాత్ర వెళ్లిన అన్ని మండలాల్లో ఇంతే ఉత్సాహంగా నిర్వహించి మాదకద్రవ్యాలను జిల్లా నుంచి తరిమివేయడానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ★ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారిని డ్రోన్ పైలట్లుగా తీర్చిదిద్దారని, తాజాగా డ్రగ్స్‌పై దండయాత్ర మహిళా పోలీసు సిబ్బంది ముందుకు వచ్చారన్నారు. ★ విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల కట్టడి అనేది పోలీసు బాధ్యత మాత్రమే కాదని ప్రజలు కూడా దానికి సహకారం అందించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో పిల్లలు సైతం డ్రగ్స్ బారిన పడ్డారని, సభలు, సమావేశాలకు గంజాయి ప్యాకెట్లు ఇచ్చి యువతను తీసుకొచ్చేవారన్నారు. సైకిల్ యాత్రలో పాల్గొంటున్న మహిళా పోలీసులకు మంత్రులు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమం టీజర్‌ను రిమోట్ నొక్కి విడుదల చేశారు.

అద్యంతం ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. ఈ కార్యక్రమానికి నగరంలోని పలు కళాశాలలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైకిల్ యాత్రలో పాల్గొని ఉత్సాహం చూపారు. సైకిళ్లతో సహా స్టేడియంకు విచ్చేశారు. వేలమందితో సభా ప్రాంగణం కిక్కిరిసింది. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.



ఇందిరాగాంధీ స్టేడియంలో సభకు హాజరైన ప్రజలు

సైకిల్ యాత్ర నిర్వహించే మహిళా సిబ్బందిని చూసి యువత స్ఫూర్తి పొందాలని కోరారు. అనంతరం సైకిల్ యాత్ర ఇందిరాగాంధీ స్టేడియం నుంచి బెంజి సర్కిల్ వరకు.. అక్కడ నుంచి ఇందిరా గాంధీ స్టేడియంకు చేరుకుంది.

పకడ్బందీగా ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణ



ప్రశ్నపత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

విజయవాడ సిటీ: నగరంలో ఈ నెల 31 వరకు ఏపీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బిషప్ అజరయ్య బాలికోన్నత పాఠశాల, పటమట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జూనియర్ అధ్యాపకులు (లైబ్రేరియన్ సైన్స్), ఏఈఈ (సివిల్), ఉద్యానశాఖాధికారి, సహాయ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు తదితర 17 నోటిఫికేషన్ల ద్వారా వెల్లడించిన పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తొలి రోజు మంగళవారం 24 పరీక్ష కేంద్రాల్లో 5,718 మందికి గాను 2,056 మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

బెజవాడకు తెచ్చేలోపే.. ప్రాణాలు పోతున్నాయ్..!

- జాతీయ రహదారులపై ట్రామాకేర్ సెంటర్లే లేవు
- జగ్గయ్యపేట, నందిగామ, గన్నవరం, పామర్రుల్లో పెట్టరేం?

పరిశీలన

ఉమ్మడి కృష్ణాలోని ఎన్‌హెచ్ 65, 16.. ప్రధాన జాతీయ రహదారులపై ఏ పెద్ద ప్రమాదం జరిగినా.. క్షతగాత్రులను విజయవాడకు తేవడం తప్ప.. మరో దారి లేదు. ఎన్‌హెచ్ 65పై.. జగ్గయ్యపేట నుంచి బందరు వరకు 149 కిలోమీటర్లు. ఈ మధ్యలో ఎక్కడ తీవ్ర ప్రమాదం జరిగినా.. విజయవాడకు పరుగెత్తాల్సిందే. చెన్నై-కోల్‌కతా ఎన్‌హెచ్ 16పై.. విజయవాడ నుంచి బొమ్మలూరు టోల్‌గేట్ వరకు 55.02 కి.మీ. ఈ మధ్యలోనూ ఒక్క అత్యవసర వైద్య చికిత్సా కేంద్రం లేదు. ఈ జాతీయ రహదారులను ఆనుకుని.. జగ్గయ్యపేట, నందిగామ, గన్నవరం, పామర్రు, ఉయ్యూరుల్లో.. ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటు ప్రతిపాదనలు.. ఏళ్లుగా అమలుకాలేదు.

80 కిలోమీటర్లు మరణ వేదన..

ఎన్‌హెచ్-65లో.. జగ్గయ్యపేట నుంచి విజయవాడకు 82.02 కి.మీ. ఈమధ్యలో నిత్యం ప్రమాద మంటికలు మోగుతున్నా.. జగ్గయ్యపేట, నందిగామల్లో సీహెచ్‌సీలు తప్ప పెద్ద ఆసుపత్రుల్లేవు. ఓ మోస్తరు గాయాలైనా స్థానికంగా చికిత్స అందిస్తున్నారు. ★ తీవ్రత మేరకు.. జగ్గయ్యపేట-80, పెనుగంచిప్రోలు-70, నందిగామ-50 కి.మీల దూరం నుంచి.. విజయవాడ తెస్తున్నారు. కనీసం గంట-గంటన్నర తప్పదు. ఈలోగా బతకాల్సిన వాళ్లు సకాలంలో చికిత్స అందక చనిపోతున్నారు.



2017లో ముళ్లపాడు వద్ద వంతెన పైనుంచి కిందకు పడిపోయిన బస్సు

పెనుగంచిప్రోలు మండలం ముళ్లపాడు వద్ద జాతీయ రహదారిపై ఓ ట్రావెల్స్ బస్సు కల్వర్టు కిందకు దూసుకెళ్లి కాలువలో పడింది. 11 మంది అక్కడే చనిపోయారు. 30 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. రాత్రిపూట ప్రమాదం జరగడం, దగ్గర్లో ట్రామాకేర్ సెంటర్ లేక.. క్షతగాత్రులు, మృతదేహాలను అక్కడి నుంచి 72 కి.మీ దూరంలో విజయవాడకు తీసుకురావాల్సి వచ్చింది.

- ఈనాడు, అమరావతి

బాబోయ్.. బందరు దారి

విజయవాడ నుంచి బందరుకు 68 కి.మీ. ఎన్‌హెచ్ 65ను ఆనుకుని ఒక్క అత్యవసర వైద్య చికిత్స కేంద్రం లేదు. ★ పామర్రు నుంచి విజయవాడకు 44.01, బందరుకు 26.08 కి.మీ. కంకిపాడు- పామర్రు మధ్యలో ఏ తీవ్ర ప్రమాదం జరిగినా.. విజయవాడకు లేదంటే బందరుకు తరలించాల్సిందే. కనీసం 30-60 నిమిషాలు తప్పదు. మధ్యలో నాలుగైదు ట్రామాకేర్ సెంటర్లు అవసరం. తీవ్ర ప్రమాదాలు జరిగే.. బ్లాక్ స్పాట్‌లూ ఎక్కువే. ★ గుడివాడలో ఏరియా ఆసుపత్రి ఉన్నా.. వెళ్లేందుకు సరైన దారిలేదు. ఒకవేళ తీసుకెళ్లినా సీరియస్ కేసులు బెజవాడకే పంపేస్తున్నారు. ★ పామర్రులో సీహెచ్‌సీ ఉన్నా.. వైద్య వసతుల్లేవు. దీనిని 100 పడకల సెంటర్‌గా మార్చాలి. ★ ఉయ్యూరులో 30 పడకల సీహెచ్‌సీని ట్రామాకేర్ సెంటర్‌గా మార్చొచ్చు.



నందిగామలో అత్యవసరం...

నందిగామ సీహెచ్‌సీ జాతీయ రహదారి పక్కనే ఉంది. 24 మంది వైద్యులున్నారు. నిత్యం ఓపీ 400పైనే ఉంటోంది.. 10-15 ప్రమాద కేసులు వస్తున్నాయి. తీవ్ర కేసులైతే.. విజయవాడ పంపేస్తారు. ఈ సీహెచ్‌సీని 100 పడకలకు పెంచి రూ.33 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. ★ ఇక్కడ ట్రామాకేర్ సెంటర్ పెడితే.. జగ్గయ్యపేట నుంచి కంచికచర్ల వరకు ఉపయుక్తం. ★ గౌరవరం దగ్గర ట్రామాకేర్ సెంటర్ కట్టాలని స్థలసేకరణ జరిగినా కార్యరూపం దాల్చలేదు.

అధిక ట్రాఫిక్ ఉన్నా అంతే..

★ గన్నవరంలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు ప్రతిపాదన ఏళ్లుగా ఉంది. ఇక్కడ 30 పడకల సీహెచ్‌సీ ఉన్నా.. సాధారణ సేవలకే పరిమితం. విజయవాడ-హనుమాన్‌జంక్షన్ మధ్యలో పెద్ద ప్రమాదం జరిగినా.. విజయవాడ తేవాల్సిందే. అధిక ట్రాఫిక్ నేపథ్యంలో.. తీవ్ర గాయాలైన వారిని ఆసుపత్రికి తెచ్చేలోపే ప్రాణాలుపోయే వీలుంది.

జిల్లాల వారీగా డీఎస్సీ శిక్షణ కేంద్రాలు



అభ్యర్థులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

గొల్లపూడి, న్యూస్‌టుడే : డీఎస్సీ అభ్యర్థుల కోసం జిల్లాల వారీగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. గొల్లపూడిలోని బీసీ భవన్‌లో రెండో విడత సివిల్ సర్వీసెస్ శిక్షణ కేంద్రాన్ని మంత్రి మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. సివిల్ సర్వీసెస్ శిక్షణకు 700 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 96 మంది ఎంపికయ్యారని వెల్లడించారు. మొదటి దఫా వంద మందికి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. అభ్యర్థులందరికీ నాణ్యమైన భోజనం, ఆరోగ్య భద్రత, వసతితో కూడిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో మరో దఫా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాల వారీగా బీసీ భవనాలను నిర్మాణం చేస్తామన్నారు. అనంతరం అభ్యర్థులకు అవసరమైన మెటీరియల్‌ను అందజేశారు. బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఇతర అధికారులు పాల్గొన్నారు.

433 జలజీవన్ మిషన్ పనులు పూర్తి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో సురక్షిత తాగునీటిని పంపిణీ చేసేందుకు జలజీవన్ మిషన్ కింద 534 పనులు మంజూరు కాగా, వీటిలో ఇప్పటివరకు 433 పూర్తయ్యాయని, 101 పనులు పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఆ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో తాగునీటి సరఫరాపై మంగళవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ..రక్షిత పథకాల ద్వారా తాగునీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. క్లోరినేషన్ చేయడంతోపాటు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరిశుభ్రమైన తాగునీటిని మాత్రమే అందించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలు, పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీల్లో తాగునీటి బైలాజికల్ పరీక్షల తేదీ, నివేదిక వివరాలను తప్పనిసరిగా బోర్డులపై ప్రదర్శించాలన్నారు. జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీపీవో పి.లావణ్యకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సి.హెచ్.తిరుమలకుమార్, డీఏవో విజయకుమారి, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, డీఈవో చంద్రకళ, ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.

WE MANUFACTURE AND SUPPLY APPAREL
FOR BULK ORDER QUANTITES
REGULAR WEAR
- RELIGIOUS WEAR
- TOPS
- BOTTOMS
- UNDERGARMENTS
- NIGHT WEAR
FOR MEN & WOMEN
BOYS & GIRLS
VIJAYAWADA-AP
8977796538

మీరు ఆక్రమిస్తే... మేము చూస్తుంటాం



నగరంలోని లబ్బీపేట వై.వి.రావు హాస్పిటల్ రోడ్డును ప్రజా ధనం వినియోగించి అభివృద్ధి చేశారు. ఆ రోడ్డుపై ఓ ఫంక్షన్ హాలు వద్ద 'నో పార్కింగ్ ఏపీ ట్రాఫిక్ పోలీస్' పేరుతో బోర్డు పెట్టారు. వాటికి తాళ్లు కట్టి కొంతమేర రహదారి ఆక్రమించారు. ఫలితంగా రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు ఫంక్షన్లు, సమావేశాలు నిర్వహించినప్పుడు అక్కడ ద్విచక్రవాహనాలు నిలుపుతున్నారని స్థానికులు చెబుతున్నారు. రహదారిని పార్కింగ్ స్థలంగా వినియోగించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. **- విజయవాడ సిటీ, న్యూస్‌టుడే**

విధుల్లో జూనియర్.. అక్రమాల్లో సీనియర్!

■ గ్రామీణ నీటిసరఫరా శాఖలో ఉద్యోగి హవా

ఈనాడు, అమరావతి

గ్రామీణ నీటి సరఫరా శాఖలో.. అతనో జూనియర్ అసిస్టెంట్. అక్రమాల్లో, అడ్డగోలు వ్యవహారాల్లో మాత్రం.. సూపర్ సీనియర్. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం చేయాల్సిన పనులను నిబంధనలకు విరుద్ధంగా చేస్తూ భారీగా దండుకుంటున్నాడు. అవినీతి ఆరోపణలున్న ఉద్యోగులను సైతం మాయ చేసి పీఎఫ్, ఎరియర్స్ రప్పిస్తున్నాడు.

ఇదండీ లెక్క... ★ ఒకే ఉద్యోగి పేరుతో రెండుసార్లు ఎరియర్స్ దరఖాస్తు చేసి దోపిడీ మొదలు పెట్టాడు. కొంతకాలం కిందట ఓ ఉద్యోగికి రూ.8.75 లక్షల ఎరియర్స్ కోసం దరఖాస్తు చేశారు. ఆ సొమ్ము ఉద్యోగి ఖాతాలో జమయినా మళ్లీ ఆ సొమ్ము గురించి దరఖాస్తు చేసి దస్త్రం నడిపించారు. ఆఖరి నిమిషంలో ఖజానా శాఖ అధికారులు గుర్తించడంతో అక్రమం బట్టబయలైంది.

అడుగడుగునా అవినీతి... ★ ఎన్టీఆర్ జిల్లా సరిహద్దు ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఆ ఉద్యోగికి ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంపై అవగాహన ఉంది. ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్, జిల్లా కార్యాలయాల్లో ఉద్యోగులకు ప్రయోజనాలు రప్పించే ప్రక్రియ చేసేందుకు సిబ్బంది ఉంటారు. కొందరు పని భారం తప్పించుకునేందుకు సదరు జూనియర్ అసిస్టెంట్‌కు ఏళ్లుగా ఆ పనులు అప్పగించి చేయిస్తున్నారు. నిబంధనల ప్రకారం అధికారుల లాగిన్ బయట వారికి తెలియకూడదు.. ఈ ఉద్యోగికి మాత్రం రెండు జిల్లాల్లో బోలెడు మంది అధికారుల లాగిన్లు తెలుసు. ★ ఇదే అదునుగా వ్యాపారం మొదలుపెట్టాడు. ఉద్యోగులకు ఎరియర్స్ దరఖాస్తు చేసినప్పుడు చిన్నచిన్న సాంకేతిక లోపాలను వాడుకోవడం.. ఖజానా శాఖలో కొందరు అధికారులకు మామూళ్ల ఎర వేయడంతో భారీగా దోచుకున్నాడు. ★ ఇతను గుడివాడలో పని చేస్తున్నప్పుడు కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో చేసిన పనుల బిల్లుల దస్త్రం కదలాలంటే రూ.20 వేలు మామూళ్లు ఇవ్వాలని ఓ గుత్తేదారుడిని డిమాండ్ చేశారు. ఆయన నిరాకరించడంతో బిల్లుల నమోదులో కొర్రీలు పెట్టి కోత వేయడంతో గుత్తేదారుడితో వివాదం రేగింది.

ఐదేళ్లు హద్దే లేదు...

★ సదరు ఉద్యోగి వైకాపా వీరాభిమాని.. గత ప్రభుత్వ పాలనలో హద్దు లేకుండా పేట్రేగిపోయారు. తనకు మంత్రులు... రాష్ట్రస్థాయి అధికారులు తెలుసని మభ్యపెట్టి దోచేశాడు. అనిశా తనిఖీల్లో పట్టుబడిన వారు, అవినీతి ఆరోపణల్లో విచారణలు ఎదుర్కొంటున్న వారికి నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగానంతర ప్రయోజనాలు ఇప్పించి వారి నుంచి భారీగా కమీషన్లు దండుకుంటున్నాడు. కొంత కాలం కిందట ఏసీబీకి పట్టుబడిన ఓ ఈఈకి అక్రమంగా ప్రయోజనాలు రప్పించాడు. ★ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అవినీతి ఆరోపణలతో విచారణ ఎదుర్కొంటున్న ఓ విశ్రాంత ఎస్‌ఈకి ఉద్యోగ విరమణ ప్రయోజనాల కోసం ప్రస్తుతం విధులకు ఎగనామం పెట్టి పైరవీలు చేస్తున్నాడు.

అటవీ పర్యాటకానికి పెరుగుతున్న ఆదరణ

ఇబ్రహీంపట్నం గ్రామీణం: అమరావతికి గేట్ వేలా ఉన్న మూలపాడు అటవీ పరిసరాలను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళిక రూపొందించి ఎంపీ కేశినేని చిన్నితో కలిసి సీఎం చంద్రబాబుకు సమర్పించనున్నట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. ఎంపీ చిన్ని, కూటమి నాయకులు, పర్యాటక, అటవీ, పురావస్తు శాఖ అధికారులతో కలిసి మూలపాడులోని నగరవనం, అటవీ ప్రాంతాన్ని ఆయన మంగళవారం పరిశీలించి మాట్లాడారు. అటవీ పర్యాటకానికి ఆదరణ పెరుగుతున్నందున ఎక్కువ మందిని ఆకర్షించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ నేపథ్యంలో విజయవాడ, రాజధాని అమరావతికి సమీపంలో మూలపాడు ఉండటంతో అభివృద్ధికి కీలకంగా మారిందన్నారు. తెదేపా హయాంలో ప్రారంభమైన అభివృద్ధి. . నేడు కూడా కొనసాగించడంతో ఇక్కడ నగరవనం ఏర్పాటు, సీతాకోక చిలుకల పార్కు, పచ్చని చెట్ల మధ్యలో వివిధ జాతులకు చెందిన పక్షుల సంచారంతో పర్యాటక ప్రాంతానికి నాంది పలికిందని వివరించారు. 300 హెక్టార్ల అటవీ శాఖ భూమిలో త్వరలో జంగిల్ సఫారీ, పక్షుల ప్రపంచం, జూ పార్కుతో పాటు మరిన్ని ట్రెక్కింగ్ పాయింట్లను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం చేపట్టనున్న అభివృద్ధి పనులతో రానున్న కృష్ణా పుష్కరాల నాటికి ఈ ప్రాంతం రూపురేఖలు మారనున్నాయన్నారు. మైలవరం భాజపా, జనసేన బాధ్యులు బాలకోటేశ్వరరావు, అక్కల గాంధీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెట్టుబడుల పేరుతో వ్యాపారికి టోకరా

మూడు నెలల్లో రూ.74.2 లక్షల మేర మోసం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: క్లాస్‌మేట్‌నంటూ పరిచయం పెంచుకుని బిట్ కాయిన్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఒక వ్యాపారికి సైబర్ నేరస్థులు టోకరా వేశారు. 3 నెలల కాలంలో ఒక వ్యాపారి నుంచి పెట్టుబడులు, రకరకాల పన్నులు పేరు చెప్పి రూ.74.2 లక్షల మేర వసూలు చేసి నిలువునా ముంచేశారు. పెట్టుబడుల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నా సైబర్ నేరస్థులు ఏదో రూపంలో మోసాలు చేస్తూనే ఉన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి...గొల్లపూడికి చెందిన ఒకరు(36) వ్యాపారం చేస్తుంటారు. ఈయనకు 2025 సెప్టెంబరు నెలలో వాట్సప్ ద్వారా ఒక యువతి క్లాస్‌మేట్ అని పరిచయం చేసుకున్నారు. తన పేరు క్రితికారెడ్డి అని, యూకేలో ఉంటానని తెలిపారు. అప్పటినుంచి వారు వాట్సాప్‌లో ఛాటింగ్ చేసుకునేవారు. ఈ క్రమంలో బిట్‌కాయిన్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే పెద్ద మొత్తంలో లాభాలు వస్తాయని చెప్పి కొన్ని స్క్రీన్ షాట్లు పెట్టారు. వాటిని చూసి ఆకర్షితులైన వ్యాపారి రూ.20 లక్షల పెట్టుబడి పెట్టారు. భారీగా లాభాలు కనిపించడంతో వాటిని తీసుకునేందుకు ప్రయత్నించగా అవి రాలేదు. రూ.20 లక్షలు ఏఎంఎల్ ట్యాక్స్ కడితే విత్‌డ్రా చేసుకోవచ్చునడంతో వారి మాటలు నమ్మి మరో రూ.20 లక్షలు కట్టారు. ఆ తరువాత మార్జినల్ ట్యాక్స్, అడిషనల్ ట్యాక్స్, వీఐపీ ఫీజు పేరు చెప్పి మరో రూ.34.2 లక్షలు వసూలు చేశారు. మోసపోయినట్లు గ్రహించి ఫిర్యాదు చేయగా సైబర్ క్రైం పోలీసులు కేసు పెట్టి దర్యాప్తు చేస్తున్నారు.

జినేష్.. శిబులకు ముగిసిన కస్టడీ

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితులు జినేష్, శిబులకు మంగళవారంతో మూడు రోజుల కస్టడీ ముగిసింది. వీరిని విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. వీరిని న్యాయాధికారి లెనిన్ బాబు ఎదుట హాజరుపరృగా.. రిమాండ్‌కు ఆదేశించారు. అనంతరం వారిని విజయవాడ కారాగారానికి తరలించారు. గోవాలోని డిస్టలరీల నుంచి స్పిరిట్‌ను తీసుకుని బాలాజీకి సరఫరా చేసినట్లు మూడు రోజుల విచారణలో ప్రధానంగా వెల్లడించినట్లు తెలిసింది. శిబు ద్వారా బాలాజీకి అందజేసినట్లు ఇంటరాగేషన్‌లో వెల్లడించాడు. కోర్టు ఆదేశాల మేరకు నిందితులను ఈనెల 25 నుంచి కస్టడీకి తీసుకున్న సంగతి తెలిసిందే.

నవ్విపోదురుగాక.. నాకేమని..!

వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన పేర్నిపై మరో కేసు

ఈనాడు, అమరావతి, మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే



కేసు మీద కేసు నమోదవుతున్నా మాజీ మంత్రి, పేర్ని వెంకట్రామయ్య(నాని) తీరు మాత్రం మారడం లేదు. ఇష్టమొచ్చినట్లు నోరుజారడం.. కార్యకర్తలను రెచ్చగొట్టడం.. పైకి నీతులు చెప్పటం ఆయనకు అలవాటైపోయింది. తాజాగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయంపై తెదేపా నాయకులు అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ దిలీప్‌కుమార్, పార్టీ నాయకులు పిప్పళ్ల వెంకటకాంతారావులు కృష్ణా జిల్లా ఇనగుదురుపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. పేర్ని వ్యాఖ్యల ఫొటోలు, క్లిప్పింగులు పోలీసులకు అందించారు. దీనిపై బీఎన్ఎస్‌లోని 196(1), 351(2), 352(2), 353(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుపై తీవ్ర వ్యాఖ్యలు..

★ చాట్రాయ్ మండలం చిన్నంపేటలో జనవరి 25న జరిగిన వైఎస్సార్ విగ్రహావిష్కరణ బహిరంగ సభలో పేర్ని మాట్లాడుతూ 'తిరుపతి లడ్డూ ప్రసాదంపై అబద్ధాలు చెప్పిన చంద్రబాబు నాలుకపై దబ్బళం కాల్చి గుచ్చాలి. ఆయనది మనిషి జన్మోకాదో తెలియదు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ శరీరమంతా వాతలు పెట్టాలి. పవన్‌కల్యాణ్ రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను కడిగి శుద్ధి చేయాలి. చంద్రబాబు ఏదైనా అనగానే పవన్, భాజపా బుర్రకథలో వంతపాడే వారిలా మారుతున్నారు. వేంకటేశ్వరస్వామి మిమ్మల్ని విడిచి పెట్టడు' అంటూ అడ్డూ అదుపు లేకుండా మాట్లాడారు.



ఫిర్యాదు అందజేస్తున్న దిలీప్‌కుమార్, కాంతారావు తదితరులు

నేనింతే మారనంతే

★ కూటమి అధికారం చేపట్టిన నాటి నుంచి పేర్ని నాని నోరు అదుపు తప్పిందనడానికి అనేక ఉదాహరణలున్నాయి. ★ గతంలో తమ పార్టీ నగర అధ్యక్షుడిని అక్రమంగా అరెస్టు చేశారంటూ అనుచరులతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి రచ్చ చేశారు. అంతు చూస్తా అంటూ సీఐని బెదిరించారు.

★ పామర్రులో జరిగిన ఓ సమావేశంలో 'రప్పా..రప్పా నరుకుతాం.. చీకట్లో కన్నుకొడితే పని అయిపోవాలి' అంటూ పార్టీ నేతలను, శ్రేణులను రెచ్చకొట్టే వ్యాఖ్యలు చేయడం పెద్ద దుమారం రేగింది. ★ జడ్పీ ఛైర్మన్ కారు దాడి విషయంలో రాష్ట్రమంతా మనవాళ్లతో గోల చేయించండి అంటూ ఆయన మాట్లాడిన ఫోన్ సంభాషణలు వైరల్ అయ్యాయి. ★ మెడికల్ విద్యార్థుల పరీక్షల సమయంలో పోలీసులు చెప్పినా వినకుండా ధర్నా పేరుతో దాదాగిరి చేశారు. ★ ఇలా నిత్యం వివాదాస్పద వ్యాఖ్యలతో పేర్ని నాని తెరమీదకు వస్తూనే ఉన్నారు.





(c) eenadu

అంతర పంటలు.. అధిక ప్రయోజనాలు

రైతేరాజు



కంచికచర్ల, న్యూస్‌టుడే



తోటలో రాజశేఖర్

మూడు పద్ధతులకు భిన్నంగా వ్యవసాయంలో కొత్త విధానాలు అవలంబిస్తున్నారు కంచికచర్ల మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన రైతు వెంపటి రాజశేఖర్. 4 ఎకరాల పొలంలో మామిడి, జామ సాగు చేపట్టిన ఆయన...

★ పెసర కోత అనంతరం పంట...

సేంద్రియ పెరటి సాగు.. ఆరోగ్యం బాగు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే



పెరటి మొక్కలకు వేస్ట్ డీకంపోజ్ ద్రావణాన్ని పిచికారీ చేస్తున్న రామకోటేశ్వరరావు



పెరట్లో కాసిన సపోట కాయలు కోస్తున్న వెంకటేశ్వరరావు, పద్మ

ఇంటి ఆవరణలో కొద్దిపాటి స్థలంలో సేంద్రియ విధానంలో పండ్లు, కూరగాయలు సాగు చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు మాగల్లుకు చెందిన మాచావరపు రామకోటేశ్వరరావు...

★ తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన కట్టా వెంకటేశ్వరరావు, పద్మ దంపతులు...

రైతు ప్రశ్న? నిపుణుల సలహా



ప్రశ్న: పొద చిక్కుడు రకాలు, విత్తే సమయం, నేల తయారీ, విత్తే దూరం గురించి వివరించండి?

- జి.శ్రీనివాస్, రైతు, యండపుదురు

సమాధానం: పొదరకం అర్కజయ్. ఇది విత్తిన 50- 60 రోజులకు కోతకు వస్తుంది... ఎకరాకు 16 కిలోలు విత్తుకోవాలి...

- వి.మంజూనాథ్, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల

-ఘంటసాల, న్యూస్‌టుడే

సూపర్ నేపియర్ పోషకాల సిరి

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: సూపర్ నేపియర్ గడ్డి సాగుతో పశుగ్రాసం కొరత తీరుతుందని...



సూపర్ నేపియర్ గడ్డి

మొక్కజొన్నలో జింక్ లోపం నివారణ చర్యలు

పామర్రు, న్యూస్‌టుడే: మొక్కజొన్నలో జింక్ లోపం నివారణ చర్యలను వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రామకోటేశ్వరి సూచించారు. మొక్కజొన్న పైర 20 నుంచి 25 రోజుల దశలో...

అతివ మలిచే అపురూప బొమ్మ

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే



బొమ్మలు తయారు చేస్తున్న మహిళలు

ఆకాశంలో సగం.. అందరిలో సగం అంటున్న మహిళలు ఇప్పుడు కొండపల్లి బొమ్మల తయారీలో తామూ సైతమంటూ ప్రాధాన్యత చాటుతున్నారు...

మహిళా సంఘాల ఆధ్వర్యంలో...

ఆన్‌లైన్ విక్రయాలు...

రుణాలకు అవకాశం

...

- శ్రీధర్, మెప్మా సిటీ మేనేజర్

దుర్గమ్మ సేవలో ఆదాయపు పన్ను శాఖ చీఫ్ కమిషనర్

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఆదాయపు పన్నుశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎం.అనిల్‌కుమార్ దర్శించుకున్నారు...



ఎం.అనిల్‌కుమార్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న అధికారులు

కేంద్ర మంత్రి పూజలు

విజయవాడ వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మను కేంద్ర కార్మిక, ఉపాధి, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభ కరంద్లాజే మంగళవారం దర్శించుకున్నారు...



శోభకరంద్లాజేకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారి

కేంద్రం అంగీకరించిన నిబంధనలు అమలు చేయాల్సిందే

విజయవాడ వన్‌టౌన్: ఏపీజీబీఈఏఫ్ 12వ ద్వైపాక్షిక ఒప్పందం, తొమ్మిదో జాయింట్ నోట్‌లో అంగీకరించిన నిబంధనలను కేంద్రం అమలు చేయాల్సిందేనని...

జోగి రమేశ్‌ను చూసి నవ్వుతున్న జనం

తప్పులు చేయకుంటే జగన్ బ్యాచ్‌కు భయమెందుకు?

ఈనాడు, అమరావతి: 'కల్తీ మద్యం కేసులో ఇరుక్కున్న జోగి రమేశ్ బీసీ కార్డు ఉపయోగించడం చూసి జనం నవ్వుతున్నారు...'



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

బీసీలకు పెద్దపీట వేస్తున్న కూటమి

'బీసీల ప్రగతికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం...'

రోడ్డు ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలిస్తే నగదు బహుమతులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని సకాలంలో ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వారికి నగదు బహుమతులు...



మాట్లాడుతున్న జేటీసీ మోహన్, చిత్రంలో ట్రాఫిక్ డీసీపీ షిరీన్‌బేగం, ఏసీపీ రామచంద్రరావు

ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడిగా విద్యాసాగర్ ఎన్నిక

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని షిర్డీలో ఈనెల 23వ తేదీ నుంచి 26 వరకు జరిగిన ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏఐఎస్‌జీఈఎఫ్) 18వ జాతీయ మహాసభల్లో ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు...

పికిల్ బాల్ లీగ్‌లో ప్రతిభ

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: గురునానక్‌కాలనీలోని పికిల్ అండ్ బ్లూ కోర్టుల్లో ఈ నెల 26వ తేదీన జరిగిన ఏబీ లిమిటెడ్ పికిల్ బాల్ లీగ్ టోర్నీలో నగరానికి చెందిన కె.దేవా గోపాల్, ఆర్.కార్తీక్ జోడీ రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకుంది...



కార్తీక్, గోపాల్ జోడీ

రూ.కోటి కట్నం తీసుకురా

సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి తప్పని వరకట్న వేధింపులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: పెళ్లై ఏడు సంవత్సరాలు దాటినా..రూ.కోటి అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్న భర్తపై ఒక యువతి మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు... 2019లో మరో రూ.40 లక్షలు ఇచ్చారు... ఈ క్రమంలో 2025 జనవరి 16న అమెపై హత్యాయత్నం చేయబోగా.. తప్పించుకున్నారు...

బ్రాయిలర్ ధరలు (కిలో రూ.లలో)



విజయవాడ: బ్రాయిలర్ ఫారం లైవ్ ధర ...

శతాబ్దాల కోటకు పర్యాటక వైభవం తీసుకొస్తాం

కొండపల్లి, న్యూస్‌టుడే: శతాబ్దాల చరిత్ర కలిగిన కొండపల్లి కోటకు పర్యాటక పూర్వ వైభవం తీసుకొస్తామని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అన్నారు...



పవిత్ర సంగమం వద్ద కేకు కోస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, తెదేపా నాయకులు

చిక్కిన చిట్టీల కేసు నిందితుడు

★ నిర్బంధించిన బాధితులు ★ విడిపించిన పోలీసులు

పటమట, న్యూస్‌టుడే: చిట్టీల పేరుతో రూ.కోట్లు వసూలు చేసి పరారీలో ఉన్న నిందితుడిని బాధితులు నిర్బంధించగా రామలింగేశ్వరనగర్‌లో ఉద్రిక్తత నెలకొంది...

చురుగ్గా జీవన ప్రమాణ ధ్రువీకరణ ప్రక్రియ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: విజయవాడ తూర్పు డివిజన్ (గాంధీనగర్) సబ్ ట్రెజరీ కార్యాలయ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జీవన ప్రమాణ ధ్రువీకరణ సమర్పణ (రెన్యువల్) కార్యక్రమం చురుగ్గా సాగుతోంది... ట్రెజరీ పరిధిలో మొత్తం 16,284 మంది ఉండగా, వీరిలో మంగళవారం వరకు 9,470 మంది సమర్పించారు. ఇంకా 6,814 మంది సమర్పించాల్సి ఉంది...

ఆల్ ఇండియా ట్రేడ్ పరీక్ష దరఖాస్తులకు గడువు నేడు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా ట్రేడ్ పరీక్ష (ఏ.ఐ.టి.టి)- 2026కు హాజరు కావడానికి ప్రైవేటు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు... రూ.500 చెల్లించి దరఖాస్తు పొందాలని తెలిపారు... 94906-39639 నంబరులో సంప్రదించాలని సూచించారు.

సమయపాలనలో రైల్వే డివిజన్ అత్యుత్తమ పనితీరు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రైళ్ల సమయపాలనలో విజయవాడ డివిజన్ అత్యుత్తమ పనితీరు కనబర్చి మొదటి స్థానంలో నిలిచిందని విజయవాడ డివిజన్ రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 86.43శాతం సమయపాలన నమోదు చేసిందన్నారు...

91.9FM Vijayawada

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమం	ప్రసార వేళలు
ఉదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-ఫ్యాక్టర్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - ఉ. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

కొట్టి పడేసి.. దోచేసి..

గంజాయి బ్యాచ్ సభ్యుడి దురాగతం

చిట్టినగర్, న్యూస్‌టుడే: గంజాయి బ్యాచ్ సభ్యుడు ఒక వ్యక్తిని కొట్టి కిందపడేసి ఆయన దగ్గరున్న నగదును దోచుకెళ్లిన ఘటన...



కిందపడిన బాధితుడు శ్రీనివాస్

ఆంధ్రప్రదేశ్ దేవదాయ ధర్మదాయ శాఖ

ఇ ప్రొక్యూర్‌మెంట్ నోటీసు


...www.apeprocurement.gov.in ...

ఇట్లు: చైర్మన్

EENADU Classifieds



BUSINESS SERVICES



REAL ESTATE




PLOT FOR SALE

TADIGADAPA



TO LET



COMMERCIAL

1600SFt & 1100SFt for Offices in 2nd Floor, Near Hotel Fortune Murali Park MG Road, Vijayawada. 87904 35283.



JOBS

IVY Overseas ... B.Tech. 99666 05638

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616

గమనిక

...

తిరువూరు
• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన: ★ తిరువూరు పట్టణం 14వ వార్డులోని డ్రెయిన్లలో మట్టి, చెత్త పేరుకుందని స్థానికుడు ప్రభాకరరావు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపించి డ్రెయిన్లను శుభ్రం చేయించారు. ★ తిరువూరు పట్టణం 16వ వార్డులోని డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుడు అరుణ్ కుమార్ 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపించి డ్రెయిన్లను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించి సమస్య పరిష్కరించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు**
★ నరసాపురంలోని యాదవుల బజారులో చెత్తను తొలగించక పోవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈవో జి.స్వాతి స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయించి సమస్య పరిష్కరించారు. నివాసితులు సంతోషం వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**

కేజీబీవీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా విజయసుందరి

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా ఆంగ్లం సీఆర్టీ ఎన్.విజయసుందరిని నియమిస్తూ సమగ్ర శిక్షా జిల్లా ఏపీసీ ఎం.రజనీ కుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అఖిల భారత బాల్‌బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపిక

తిరువూరు, న్యూస్‌టుడే : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని కె.రమ్య అఖిల భారత బాల్‌బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ అబూ బకర్ మంగళవారం తెలిపారు. ఫిబ్రవరి 11 నుంచి 15 వరకు తమిళనాడు దిండిగల్‌లోని అన్నా విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న పోటీల్లో కృష్ణ విశ్వవిద్యాలయం తరఫున ఆమె పోటీలో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు ఆమెను అభినందించారు.

విజేతలకు బహుమతుల అందజేత

గంపలగూడెం : మండలంలోని తునికిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవం నాడు బాలబాలికలకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎ.శర్మ తెలిపారు. గ్రామ తెదేపా నాయకుడు చిరుమామిళ్ల అమరేంద్ర పంపిణీకి అవసరమైన బహుమతులకు రూ.5 వేలు విరాళం అందజేశారని చెప్పారు. ఎస్ఎంసీ సభ్యులు, గ్రామస్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడిగా యుగంధర్

ఇబ్రహీంపట్నం, గంపలగూడెం, న్యూస్‌టుడే : విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు పరిషత్ రాష్ట్ర కోశాధికారి దుర్గాప్రసాద్ రాజు తెలిపారు. పరిషత్ జిల్లా సమావేశం ఇబ్రహీంపట్నంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడిగా గంపలగూడేనికి చెందిన నారేళ్ల యుగంధర్, ఉపాధ్యక్షుడిగా దశరథ, కార్యదర్శులుగా వాచస్పతి, వెంకటేశ్వరరావులను నియమించినట్లు ఆయన చెప్పారు. అనంతరం గంపలగూడెం, మైలవరం, జి.కొండూరు మండల సమితి అధ్యక్షులు, ఉపాధ్యక్షులను నియమించినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

శత శాతం ఫలితాల సాధనే లక్ష్యం

మండలానికో ప్రత్యేకాధికారిని నియమించిన ప్రభుత్వం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే

పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇప్పటికే జిలాల్లో వంద రోజుల ప్రణాళిక పకడ్బందీగా అమలు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేలా ప్రత్యేకాధికారులను నియమించి బాధ్యతలు అప్పగించింది.

పర్యవేక్షణ ఇలా..: రెవెన్యూ, ఇతర శాఖలకు చెందిన అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించారు. వీరు పాఠశాలలను తనిఖీ చేసే సమయంలో 20 అంశాలను పరిశీలించి తనిఖీ నోట్‌లో నమోదు చేయాలని పేర్కొంది.



విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ప్రత్యేకాధికారి, సీఆర్పీలు

- ప్రధానంగా విద్యార్థుల హాజరును పరిశీలించాలి.
- సిలబస్ పూర్తి కాకపోతే కారణాలు తెలుసుకుని అందులో నమోదు చేయాలి.
- పాఠశాలల్లో నిర్వహించిన నెలవారీ పరీక్షల్లో 60 శాతం తక్కువ మార్కులొచ్చిన విద్యార్థులకు గ్రేడ్లు నిర్ణయించాలి.
- చిన్నారులు రాసిన జవాబు పత్రాలను పరిశీలించి సంబంధిత ఉపాధ్యాయులు, విద్యార్థులతో చర్చించాలి.

జిల్లాలోని మండలాలు : 17
ఉన్నత పాఠశాలలు : 519
వీటిలో పది విద్యార్థులు : బాలురు 14,184, బాలికలు 13,613 మంది
ప్రభుత్వం నియమించిన ప్రత్యేకాధికారులు : 17 మంది

- పాఠశాల హెచ్ఎం, ఎంఈవో, డిప్యూటీ ఎంఈవోలను సమన్వయం చేసుకుంటూ వంద రోజుల ప్రణాళికను మెరుగ్గా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారా? లేదా అన్న అంశాలను పరిశీలించి నమోదు చేయాలి.
- సబ్జెక్టు వారీగా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయడం, ఇతర అంశాలు అమలయ్యేలా పర్యవేక్షించాలి.
- రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణ తదితర అంశాలను తనిఖీ చేయాలి.
- పాఠశాలకు రాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా వచ్చేలా చూడాలి.
- చివరిగా తమ అభిప్రాయాలను ఆ పత్రంలో నమోదు చేయాల్సి ఉంది.

రోలర్ స్కేటింగ్‌లో సత్తా


దానియేల్‌ను అభినందిస్తున్న సందీప్ ఇన్నారెడ్డి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : గుంటుపల్లి డాన్‌బాస్కో పాఠశాలలో సీబీఎస్ఈ 4వ తరగతి చదువుతున్న విద్యార్థి పోతల విజయ్ దానియేల్ రోలర్ స్కేటింగ్‌లో జాతీయ స్థాయిలో పలు విజయాలు సాధించాడు. ఈ మేరకు ఆ పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ఆ విద్యార్థిని అభినందించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫాదర్ సందీప్ ఇన్నారెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి.. సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


కీర్తిరాయునిగూడెంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

మైలవరం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో అభివృద్ధితో కూడిన సంక్షేమాన్ని అమలు చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని స్థానిక శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కీర్తిరాయునిగూడెంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రహదారి నిర్మాణ పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. నారా లోకేశ్ చేసిన యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకోవడాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కేకును కోసి, శుభాకాంక్షలు తెలిపారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి ఎ.రామ్మోహనరావు(గాంధీ), తెదేపా మండల అధ్యక్షుడు జె.వేణుగోపాల్‌రెడ్డి, తెదేపా నాయకుడు ఎం.నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేద్దాం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అర్జున్ రాజు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : డ్రగ్స్ రహిత రాష్ట్రాన్ని నిర్మించడానికి ఈ నెల 27 నుంచి మార్చి 1వ తేదీ వరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 510 కి.మీ జరిగే 'డ్రగ్స్‌పై దండయాత్ర' సైకిల్ ర్యాలీ కార్యక్రమానికి సంఘీభావంగా మంగళవారం విస్సన్నపేటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై యం.అర్జున్ రాజు మాట్లాడుతూ మద్యం మత్తుకు బానిస కావద్దని, డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దామని విద్యార్థులు, స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం పలు కళాశాలలకు చెందిన 45 మంది విద్యార్థులు విజయవాడలో జరిగిన సైకిల్ ర్యాలీకి తరలి వెళ్లారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలోని పోలీస్ స్టేషన్ నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు ర్యాలీని నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించారు. సీఐ గిరిబాబు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా


గంపలగూడెం పీహెచ్‌సీలో శుభ్రతపై వైద్యులకు సూచనలిస్తున్న ఆర్డీవో మాధురి

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని పలు కార్యాలయాలను ఆర్డీవో కె.మాధురి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మందుల నిల్వలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఆసుపత్రిలో శుభ్రత పాటించాలని, ప్రతి రోజు హాజరు పట్టీలో సిబ్బంది సంతకాలు చేయాలని సూచించారు. వైద్యాధికారులు వి.శృతి, భార్గవి పాల్గొన్నారు. తదుపరి పీఏసీఎస్‌లో అన్నదాతలకు ఎరువుల పంపిణీ, దస్త్రాల నిర్వహణను పరిశీలించి రైతులతో మాట్లాడారు. గంపలగూడెంలో ప్రస్తుతం ఖాళీ చేసిన తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి భవనం మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఎత్తిపోతల నిర్వహణకు నిధులు కేటాయించాలని వినతి


పుస్తకావిష్కరణ చేస్తున్న రైతులు, నాయకులు

జి.కొండూరు, న్యూస్‌టుడే : తారకరామా ఎత్తిపోతల పథకం నిర్వహణకు ప్రభుత్వం తక్షణమే రూ.5 కోట్ల నిధులు కేటాయించాలని రాష్ట్ర కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య కోరారు. మండలంలోని కవులూరులో రైతు చెరుకూరి శ్రీనివాసరావు నివాసంలో మంగళవారం నిర్వహించిన రైతు సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం రైతుల సమక్షంలో తారకరామా ఎత్తిపోతల సమస్యలు, పరిష్కారాలకు సంబంధించి జమలయ్య రాసిన పుస్తకావిష్కరణ చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

అచ్చంరాజుకు ఉత్తమ మార్గదర్శి అవార్డు

రాజవరం(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని రాజవరానికి చెందిన తెదేపా నాయకుడు చెన్నుపాటి అచ్చంరాజు పీ-4లో స్ఫూర్తిగా సేవలందించినందుకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా అచ్చంరాజును గ్రామస్థులు మంగళవారం అభినందించారు.

ఉద్యాన అధికారిగా నరేంద్ర కుమార్

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండలంలో ఉద్యాన అధికారిగా పని చేస్తున్న నరేంద్ర కుమార్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, విజయవాడ సీపీ రాజశేఖరబాబు చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు.

లేబర్ కోడ్‌లను తిప్పికొట్టాలి


సభలో మాట్లాడుతున్న సుప్రజ, పక్కన నేతలు

తిరువూరు, న్యూస్‌టుడే : కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.సీహెచ్.సుప్రజ అన్నారు. తిరువూరు పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. నాయకులు వెంకటేశ్వరావు, వరలక్ష్మి, భద్రం, బాబు, పద్మ, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని నాలుగు పీఏసీఎస్‌లు, ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో 71 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం కూనపరాజుపర్వలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ సహాయకురాలు దివ్య, దమయంతి, రైతులు పాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శన

మైలవరం, న్యూస్‌టుడే : పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని దాసుళ్లపాలెంలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. దూడల పోషణ, సంరక్షణ, యాజమాన్యం, వ్యాధుల నియంత్రణ అంశాలపై శాస్త్రీయ పద్ధతుల్లో దూడల పెంపకంపై అవగాహన కల్పించారు. అత్యుత్తమ లక్షణాలు కలిగిన దూడలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. పశు సంవర్ధక శాఖ ఏడీ హరిహరనాథ్, డాక్టర్ హరిత, పుల్లూరు పశువైద్యాధికారి సుమంత్ రెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత.. నిర్లక్ష్యమే ఇక!

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

సామాజిక బాధ్యతలో భాగంగా పరిశ్రమలు చేసిన పలు కార్యక్రమాలు నిర్లక్ష్యపు మాటున నిర్వీర్యమవుతున్నాయి. ప్రజా ప్రయోజనకరమైన పరికరాలు, వస్తువులతో పాటు పచ్చదనం పూర్తిగా మాయమైపోయాయి. ఆప్కెల్(ఆంధ్రప్రదేశ్ హెవీ మిషనరీ ఎంజినీరింగ్ లిమిటెడ్) సీఎస్ఆర్(సామాజిక నిధుల)లో భాగంగా ఐదేళ్ల క్రితం సోలార్ వీధి దీపాలను కొండపల్లి పంచాయతీగా ఉన్నప్పుడు అందించింది. ఆ సమయంలోనే ఎన్టీటీపీఎస్ సంస్థ రోడ్ల వెంట మొక్కలు నాటి వాటి నిర్వహణ అప్పటి పంచాయతీలైన ఇబ్రహీంపట్నం, కొండపల్లికి అప్పగించింది. అయితే పంచాయతీలుగా ఉన్నప్పుడు వీటి నిర్వహణ సక్రమంగానే నడిచినా కాలక్రమేణ రెండు మేజర్ పంచాయతీలు పురపాలికగా మారాయి. ఈ క్రమంలో సోలార్ దీపాల కాంతులు నిలిచిపోగా, రహదారుల వెంట నాటిన చెట్లు దాదాపుగా ఎండిపోయాయి.


నిరుపయోగంగా సోలార్ వీధి దీపం

దొంగిలించారు: కొండపల్లి నుంచి ఉంటప్రోలుకు రాకపోకలు సాగించేందుకు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈ ప్రాంత గ్రామస్థులు అప్పట్లో కోరారు. దీంతో అప్పట్లో కొండపల్లి పాలకవర్గం ఆ ప్రాంతంలో సోలార్ దీపాలను సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో కొంతకాలం తర్వాత దీపాలకు ఉన్న బ్యాటరీలను కొందరు దొంగిలించారు. దీంతో నాటి నుంచి నేటి వరకూ ఈ ప్రాంతం చీకటిమయంగా ఉంటోంది. రాత్రి సమయాల్లో వాహనాల వెలుగులే తప్ప మరొకటి కనిపించవు.

మరమ్మతులు నిర్వహిస్తే మేలు

సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటైన సోలార్ దీపాలు పంచాయతీ పాలనలో వెలిగాయి. ఆ తర్వాత అవి మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారాయి. వాటిని బాగు చేస్తే పురపాలిక వీధుల్లో వెలుగులు రావడంతో పాటు విద్యుత్తు భారం తగ్గుతుంది. పంచాయతీ పాలనలోనే ఎన్టీటీపీఎస్ రోడ్ల పక్కన మొక్కలు నాటింది. అయితే వాటి నిర్వహణ సంస్థ చేయకుండా పంచాయతీకి వదిలేసింది. **- అమ్మాజీ, మాజీ సర్పంచి**

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

అవకాశం ఉంటే సోలార్ దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. దీంతో పాటు ఇతర పరిశ్రమలు కూడా ముందుకొచ్చి సీఎస్ఆర్ నిధులతో సోలార్ వెలుగులు పురపాలిక అంతా ఏర్పాటు చేసేలా కౌన్సిల్ సమావేశంలో చర్చిస్తాం. **- వెంకటరత్నం, ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్**

సందడిగా వీడ్కోలు సమావేశాలు


రామచంద్రాపురం : కృష్ణారెడ్డి దంపతులను సత్కరిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


పెనుగొలను : నృత్యం చేస్తున్న బాలికలు

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలను జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పది విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు సందేశమిచ్చారు. బాలబాలికలు నృత్యాలతో అలరించారు.

రామచంద్రాపురం(ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని రామచంద్రాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పది విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ మార్గదర్శి అవార్డు అందుకున్న తెదేపా నాయకుడు గడ్డి కృష్ణారెడ్డి, రోజారాణి దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు. ఎంఈవో కేశవరావు తదితరులు పాల్గొన్నారు. కృష్ణారెడ్డి దంపతులను ఎమ్మార్పీఎస్ మండల నాయకులు ఎం.ఏలియాబాబు, కె.కృష్ణ, బి.వెంకటరత్నం తదితరులు కూడా సత్కరించి అభినందించారు.

IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE -CUM-XII ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS MEDCHAL - MALKAJGIRI DISTRICT AT KUKATPALLY
O.S. No. 663 of 2024
Between:
Vanga Sundara Rami Reddy ...Plaintiff
AND
Sri Bandi Nageswara Rao and Others. ....Defendants
To
1. Sri. Bandi Nageswara Rao (Died per LR's)
2. Smt. Bandi Murali Krishna.
3. Smt. Bandi Kusuma.
Both the D 2 & 3 are residing at: Flat No. 502, Sri Sai Bhaskara Enclave, Beside Durga Gym, Canal Road, Srinivasa Nagar, Gollapudi - 521 228. NTR District, Andhra Pradesh.
(Defendants)
Please take notice that the above O.S. is filed for recovery of money against you both the Defendant No. 2 & 3 and the same is posted on 10-02-2026 at 10:30 am for your appearance. You may appear either in person or through an advocate before the said court and said date, failing which the matter will be decided ex-parte as per the law.
(BY THE ORDER OF THE COURT)
P. VENKAT RAMANA - MBA, LL.B, LL.M
DAYANAND PATIL - B.Com LL.B.
Advocates
Plot No. 820, GR. Floor, Pragathinagar, Bachupally (M) Medchal Malkajgiri Dist. Hyderabad-90. TG.
Mobile # 99482 70260

వైభవంగా రాజశ్యామలాదేవి నవరాత్రోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కంభంపాడు (ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని కంభంపాడు శివాలయంలో నిర్వహిస్తున్న రాజశ్యామలాదేవి నవరాత్రోత్సవాలు మంగళవారం ముగిశాయి. గంగా విజయదుర్గ సమేత నాగమల్లేశ్వర స్వామి గుడిలో తొమ్మిది రోజుల పాటు విజయదుర్గాంబ అమ్మవారిని రాజశ్యామలాదేవిగా అలంకరించి ఉత్సవాలను నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదగాలి


నాగులూరు : మాట్లాడుతున్న ఎంఈవో రమేష్‌బాబు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : చిన్నతనం నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని రెడ్డిగూడెం ఎంఈవో పి.రమేష్‌బాబు సూచించారు. మంగళవారం నిర్వహించిన నాగులూరు జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలో ఆయన పాల్గొని మాట్లాడారు. డాక్టర్ అరుణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, 2024-25 విద్యా ఏడాదిలో పది పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన కె.సుధీర్‌కు కె.విజయబాబు బంగారు పతకం అందించారు. కె.రవిబాబు రూ.10 వేలు నగదు బహుమతి ఇచ్చినట్లు హెచ్ఎం తెలిపారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : వెలగలేరు చనుమోలు ఫకీర్రాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.పద్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పండ్ల కవర్లతో నాణ్యమైన దిగుబడి


మామిడి పూతలు పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు

మైలవరం, రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మామిడి కాయలకు పండ్ల కవర్లను ఉపయోగించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రం కీటక శాస్త్రవేత్త జి.శాలిరాజు సూచించారు. మంగళవారం నియోజకవర్గంలో పలు గ్రామాల్లోని మామిడి తోటలను ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్(ఫ్రూట్స్) ఎం.దేవమునిరెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి బాలాజీ కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. తోటల్లో పూతలు, వాటిని ఆశించే పురుగులు, చీడపీడలపై రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన అధికారి సొహైల్ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ అందజేత

మైలవరం, న్యూస్‌టుడే : దివ్యాంగురాలైన ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థిని కె.జ్ఞాపికశ్రీకి రూ.80 వేల విలువైన ల్యాప్‌టాప్‌ను ప్రవాస భారతీయుడు ఎస్.శశిధర్ రెడ్డి సహకారంతో మంగళవారం స్థానిక మదర్ థెరిసా ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ వితరణ చేశారు. ట్రస్ట్ కార్యదర్శి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


అయిదు రోజుల పని విధానం అమలు చేయండి


తిరువూరులో నినాదాలు చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

గంపలగూడెం, ఎ.కొండూరు : మండలంలోని నెమలి, గంపలగూడెం, ఊటుకూరు, వినగడప, పెనుగొలను, గోసవీడు, తోటమూలలోని వాణిజ్య, గ్రామీణ, సహకార బ్యాంకుల ఉద్యోగులు మంగళవారం జరిగిన సమ్మెలో పాల్గొన్నారు. యూనైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ పిలుపు మేరకు తమ సమస్యల పరిష్కారానికి అధికారులు, ఉద్యోగులు సమ్మె చేయడంతో బ్యాంకులు పని చేయలేదు. దీంతో ఖాతాదారుల ఆర్థిక లావాదేవీలు నిలిచాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బ్యాంకుల్లో అయిదు రోజుల పని విధానం అమలు చేయాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని బ్యాంకు ఉద్యోగుల ప్రాంతీయ ఐక్యవేదిక కన్వీనర్ బెల్లంకొండ లీలా హనుమత్ ప్రసాద్ తెలిపారు.

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరులోని పలు బ్యాంకుల ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఏకాగ్రత అవసరం


మూలపాడు: విద్యార్థినికి స్టడీ మెటీరియల్ అందిస్తున్న జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ శ్రీదేవి ★ మైలవరంలో..

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : పది పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఉమ్మడి కృష్ణా జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలోని పది విద్యార్థులకు ఆమె స్టడీ మెటీరియల్‌ను అందజేసి వారితో మాట్లాడారు. పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఏకాగ్రత అవసరమని చెప్పారు. వంద రోజుల ప్రణాళికను పూర్తి స్థాయిలో అమలు చేసి, వంద శాతం ఫలితాలను సాధించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్ఎం డేవిడ్ రాక్‌ఫెల్లర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


★ గుంటుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచి కవిత పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మైలవరం: స్థానిక బాలికోన్నత, మండలంలోని చంద్రగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. మైలవరంలో జడ్పీటీసీ సభ్యుడు తిరుపతిరావు, సర్పంచి మంజుభార్గవి, ఎస్ఎంసీ అధ్యక్షుడు బాబూరావు, హెచ్ఎం రాజశేఖర్, చంద్రగూడెంలో సొసైటీ అధ్యక్షుడు రోశాలు, హెచ్ఎం జి.శివపార్వతి, కమిటీ ఛైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చక్రాల కుర్చీ వితరణ

జి.కొండూరు, న్యూస్‌టుడే : చెవుటూరు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా కొనసాగుతున్న పోతురాజు వాసు, కిరణ్ వారి తాతయ్య, అమ్మమ్మ వేములకొండ లక్ష్మీనారాయణ, వెంకాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం రూ.7 వేలు సమకూర్చి అదే పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థి సంకటి సంపత్ కుమార్‌కు చక్రాల కుర్చీ అందించారు. దీన్ని పాఠశాల హెచ్ఎం ఎ.రమాదేవి చేతుల మీదుగా మంగళవారం పాఠశాల ఆవరణలో విద్యార్థికి ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు దాతలను అభినందించారు.

చికిత్స పొందుతూ సంక్షేమ సహాయకుడి మృతి


రామకృష్ణ (పాత చిత్రం)

మాధవరం (ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని మాధవరం గ్రామ సచివాలయంలో సంక్షేమ సహాయకుడిగా పని చేస్తున్న దునక రామకృష్ణ(50) హృదయ సంబంధిత వ్యాధితో మంగళవారం మృతి చెందారు. ఆయన శనివారం విధుల్లో ఉండగానే అస్వస్థతకు గురి కావడంతో విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని స్వస్థలమైన మైలవరం తరలించారు. మాధవరం సర్పంచి, సచివాలయ ఉద్యోగులు మైలవరంలో రామకృష్ణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

CUB Trust and Excellence SINCE1904
సిటి యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
డోర్ నెం: 5-123/1, , నూజివీడు రోడ్, గూడవల్లి రాజ్యలక్ష్మి టవర్స్, మైలవరం - 521230, యన్.టి.ఆర్. జిల్లా. సెల్: 93840 29490

బంగారు నగల వేలము ప్రకటన

ఈ దిగువ ఉదహరించిన ఖాతాదారులు తమ బంగారు ఆభరణముల హామీపై తీసుకొనిన అప్పును తిరిగి చెల్లించమని రిజిష్టరు డిమాండ్ నోటీసు, రిజిష్టర్డు కాషన్ అండ్ డిఫాల్ట్ నోటీసు మరియు రిజిష్టరు వేలం నోటీసులు ద్వారా తెలియపరచిన దరిమిలా సదరు అప్పును తీర్చనందున సదరు ఆభరణములు, వస్తువులు అవి "ఉన్నవి ఉన్నట్లుగా" ప్రాతిపదికన బ్యాంకు నిబంధనల ప్రకారం తేది: 04-02-2026 బుధవారం మ. 1 గంటకు మా బ్రాంచి ఆవరణములో బహిరంగ వేలము వేయబడును. ఈ నోటీసు ఖాతాదారుడు మరణించినయెడల వారి వారసులకు ఈ క్రింది ప్రకటన పూర్వకంగా తెలియజేయడమైనదిగా భావించవలెను. ఏ విధమైన కారణం చూపకనే వేలం షరతులు మార్చుటకు గాని, వేలం వాయిదా వేయుటకు గాని, రద్దు చేయుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. హెచ్చు పాటదారుడు మొత్తం పాట సొమ్మును అదే రోజు చెల్లించి వస్తువులను పొందవలెను. లేనియెడల ధరావత్తు కోల్పోవుదురు. వేలం ద్వారా లభించిన డబ్బులను మీ యొక్క ఖాతాలో జమపరచడం జరుగుతుంది. ఇందలి ఖాతాదారునికి మా బ్యాంకులో మిగతా ఏమైనా ఉన్నచో పై బాకీ పోగా మిగిలిన సొమ్మును మా ఖాతాకు సర్దుబాటు చేయబడును.

వ నెం	లోన్ ఖాతా నెం	లోన్ తేది	ఖాతాదారుని పేరు చిరునామా	బరువు. గ్రాలలో
1.	502112146018110	26-06-2024	షేక్ గాలిషరీఫ్, S/o. గన్నె సైదా 1-45, వెల్వడం, మైలవరం మైలవరం మండలం - 521230	44.2
2.	502112146020431	30-09-2024		30.8
3.	502112146020436	30-09-2024		15.8

స్థలం: మైలవరం
తేది: 28-01-2026
సం/- బ్రాంచి మేనేజరు
సిటి యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, నూజివీడు రోడ్, మైలవరం-521230

(c) eenadu

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్‌ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ



ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తాడికొండ: బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, అరుపులతో హాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర చాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series: Hero
Digital Partner: ఈనాడు.నెట్
TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్, Mee FM
Organised by ఈనాడు


విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - I జూనియర్స్: మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర చాలెంజర్స్ – రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర చాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్స్‌లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.


గెలుపొందిన తెలంగాణ టైగర్స్ జట్టు

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - I జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి


విజేత రాయలసీమ రాకర్స్ జట్టు

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్


వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-I (జూనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్


సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

కనులపండువగా అమ్మవారి పల్లకీల ఊరేగింపు


రంగుల మండపంలో తిరుపతమ్మ సహ దేవతల విగ్రహాలు


విగ్రహాలను తీసుకురావడానికి జగ్గయ్యపేట వెళుతున్న పల్లకీలు

పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: రంగుల మహోత్సవంలో భాగంగా శ్రీతిరుపతమ్మ, సహదేవతల విగ్రహాలను జగ్గయ్యపేట నుంచి తీసుకురావడానికి పల్లకీలు మంగళవారం రాత్రి పెనుగంచిప్రోలు నుంచి బయలుదేరాయి. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలను ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు తీసుకెళ్లారు. అనంతరం ప్రధాన వీధుల గుండా జగ్గయ్యపేటకు పయనమయ్యాయి. పెద్దసంఖ్యలో తరలి వచ్చిన భక్తులు పల్లకీల వద్ద వారులు పోసి పూజలు చేశారు. ఎస్ఐ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెనుగంచిప్రోలుకు తిరుగు పయనం.. జగ్గయ్యపేటలో విడిది చేసిన గోపయ్య సమేత తిరుపతమ్మ, సహదేవతల విగ్రహాలకు రంగులు వేసే ఘట్టం పూర్తి కావడంతో బుధవారం ఉదయం ఐదు గంటలకు పెనుగంచిప్రోలుకు తీసుకెళ్లడానికి ఆలయ ఈవో మహేశ్వరరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యుడు చుంచు రమేష్‌బాబు, సభ్యులు, అధికారులు ఏర్పాట్లు చేశారు. పల్లకీలు జగ్గయ్యపేట నుంచి చిల్లకల్లు, భీమవరం, లింగగూడెం గ్రామాల మీదుగా పెనుగంచిప్రోలు ఆలయం వద్దకు తీసుకురానున్నారు.

పల్లకీల్లో విగ్రహాల వరుస ఇలా.. మొదటి పల్లకీలో తిరుపతమ్మ, రెండో పల్లకీలో గోపయ్య స్వామి, మూడో పల్లకీలో ఉప్పుతూరు అంకమ్మ, నాలుగో పల్లకీలో వినుకొండ అంకమ్మ, ఆతర్వాత తిరుపతమ్మ, గోపయ్య స్వాముల ఉత్సవ విగ్రహాలు, మల్లయ్యస్వామి, చంద్రమ్మ, మద్ది రావమ్మ, పెద్దమ్మ, గుర్రపు వాహనాన్ని తీసుకొస్తారు.

భారీ పోలీసు బందోబస్తు: గతంలో జరిగిన ఘర్షణలు, భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు ఆధ్వర్యంలో డీసీపీ లక్ష్మీనారాయణ, ఇతర పోలీసు అధికారుల పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయుల నియామకాల ప్రక్రియ యాజమాన్యాలకే ఇవ్వాలి

ప్రాస్మా రాష్ట్ర కమిటీ డిమాండ్


మాట్లాడుతున్న ప్రభాకరరావు, చిత్రంలో రవిచంద్రశేఖర్, రవీంద్ర తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయివేటు ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను యాజమాన్యాలకే ఇవ్వాలని ప్రైవేటు ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ప్రాస్మా) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం విజయవాడలోని ఒక హోటల్లో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ప్రభాకరరావు, కె.రవిచంద్రశేఖర్ మాట్లాడారు. ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలను గత ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే నిర్వహించాలని, ఈ విషయంలో న్యాయస్థానాల ఆదేశాలను కూటమి ప్రభుత్వం అమలు చేయకపోవడం సరి కాదన్నారు. గత ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా ఆయా ఎయిడెడ్ పాఠశాలల కరస్పాండెంట్లు ఇప్పటికే నియామక ప్రక్రియ ప్రారంభించారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 85 ఎయిడెడ్ పాఠశాలల్లో న్యాయస్థానాల ఆదేశాల మేరకు నియామక ప్రక్రియ పూర్తయ్యిందని, అయితే విధానపరమైన కారణాలు చూపుతూ ప్రభుత్వం దాదాపు అయిదు నెలల పాటు ప్రక్రియ నిలిపేసిందని చెప్పారు. పాఠశాలల యాజమాన్యాలతో సంప్రదింపులు లేకుండా కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) ద్వారా నియామకాలు చేపడతామని ప్రకటించిందని, ఇది న్యాయస్థానాలు, గత ప్రభుత్వ ఉత్తర్వులకు పూర్తిగా వ్యతిరేకం అన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. సీబీటీ పరీక్షల నిర్వహణ చట్ట విరుద్ధమైంది కనుక.. వెంటనే ఆ ప్రక్రియ ఆపాలని, లేనిపక్షంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు ఎం.రవీంద్రబాబు, జవహర్‌రాజు, నరేష్, రామచంద్రరాజు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం.. గంటల వ్యవధిలో ఆచూకీ లభ్యం

పెనమలూరు, రామవరప్పాడు: బాలుడి అదృశ్యంతో పెనమలూరు పోలీసులు హైరానాకు గురయ్యారు. నాలుగు ప్రత్యేక బృందాలు, పటమట, విజయవాడ నగర, ట్రాఫిక్ పోలీసులు జల్లెడ పట్టగా ఆఖరుకు ఫిర్యాదు అందిన రెండు గంటల్లోనే రామవరప్పాడులో అతడి ఆచూకీ కనిపెట్టారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం.. చిలక మోహిత్ ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం గండేపల్లిలోని తన అమ్మమ్మ విజయమ్మ వద్ద తన సోదరుడితో కలిసి ఉంటూ మూడో తరగతి చదువుతున్నాడు. తన అమ్మమ్మ, సోదరుడితో కలిసి సోమవారం కానూరులోని పెద్దమ్మమ్మ ఇంటికి వచ్చాడు. పెద్దమ్మమ్మ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో కుటుంబ సభ్యులందరూ మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. ఇంట్లో మోహిత్, సోదరుడు మాత్రమే ఉండగా వీరు స్థానికంగా ఆటలాడుకుంటున్న క్రమంలో మోహిత్ దారి తప్పిపోయి ఇంటికి చేరుకోలేకపోయాడు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో కుటుంబ సభ్యులు ఆసుపత్రి నుంచి తిరిగి రాగా.. మోహిత్ అదృశ్యమైనట్లు తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలో గాలించినా ఫలితం లేకపోవడంతో సాయంత్రం నాలుగున్నరకు వీరు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నగర, ట్రాఫిక్ పోలీసులకు మోహిత్ ఫొటోలు పంపి అంతటా అప్రమత్తం చేశారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించారు. ఈలోగా సీఐ వెంకటరమణ నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి కానూరు, పటమట, ఆటోనగర్, ప్రసాదంపాడు ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. సాయంత్రం ఆరున్నరకు మోహిత్‌ను రామవరప్పాడు వద్ద ట్రాఫిక్ పోలీసులు గుర్తించి సీఐ వెంకటరమణకు సమాచారం అందించారు. సీఐ వెంటనే అక్కడకు వెళ్లి బాలుడిని స్టేషన్‌కు తీసుకువచ్చి తల్లిదండ్రులు వెంకట్, లక్ష్మిలకు అప్పగించారు.

పిల్లల విక్రయం కేసులో ముగిసిన పోలీస్ కస్టడీ

గవర్నర్‌పేట: పిల్లల విక్రయం కేసులో నిందితురాలు కవిత పోలీస్‌కస్టడీ మంగళవారం ముగిసింది. ముంబయికి చెందిన ఈమెను పిల్లల విక్రయం కేసులో భవానీపురం పోలీసులు అరెస్టు చేశారు. ఈమె నుంచి మరింత సమాచారం నిమిత్తం కస్టడీకి ఇవ్వాలని కోరగా రెండు రోజుల పోలీసుల కస్టడీకి ఇచ్చారు. పోషించలేని తల్లిదండ్రుల నుంచి మాత్రమే పిల్లలను తాను తీసుకుని బలగం సరోజినికి అప్పగించినట్లు విచారణలో వెల్లడించారు. మంగళవారంతో కస్టడీ ముగియగా ఆమెను సీఎంఎం కోర్టులో హాజరుపరిచారు. అనంతరం ఆమెను రాజమహేంద్రవరం కేంద్ర కారాగానికి తరలించారు.

చదువు

■ e-mail: edc@eenadu.in

ఉపాధి పథం నైపుణ్య సాధనం



కోర్సుల రన్‌వేపై కెరియర్ టేకాఫ్

కలల కెరియర్ అందుకోవాలంటే కోర్సుల వారధి నిర్మించుకోవాలి. ఉద్యోగాల రీత్యా ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న విమానయాన రంగంలోకి ప్రవేశించేందుకు ఎన్నో దారులున్నాయి. ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్హతలతో వీటిలో ప్రవేశించవచ్చు. కొన్ని హోదాలు పొందడానికి అదనపు శిక్షణ కావాలి. ఎంచుకున్న మార్గాన్ని బట్టి కోర్సు ఎంపిక జరగాలి.

విమానయాన రంగంలో ఎక్కువ ఉద్యోగాలు 3 విభాగాల్లో ఉన్నాయి. అవి..

1. టెక్నికల్ ఉద్యోగాలు
2. మేనేజ్‌మెంట్ హోదాలు
3. సేవల విభాగంలో కొలువులు

మరో ఐదేళ్లలో అంటే 2030 నాటికి భారత పౌర విమానరంగం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మార్కెట్‌గా అవతరించనుంది. ఈ నేపథ్యంలో మూడు విభాగాల్లోనూ నైపుణ్యాలున్న సిబ్బంది అవసరం ఎక్కువగా ఉంది. ఖాళీలు ఎక్కువగా ఉన్నప్పటికీ, శిక్షణ పొందినవారు తక్కువ మందే ఉన్నారు. విమానయాన కోర్సుల శిక్షణకు మౌలిక సదుపాయాల కల్పన ప్రధాన అడ్డంకిగా ఉండటమే ఇందుకు కారణం. పైలట్ లాంటి కోర్సుల శిక్షణకు తగిన సౌకర్యాలు లేకపోతే అనుమతులు లభించవు.

పైలట్ (కమర్షియల్) ట్రెయినింగ్

కమర్షియల్ పైలట్ లైసెన్స్ (సీపీఎల్)గా పిలిచే ఈ కోర్సులో చేరడానికి మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో ప్లస్2/ఇంటర్మీడియట్ కనీస విద్యార్హత. వయసు 17 ఏళ్లు ఉండాలి. దేశవ్యాప్తంగా పలు సంస్థలు పైలట్ శిక్షణ అందిస్తున్నాయి.

గ్రౌండ్ స్టాఫ్ ఆపరేషన్స్

ఇంటర్ విద్యార్హతతో ఎయిర్‌పోర్ట్ గ్రౌండ్ సర్వీసెస్‌లో ఏడాది కాలపరిమితి ఉన్న డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ తరహా కోర్సుల్లో ప్రవేశానికి వివిధ సంస్థలు ఉమ్మడిగా నిర్వహిస్తోన్న ఏఎంఈ సెట్ రాయవచ్చు. ఇతర పరీక్షలతోనూ ప్రవేశం పొందవచ్చు.

వేతనాలు

✦ పైలట్ శిక్షణ పొందినవారికి రూ.12 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ప్రారంభంలో వార్షిక వేతనాలు అందుతాయి.

✦ కేబిన్ క్రూ సిబ్బందికి రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వార్షిక వేతనాలు సంస్థలు ఇస్తున్నాయి.

✦ ఎయిర్‌క్రాఫ్ట్ నిర్వహణ సిబ్బంది విద్యార్హతలతో పాటు తగిన కౌశలాలు సాధిస్తే ఏడాదికి రూ.6 లక్షలు - రూ.10 లక్షల మధ్య ప్యాకేజీ దక్కుతోంది.

✦ ఏవియేషన్ మేనేజ్‌మెంట్‌లో బీబీఏ పూర్తిచేసిన వారికి రూ.5 - రూ.12 లక్షల మధ్య వార్షిక వేతనాన్ని విమానయాన సంస్థలు ఆఫర్ చేస్తున్నాయి.

✦ ఎయిర్ లైన్స్ క్షేత్రస్థాయి కార్యకలాపాల్లో పాలుపంచుకునే సిబ్బందికి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వేతనాలిస్తున్నాయి.

ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీరింగ్ (ఏఎంఈ)

ఎయిర్‌లైన్స్‌లో అత్యంత డిమాండ్ ఉన్న ఈ హోదాను సాధించాలంటే డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అనుమతి పొందిన ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీరింగ్ లైసెన్స్ కోర్సు చేయాలి. ఇంటర్ ఎంపీసీ విద్యార్థులు అర్హులు. దేశంలో పలు సంస్థలు ఈ కోర్సును అందిస్తున్నాయి.

కేబిన్ క్రూ

విమానం లోపల సేవలందించే సిబ్బందిగా పనిచేయడానికీ కోర్సులున్నాయి. ఇంటర్మీడియట్ తర్వాత కేబిన్ క్రూ, ఎయిర్ హోస్టెస్‌లలో శిక్షణ పొందినవారు కేబిన్ సిబ్బంది పోస్టులకు దరఖాస్తు చేయవచ్చు. ఆరు నెలలు/ ఏడాది వ్యవధితో పలు ప్రైవేటు సంస్థలు ఈ కోర్సును అందిస్తున్నాయి. కొన్ని విమానయాన సంస్థలూ ఈ శిక్షణ అందించి, నేరుగా ఉద్యోగంలోకి తీసుకుంటున్నాయి.

పై మూడు మార్గాలూ నేరుగా వివిధ విమానయాన సంస్థల్లో పనిచేసేందుకు ఉద్దేశించినవి. విమాన రాకపోకలకు మౌలిక సదుపాయాలు కల్పించే ఎయిర్‌పోర్టులు, గ్రౌండ్ ఆపరేషన్స్ విభాగాల్లో సేవలందించే కొలువులూ ఉన్నాయి..

ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్

ఇందులో నేరుగా విమానాశ్రయ నిర్వహణలో పనిచేసే ఉద్యోగాలుంటాయి. అలాగే వివిధ విమానయాన సంస్థలు ఎయిర్‌పోర్టుల్లో నిర్వహించే కార్యకలాపాల్లో పాల్గొనే ఉద్యోగాలు యువతను ఆకర్షిస్తున్నాయి. ఈ హోదాలు పొందడానికి బీబీఏ- ఏవియేషన్ మేనేజ్‌మెంట్, బీఎస్సీ- ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా, పీజీ కోర్సుల్లో ఏదైనా పూర్తి చేయాలి. దేశ వ్యాప్తంగా పలు సంస్థలు వీటిని అందిస్తున్నాయి.

కార్గోలోనూ అవకాశాలు

పౌర విమానయాన రంగంతో పాటు ఎయిర్ కార్గో (ఆకాశ మార్గాన సరకు రవాణా రంగం) కూడా శరవేగంగా వృద్ధి చెందుతోంది. సరకు రవాణా, నిర్వహణలో ఆసక్తి ఉన్న యువతకు మంచి అవకాశాలున్నాయి. కార్గో హ్యాండ్లింగ్ (సరకు నిర్వహణ), గ్రౌండ్ స్టాఫ్ (క్షేత్రస్థాయి సిబ్బంది), సరకు సరఫరా వ్యవస్థ పర్యవేక్షణలో వివిధ స్థాయి ఉద్యోగాలను విమానయాన సరకు రవాణా సంస్థలు అందిస్తున్నాయి.

క్షేత్రస్థాయి కార్యకలాపాల (ఆపరేషన్స్, గ్రౌండ్ కంట్రోల్ హ్యాండ్లింగ్) విభాగంలో కార్గో ఏజెంట్స్, లోడ్ ప్లానర్స్, స్టోరింగ్ బాధ్యతల నిర్వహణలో ఉద్యోగావకాశాలు తరచూ వస్తున్నాయి. అలాగే, కార్గో ఆపరేషన్స్ మేనేజర్లు, స్టోర్ ఎగ్జిక్యూటివ్స్, హెచ్.ఆర్. బిజినెస్ పార్టనర్స్ లాంటి హోదాలు కార్గో మేనేజ్‌మెంట్, అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఉంటున్నాయి. లాజిస్టిక్స్, సప్లయ్ చెయిన్ విభాగంలో సరకు రవాణా ప్రణాళిక, సమన్వయ బాధ్యతల పర్యవేక్షణకు భారీ ఎత్తున సిబ్బందిని తీసుకుంటున్నారు. సాధారణంగా ఈ హోదాలన్నిటికీ ఇంటర్ కనీస విద్యార్హత. ఉన్నత స్థాయి హోదాలకు డిగ్రీ కావాలి. అయితే విద్యార్హతలతో పాటు ప్రభావవంతమైన భావవ్యక్తీకరణ, పనివేళల రీత్యా షిఫ్టుల్లో పనిచేసే ఆసక్తి, సరకు రవాణా విషయంలో లోతైన పరిజ్ఞానం, రవాణా విధివిధానాలపై అవగాహన, లాజిస్టిక్స్ సాఫ్ట్‌వేర్ నైపుణ్యం ఉంటే కార్గో కంపెనీలు మంచి ప్యాకేజీ ఆఫర్ చేస్తున్నాయి.




ప్రతి రంగంలోనూ కృత్రిమ మేధ (ఏఐ) సింహభాగాన్ని ప్రభావితం చేస్తోంది. అయితే విమానయాన రంగంలో మాత్రం దాని పాత్ర సాంకేతిక విభాగాలకే పరిమితం. అందువల్ల ఇందులో ఏటా సిబ్బంది అవసరం పెరుగుతోంది. ఆసక్తి ఉన్నవారు విమానయాన రంగంలోకి నిశ్చింతగా ప్రవేశించి కెరియర్ పరంగా గగన వీధుల్లో విహరించవచ్చు.


యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

ఎంఏ లింగ్విస్టిక్స్ కోర్సు చదువుతున్నాను. ఇది పూర్తయిన తర్వాత ఎలాంటి ఉద్యోగాలు ఉంటాయి. - జమీరుద్దీన్

ఎంఏ లింగ్విస్టిక్స్‌తో ఎలాంటి ఉద్యోగాలు?



■ ఎంఏ లింగ్విస్టిక్స్ భాషను శాస్త్రీయంగా అధ్యయనం చేసే పీజీ ప్రోగ్రాం. ఇది భాషల నిర్మాణం, ఉచ్చారణ, అర్థం, సమాజంతో భాషల సంబంధం, భాషా సాంకేతికత లాంటి అంశాలపై లోతైన అవగాహనను అందిస్తుంది. ఈ కోర్సు పూర్తిచేసిన వారికి విద్య, పరిశోధన, పరిపాలన, మీడియా, ఐటీ లాంటి రంగాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. భాషా శిక్షణ సంస్థల్లో ట్రెయినర్, కమ్యూనికేషన్ స్కిల్స్ కోచ్‌గానూ పనిచేయవచ్చు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులుగా అవకాశాలుంటాయి. నెట్ లేదా సెట్ అర్హతతో డిగ్రీ కళాశాలల్లో, పీహెచ్‌డీ పూర్తిచేస్తే విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కొనసాగవచ్చు.

▶ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాషా పరిశోధనా సంస్థలు, సాహిత్య అకాడమీలు, భాషా సర్వే సంస్థల్లో రిసెర్చ్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ ఫెలో, భాషా శాస్త్ర నిపుణులుగా పనిచేయవచ్చు. నిఘంటు తయారీ, భాషా డాక్యుమెంటేషన్, అంతరించిపోతున్న భాషలపై పరిశోధన లాంటి రంగాల్లో లింగ్విస్టిక్స్‌కు ప్రాధాన్యం ఉంది.

ఎంఏ లింగ్విస్టిక్స్‌తో పాటు జర్నలిజం చదివితే మీడియా, ప్రచురణ రంగంలో సబ్ ఎడిటర్, కంటెంట్ రైటర్, స్క్రిప్ట్ రైటర్, ప్రూఫ్ రీడర్ లాంటి ఉద్యోగాలు లభిస్తాయి. పుస్తక ప్రచురణ సంస్థల్లో మాన్యుస్క్రిప్ట్ ఎడిటింగ్, ట్రాన్స్‌లేషన్ లాంటి పనులూ చేయవచ్చు.

▶ ప్రైవేటు రంగ ఉద్యోగాలతో పాటు కొన్ని ప్రభుత్వ ఉద్యోగాలూ ఎంఏ లింగ్విస్టిక్స్ విద్యార్థులకు అందుబాటులో ఉంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో అనువాదకులు, భాషా నిపుణులు, ప్రచార విభాగాల్లో కంటెంట్ ఆఫీసర్ లాంటి పోస్టులకు అర్హత ఉంటుంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

వీఎన్ఐటీలో ఉద్యోగాలు

విశ్వేశ్వరయ్య నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఎన్ఐటీ) నాగ్‌పూర్.. నాన్ టీచింగ్ విభాగాల్లో పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- లైబ్రేరియన్: 01
- సీనియర్ సైంటిఫిక్/టెక్నికల్ ఆఫీసర్: 02
- సైంటిఫిక్/టెక్నికల్ ఆఫీసర్: 03
- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్: 01 ● సూపరింటెండెంట్: 05
- లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్: 01
- జూనియర్ ఇంజినీర్: 01 ● టెక్నికల్ అసిస్టెంట్: 08
- సీనియర్ అసిస్టెంట్: 02 ● సీనియర్ టెక్నీషియన్: 03
- జూనియర్ అసిస్టెంట్: 03 ● టెక్నీషియన్: 10
- ఆఫీస్ అటెండెంట్/ల్యాబ్ అటెండెంట్: 05

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్మీడియట్, బ్యాచిలర్ డిగ్రీ, బీఈ/బీటెక్, ఎమ్మెస్సీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు రూ.18,000- రూ.1,44,200.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 01.03.2026. వెబ్‌సైట్: https://vnit.ac.in/

హెచ్‌సీఎల్‌లో

హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్), కోల్‌కతా వర్క్ మెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- వర్క్ మెన్: 18

అర్హత: పోస్టులను అనుసరించి పదోతరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 01.01.2026 నాటికి 40 ఏళ్లు మించరాదు. ఎస్సీ, ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు సడలింపు ఉంటుంది.
వేతన శ్రేణి: నెలకు రూ.28,120 - రూ.55,620.
దరఖాస్తు ఫీజు: రూ 500. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు లేదు.
ఎంపిక: రాత పరీక్ష, ట్రేడ్ టెస్టులతో
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25.02.2026
వెబ్‌సైట్: https://www.hindustancopper.com/Page/Career_New

(c) eenadu

వసుంధర

vasundhara@eenadu.in

ఒకప్పుడు ఆ ఊళ్లో మహిళల దినచర్యంతా వ్యవసాయం చుట్టూనే సాగేది. కానీ విజయలక్ష్మి ఆ పరిస్థితిని మార్చారు. కలంకారీ కళను అక్కడివారికి పరిచయం చేశారు. రామాయణ ఘట్టాలను వస్త్రాలపై ఆవిష్కరిస్తూ తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఆ చిత్రకళా ప్రయాణం ఆమెకు తాజాగా జాతీయ పురస్కారాన్నీ తెచ్చిపెట్టింది. 'వసుంధర' ఆమెను పలకరించింది.



ఆమె కళకి జాతీయ అవార్డు!



విజయలక్ష్మి

మాది శ్రీకాళహస్తి. కళాకారుల కుటుంబం. రంగుల పరిమళం, చేతిలో కలం... ఇవే మా లోకం. కలంకారీ కళను చూస్తూ... నాన్న దగ్గర ఓనమాలు నేర్చుకుంటూ పెరిగా. నా తొలి గురువు ఆయనే. పదో తరగతి పూర్తయ్యాక మా చిన్నాన్న మునికృష్ణారెడ్డి నా కళకి మరిన్ని మెరుగులు దిద్దారు. అయితే నాకు స్ఫూర్తి మాత్రం అక్క మునిరత్నమ్మే. దేశంలోనే కలంకారీతో జాతీయ అవార్డు సాధించిన మహిళగా ఆమె పేరు మారుమోగుతోంటే చూసి... అక్క అడుగుజాడల్లో నడవాలని నిర్ణయించుకున్నా. పెళ్లయ్యాక వెంకటగిరి మండలంలోని కుప్పంపల్లికి వచ్చా. మారుమూల గ్రామం... నా కళకు ఆదరణ ఉంటుందా? ఇంతటితో ప్రయాణం ఆగిపోతుందేమో అని నాలో ఎన్ని ప్రశ్నలో! కానీ, నాన్న ఎప్పుడూ 'ఆడపిల్లలు తమ కాళ్ల మీద తాము నిలబడాలమ్మా. అంతే కాదు, నువ్వు నేర్చుకున్న కళ అంతరించిపోకుండా చూసుకోవాలి. దాంతో తోటివారికీ ఉపాధి కల్పించగలగాలి' అనేవారు. ఆ మాటలే నన్ను ముందుకు నడిపాయి. మావారు, తమ్ముడు కూడా అండగా నిలవడంతో చిన్న కుటీర పరిశ్రమను మొదలుపెట్టాను. నాకంటూ ప్రత్యేకత చాటాలనుకుని వస్త్రంపై కలంకారీతో రామాయణ ఇతివృత్తాల్ని చిత్రించడం మొదలుపెట్టా. సీతమ్మ అరణ్యవాస కష్టాలు, హనుమంతుని భక్తి, రామ పట్టాభిషేకం... ఇలా ప్రధాన ఘట్టాలన్నీ ఆవిష్కరిస్తూ వచ్చా.

మూడేళ్ల శ్రమ..

కానీ.. ఇదంతా ఒకరోజులోనో, నెలలోనో సాధ్యమా? ప్రతి రేఖలో జీవం ఉండాలి. చూసేవారికి త్రేతాయుగం కళ్ల ముందు కదలాలి అనుకున్నా. రోజూ కొంత సమయాన్ని కేటాయిస్తూ చేశా. ఒక ఘట్టం పూర్తయ్యాక దాన్ని సహజ రంగులతో ఉడకబెట్టడం, ఆపై ఆరబెట్టడం. వాతావరణం తేమగా ఉంటే రోజుల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. కొన్నిసార్లు అనుకున్న రంగు రాకపోతే మళ్లీ మొదట్నుంచి మొదలుపెట్టాలి. ఒకవైపు అత్తారింట్లో బాధ్యతలు, మరోవైపు కళ... రెండూ సమన్వయం చేసుకుంటూ వచ్చా. అలా పూర్తి చేయడానికి మూడేళ్లు ఓపికగా శ్రమించా. ఆ కష్టానికి ఫలితంగా రాష్ట్రపతి ప్రశంసలతోపాటు ఆమె చేతులమీదుగా ఇటీవల జాతీయ అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. నిజం చెప్పాలంటే... అవార్డుల కన్నా నా దగ్గర పనిచేసే మహిళల కళ్లలో కనిపించే ఆనందమే నాకు ఎక్కువ సంతోషాన్నిస్తుంది. ఊళ్లో మహిళలు ఒకప్పుడు కలుపు తీయడానికి, ఇతర వ్యవసాయ పనులకు వెళ్లేవాళ్లు. పని ఉంటే సరే! లేదంటే ఖాళీ. అది చూసి బాధేసింది. వాళ్లందరినీ పిలిచి కలంకారీ కళను నేర్పించా. 40 మందికి పైగా నేర్చుకున్నారు. ఇప్పుడు వాళ్లంతా నేర్పుగా చీరలపై చిత్రాలు గీస్తోంటే గర్వంగా అనిపిస్తుంది. వాళ్లు 'అక్కా.. కూలి పనులకంటే ఇదే గౌరవంగా ఉంది. ఇంటి పట్టునే ఉండి డబ్బులు సంపాదించుకుంటున్నాం' అని చెబుతోంటే నా జన్మ ధన్యమైంది అనిపిస్తుంది. 30 మంది మహిళలకి జీవనోపాధినీ కల్పిస్తున్నా.

ప్రభుత్వం తోడుంటే..

మారుమూల గ్రామాల్లో ఎన్నో ఇబ్బందుల మధ్య కళల్ని కాపాడుకోవడం శ్రమతో కూడుకున్న పనే! ప్రభుత్వం స్పందించి ఆసక్తి ఉన్న వాళ్లకి వర్క్‌షాప్‌లు నిర్వహించడం, నేర్చుకునేవాళ్లకి స్టైపెండ్ ఇవ్వడం లాంటివి చేస్తే అద్భుతాలను సృష్టించవచ్చు. శిక్షణ కేంద్రాలను గ్రామాల్లోకీ తీసుకొస్తే... ఎంతోమంది పల్లె పడతుల జీవితాలు రంగులమయం అవుతాయి. నావరకూ ఈ కలంకారీ కళను కాపాడుతూ, కొందరికైనా ఆర్థికంగా నిలబెట్టడమే లక్ష్యం.

– వేల్పూరి వీరగంగాధర శర్మ, తిరుపతి

నా శ్రమని గుర్తించరెందుకు?

ఐదేళ్లుగా నేనో కంపెనీలో పనిచేస్తున్నా. అందులో రాణించాలని శాయశక్తులా కృషి చేస్తున్నా. కొత్త నైపుణ్యాలూ నేర్చుకుంటున్నా. అవసరమైతే పనివేళలకు మించి శ్రమిస్తున్నా. ఇంత చేసినా నా యజమాని నేను చేసే తప్పుల్ని కనిపెట్టి, హెచ్చరించి, తీర్చిదిద్దుతున్నారే తప్ప... ఏనాడు నన్ను ప్రశంసించలేదు. నా సహోద్యోగులు చేసే చిన్న పనికీ ప్రశంసల వర్షం కురిపిస్తారు. పైగా, ఈ మధ్య జీతం పెంచమని అడిగితే... 'ఇప్పటికే నీకు చాలా ఎక్కువ ఇస్తున్నాం' అంటూ నా అభ్యర్థనను తోసిపుచ్చారు. నేనేం చేయాలి?

– ఓ సోదరి

డియర్ వసుంధర

కవితా గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

నచ్చిన ఉద్యోగిని ఒకలా... నచ్చని వాళ్లని మరోలా చూసేవాళ్లు అన్నిచోట్లా ఉంటారు. వృత్తిగత జీవితాల్లో ఇలాంటి వాళ్లు ఎదురవ్వడం సహజం. మీరు చేయాల్సిన దానికన్నా ఎక్కువగా శ్రమిస్తున్నా... గుర్తింపు లేకపోవడమే బాధపడాల్సిన విషయం. మానసిక ఒత్తిడినీ, అసంతృప్తినీ పెంచే అంశం ఇది. అయితే, మీరు మనసు చిన్నబుచ్చుకోకండి. ముందు మీ బాస్‌తో ప్రశాంతంగా మాట్లాడండి. మీ పని మీద రివ్యూ అడగండి. 'నా నుంచి ఏం కోరుకుంటున్నారు? ఇప్పటివరకూ చేసిన పనిని ఎలా గుర్తించారు?... వంటివి అడిగి తెలుసుకోండి. వీటికి తను చెప్పే సమాధానాన్ని బట్టి మీ తదుపరి నిర్ణయాన్ని తీసుకోండి. బాస్ ఆలోచనా ధోరణి మీపట్ల ఎలా ఉందో చెప్పడానికి అర్థం పట్టే ప్రక్రియ ఇది. అందుకే ప్రతికూల స్పందన వస్తే... విభాగం మార్చుకునే అవకాశం ఉందేమో చూడండి. లేదా వేరే ఉద్యోగం వెతుక్కోండి. ఎందుకంటే ఇన్నాళ్లు మీ శ్రమను లెక్కచేయని వాళ్లు... ఇకపై గుర్తిస్తారు అనుకోవడం భ్రమ అవుతుంది. ఇదే తరహాలో కష్టపడితే మీరు ఎక్కడైనా రాణించగలరు. ఆలోచించి నిర్ణయం తీసుకోండి. ఆల్ ది బెస్ట్.



'ప్లీజింగ్ సింద్రోమ్' తెలుసా!

మనం అందరికీ నచ్చాలి. మన వల్ల ఎవరూ బాధపడకూడదు. ఈ క్రమంలో మనం బాధపడినా పరవాలేదు... ఇలా అనుకుని చాలాసార్లు అవతలి వ్యక్తులమీద పట్టలేని కోపం వచ్చినా దాన్ని చిరునవ్వు వెనక దాచేస్తాం. అవతలివాళ్లదే తప్పైనా మనమే సర్దుకుపోతే సరి అనుకుంటాం. ముందు మనమే మాట్లాడితే పోయేదేముందని మాటనీ కలిపేస్తాం. ఇలాంటి సందర్భాలు మనలో చాలామందికి ఇల్లు, ఆఫీసుల్లో ఎదురయ్యే ఉంటాయి కదా! దీన్నే 'పీపుల్ ప్లీజింగ్ సింద్రోమ్' అంటున్నాయి అధ్యయనాలు. ఇతరుల్ని నొప్పించకూడదు అనే ఈ ధోరణి అప్పటికి మంచిదే అనిపించినా భవిష్యత్తులో ఇవన్నీ ఒత్తిడి, అలసట, నిద్రలేమి... వంటి మానసిక సమస్యలకు దారితీస్తాయట. చిన్నచిన్న నిర్ణయాలకు కూడా ఇతరులపై ఆధారపడటం, మన ఇష్టాలకి బదులు పక్కవారి అభిప్రాయాలకే ఎక్కువ విలువ ఇవ్వడానికి అలవాటు పడిపోతామట. అంతేనా, మహిళల వృత్తి, వ్యక్తిగత జీవితాలపైనా ఇది తీవ్ర ప్రభావం చూపిస్తుందంటున్నారు శాస్త్రవేత్తలు. దీన్నుంచి బయటపడాలంటే... ఒకరి మెప్పు కోసం మన ఉనికిని కోల్పోకుండా మన ఆలోచనలకి, అభిప్రాయాలకి ప్రాధాన్యం ఇచ్చుకోవాలి. నచ్చని విషయానికి వెంటనే నో చెప్పడం నేర్చుకోవాలి. ఇతరులకు ఏం కావాలో కాదు, మనకేం కావాలో తెలుసుకుని మసలుకోవాలి. మీ మాటకు విలువనిచ్చేవారితో స్నేహం చేయాలి. ఇవన్నీ ఒక్కసారిగా మార్చుకోవడం కష్టమే కానీ నెమ్మదిగా అలవాటు చేసుకుంటే మంచిదంటారు నిపుణులు.

బంగారం - వెండి



27న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,62,380	1,48,850	3,87,000
విజయవాడ	1,59,230	1,48,450	3,61,500
ప్రొద్దుటూరు	1,65,500	1,52,260	3,58,000
రాజమహేంద్రవరం	1,61,950	1,48,450	3,87,000
విశాఖపట్నం	1,61,950	1,48,450	3,61,000
తమిళనాడు	-----	1,49,600	3,87,000

ఆమె కలలు వేరు. ఎంచుకున్న కెరియరూ వేరే! అలాంటామెకు ప్రజలకు సేవ చేయాలన్న కోరిక కలిగింది. అందుకు తనకు కనిపించిన మార్గం సివిల్స్. అలా అనుకోకుండా దారి మార్చుకుని... పోలీసు అయ్యారు తనుశ్రీ. తన ధైర్య సాహసాలతో తాజాగా గ్యాలెంటరీ అవార్డునీ అందుకున్నారు.

ఆ ధైర్యానికి సెల్యూట్!



తనుశ్రీ

తనుశ్రీ పుట్టిపెరిగిందంతా బిహార్. దిల్లీ యూనివర్సిటీ నుంచి బీఏ ఆనర్స్ పూర్తిచేశారు. చిన్నప్పట్నుంచీ మంచి విద్యార్థినే. అయితే ఎప్పుడూ పుస్తకం పట్టుకునే ఉండటం ఆమె నైజం కాదు. సృజనాత్మకతకీ చోటిచ్చి ఎన్నో ప్రయోగాలు చేసేవారు. అలా తన అభిరుచికి ప్రాణం పోసేలా డిజైనింగ్ రంగం కనిపించింది. దీంతో నిఫ్ట్-గాంధీనగర్ నుంచి టెక్స్‌టైల్ డిజైనింగ్‌లో కోర్సుని పూర్తి చేశారు. తన పని ఇతరులకూ సాయపడాలనేది తనుశ్రీ తత్వం. అందుకే నేత కార్మికులతో కలిసి పనిచేశారామె. ఝార్ఖండ్‌లోని క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులోనూ భాగమయ్యారు. అలా నాలుగైదేళ్లు పనిచేశారు. అప్పుడే పేదల కష్టాలు అర్థమయ్యాయామెకు. సమాజానికి సేవ చేసేలా ఏదైనా చేయాలనుకున్న ఆలోచన కలిగింది. ఏం చేద్దామా అని ఆలోచిస్తున్న తనకు తండ్రి కనిపించారు. ఆయన పోలీస్ ఆఫీసర్. అలా సివిల్స్ వైపు వెళ్లారు.

యూపీఎస్సీ ప్రయాణం అంత సులువు కాదని అర్థమవ్వడానికి తనుశ్రీకి ఎంతోకాలం పట్టలేదు. వరుస వైఫల్యాలు. ఎంత కష్టపడినా అదే ఫలితం. ఈక్రమంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌నీ సాధించారు. అక్కడ శిక్షణ తీసుకుంటూనే సివిల్స్‌కి సిద్ధమయ్యారు... చివరకు 2017లో ఐపీఎస్ సాధించారు. శిక్షణ అనంతరం కశ్మీర్‌లో పోస్టింగ్ అందుకున్నారు. స్టేట్ ఇన్వెస్టిగేషన్ విభాగంలో పనిచేసిన ఈమె తరవాత పుల్వామాకి సీనియర్ సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు.

పుల్వామా... మిలిటెంట్ల హాట్‌స్పాట్‌గా చెబుతుంటారు. అలాంటిచోట తన ప్రణాళికలు, వ్యూహాలతో ఉగ్రవాద దాడులను అడ్డుకున్నారు తనుశ్రీ. హైరిస్క్ ఆపరేషన్లను చేపట్టారు. ఇద్దరు ప్రమాదకర ఉగ్రవాదులను మట్టుపెట్టారు కూడా. ఈక్రమంలో ఎదురైన బెదిరింపులూ చాలానే. అయినా విధుల విషయంలో వెనుదిరగలేదు. ఇల్లాలిగా, తల్లిగానే కాదు... విధి నిర్వహణ బాధ్యతల్నీ సమర్థంగా నిర్వర్తిస్తున్నారీమె. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా యువతలో అవగాహననీ కల్పిస్తున్నారు. ఆ ధైర్యానికీ, ఆమె నాయకత్వానికీ, వృత్తిపట్ల నిబద్ధతకీ గుర్తింపుగానే ప్రతిష్ఠాత్మక గ్యాలెంటరీ అవార్డుకి ఎంపియ్యారు ఎస్ఎస్‌పీ తనుశ్రీ. మహిళలు చేయలేరు అనే అతి ప్రమాదకరమైన చోట సమర్థంగా విధులు నిర్వర్తిస్తూ మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తున్న ఈ పోలీస్‌కి సెల్యూట్ చెప్పాల్సిందే కదూ!

మీకు తెలుసా!

పురుషుల కంటే స్త్రీలలో ప్రోలాక్టిన్ హార్మోన్ స్థాయి సుమారు 60శాతం ఎక్కువగా ఉంటుందట. ఇది మనం భావోద్వేగానికి గురైనప్పుడు కన్నీళ్లు వచ్చేలా చేస్తుందట. అందుకే మగవారితో పోలిస్తే మహిళలు సున్నితంగా ఉండి ఎక్కువగా ఏడుస్తారని అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే ప్రసవం తరవాత ఆడవారిలో చనుబాలుపెరగడానికీ ఈ ప్రోలాక్టినే కారణమట.

ఎక్కడికైనా జరిపేయొచ్చు..!

స్మార్ట్ కిచెన్

ఇప్పుడన్నీ స్మార్ట్ కిచెన్లే. భారీ ఎలక్ట్రానిక్ వస్తువులు లేని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదేమో. ఇవన్నీ రోజువారీ పనుల్ని సులభం చేసేవే అయినా... ఇల్లు శుభ్రం చేసేటప్పుడే వాటిని జరపలేక ఎన్ని కష్టాలు పడాలో. ఈ సమస్యకు పరిష్కారంగా వచ్చిన గ్యాడ్జెట్లే ఇవి.

లాక్ చేస్తుంది...



వాషింగ్ మెషీన్, రిఫ్రిజిరేటర్లు ఉండే ప్రాంతాన్ని శుభ్రం చేయాలంటే వాటికి ప్రత్యేకంగా సమయం కేటాయించాల్సిందే. ఎత్తడం, విరగకుండా, గ్యాస్ కదలకుండా వేరే చోటుకి తరలించడం అంతా పెద్ద పనే. ట్రాలీలను అమర్చినా వీటి బరువు ఎంతవరకూ మోయగలవు అన్నదీ ప్రశ్నే. 'అడ్జస్టబుల్ బేస్ ట్రాలీ స్టాండ్స్' వాడితే ఈ సమస్యలకు చెక్ చెప్పేయొచ్చు. వస్తువు జారి పడిపోకుండా యాంటీ-స్లిప్ ప్యాడ్‌లు ఉంటాయి వీటికి. కదలికల్ని నియంత్రించడానికి బ్రేక్ లాక్‌లు కూడా ఉన్నాయి. ట్రాలీకి ఉండే యాంటీ-వైబ్రేషన్ ప్యాడ్‌లు మెషీన్ రన్నింగ్ శబ్దాన్ని కూడా తగ్గిస్తాయి.

సులువుగా తెలుసుకోవచ్చు...



వంటింట్లో ఉండే భారీ వస్తువుల్లో గ్యాస్ సిలిండర్ ఒకటి. కాస్త కదల్చాలన్నా టాస్కులు చేయాల్సిందే. అందుకే గదంతా శుభ్రం చేస్తాం కానీ, సిలిండర్ జోలికి వెళ్లం. దాంతో కింద తుప్పు పట్టడంతోపాటు బొద్దింకలు, క్రిములకు ఆవాసంగా మారుతుంది. ఈ 'స్టవ్ క్రాఫ్ట్ ఇంటిలిజెంట్ గ్యాస్ ట్రాలీ'ని ఉపయోగించి చూడండి. సిలిండర్ని దీనిపై పెడితే సరి. ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎక్కడికి కావాలంటే అక్కడికి జరుపుకోవచ్చు. అన్నట్టు దీనికి బరువు చూపించే స్కేల్ కూడా అమర్చి ఉంటుంది. దాంతో గ్యాస్ ఎంత ఉంది అన్నదీ సులభంగా తెలుసుకోవచ్చు.

క్యాబినెట్లనీ జరపొచ్చు...



చెక్క, ప్లాస్టిక్‌తో చేసిన క్యాబినెట్లని వంటింట్లోనూ ఇష్టపడుతోంది ఇప్పటితరం. డైనింగ్ టేబుల్ కూడా వీలైనంత వరకూ చెక్కతో నచ్చిన విధంగా చేయించుకోవడానికే ప్రాధాన్యమిస్తున్నారు. శుభ్రం చేసే విషయానికి వచ్చేసరికి నానా తంటాలు పడుతున్నారు. అలాంటప్పుడు ఈ 'హెవీ లిఫ్టర్ అండ్ మూవర్ టూల్ సెట్'ను వాడి చూడండి. ఒకదాంట్లో లిఫ్టర్, ఐదు మూవర్లు వస్తాయి. జరపాలి అనుకున్న వస్తువుని లిఫ్టర్‌ని ఉపయోగించి దాన్ని ఎత్తి... కింద అవసరం అయినన్ని మూవర్లు పెడితే సరి. సులువుగా ఆ వస్తువుని కదపొచ్చు.

వాళ్ల వల్లే ఈ గుర్తింపు..!



విమల

కొన్ని కళలు మనసుకి హత్తుకునేలా ఉంటాయి. వాటిలో కేరళకు చెందిన మోహినీయాట్టం తప్పక ఉంటుంది. అయితే ఆ నాట్యానికి ప్రాణం పోసినవారిలో 84ఏళ్ల కళామండలం విమల మేనన్ కూడా ఒకరు. హస్త ముద్రలు, భావవ్యక్తీకరణలతో ప్రదర్శించే ఈ కళను దాదాపు ఐదు దశాబ్దాల నుంచి వేలమంది విద్యార్థులకి నేర్పిస్తున్నారు. కేరళ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుతూ కళాకారులకు అందించిన సేవలకిగానూ తాజాగా పద్మశ్రీకి ఎంపికయ్యారు.

'ఈ కళాజీవితం మరణం వరకూ కొనసాగుతుంది...' పద్మశ్రీ పురస్కారం వచ్చిందని తెలియగానే విమల మేనన్ అన్న మాట ఇది. కేరళ, ఇరింజలకుడలోని చిన్న గ్రామంలో పుట్టారు విమల. నాన్న కృష్ణన్ నాయర్, సివిల్ ఇంజినీర్. అమ్మ విశాలాక్షి సంగీతం టీచర్. ఏడుగురు సంతానంలో విమల రెండోవారు. సంగీత నేపథ్యం ఉన్న కుటుంబం కావడంతో పదేళ్లప్పట్నుంచి శాస్త్రీయ నృత్యం, కర్ణాటక సంగీతం నేర్చుకోవడం మొదలుపెట్టారట. పాఠశాల విద్య పూర్తయిన తరవాత కేరళ నాట్యమండలంలో చేరారు విమల. అక్కడ మోహినీయాట్టం, భరతనాట్యంలో డిప్లొమా పూర్తిచేశారామె. అదే సమయంలో పలు స్టేజ్ ప్రదర్శనలూ ఇచ్చారు. తరవాత తమిళనాడులోని జవహర్ స్కూల్లో డ్యాన్స్ టీచర్‌గా చేరారు. అప్పుడే కె.పి. విశ్వనాథ్ మేనన్‌తో వివాహం అయ్యింది. పెళ్లి తర్వాత భూటాన్‌తోపాటు భర్త ఉద్యోగరీత్యా మన దేశంలోనూ పలుచోట్లకు మారాల్సి వచ్చిందట విమలకి. అయినా నృత్య ప్రదర్శనలు ఇవ్వడం ఆపలేదామె. వెళ్లిన ప్రతిచోటా ప్రభుత్వ పాఠశాలల్ని వెతుక్కుంటూ వెళ్లి పిల్లలకి ఉచితంగా నాట్యం నేర్పించేవారట విమల.

విద్యార్థులే నా సంపద...

ఐదు దశాబ్దాలకు పైగా మోహినీయాట్టం, భరతనాట్యంలో అనుభవం ఉన్న విమల 1972లో కేరళలోని తిరువనంతపురంలో 'కేరళ నాట్య అకాడమీ'ని స్థాపించారు. దీనిలో కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా ఆసక్తి ఉన్న విద్యార్థులకు మోహినీయాట్టంతోపాటు కూచిపూడి, భరతనాట్యం వంటి కళల్ని ఇప్పటికీ నేర్పిస్తున్నారు. 'నా విద్యార్థులే నేను సంపాదించిన ఆస్తి. వాళ్ల వల్లే నాకు ఇంత గుర్తింపు వచ్చింది' అనే విమల 'రామనాట్టం ఇన్ మోహినీయాట్టం' అనే ప్రాజెక్టును మొదలుపెట్టి మోహినీయాట్టం నాట్య ప్రాధాన్యతను నేటి తరానికి తెలియజేస్తూ, శాస్త్రీయ నృత్యాల్ని కాపాడుతున్నారు. దీనికి ప్రభుత్వం నుంచి ఫెలోషిప్‌నీ పొందారు. అంతేకాదు, ఒకేసారి 12వందలమంది మోహినీయాట్టం కళాకారులతో వేదికపై ప్రదర్శన ఇచ్చి, గిన్నిస్ రికార్డునీ సొంతం చేసుకున్నారు. సిస్టర్ నివేదిత విశ్వవిద్యాలయం వంటి సంస్థలతో కలిసి వర్క్‌షాపుల్నీ నిర్వహిస్తున్నారీమె. కళారంగంలోనూ ఉద్యోగావకాశాలు కల్పించాలని ప్రభుత్వంతో పోరాడుతున్నారు విమల. దీంతో ఆమె చేస్తున్న పోరాటానికీ, అందిస్తున్న సేవలకీ కేరళశ్రీ పురస్కారంతోపాటు కళామండలం, కేరళ సంగీతనాటక అకాడమీ పురస్కారాలనూ అందుకున్నారు. తాజాగా ఆమెను పద్మశ్రీ వరించింది.

ఉత్సాహంగా పనిచేయాలంటే...

ఇంటా, బయటా ఎంత శ్రమించినా ఇంకా ఏదో ఒక పని మహిళలకు మిగిలే ఉన్నట్లు అనిపిస్తుంది. పర్ఫెక్షన్, ప్రణాళిక లేకపోవడం, సమయ పాలన పాటించకపోవడమే ఇందుకు కారణాలు... మరి వాటిని అనుసరిస్తే...



- ఇల్లాలిగా ఇంటి బాధ్యతలపై పట్టు మీకు ఉండొచ్చు. 'అన్ని పనులు బాగా చక్కబెడుతుంది' అన్న బిరుదు బాగానే ఉంటుంది. అయితే మితిమీరిన భారం ఎవరినైనా ఒత్తిడికి గురిచేస్తుంది. ఇది తీవ్ర స్థాయికి చేరుకున్నప్పుడు మీకెవరూ సాయం చేయట్లేదనీ, ఒంటరిమైపోయాననే బాధ మిగులుతుంది. అందుకే, ఎవరి మెప్పుకోసమో మీరు అన్ని పనుల్నీ నెత్తిన వేసుకోవద్దు. ముందు ఇంట్లో మీ బాధ్యతల్ని జాబితా రాసుకోండి. మిగిలిన వారికి అప్పగించాల్సిన వాటిపై స్పష్టత తెచ్చుకోండి. అప్పుడు అవి తేలిక అవుతాయి. మీకు భారమూ తగ్గుతుంది.
- ఇల్లు, ఆఫీసు పనుల్ని సమన్వయం చేసుకోవడం అంత సులువేం కాదు. ఇందుకోసమే చాలామంది మల్టీటాస్కింగ్ చేస్తారు. ఇది వినడానికి బాగానే ఉంటుంది కానీ... వాస్తవంలో దీని ప్రయోజనం మాత్రం తక్కువే. ముఖ్యంగా మహిళల్ని తీవ్ర ఒత్తిడికి గురి చేస్తుంది. దీనికి బదులు ప్రాధాన్యతాక్రమంలో, ప్రణాళికాబద్ధంగా వాటిని పూర్తి చేయడానికి ప్రయత్నించండి. ఫలితం కనిపించొచ్చు.
- పనుల ఒత్తిడి తగ్గాలంటే ముందు అన్నింటికీ సమయపాలన పాటించాలి. మీరే కాదు... ఇంట్లోని ఇతర సభ్యులూ వారి రొటీన్‌ని అనుసరించేలా చూడాలి. అలాకాకుండా తర్వాత చేద్దాం... కాసేపాగి చూద్దాం అనుకుంటే ఒకదానికి ఒకటి పేరుకుపోతాయి. ఈ ప్రణాళికలో మీకంటూ విశ్రాంతికి సమయాన్ని కచ్చితంగా కేటాయించుకోవడం మరిచిపోవద్దు సుమీ! అప్పుడే మీరు రీఛార్జ్ అవుతారు.

చిన్న పొరపాటు... లాభాలు తెచ్చింది!

వినియోగదారుల నాడి పట్టాలి. అప్పుడే వ్యాపారంలో లాభాలు సాధించడం సాధ్యం. ఆ పాఠం జాంగ్ హోషింగ్‌కి బాగా ఒంటపట్టింది. కాబట్టే, ఓ చిన్న పొరపాటుతో లాభాలు సాధించింది. అంతేనా, నెట్టింట వైరల్ కూడా అయ్యింది.



జాంగ్ హోషింగ్‌ది చైనా. ఈమెకి తూర్పు చైనాలోని ఈవూ ఇంటర్నేషనల్ ట్రేడ్ మార్కెట్‌లో చిన్న బొమ్మల షాపు ఉంది. ఫిబ్రవరి నుంచి వాళ్లకి కొత్త ఏడాది మొదలవుతుంది. ఈ ఏడాది వాళ్లకి 'హార్స్ ఇయర్'. పైగా ఎరుపు వాళ్లు శుభానికి సూచికగా భావిస్తుంటారు. ఇంకేం గుర్రాల బొమ్మలకు గిరాకీ ఉంటుందని తన ఫ్యాక్టరీలో వాటిని చేయించింది. ఆర్డర్లూ మొదలయ్యాయి. అయితే పనిచేసే వాళ్లెవరో నవ్వుతున్న గుర్రపు బొమ్మకు బదులు బాధగా ఉన్నట్లుగా ఒకదాన్ని తయారు చేశారు. అది ఒక వినియోగదారుడికి చేరింది. దాన్ని చూసిన ఆ వ్యక్తి ఇంటర్నెట్‌లో ఫొటోతోపాటు 'ఈ గుర్రం పాపం చాలా బాధగా ఉంది. అచ్చు ఆఫీసులో నేను ఉన్నట్లే. కొత్త ఏడాది నుంచైనా పని ప్రదేశంలోని అసంతృప్తులను వదిలి, సంతోషాల్నే గుర్తుంచుకోవాలి అనుకుంటున్నా' అని రాశారు. దానికి స్పందన బాగా వచ్చింది. అది గమనించిన జాంగ్ వెంటనే స్పందించి బాధగా ఉన్న ఆ గుర్రపు బొమ్మలే తయారుచేయించింది. తను ఊహించినట్టుగానే వాటికి గిరాకీ పెరిగింది. వేలల్లో అమ్ముడవుతున్నాయట. దీని కోసం ఎక్కువమందిని నియమించుకుని మరీ తయారీ చేపడుతోందట జాంగ్. 'ప్రతి ఒక్కరిలోనూ లోపాలుంటాయి. నిజానికి అవే మన ప్రత్యేకత. వాటిని సానుకూలంగా స్వీకరిస్తే ఎవరైనా ఆనందంగా జీవించగలరు. ఈ సూత్రాన్ని అర్థం చేసుకునే మా 'క్రయింగ్ హార్స్'ను ఎక్కువమంది ఇష్టపడుతున్నారు. ఏదైతేనేం చిన్న పొరపాటు, సమయానుకూల స్పందన మాత్రం మాకు లాభాలు తెచ్చిపెడుతోంది. ఫ్యాక్టరీలో ఎవరివల్ల పొరపాటు జరిగిందో తెలియదు. అందుకే పనివాళ్లందరికీ బోనస్ ఇవ్వబోతున్నా' అంటోంది జాంగ్ నవ్వుతూ. ఈ కథ, ఈమె స్పందన ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.

(c) eenadu

చాంపియన్

న్యూజిలాండ్ చేతిలో వన్డే సిరీస్ ఓడినా.. టీ20ల్లో మాత్రం భారత్‌కు ఎదురే లేదు. సొంతగడ్డపై ఇంకొన్ని రోజుల్లో పొట్టి ప్రపంచకప్ మొదలు కాబోతుండగా.. ఈ ఫార్మాట్లో కివీస్‌ను చిత్తుగా ఓడిస్తూ మరో రెండు మ్యాచ్‌లు ఉండగానే సిరీస్‌ను చేజిక్కించుకుంది టీమ్ఇండియా. ఇప్పుడిక క్లీన్‌స్వీప్‌పై గురిపెట్టిన సూర్యకుమార్ సేన.. విశాఖపట్నంలో నాలుగో టీ20కి సిద్ధమైంది.

ఎదురుందా!

జోరుమీదున్న భారత్ ● కివీస్‌తో నాలుగో టీ20 నేడు

విశాఖ నుంచి ఈనాడు క్రీడా ప్రతినిధి


సూర్య

న్యూజిలాండ్‌పై హ్యాట్రిక్ విజయాలతో ఇప్పటికే టీ20 సిరీస్‌ను చేజిక్కించుకున్న భారత్.. ఆత్మవిశ్వాసంతో నాలుగో టీ20కి సిద్ధమైంది. అన్ని ఫార్మాట్లలోనూ భారత్‌కు ఘనమైన రికార్డున్న విశాఖపట్నంలో బుధవారం ఈ మ్యాచ్ జరగనుంది. సిరీస్ సాగే కొద్దీ దూకుడు పెంచుతున్న భారత బ్యాటర్లను అడ్డుకోవడం కివీస్‌కు కష్టంగానే కనిపిస్తోంది. ముఖ్యంగా గత మ్యాచ్‌లో 154 పరుగుల లక్ష్యాన్ని కేవలం 10 ఓవర్లలోనే ఛేదించి ప్రత్యర్థిని బెంబేలెత్తించింది టీమ్ఇండియా. మరి నాలుగో టీ20లో భారత బ్యాటర్లకు కివీస్ బౌలర్లు ఏమేర కళ్లెం వేయగలరో చూడాలి.

బ్యాటింగ్ పిచ్

విశాఖ పిచ్ ఎప్పుడూ బ్యాటింగ్‌కు అనుకూలమే. బుధవారం భిన్నంగా ఏమీ ఉండకపోవచ్చు. 200 పైచిలుకు స్కోర్లు నమోదయ్యే అవకాశముంది. రాత్రి వేళల్లో మంచు కురిసే అవకాశం ఉండటంతో భారీ లక్ష్యాలు కూడా ఇక్కడ సురక్షితం కాదు. చివరగా 2023లో ఇక్కడ జరిగిన టీ20లో ఆస్ట్రేలియా నిర్దేశించిన 209 పరుగుల లక్ష్యాన్ని భారత్ ఛేదించింది. ఇక్కడి వికెట్ నుంచి స్పిన్నర్లకు సహకారం అందుతుంది. మంచు ప్రభావం దృష్ట్యా టాస్ గెలిచిన జట్టు బౌలింగ్‌ను ఎంచుకునే అవకాశాలున్నాయి.

అతడి మీదే కళ్లు

సిరీస్‌లో భారత బ్యాటింగ్ భీకరంగా సాగుతున్నప్పటికీ.. ఓపెనర్ సంజు శాంసన్ మాత్రం పేలవ ఫామ్‌ను కొనసాగిస్తుండడం జట్టుకు కొంత ఇబ్బందిగా మారింది. టీ20 ప్రపంచకప్‌లోనూ ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడని భావిస్తున్న శాంసన్.. సిరీస్‌లో వరుసగా 10, 6, 0 పరుగులకే వెనుదిరిగాడు. ఏ మ్యాచ్‌లోనూ కనీసం రెండు ఓవర్లు కూడా బ్యాటింగ్ చేయని సంజు.. ఈ మ్యాచ్‌లో అయినా క్రీజులో నిలదొక్కుకుంటాడని జట్టు ఆశిస్తోంది. ఇషాన్ కిషన్ పునరాగమనంలో సత్తా చాటుతున్న నేపథ్యంలో సంజు బ్యాటింగ్‌లో మార్పు రాకపోతే ప్రపంచకప్‌లో ఓపెనింగ్ స్థానాన్ని అతడికి కోల్పోవాల్సి ఉంటుంది. మరో ఓపెనర్ అభిషేక్ శర్మను అడ్డుకోవడం కివీస్ బౌలర్లకు శక్తికి మించిన పనే అవుతోంది. గత మ్యాచ్‌లో అతను తన గురువు యువరాజ్ సింగ్‌ను గుర్తు చేస్తూ కేవలం 14 బంతుల్లోనే అర్ధశతకం బాదేశాడు. ఫామ్ లేమి నుంచి బయటపడి కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వరుసగా రెండు మెరుపు అర్ధ సెంచరీలు బాదడం జట్టుకు ఉత్సాహాన్నిస్తోంది. టాప్ ఆర్డరే చాలా వరకు పని పూర్తి చేస్తుండడంతో మిడిలార్డర్‌కు పెద్దగా పని పడట్లేదు. అయినప్పటికీ హార్దిక్ పాండ్య, శివమ్ దూబె, రింకు సింగ్ సైతం మంచి లయలోనే ఉన్నారు. సిరీస్‌లో అవకాశం వచ్చినపుడు మెరిశారు. బ్యాటింగ్‌లో తుది జట్టును మార్చడం సందేహమే. అయితే ఇప్పటికే సిరీస్ సొంతమైన నేపథ్యంలో శ్రేయస్ అయ్యర్‌ను ఆడించే అవకాశాన్ని పరిశీలించొచ్చు. అతడిని ఆడించాలంటే అభిషేక్‌కు విశ్రాంతినిచ్చి సంజు, ఇషాన్‌లను ఓపెనింగ్‌లో పంపాల్సి ఉంటుంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఇబ్బంది పడ్డ బౌలింగ్ విభాగం.. మూడో టీ20లో అదరగొట్టింది. బుమ్రా పొదుపుగా బౌలింగ్ చేయడమే గాక మూడు వికెట్లు తీసి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. అతణ్ని ఈ మ్యాచ్‌లోనూ ఆడించే అవకాశముంది. హర్షిత్ రాణా అతడితో పేస్ బాధ్యతలు పంచుకుంటాడు. గత మ్యాచ్‌లో అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న రవి బిష్ణోయ్.. కుల్‌దీప్‌తో కలిసి స్పిన్ దాడిని కొనసాగించవచ్చు.


సంజు శాంసన్

4 విశాఖపట్నంలో భారత్ ఆడిన టీ20లు. మూడు విజయాలు సాధించి, ఒక మ్యాచ్‌లో ఓడింది. ఇక్కడ కివీస్‌తో టీ20ల్లో తలపడలేదు.

కివీస్ పుంజుకుంటుందా?

వన్డే సిరీస్ విజయం తర్వాత టీ20 సిరీస్‌ను ఉత్సాహంగా ఆరంభించిన కివీస్‌ను వరుస ఓటములు కిందికి లాగేశాయి. ముఖ్యంగా మూడో టీ20లో 150 పైచిలుకు లక్ష్యాన్ని పది ఓవర్లలోనే భారత్ ఛేదించేయడం ఆ జట్టు ఆత్మవిశ్వాసాన్ని బాగానే దెబ్బ తీసి ఉంటుంది. కానీ ప్రతిభావంతులతో కూడిన కివీస్‌ను తక్కువ అంచనా వేస్తే కష్టమే. టాప్ ఆర్డర్ వైఫల్యం ఆ జట్టును దెబ్బ తీస్తోంది. కాన్వే, సీఫర్ట్, రచిన్ ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేయాలని జట్టు కోరుకుంటోంది. తర్వాత ఫిలిప్స్, మిచెల్, చాప్‌మన్, శాంట్నర్‌లతో మిడిలార్డర్ బలంగానే ఉంది. హెన్రీ నేతృత్వంలోని పేస్ విభాగం భారత బ్యాటర్లకు ఆరంభంలో కళ్లెం వేయగలిగితేనే కివీస్‌కు విజయావకాశాలు ఉంటాయి. ఆ జట్టు స్పిన్నర్లు శాంట్నర్, ఇష్ సోధి పెద్దగా ప్రభావం చూపట్లేదు. స్పిన్‌కు అనుకూలించే విశాఖ పిచ్‌పై వీళ్లిద్దరూ ఏమేర ప్రభావం చూపిస్తారో చూడాలి.


సోఫీ డివైన్

సోఫీ తడాఖా..

● దిల్లీపై గుజరాత్ గెలుపు

వదోదర: డబ్ల్యూపీఎల్‌లో తన ప్లేఆఫ్స్ అవకాశాలను గుజరాత్ జెయింట్స్ మెరుగుపర్చుకుంది. నాలుగో విజయంతో పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది. మంగళవారం ఉత్కంఠభరిత పోరులో గుజరాత్ 3 పరుగుల తేడాతో దిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించింది. బెత్ మూనీ (58; 46 బంతుల్లో 7×4), అనుష్క శర్మ (39; 25 బంతుల్లో 8×4) మెరవడంతో మొదట గుజరాత్ 9 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. శ్రీచరణి (4/31) బంతితో రాణించింది. ఛేదనలో దిల్లీ 8 వికెట్లకు 171 పరుగులే చేయగలిగింది. నిక్కీ ప్రసాద్ (47; 24 బంతుల్లో 9×4) టాప్ స్కోరర్. సోఫీ డివైన్ (4/37), రాజేశ్వరి గైక్వాడ్ (3/20) ఆ జట్టును దెబ్బతీశారు. ఓ దశలో 11వ ఓవర్లో 82/2తో నిలిచిన దిల్లీ.. ఆ తర్వాత గతి తప్పింది. చకచకా వికెట్లు కోల్పోయి 15 ఓవర్లు ముగిసే సరికి 105/6తో నిలిచింది. గుజరాత్ అలవోకగా గెలిచేలా కనిపించింది. కానీ ఆఖర్లో నిక్కీ అనూహ్యంగా చెలరేగడంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. స్నేహ్ రాణా (29; 15 బంతుల్లో 3×4, 2×6) కూడా బ్యాట్ ఝుళిపించడంతో ఆశలు లేని స్థితి నుంచి దిల్లీ పోటీలోకి వచ్చింది. నిక్కీ నాలుగు ఫోర్లు, స్నేహ్ సిక్స్ బాదడంతో ఇన్నింగ్స్ 17వ ఓవర్లో సోఫీ డివైన్ 23 పరుగులు సమర్పించుకుంది. చివరి రెండు ఓవర్లలో దిల్లీకి 29 పరుగులు అవసరం కాగా.. స్నేహ్ వరుసగా 6, 4 4, నిక్కీ ఓ ఫోర్ కొట్టడంతో 19వ ఓవర్లో గార్డ్‌నర్ 20 పరుగులు ఇచ్చింది. నిక్కీ, స్నేహ్‌ల జోరు చూస్తుంటే ఆఖరి ఓవర్లో 9 పరుగులు చేయడం దిల్లీకి కష్టం కాదనిపించింది. కానీ సూపర్‌గా బౌలింగ్ చేసిన సోఫీ డివైన్.. 5 పరుగులే ఇచ్చి స్నేహ్, నిక్కీలను ఔట్ చేసింది.

సంక్షిప్త స్కోర్లు: గుజరాత్ ఇన్నింగ్స్: 174/9 (మూనీ 58, అనుష్క 39, తనూజ 21; శ్రీచరణి 4/31, షినెలి హెన్రీ 2/38, నందని శర్మ 1/26)

దిల్లీ ఇన్నింగ్స్: 171/8 (నిక్కీ ప్రసాద్ 47, స్నేహ్ రాణా 29, వోల్వార్ట్ 24; సోఫీ డివైన్ 4/37, రాజేశ్వరి గైక్వాడ్ 3/20)

ఇంగ్లాండ్‌దే వన్డే సిరీస్


రూట్

కొలంబో: శ్రీలంకతో మూడు వన్డేల సిరీస్‌ను ఇంగ్లాండ్ 2-1తో కైవసం చేసుకుంది. మంగళవారం చివరి వన్డేలో ఇంగ్లిష్ జట్టు 53 పరుగుల తేడాతో లంకను ఓడించింది. మొదట ఇంగ్లాండ్ 3 వికెట్లకు 357 పరుగులు చేసింది. హ్యారీ బ్రూక్ (136 నాటౌట్; 66 బంతుల్లో 11×4, 9×6), జో రూట్ (111 నాటౌట్; 108 బంతుల్లో 9×4, 1×6) అజేయ సెంచరీలు చేశారు. దూకుడుగా ఆడిన బ్రూక్ కేవలం 57 బంతుల్లోనే మూడంకెల స్కోరు అందుకున్నాడు. ఛేదనలో లంక పోరాడినా 46.4 ఓవర్లలో 304 పరుగులకే ఆలౌటైంది. పవన్ రత్నాయకే (121; 115 బంతుల్లో 12×4, 1×6) సెంచరీ వృథా అయింది. డాసన్, జాక్స్, రషీద్, ఓవర్టన్ తలా రెండు వికెట్లు తీసి ఇంగ్లాండ్‌ను గెలిపించారు. ఈ సిరీస్‌లో తొలి వన్డేలో శ్రీలంక.. రెండో వన్డేలో ఇంగ్లాండ్ నెగ్గాయి.

విహాన్ సెంచరీ

● జింబాబ్వేపై భారత్ ఘన విజయం
● అండర్-19 ప్రపంచకప్


విహాన్

బులవాయో: అండర్-19 ప్రపంచకప్ సూపర్ సిక్స్‌ను భారత్ ఘనంగా ఆరంభించింది. మంగళవారం తొలి మ్యాచ్‌లో జింబాబ్వేను 204 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించి.. సెమీస్ బెర్తును దాదాపుగా ఖాయం చేసుకుంది. విహాన్ మల్హోత్రా (109 నాటౌట్; 107 బంతుల్లో 7×4) సెంచరీతో చెలరేగడంతో మొదట భారత్ 8 వికెట్లకు 352 పరుగుల భారీ స్కోరు సాధించింది. వైభవ్ సూర్యవంశీ (52; 30 బంతుల్లో 4×4, 4×6), అభిజ్ఞాన్ కుందు (61; 62 బంతుల్లో 5×4, 1×6) రాణించారు. కెప్టెన్ ఆయుష్ మాత్రే (3/14), ఉద్ధవ్ మోహన్ (3/20), అంబ్రిష్ (2/19) విజృంభించడంతో ఛేదనలో జింబాబ్వే 37.4 ఓవర్లలో 148 పరుగులకే ఆలౌటైంది. చివాలా (62) టాప్ స్కోరర్. సూపర్-6లో భారత్ తన చివరి మ్యాచ్‌లో ఫిబ్రవరి 1న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను ఢీకొననుంది. ప్రస్తుతం 6 పాయింట్లతో గ్రూప్-2లో భారత్ అగ్రస్థానంలో ఉంది. మెరుగైన రన్‌రేట్ (3.337) కలిగిన యువ భారత్ ఆఖరి మ్యాచ్‌లో ఓడినా సెమీస్ చేరే అవకాశముంది. సూపర్-6 చేరిన జట్లపై గ్రూప్ దశలో సాధించిన పాయింట్లు కొనసాగుతాయి. న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌పై గెలిచిన భారత్ ఖాతాలో ముందే 4 పాయింట్లు చేరాయి. గ్రూప్-2లో భారత్, ఇంగ్లాండ్ (6 పాయింట్లు, 1.989 రన్‌రేట్), పాకిస్థాన్ (4, 1.484) సెమీస్ రేసులో ఉన్నాయి.

నిలిచిన విహాన్

భారత్ ఇన్నింగ్స్‌లో విహాన్ మల్హోత్రా ఆటే హైలైట్. ఇన్నింగ్స్‌కు ఇరుసులా నిలిచిన అతడు.. జట్టు భారీ స్కోరు చేయడంలో కీలకపాత్ర పోషించాడు. దూకుడుగా ఆడిన వైభవ్ సూర్యవంశీతో పాటు ఆరోన్ జార్జి (23), ఆయుష్ మాత్రే (21), వేదాంత్ త్రివేది (15) వికెట్లు 130 పరుగులకే పడడంతో భారత్ ఇబ్బందుల్లో చిక్కుకుంది. ఈ స్థితిలో అభిజ్ఞాన్‌తో కలిసి విహాన్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. అభిజ్ఞాన్ వెనుదిరిగినా.. ఖిలాన్ పటేల్ (30), అంబ్రిష్ (21) జతగా స్కోరు 350 దాటించాడు. ఈ క్రమంలో విహాన్.. 49వ ఓవర్లో సెంచరీ మార్కు అందుకున్నాడు. జింబాబ్వే బౌలర్లలో చిముగొరో మూడు, మజాయ్, సింబార్షే రెండేసి వికెట్లు పడగొట్టారు. ఛేదనలో భారత బౌలర్ల ధాటికి జింబాబ్వే 24 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. చివాలా, బ్లిగ్నాట్ (37) నిలవడంతో 26.4 ఓవర్లకు 93/4తో కోలుకుంది. కానీ టీమ్ఇండియా బౌలర్లు మరోసారి విజృంభించడంతో జింబాబ్వే మళ్లీ తడబడింది. 55 పరుగుల తేడాతో 6 వికెట్లు కోల్పోయి ఓటమి చవిచూసింది.

సంక్షిప్త స్కోర్లు: భారత్: 352/8 (విహాన్ మల్హోత్రా 109 నాటౌట్, వైభవ్ 52, అభిజ్ఞాన్ 61, ఖిలాన్ పటేల్ 30, అంబ్రిష్ 21; చిముగొరో 3/49, మజాయ్ 2/86, సింబార్షే 2/51); జింబాబ్వే: 37.4 ఓవర్లలో 148 ఆలౌట్ (చివాలా 62, బ్లిగ్నాట్ 37, చిముగొరో 29; ఆయుష్ 3/14, ఉద్ధవ్ మోహన్ 3/20, అంబ్రిష్ 2/19).

ఆడకపోతే పాక్‌కు కష్టాలే..

దిల్లీ: భారత్ ఆతిథ్యమిచ్చే టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ పాల్గొనడంపై అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. బంగ్లాదేశ్‌కు మద్దతుగా టీ20 ప్రపంచకప్ నుంచి వైదొలగుతామని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) బెదిరిస్తున్న సంగతి తెలిసిందే. ఒకవేళ టోర్నీలో ఆడితే.. ఫిబ్రవరి 15న భారత్‌తో మ్యాచ్‌లో మాత్రం ఆడమని అంటోంది. కానీ టోర్నీని బాయ్‌కాట్ చేయడం కానీ, భారత్‌తో మ్యాచ్‌కు దూరంగా ఉండడం కానీ పాక్‌కు సాధ్యమయ్యేలా కనిపించట్లేదు. అలా చేస్తే పీసీబీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సివుంటుంది. టోర్నీ నుంచి వైదొలగితే పాక్.. ఐసీసీ నుంచి తీవ్ర ఆంక్షలకు గురవుతుంది. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే నష్టపరిహారం కోసం ప్రసారదారు పీసీబీని కోర్టుకు లాగొచ్చు. పీసీబీపై రూ.348 కోట్లకు దావా వేసే అవకాశముంది. టీ20 ప్రపంచకప్‌ను బహిష్కరిస్తే పాకిస్థాన్‌కు కష్టాలు తప్పవు. ద్వైపాక్షిక క్రికెట్ నుంచి ఆ దేశాన్ని ఐసీసీ సస్పెండ్ చేయొచ్చు. పీఎస్‌ఎల్‌లో ఆడేందుకు విదేశీ ఆటగాళ్లకు ఎన్‌ఓసీని నిరాకరించవచ్చు. ఆసియాకప్ నుంచి కూడా పాక్‌ను తప్పించవచ్చు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తోన్న టీ20 ప్రపంచకప్ ఫిబ్రవరి 7న ఆరంభం కానుంది. ఈ టోర్నీలో పాల్గొనడంపై శుక్రవారం లేదా సోమవారం నిర్ణయం తీసుకుంటామని పీసీబీ చెప్పింది.


సబలెంకా ఫటాఫట్

● సెమీస్‌లోకి ప్రవేశం
● అల్కరాస్, జ్వెరెవ్, స్వితోలినా కూడా

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అర్యానా సబలెంకా దూసుకెళ్తోంది. ఈ టాప్‌సీడ్ పెద్దగా కష్టపడకుండానే సెమీఫైనల్లోకి ప్రవేశించింది. మంగళవారం మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో ఈ బెలారస్ స్టార్ 6-3, 6-0తో ఇవా జోవిచ్ (అమెరికా)ను చిత్తు చేసింది. సబలెంకా దూకుడు ముందు జోవిచ్ నిలవలేకపోయింది. కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్‌ఫైనల్‌కు వచ్చిన 18 ఏళ్ల ఈ అమెరికా అమ్మాయి.. తొలి సెట్‌లో ఆరంభం నుంచే తడబడింది. మెరుపు సర్వీసులతో అదరగొట్టిన సబలెంకా 3-0తో ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత జోవిచ్ కాస్త మెరుగ్గా ఆడింది. తొమ్మిదో గేమ్‌లో ఆమెకు మూడు బ్రేక్ పాయింట్లు కూడా దక్కాయి. కానీ సద్వినియోగం చేసుకోలేకపోయింది. దీంతో సబలెంకా సెట్ గెలిచి ఆధిక్యంలో నిలిచింది. రెండో సెట్లో సబలెంకా ఆట ముందు జోవిచ్ పూర్తిగా తేలిపోయింది. వరుసగా ఆరు పాయింట్లు తానే దక్కించుకున్న బెలారస్ స్టార్.. తేలిగ్గా సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. మ్యాచ్‌లో ఏడు ఏస్‌లు కొట్టిన సబలెంకా.. నాలుగుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసింది. 31 విన్నర్లు కూడా కొట్టింది. ఆస్ట్రేలియన్ ఓపెన్లో సెమీఫైనల్ చేరడం సబలెంకాకు ఇది వరుసగా నాలుగోసారి.

గాఫ్ ఇంటిముఖం

అమెరికా తార కొకో గాఫ్ ఇంటిముఖం పట్టింది. క్వార్టర్‌ఫైనల్లో ఈ మూడో సీడ్ ప్లేయర్ 1-6, 2-6తో వరుస సెట్లలో స్వితోలినా (ఉక్రెయిన్) చేతిలో ఓడింది. తొలి సెట్లో తొలి గేమ్‌లోనే సర్వీస్ కోల్పోయిన గాఫ్.. ఆ తర్వాత కోలుకోలేకపోయింది. 1-5తో వెనుకబడి సెట్‌ను చేజార్చుకుంది. రెండో సెట్లోనూ అదే కథ. రెండో గేమ్‌లోనే గాఫ్ సర్వీస్ బ్రేక్ అయింది. 3-0తో ఆధిక్యంలోకి వెళ్లిన స్వితోలినా.. ఆపై సెట్‌తో పాటు మ్యాచ్‌ను చేజిక్కించుకుంది. 5 డబుల్‌ఫాల్ట్స్, 26 అనవసర తప్పిదాలు చేసిన గాఫ్ ఓటమి కొనితెచ్చుకుంది. మ్యాచ్‌ను కోల్పోయాక రాకెట్‌ను విరగ్గొట్టి ఆమె అసహనాన్ని ప్రదర్శించింది.


అల్కరాస్

అల్కరాస్ తొలిసారి..

తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలవాలనే పట్టుదలతో ఉన్న స్పెయిన్ కుర్రాడు కార్లోస్ అల్కరాస్ సెమీఫైనల్ చేరాడు. పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో ఈ టాప్ సీడ్ ప్లేయర్ 7-5, 6-2, 6-1తో డిమెనార్ (ఆస్ట్రేలియా) పోరాటానికి తెరదించాడు. తొలి సెట్లో మాత్రమే అల్కరాస్‌కు డిమెనార్ నుంచి ప్రతిఘటన ఎదురైంది. ఆరంభంలో అల్కరాస్ 2-0తో ఆధిక్యంలో నిలిచినా.. డిమెనార్ పుంజుకున్నాడు. 3-3తో స్కోరు సమం చేశాడు. సెట్ టైబ్రేకర్‌కు మళ్లుతుందేమో అనిపించినా.. పన్నెండో గేమ్‌లో బ్రేక్ సాధించిన అల్కరాస్ సెట్ గెలిచాడు. రెండు, మూడో సెట్లలో అల్కరాస్‌దే ఆధిపత్యం. బలమైన సర్వీసులు, క్రాస్‌కోర్టు విన్నర్లతో విజృంభించిన ఈ స్పెయిన్ స్టార్.. ఈ రెండు సెట్లలో అయిదుసార్లు డిమెనార్ సర్వీస్ బ్రేక్ చేసి విజయాన్ని అందుకున్నాడు. ఈ క్రమంలో అతడు 5 ఏస్‌లు, 26 విన్నర్లు కొట్టాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్లో సెమీఫైనల్ చేరడం అల్కరాస్‌కు ఇదే తొలిసారి. 2024, 2025లో అతడు క్వార్టర్స్‌లోనే ఇంటిముఖం పట్టాడు. మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) కూడా తుది నాలుగు జాబితాలో చోటు దక్కించుకున్నాడు. అతడు 6-3, 6-7 (5-7), 6-1, 7-6 (7-3)తో టియాన్ (అమెరికా)ను కష్టంగా ఓడించాడు. తొలి, నాలుగో సెట్లు టైబ్రేకర్‌కు మళ్లినా.. జ్వెరెవ్ అనుభవాన్ని రంగరించి టియాన్‌ను అడ్డుకున్నాడు. మ్యాచ్‌లో జ్వెరెవ్ 56 విన్నర్లతో పాటు 24 ఏస్‌లు కొట్టాడు.


సబలెంకా

అతికకు అదిరే ఆరంభం

లా కోన్‌కా (ఇటలీ): డబ్ల్యూఎస్‌కే మాస్టర్ కార్టింగ్ సిరీస్‌లో భారత యువ రేసర్ అతిక మీర్‌కు అదిరే ఆరంభం దక్కింది. తొలిసారి జూనియర్ విభాగం (12-14)లో బరిలో దిగిన 11 ఏళ్ల అతిక.. డబ్ల్యూఎస్‌కే మాస్టర్ కార్టింగ్ సిరీస్ క్వాలిఫయింగ్‌లో 49.76 సెకన్లలో రేసు పూర్తి చేసి రెండో వేగవంతమైన డ్రైవర్‌గా నిలిచింది. అందరూ పురుష డ్రైవర్లే పోటీపడిన ఈ రేసులో.. అతిక సెకనులో పదో వంతు తేడాతో పోల్ పొజిషన్‌ను చేజార్చుకుంది. రేసింగ్‌లో అదరగొడుతున్న అతికకు ఫార్ములావన్ అకాడమీ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. డబ్ల్యూఎస్‌కే మాస్టర్ కార్టింగ్ సిరీస్‌ను కార్టింగ్‌లో ఫార్ములావన్‌గా పిలుస్తారు.

షుమాకర్ కోలుకుంటున్నాడు..?

దిల్లీ: పన్నెండేళ్ల కింద ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఫార్ములా 1 దిగ్గజం మైకేల్ షుమాకర్ మంచానికే పరిమితమైన సంగతి తెలిసిందే. ఇన్నేళ్లలో అతడి ఆరోగ్య స్థితి గురించి అధికారికంగా ఎలాంటి సమాచారం రాలేదు. అతడి కుటుంబం గోప్యత పాటించింది. షుమాకర్ స్థితిలో ఎలాంటి మార్పూ లేదని అప్పుడప్పుడు మీడియాలో మాత్రం వార్తలొచ్చాయి. కానీ అతడు పురోగతి సాధిస్తున్న సూచనలు కనిపిస్తున్నాయని తాజాగా ఫాక్స్ స్పోర్ట్స్ వెల్లడించింది. ఇప్పుడు అతడు మంచానికే పరిమితమై లేడని, చక్రాల కుర్చీలో కూర్చోగలుగుతున్నాడని తెలిపింది. షుమాకర్ భార్య కోరినా అతణ్ని జాగ్రత్తగా చూసుకుంటోంది. స్విట్జర్లాండ్‌లో ప్రత్యేక వైద్య బృందం 57 ఏళ్ల షుమాకర్‌కు చికిత్స అందిస్తోంది. ఏడుసార్లు ప్రపంచ ఛాంపియన్ షుమాకర్ 2013లో ఫ్రెంచ్ ఆల్ప్స్‌లో స్కీయింగ్ చేస్తూ ప్రమాదానికి గురయ్యాడు. అతడి తలకు తీవ్ర గాయమైంది.



షుమాకర్

స్కాట్లాండ్ జట్టులో అఫ్గాన్ ప్లేయర్

ఎడిన్‌బర్గ్: బంగ్లాదేశ్ వైదొలగడంతో ఆఖరి నిమిషంలో టీ20 ప్రపంచకప్‌లో ఆడే అవకాశాన్ని సంపాదించిన స్కాట్లాండ్.. ఈ టోర్నీలో ఆడే 15 మంది సభ్యుల జట్టును మంగళవారం ప్రకటించింది. రిచీ బారింగ్టన్ సారథ్యంలోని స్కాట్లాండ్ జట్టులో అఫ్గానిస్థాన్‌లో పుట్టిన పేసర్ జైనుల్లా ఇహ్‌సాన్‌కు చోటు దక్కింది. స్కాట్లాండ్ సీనియర్ జట్టుకు ఆడడం అతడికిదే తొలిసారి. పాకిస్థాన్ సంతతికి చెందిన సఫియాన్ షరీఫ్ కూడా ఈ జట్టులో ఉన్నాడు. వెస్టిండీస్, ఇటలీ, ఇంగ్లాండ్, నేపాల్‌తో గ్రూప్-సిలో స్కాట్లాండ్ పోటీపడనుంది. ఫిబ్రవరి 7న ఆరంభమయ్యే టీ20 ప్రపంచకప్‌లో టోర్నీ తొలి రోజే ఆ జట్టు.. వెస్టిండీస్‌ను ఢీకొంటుంది.

స్కాట్లాండ్ జట్టు: రిచీ బారింగ్టన్ (కెప్టెన్), టామ్ బ్రూస్, మాథ్యూ క్రాస్, బ్రాడ్లీ క్యూరీ, ఒలివర్ డేవిడ్‌సన్, క్రిస్ గ్రీవ్స్, జైనుల్లా ఇహ్‌సాన్, మైకేల్ జోన్స్, మైకేల్ లీసక్, ఫిన్లే మెక్‌క్రీత్, బ్రండన్ మెక్‌ముల్లన్, జార్జ్ మున్సీ, సఫియాన్ షరీఫ్, మార్క్ వాట్, బ్రాడ్లీ వేల్.

మెయిన్‌డ్రాలో అష్మిత

థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో భారత యువ షట్లర్ అష్మిత చాలిహా మెయిన్‌డ్రాకు అర్హత సాధించింది. మంగళవారం క్వాలిఫికేషన్ తొలి మ్యాచ్‌లో హంగ్ యీ టింగ్ (చైనీస్ తైపీ)పై 21-15, 12-21, 21-12తో గెలిచిన అష్మిత.. రెండో మ్యాచ్‌లో కిమ్ జూ యాన్ (కొరియా)ను 21-11, 10-21, 21-16తో ఓడించి ముందంజ వేసింది. మెయిన్‌డ్రా తొలి మ్యాచ్‌లో మరో భారత షట్లర్ దేవిక సిహాగ్‌తో అష్మిత తలపడనుంది. మరోవైపు శ్రేయ లెలె పోరాటం ముగిసింది. ఆమె 12-21, 21-12, 15-21తో కడెక్ అమార్త్యా (ఇండోనేషియా) చేతిలో ఓడింది. పురుషుల డబుల్స్‌లో కృష్ణమూర్తి రాయ్-ప్రతీక్ జంట 20-22, 20-22తో అజ్రియాన్-టాన్ (మలేసియా) ద్వయం చేతిలో ఓడింది.

రిటైర్మెంట్ అంత కష్టం కాదు


కేఎల్ రాహుల్

దిల్లీ: రిటైర్మెంట్ ఆలోచన తనకు రాకపోలేదని, కానీ దానికి ఇంకా కొంత సమయం ఉందని టీమ్ఇండియా బ్యాటర్ కేఎల్ రాహుల్ అన్నాడు. సమయం వచ్చినప్పుడు రిటైరవుతానని, కెరీర్‌ను సాగదీయనని చెప్పాడు. "రిటైర్మెంట్ గురించి ఆలోచించా. అది అంత కష్టమైందని అనుకోవట్లేదు. మన పట్ల మనం నిజాయితీగా ఉంటే సమయం వచ్చినప్పుడు రిటైర్ కావాలి. సాగదీయడంలో అర్థం లేదు. కానీ నా రిటైర్మెంట్‌కు ఇంకా సమయం ఉంది'' అని రాహుల్ అన్నాడు. 33 ఏళ్ల రాహుల్ 67 టెస్టుల్లో 35.8 సగటుతో 4053 పరుగులు చేశాడు. 94 వన్డేల్లో 50.9 సగటుతో 3360, 72 టీ20ల్లో 37.75 సగటుతో 2265 పరుగులు చేశాడు. తాను మరీ ముఖ్యుడిని అని అనుకోనని రాహుల్ చెప్పాడు. "సమయం వచ్చినప్పుడు రిటైరవుతా. నేను మరీ అంత ముఖ్యుడిని కాదని నాకు నేను చెప్పుకొంటా. దేశంలో క్రికెట్ కొనసాగుతుంది. ప్రపంచంలో క్రికెట్ కొనసాగుతుంది. జీవితంలో ముఖ్యమైనవి ఇంకా ఎన్నో ఉన్నాయి. మొదటి నుంచి నా ఆలోచనలు ఇలాగే ఉన్నాయి. కానీ మా పాప పుట్టాక నేను జీవితాన్ని చూసే తీరు పూర్తిగా మారిపోయింది'' అని అన్నాడు.

(c) eenadu

కవలల గ్రామం కొడిన్హిలో
పిల్లలకు తల్లిపాల కొరత

ప్రపంచంలోనే అత్యధిక కవలలు జన్మించే గ్రామంగా గుర్తింపు పొందిన కేరళలోని మలప్పురం జిల్లా కొడిన్హిలో ఇప్పుడు ఓ కొత్త సమస్య తలెత్తింది. 'ట్విన్స్ విలేజ్'గా పేరున్న ఈ గ్రామంలోని తల్లీపిల్లల ఆరోగ్యంపై భోపాల్ ఎయిమ్స్, భువనేశ్వర్‌కు చెందిన వైద్యుల బృందం సంయుక్త పరిశోధన నిర్వహించాయి. నెలలు నిండకముందే ప్రసవం, తక్కువ బరువుతో జననం, ఇన్ఫెక్షన్ల ప్రమాదం కొడిన్హిలో ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో మొదటి ఆరు నెలలు తల్లిపాలు ఇవ్వడం పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అత్యంత కీలకం అన్నారు. ఒకేసారి ఇద్దరు పిల్లలను చూసుకోవలసి రావడం తల్లులపై శారీరక, మానసిక ఒత్తిడిని పెంచుతోందని చెప్పారు. ఫలితంగా 4 శాతం తల్లులు మాత్రమే పూర్తిగా ఆర్నెల్లపాటు పిల్లలకు తమ పాలు ఇస్తున్నట్లు తెలిపారు. చాలామంది ఆర్నెల్ల కంటే ముందే పిల్లలకు పాలకు బదులుగా ఇతర ఆహారం ఇవ్వడం ప్రారంభిస్తున్నారని వైద్యులు వెల్లడించారు. 2 వేల కుటుంబాలున్న కొడిన్హిలో ఇప్పటివరకు 550 మందికి పైగా కవలలు జన్మించారు. ప్రస్తుతం 280 మంది కవలలు ఈ గ్రామంలో ఉన్నట్లు భోపాల్ ఎయిమ్స్ డైరెక్టరు డాక్టర్ మాధవానంద్ కర్ తెలిపారు. అత్యధికంగా కవలలు జన్మిస్తున్న కొడిన్హి ప్రపంచ పరిశోధకులకు ఒక మిస్టరీగా ఉందని భోపాల్ ఎయిమ్స్ ఓ ప్రకటనలో పేర్కొంది.



మధ్యప్రదేశ్‌లో దారుణం..
పేపర్లలో గణతంత్ర భోజనం

మైహర్: మధ్యప్రదేశ్‌లోని మైహర్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గణతంత్ర దినోత్సవ ప్రత్యేక భోజనాన్ని కంచాలకు బదులుగా పేపర్లలో వడ్డించారు. భటిగ్వాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. వీడియోలో విద్యార్థులు నేలపై కూర్చుని పాత పుస్తకాల నుంచి తీసిన పేపర్లలో తమకు వడ్డించిన హల్వా-పూరీని తింటున్నారు. దీనిపై కఠిన చర్యలకు ఆదేశాలు జారీ చేసినట్లు సత్నా, మైహర్ జిల్లాల ప్రజా సంబంధాల అధికారి రాజేశ్ సింగ్ తెలిపారు.



నాలుగు లేన్లు రెండయ్యాయి
ముంబయిలో విచిత్ర ఫ్లైఓవర్

ముంబయి: మహారాష్ట్రలో ముంబయిలోని మీరా - భయందర్ జంట నగరాల మార్గంలో కొత్తగా నిర్మించిన ఓ ఫ్లైఓవరు చర్చనీయాంశంగా మారింది. నాలుగు వరుసలుగా నిర్మించిన ఈ పై వంతెన మధ్యలో ఒక్కసారిగా రెండు వరుసలకు కుదించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నిర్మాణం వీడియోను 'ఎక్స్' వేదికగా పోస్టు చేసిన కాంగ్రెస్ పార్టీ 'మహారాష్ట్రలో ఇంజినీరింగ్ అద్భుతం' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. "ఇలాంటి భాజపా పాలిత రాష్ట్రాల్లో ఇటువంటి ప్రమాదకర నిర్మాణాలు సర్వసాధారణమే" అని విమర్శించింది. ఇటీవల మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో 90 డిగ్రీల మలుపుతో నిర్మించిన ఓ రైల్వే వంతెన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ముంబయి మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంఎంఆర్డీఏ) అధికారులు మాత్రం ఈ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని సమర్థించుకొంటున్నారు. స్థల పరిమితులు, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని అలా నిర్మించామని, డిజైనుపరంగా ఎటువంటి లోపాలూ లేవని అంటున్నారు.





మీ ఆరోగ్య స్థితి మీకు నచ్చకపోతే..

మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంటుంది. మీరు రోజూ తీసుకునే ఆహారం మిమ్మల్ని ఆరోగ్య వైపో, అనారోగ్యం వైపో నడిపిస్తూ ఉంటుంది. మీ ప్రస్తుత ఆరోగ్య స్థితి మీకు నచ్చకపోతే.. వెంటనే ఆహారపు అలవాట్లను మార్చుకోండి. క్రమంతప్పకుండా పోషకాహారం తీసుకోండి.
– ఎలీ జరోగ్, వైద్యుడు

జీ రామ్ జీ.. సర్‌పై మళ్లీ చర్చించలేం

- విపక్షాలకు తేల్చిచెప్పిన ప్రభుత్వం
- నేటి నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు



అఖిలపక్ష భేటీలో కేంద్రమంత్రులు కిరణ్ రిజిజు, రాజ్‌నాథ్‌సింగ్, జేపీ నడ్డా

దిల్లీ: గ్రామీణ ఉపాధి హామీ పథకం 'వీబీ జీ రామ్ జీ', ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)లపై బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలన్న విపక్షాల డిమాండును కేంద్ర సర్కారు తోసిపుచ్చింది. బుధవారం పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ భేటీకి అధ్యక్షత వహించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో తీసుకువచ్చిన కొత్త చట్టం, సర్, అమెరికా సుంకాల ప్రభావం, విదేశాంగ విధానం, వాయు కాలుష్యం, పడిపోతున్న రూపాయి విలువ, 16 ఏళ్లలోపు పిల్లలకు సామాజిక మాధ్యమాల నిషేధం వంటి పలు అంశాలను చర్చకు చేపట్టాలని విపక్ష నేతలు డిమాండ్ చేశారు. సమావేశాల్లో చర్చకు వచ్చే అంశాల వివరాలనైనా ప్రభుత్వం తమకు పంపించాలని రమేశ్ (కాంగ్రెస్), జాన్ బ్రిట్టాస్ (సీపీఎం) తదితరులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ■ వీబీ జీ రామ్ జీ, సర్‌పై చర్చకు ప్రభుత్వం తిరస్కరించడం వాటితోపాటు పలు అంశాలను ప్రస్తావించి జరుపనున్నట్లు కాంగ్రెస్ నిర్ణయించింది. పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ నివాసంలో జరిగిన పార్టీ పార్లమెంటరీ వ్యూహ బృందం సమావేశంలో ఉభయసభల విపక్ష నేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. ఉమ్మడి వ్యూహంపై చర్చించేందుకు బుధవారం ఉదయం ఖర్గే ఛాంబర్‌లో విపక్షాల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. వ్యూహాలపై భాజపా కూడా సమావేశమైంది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

సమావేశ ముఖ్య తేదీలు

ఎప్పటి నుంచి ఎప్పటివరకు?:	ఆర్థిక సర్వే:
బుధవారం నుంచి ఫిబ్రవరి 13 వరకు, తిరిగి మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు	జనవరి 29 (గురువారం)
	బడ్జెట్ సమర్పణ: ఫిబ్రవరి 1 (ఆదివారం)

బ్యాంకు ఉద్యోగుల సమ్మెతో సేవలపై ప్రభావం

దిల్లీ: బ్యాంకు ఉద్యోగుల ఐక్యవేదిక (యూఎఫ్‌బీయూ) పిలుపుమేరకు దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు మంగళవారం సమ్మె పాటించడంతో అనేక ప్రాంతాల్లో చెక్కుల క్లియరెన్స్, నగదు జమ/ ఉపసంహరణ వంటి సేవలకు అంతరాయం కలిగింది. మధ్యప్రదేశ్, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో అనేక ఏటీఎంలలో నగదు ఖాళీ అయింది. వారంలో ఐదురోజుల పనిదినాలు ఉండేలా చేయాలనే డిమాండుతో దాదాపు 8 లక్షల మంది ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. రూ.4 లక్షల కోట్ల విలువైన చెక్కుల క్లియరెన్స్ నిలిచిపోయిందని అంచనా. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఖజానా కార్యకలాపాలూ స్తంభించిపోయాయని 'అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం' ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటాచలం వెల్లడించారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజువారీ పనివేళల్ని 40 నిమిషాలు పెంచి, అన్ని శనివారాలు సెలవులుగా పాటించేందుకు 2023 డిసెంబరులోనే అంగీకారం కుదిరినా దానికి ప్రభుత్వం ఇంకా ఆమోదం తెలపలేదని చెప్పారు. ప్రైవేటు బ్యాంకులపై సమ్మె ప్రభావం లేదు.



ముంబయిలో ఆందోళన చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

అధికారుల అక్రమాలపై
ఫిర్యాదుకు అఫిడవిట్ జతచేయాలి
సుప్రీంకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: ప్రభుత్వాధికారులు తమ విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొంటూ దాఖలయ్యే దరఖాస్తులకు తప్పనిసరిగా అఫిడవిట్ జతచేయాలని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టంచేసింది. న్యాయ అధికారులకు వ్యతిరేకంగా దాఖలయ్యే ఫిర్యాదులకు తప్పనిసరిగా అఫిడవిట్ జతచేయాలంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జారీ చేసిన ఆదేశాలను ప్రస్తావిస్తూ జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. జడ్జీలపై వచ్చే ఫిర్యాదులకు అఫిడవిట్ జతచేయాల్సి వచ్చినప్పుడు ఇతర ప్రభుత్వాధికారులకూ అదే నియమం వర్తిస్తుందని ధర్మాసనం ఓ కేసు విచారణ సందర్భంగా పేర్కొంది.

యాసిడ్ దాడి దోషుల ఆస్తుల స్వాధీనం?

దిల్లీ: యాసిడ్ దాడులకు పాల్పడే నేరగాళ్లకు తీవ్రమైన కఠిన శిక్షలు విధించేలా చట్టాన్ని సవరించాలని కేంద్ర ప్రభుత్వానికి మంగళవారం సుప్రీంకోర్టు సూచించింది. దోషుల ఆస్తులను ఎందుకు స్వాధీనం చేసుకోకూడదనీ ప్రశ్నించింది. వరకట్న హత్యల కేసులలో మాదిరిగా నిర్దోషిగా నిరూపించుకునే బాధ్యతనూ నిందితులపైనే మోపాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఆర్.మహాదేవన్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం అభిప్రాయపడింది. హరియాణాకు చెందిన యాసిడ్ దాడి బాధితురాలు షహీన్ మాలిక్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ విషయాలను పేర్కొంది. గత 16 ఏళ్లుగా న్యాయం కోసం పోరాడుతున్న విషయాన్ని షహీన్ మాలిక్ తెలుపగా ధర్మాసనం సీరియస్‌గా స్పందించింది. ఇప్పటి వరకు జరిగిన యాసిడ్ దాడులు, వాటిపై కేసులు, బాధితుల వివరాలను తనకు నాలుగు వారాల్లో సమర్పించాలని, అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది.

యూజీసీ 'సమానత్వ కమిటీ'లపై తీవ్ర వివాదం

- కులవివక్ష నిర్వచనంపై జనరల్ విద్యార్థుల నిరసనలు



దిల్లీలోని యూజీసీ ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న నిరసనకారులు

దిల్లీ: ఉన్నత విద్యా సంస్థల్లో కులవివక్షను రూపుమాపి సమానత్వ భావనను పెంపొందించే లక్ష్యంతో ఇటీవల నోటిఫై చేసిన విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) నిబంధనలు-2026... వివాదంలో చిక్కుకున్నాయి. ఈ నిబంధనలను వ్యతిరేకిస్తూ పలు రాష్ట్రాల్లో నిరసనలు జరుగుతున్నాయి. కాగా, సమానత్వ కమిటీల ఏర్పాటు ఆదేశాలను వామపక్ష విద్యార్థి సంఘాలు సమర్థించాయి.

ప్రతి ఉన్నత విద్యా సంస్థలోనూ 'సమానత్వ(ఈక్విటీ) కమిటీ'ల ఏర్పాటును యూజీసీ ఇటీవల తప్పనిసరి చేసింది. ఆయా కమిటీల్లో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలని స్పష్టం చేసింది. రోహిత్ వేముల కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు యూజీసీ(ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వ ప్రోత్సాహం) నిబంధనలు-2012 స్థానంలో కొత్త నిబంధనలను ఈ నెల 13 నుంచి అమలులోకి తెచ్చింది. అయితే, కొత్త నిబంధనలలోని కులవివక్ష నిర్వచనాన్ని ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, అధ్యాపక సిబ్బందికే పరిమితం చేయడంపై జనరల్, ఇతర కేటగిరీల వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరసనలకు దిగారు. దిల్లీలోని యూజీసీ ప్రధాన కార్యాలయం వద్ద కూడా మంగళవారం విద్యార్థులు ధర్నా చేపట్టారు. మరోవైపు, రిజర్వుడు కేటగిరీల కిందకు రాని విద్యార్థులు, బోధనా సిబ్బందికి రక్షణ కల్పించే విషయాన్ని కొత్త నిబంధనల్లోని 3(సి) విస్మరించిందని పేర్కొంటూ వినీత్ జిందాల్ అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కొత్త నిబంధనల వల్ల ఎవరికీ నష్టం వాటిల్లదని, ఎవరూ వేధింపులకు గురికారని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ తెలిపారు.

వినాశనానికి మరింత దగ్గరైన ప్రపంచం!

- 'అర్ధరాత్రి'కి ఇంకా చేరువైన డూమ్స్‌డే గడియారం



వాషింగ్టన్: ప్రపంచం మునుపెన్నడూ లేనంతగా విధ్వంసానికి చేరువైందని 'బులెటిన్ ఆఫ్ ద అటామిక్ సైంటిస్ట్స్' అనే స్వచ్ఛంద సంస్థ పేర్కొంది. అమెరికా, రష్యా, చైనా, ఇతర దేశాలు దుందుడుకుగా వ్యవహరించడం, శత్రుభావాలు, జాతీయవాదం పెరగడం వంటివి ఇందుకు కారణమని వివరించింది. దీంతో 'డూమ్స్‌డే గడియారం'లో అర్ధరాత్రికి 85 సెకన్ల దూరంలోనే ఉంది. వినాశనానికి మానవాళి ఎంత దూరంలో ఉందన్నది బులెటిన్ ఆఫ్ ద అటామిక్ సైంటిస్ట్స్ విశ్లేషిస్తుంది. ఒక ఊహాజనిత గడియారంపై అర్ధరాత్రి 12 గంటల సమయాన్ని వినాశనానికి సూచికగా అభివర్ణిస్తుంది. దీన్ని డూమ్స్‌డే క్లాక్‌గా పిలుస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఈ సమయాన్ని ముందుకు, వెనక్కి జరుపుతుంటుంది. గత ఏడాది గడియారాన్ని అర్ధరాత్రికి 89 సెకన్లకు చేరువ చేసింది. అణ్వస్త్ర దేశాలతో ప్రమేయమున్న ఘర్షణలు పెరిగే ప్రమాదం ఉందని సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ప్రస్తావించింది. భారత్, పాకిస్థాన్ మధ్య గత ఏడాది మే నెలలో జరిగిన ఘర్షణలనూ ఉదహరించింది. అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల తర్వాత ఇరాన్ అణ్వస్త్రాన్ని సమకూర్చుకోవచ్చన్న ఆందోళన పెరిగిందని తెలిపింది. మొత్తంమీద అణుయుద్ధం ముప్పు, వాతావరణ మార్పులు, బయోటెక్నాలజీని దుర్వినియోగం చేసే అవకాశం, సరైన నియంత్రణలు లేకుండా కృత్రిమ మేధ(ఏఐ) వాడకం వంటివి పెరిగాయని వివరించింది. ఈ నేపథ్యంలో డూమ్స్‌డే గడియారంలోని సమయాన్ని అర్ధరాత్రికి మరో 4 సెకన్ల మేర ముందుకు జరిపినట్లు వివరించింది.

ఫ్రాన్స్‌లో 15 ఏళ్లలోపు పిల్లలకు
సోషల్ మీడియా నిషేధం!

- సెనెట్‌లో చర్చ అనంతరం దీనిపై నిర్ణయం: మెక్రాన్



పారిస్: పిల్లలపై సామాజిక మాధ్యమాల ప్రభావాన్ని అరికట్టేందుకు ఫ్రాన్స్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 15 ఏళ్లలోపు పిల్లలు సామాజిక మాధ్యమాలు వినియోగించకుండా ఓ చట్టం తీసుకురానుంది. ఈ విషయాన్ని ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ప్రకటించారు. 15 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా మాధ్యమాలను ఉపయోగించడాన్ని నిషేధించే బిల్లుకు ఫ్రాన్స్ దిగువ సభలోని శాసనసభ్యులు మద్దతిచ్చారన్నారు. సెనెట్‌లో దీనిపై చర్చ జరిపి, బిల్లుపై నిర్ణయం తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. పిల్లలు గంటల కొద్దీ సమయాన్ని స్క్రీన్‌కు కేటాయించడం వల్ల వారిలో తలెత్తుతున్న ఆరోగ్య, మానసిక సమస్యలను నివారించడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు మెక్రాన్ వెల్లడించారు. ఫిబ్రవరి చివరికి సెనెట్ ఈ బిల్లును ఆమోదించే అవకాశం ఉందని ఫ్రాన్స్ అధికారులు పేర్కొన్నారు. సోషల్ మీడియాపై నిబంధనలు సెప్టెంబరు 1 నుంచి అమల్లోకి వస్తాయన్నారు. 15 ఏళ్లలోపు పిల్లల ఖాతాలను తొలగించడానికి సామాజిక మాధ్యమాల సంస్థలకు డిసెంబరు 31 వరకు సమయం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ బిల్లులో పాఠశాలల్లో పిల్లల మొబైల్ ఫోన్ వాడకంపైనా నిషేధం ఉంటుందన్నారు. ఈ చట్టం అమల్లోకి వస్తే టీనేజర్ల సోషల్ మీడియా వాడకంపై దేశవ్యాప్తంగా నిషేధాన్ని ప్రవేశపెట్టిన రెండో దేశంగా ఫ్రాన్స్ నిలుస్తుంది. ఇప్పటికే ఆస్ట్రేలియా ప్రభుత్వం దేశంలోని పదహారేళ్ల కన్నా తక్కువ వయసున్నవారు సోషల్ మీడియా వాడకుండా నిషేధించింది.

కదులుతున్న కారులోంచి జారిపడిన చిన్నారి, తల్లిపై కేసు

ఇంటర్నెట్ డెస్క్: కాలిఫోర్నియాలోని పులెటన్‌లో 19 నెలల చిన్నారి కదులుతున్న కారులోంచి జారి రోడ్డుపై పడ్డాడు. వెనుక వస్తున్న కారు డ్రైవరు అప్రమత్తంగా వ్యవహరించి బ్రేకు వేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ నెల 20న ఈ ప్రమాదం జరిగిందని..



పిల్లాడికి ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. బాబు తల్లి జాక్వెలిన్‌పై కేసు నమోదు చేశామని, దర్యాప్తు కొనసాగుతుందని వెల్లడించారు.

భారత్, ఈయూ భాగస్వామ్యానికి అవే పునాదులు
ఈయూ ప్రతినిధులతో రాజ్‌నాథ్ భేటీ

ఈటీవీ భారత్: భారత్, ఐరోపా కూటమి (ఈయూ) మధ్య సాంకేతిక, రక్షణ భాగస్వామ్య ఒప్పందం రెండు పక్షాల సంబంధాల్లో కీలక మైలురాయిగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న రాజకీయ, భద్రతా పరిస్థితుల నడుమ భాగస్వామ్యం భారత్, ఈయూ దేశాలను మరింత దగ్గర చేస్తుందని తెలిపారు. దిల్లీలో ఈయూ ప్రతినిధి బృందంతో మంగళవారం సమావేశమైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈయూ విదేశాంగ, భద్రతా విధానాల ప్రతినిధి కాజా కల్లాస్ నేతృత్వంలో వచ్చిన బృందాన్ని రాజ్‌నాథ్ సింగ్ స్వాగతించారు. ఈ భేటీకి ప్రత్యేక ప్రాధాన్యం ఉందని చెప్పారు. భారత గణతంత్ర వేడుకల నేపథ్యంలో జరగడం విశేషమని తెలిపారు. భారత్, ఈయూ దేశాల మధ్య ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, న్యాయపాలన వంటి విలువలే భాగస్వామ్యానికి పునాదులని తెలిపారు. ఆ విలువలను ప్రపంచ భద్రత, సుస్థిర వృద్ధి, సమగ్ర అభివృద్ధిగా మలచాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.

కమిటీ నివేదిక రాగానే జస్టిస్ వర్మపై చర్యలు: రిజిజు

దిల్లీ: అధికారిక నివాసంలో భారీ నగదు లభించిన వివాదంలో చిక్కుకున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వర్మ అభిశంసన ప్రక్రియపై దర్యాప్తు కొనసాగుతోందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మంగళవారం తెలిపారు. ఈ ఘటనపై నివేదిక ఇవ్వాల్సిందిగా కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా త్రిసభ్య కమిటీని నియమించిన విషయం తెలిసిందే. ఈ కమిటీ నివేదిక కోసం ప్రభుత్వం వేచిచూస్తోందని.. అది రాగానే ఆయనపై చర్యలు తీసుకుంటామని రిజిజు స్పష్టంచేశారు.

మాదక ద్రవ్యాల పడవలపై
అమెరికా దాడుల్లో మృతులు 126

వాషింగ్టన్: మాదక ద్రవ్యాలు అక్రమంగా రవాణా చేస్తున్న పడవలపై ట్రంప్ యంత్రాంగం చేపట్టిన వరుస దాడుల్లో ఇప్పటి వరకూ 126 మంది మరణించారని అమెరికా సైన్యం నిర్ధారించింది. కరీబియన్ సముద్రం, తూర్పు పసిఫిక్ సముద్ర ప్రాంతాల్లో గత సెప్టెంబరు నుంచి నిర్వహించిన 36 దాడుల్లో 116 మంది మాదక ద్రవ్యాల అక్రమ రవాణాదారులు మృతి చెందినట్టు అమెరికా సదరన్ కమాండ్ ఒక ప్రకటనలో తెలిపింది. మరో పదిమంది ఈ దాడుల నేపథ్యంలో కనబడకుండా పోయారని ఆ కారణంగా వారు మరణించి ఉంటారని భావిస్తున్నామని పేర్కొంది. గత డిసెంబరు 30న మూడు పడవలపై అమెరికన్ బలగాలు జరిపిన దాడుల సందర్భంగా ఎనిమిది మంది పడవల్లోంచి దూకేశారని, ఆ తర్వాత కనబడకుండా పోయిన కారణంగా వారు మరణించి ఉంటారని భావిస్తున్నామని వివరించింది. దాడుల్లో అక్టోబరు 27న ఒకరు, గత శుక్రవారం మరొకరు గల్లంతయ్యారని, వారు కూడా మరణించారని భావిస్తున్నట్టు వెల్లడించింది. ఈ దాడులు చట్టబద్ధమైనవి కావని, నేరాలను నిలువరించడానికి ఇవి సహాయపడబోవని సదరన్ కమాండ్ పేర్కొంది. వెనెజువెలా అధ్యక్షుడు నికొలాస్ మదురోను నిర్బంధించే క్రమంలో అమెరికా మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై చర్యల పేరుతో లాటిన్ అమెరికా ప్రాంతంలో భారీగా బలగాలను మోహరించిన విషయం తెలిసిందే.

మంచు, వర్షపాతాలతో ఉక్కిరిబిక్కిరి

- దిల్లీలో గజగజ..
- కశ్మీర్‌లో విమానాల రద్దు

దిల్లీ, శ్రీనగర్: భారీగా కురుస్తున్న మంచు కశ్మీర్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే, వర్షపాతం దిల్లీలో పరిస్థితిని మరింత ఇబ్బందికరంగా మార్చింది. కశ్మీర్ అంతటా హిమపాతం విపరీతంగా ఉండటంతో జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిని మూసివేయాల్సి వచ్చింది. శ్రీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే 58 విమాన సర్వీసులు రద్దయ్యాయి. దీంతో వందల మంది పర్యాటకులు కశ్మీర్‌లోనే చిక్కుకుపోయారు. సోమవారం రాత్రి నుంచి మొదలైన మంచు తీవ్రతకు రన్‌వే ప్రమాదకరంగా మారడంతో అన్ని విమానాలను రద్దుచేశారు. ప్రయాణ తేదీ మార్చుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. అనుకోకుండా మరోరోజు కశ్మీర్‌లో నిలిచిపోవాల్సి రావడంతో కొందరు ఇబ్బంది పడుతుండగా మరికొందరు పర్యాటకులు మాత్రం ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. సోన్‌మార్గ్, గుల్మార్గ్, పహల్గాం వంటివన్నీ హిమమయం అయిపోయాయి. రైలు సేవలు ప్రభావితమయ్యాయి. అనేక రోడ్లు మూసుకుపోయాయి. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ శోపియాన్ జిల్లా ఆసుపత్రిలో ఒకేరోజు 10 మంది గర్భిణులకు శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు.

ఇంధన సాధికారత సాధించిన భారత్

- 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు అవకాశం
- ప్రధాని మోదీ వెల్లడి



బేతుల్ (గోవా): విద్యుత్ రంగంలో తాము చేపట్టిన సంస్కరణల కారణంగా దేశం ఇంధన భద్రత దశ నుంచి ఇంధన సాధికారత దశకు చేరుకుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత ఇంధన రంగంలో 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు అవకాశం కలిగిందని తెలిపారు. మంగళవారం గోవాలో ప్రారంభమైన భారత ఇంధన రంగ వారోత్సవాలు- 2026 కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. ప్రస్తుత దశాబ్దాంతానికి ఈ రంగంలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. చమురు, సహజవాయు నిక్షేపాల అన్వేషణ, ఉత్పత్తి కోసం 10 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని ఎంచుకున్నామని వెల్లడించారు. ప్రపంచంలో అతి పెద్ద చమురు శుద్ధీకరణ కేంద్రంగా దేశాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. 2030 నాటికి ఇంధన రంగంలో సహజవాయు వాటాను రెట్టింపు చేసి 15 శాతానికి చేర్చాలన్న లక్ష్యం విధించుకున్నామని వివరించారు. ఇది ఎల్ఎన్‌జీ, పైప్‌లైన్ రంగాల్లో అవకాశాలను మెరుగుపరుస్తుందని తెలిపారు. ప్రపంచంలో అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక రంగంగా ఉన్న భారత్‌లో.. ఇంధనానికి క్రమంగా డిమాండు పెరుగుతోందని, అంతర్జాతీయ డిమాండును తీర్చేందుకు దేశానికి అవకాశాలు లభిస్తున్నాయని వివరించారు. భారత పెట్రో ఉత్పత్తులు 150 దేశాలకు ఎగుమతి అవుతున్నాయని, అంతర్జాతీయంగా దేశం ఐదు అతి పెద్ద పెట్రోలియం ఎగుమతిదారుల సరసన చేరిందని తెలిపారు.

మోదీ సందేశాన్ని మార్చిన గ్రోక్

గణతంత్ర దినోత్సవం సందర్భంగా మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు నుంచి వచ్చిన శుభాకాంక్షలకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రధాని మోదీ ఇచ్చిన సందేశాన్ని సామాజిక మాధ్యమం గ్రోక్ మార్చేసింది. 77వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని మోదీకి ముయిజ్జు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పోస్టుకు ధన్యవాదాలు చెప్తూ ఎక్స్ వేదికగా మోదీ పోస్టు పెట్టారు. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం కలిసి పనిచేస్తామని దివేహి(మాల్దీవులు అధికారిక భాష)లో రాసుకొచ్చారు. ఈ సందేశాన్ని పూర్తి భిన్నమైన అర్థం వచ్చేలా గ్రోక్ ఆంగ్లంలోకి అనువాదం చేసింది. "మాల్దీవుల్లో భారత 77వ స్వాతంత్ర్య వేడుకలు జరిగాయి. అందులో మాల్దీవుల ప్రభుత్వం పాల్గొంది. ఈ ప్రభుత్వం భారత్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేసింది" అని ఇరు దేశాల దౌత్య సంబంధాలను దెబ్బతీసేలా అనువదించింది. గణతంత్ర వేడుకల స్థానంలో స్వాతంత్ర్య దినోత్సవంగా మార్చింది. ఈ అనువాదం వివాదాస్పదమవుతోంది.

పాకిస్థాన్‌లో లవ ఆలయం పునరుద్ధరణ

లాహోర్: పాకిస్థాన్‌లోని చారిత్రక లాహోర్ కోటలో శ్రీరాముడి కుమారుడైన లవకు చెందిన ఆలయాన్ని పునరుద్ధరించారు. ఇక్కడి పంజాబ్ ప్రావిన్స్‌లోని లాహోర్ కోటలో పురాతన కట్టడాలను సంరక్షించడంలో భాగంగా 2018లో ఈ ఆలయాన్ని పాక్షికంగా పునరుద్ధరించారు. ఇప్పుడు ఆ ప్రక్రియను పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పంజాబ్ ప్రావిన్స్ ప్రభుత్వ సంస్థ డబ్ల్యూసీఎల్ఏ మంగళవారం పేర్కొంది. లాహోర్ కోట లోపల గదుల మధ్యలో లవ ఆలయం ఉంది. దీనికి పైకప్పు ఏమీ లేదు. లవ పేరు మీదుగానే లాహోర్ పేరు వచ్చినట్లు హిందువుల విశ్వాసం. దీంతో పాటు సిక్కుల కాలానికి చెందిన మహారాజా రంజిత్ సిక్‌కు సంబంధించిన మరో రెండు స్మారక కట్టడాలను కూడా పునరుద్ధరించినట్లు తెలిపింది.



దక్షిణ కొరియాపై సుంకాలు పెంచిన ట్రంప్

వాషింగ్టన్: దక్షిణ కొరియా దిగుమతులపై సుంకాలను 25 శాతానికి పెంచుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. వాణిజ్య ఒప్పందానికి ఆమోదం తెలపడానికి ఆ దేశ చట్టసభలో జరుగుతోన్న జాప్యంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. "దక్షిణ కొరియా గత ఏడాది అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందానికి కట్టుబడి ఉండటం లేదు. ఇరు దేశాలకు ప్రయోజనం చేకూర్చేలా గొప్ప ఒప్పందం కుదుర్చుకున్నాం. దీనిపై ఆ దేశ చట్టసభ ఇప్పటికీ ఆమోదం తెలపలేదు. ఆ దేశం నుంచి దిగుమతి చేసుకునే ఆటోమొబైల్స్, కలప, ఔషధాలు, ఇతర వస్తువులపై 15 శాతంగా ఉన్న సుంకాలను నుంచి 25 శాతానికి పెంచుతున్నాం" అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ సుంకాలు తక్షణమే అమలులోకి వస్తాయని శ్వేతసౌధం స్పష్టంచేసింది.

భారత్-ఈయూ ఒప్పందంపై పెదవి విరుపు

భారత్, ఐరోపా కూటమి (ఈయూ) ఎఫ్‌టీఏను ఉక్రెయిన్‌పై యుద్ధానికి రష్యాకు నిధులు సమకూర్చే ఒప్పందంగా అమెరికా అభివర్ణించింది. 'రష్యా నుంచి భారత్‌కు ముడి చమురు వస్తోంది. దానిని శుద్ధి చేసినప్పుడు తయారయ్యే ఉత్పత్తులను అది ఐరోపా దేశాలకు విక్రయిస్తోంది. తద్వారా ఆ నిధులు భారత్ మీదుగా రష్యాకు వెళ్తున్నాయి. అంటే తమపై యుద్ధానికి ఐరోపా దేశాలు తామే నిధులు సమకూరుస్తున్నాయి' అని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ విమర్శించారు.

అమెరికాలో ఇప్పటికీ చీకట్లో 8 లక్షల మంది



వాషింగ్టన్ డీసీలోని ఓ రహదారిపై పేరుకుపోయిన మంచు

కెనసా: అమెరికా దక్షిణ, ఈశాన్య ప్రాంతాలను కుదిపేసిన మంచు తుపాను నెమ్మదిస్తున్నట్లు కనిపిస్తోంది. సోమవారం నాటికి మంచు క్రమంగా కరుగుతూ సముద్రం దిశగా పరుగులు తీస్తోంది. అయినా ఇప్పటికీ దేశంలో 8 లక్షల మంది విద్యుత్తు సరఫరా అందడం లేదు. టెన్నెస్సీ రాష్ట్రంలోని నాష్‌విల్‌లోనే 1.5 లక్షల మందికి కరెంటు లేదు. మిసిసిపిలో 1.4 లక్షల మందికి, లూసియానాలో 1.15 లక్షల మందికి విద్యుత్తు అందడం లేదు.

■ మంగళవారం ఉదయానికి దక్షిణాదిన ఉష్ణోగ్రతలు అత్యల్ప స్థాయికి చేరుకున్నాయి.
■ మిసిసిపి, లూసియానా, ఓక్లహోమా, అలబామా, దక్షిణ కరోలినాలో అంగుళం మందం మంచు పేరుకుపోయింది.
■ టెన్నెస్సీ రాజధానిలో మంగళవారం ఉదయానికి ఉష్ణోగ్రత మైనస్ 17 డిగ్రీల ఫారన్‌హీట్‌కు చేరుకుంది. ■ ఆర్కన్సాస్‌లోని లిటిల్ రాక్‌లో ఉన్న క్లింటన్ జాతీయ విమానాశ్రయంలో 6.7 అంగుళాల మందం మంచు పేరుకుపోయింది.
■ కెంటకీలోని అలెన్ కౌంటీలో విద్యుత్తు సరఫరా పునరుద్ధరణకు 10 రోజులు పట్టవచ్చని అధికారులు తెలిపారు.
■ మసాచుసెట్స్‌లోని స్టెర్లింగ్‌లో పడిన 22.5 అంగుళాల మందం మంచే ఇప్పటిదాకా ఈ ఏడాదిలో అత్యధికం.
■ మిసిసిపిలోని తుపెలోలో 200 శునకాలను అధికారులు రక్షించారు.

Government of India

Ministry of Railways (South Central Railway) Notification
Secunderabad, 07-01-2026.

Rc.No.1381/2023-C. Dated: 26-01-2026.

S.O.311(E) - In exercise of Powers conferred by the Sub-section (1) of Section 20A of the Railways Act, 1989 (24 of 1989) (herein after referred to as the said Act) the Central Government, after being satisfied that for the public purpose, the land the brief description of which is given in the Schedule annexed hereto, is required for the purpose of execution of the Special Railway Project namely "Doubling of Railway line between Guntur and Bibinagar Stations" in Palnadu District in the State of Andhra Pradesh hereby declares its intention to acquire such land.

Any person interested in the said land may, within a period of thirty days from the date of publication of this notification in the Official Gazette, raise objections to the acquisition and use of such land for the aforesaid purpose under Sub-section (1) of Section 20D of the said Act.

Every such objection shall be made to the Competent Authority, namely, Revenue Divisional Officer, Gurazala in writing and shall set out the grounds thereof and the Competent Authority shall give the objector an opportunity of being heard, either in person or by a legal practitioner, and may, after hearing all such objections and after making such further enquiry, if any, as the Competent Authority thinks necessary, by order, either allow or disallow the objections.

Any order made by the Competent Authority under Sub-section (II) of Section 20D of the said Act shall be final.

The land plans and other details of the land covered under this notification are available and can be inspected bny the interested person at the aforesaid office of the Competent Authority. Compensation will be awarded as per the Right to Fair Compensation and Transparency in Land Acquisitio, Rehabiliation and Resettlement Act, 2013 (Act No.30 of 2013)

SCHEDULE

Description of the lands under acquisition for "Doubling of Railway line between Guntur and Bibinagar Stations" in Gurazala Division in Palnadu District in the State of Andhra Pradesh.

Sl.No.	Name of the Mandal	Name of the Village	Sy.No. & Sub Division	Acquisition area in Acres	Hectors
1	Piduguralla	Thummalacheruvu	362	0.01	0.0000405
2	Piduguralla	Thummalacheruvu	363-1	0.36	0.0014566
3	Piduguralla	Thummalacheruvu	364-1	0.11	0.0004451
4	Piduguralla	Thummalacheruvu	365/2B	0.01	0.0000405
5	Piduguralla	Thummalacheruvu	366-1	0.13	0.0005260
6	Piduguralla	Thummalacheruvu	399/5B-1A	0.19	0.0007687
7	Piduguralla	Thummalacheruvu	399/5B-2A	0.17	0.0006878
8	Piduguralla	Thummalacheruvu	418/B-1	0.09	0.0003641
9	Piduguralla	Thummalacheruvu	418/B-3	0.08	0.0003237
10	Piduguralla	Thummalacheruvu	421-1	0.15	0.0006069
11	Piduguralla	Thummalacheruvu	422-1A	0.19	0.0007687
12	Piduguralla	Thummalacheruvu	422-2	0.07	0.0002832
13	Piduguralla	Thummalacheruvu	425-1	0.14	0.0005664
14	Piduguralla	Thummalacheruvu	426/B-1	0.10	0.0004046
15	Piduguralla	Thummalacheruvu	427/B	0.01	0.0000405
16	Piduguralla	Thummalacheruvu	434	0.01	0.0000405
17	Piduguralla	Thummalacheruvu	436-1	0.08	0.0003237
18	Piduguralla	Thummalacheruvu	437-1A1	0.12	0.0004855
19	Piduguralla	Thummalacheruvu	437-1A2	0.11	0.0004451
20	Piduguralla	Thummalacheruvu	437-2A	0.06	0.0002428
21	Piduguralla	Thummalacheruvu	438-1A1	0.05	0.0002023
22	Piduguralla	Thummalacheruvu	438-1A2	0.05	0.0002023
23	Piduguralla	Thummalacheruvu	438-2A	0.11	0.0004451
24	Piduguralla	Thummalacheruvu	441-1A	0.03	0.0001214
25	Piduguralla	Thummalacheruvu	441-1B	0.02	0.0000809
26	Piduguralla	Thummalacheruvu	442/2-1	0.10	0.0004046
27	Piduguralla	Thummalacheruvu	443-1	0.23	0.0009306
28	Piduguralla	Thummalacheruvu	458/1B-1A	1.54	0.0062308
29	Piduguralla	Thummalacheruvu	470-A1	0.18	0.0007283
30	Piduguralla	Thummalacheruvu	471-H/1	0.01	0.0000405
31	Piduguralla	Thummalacheruvu	471-G/1	0.01	0.0000405
32	Piduguralla	Thummalacheruvu	471-E/1	0.01	0.0000405
33	Piduguralla	Thummalacheruvu	471-D/1	0.02	0.0000809
34	Piduguralla	Thummalacheruvu	471-C/1	0.02	0.0000809
35	Piduguralla	Thummalacheruvu	471-B/1	0.02	0.0000809
36	Piduguralla	Thummalacheruvu	471-A/1	0.01	0.0000405
37	Piduguralla	Thummalacheruvu	471-A/2-1	0.10	0.0004046
38	Piduguralla	Thummalacheruvu	471-B/2-1	0.11	0.0004451
39	Piduguralla	Thummalacheruvu	471-C/2-1	0.12	0.0004855
40	Piduguralla	Thummalacheruvu	471-D/2-1	0.12	0.0004855
41	Piduguralla	Thummalacheruvu	471-E/2-1	0.10	0.0004046
42	Piduguralla	Thummalacheruvu	471-G/2-1	0.11	0.0004451
43	Piduguralla	Thummalacheruvu	471-H/2-1	0.47	0.0019016
44	Piduguralla	Thummalacheruvu	472/B-A	0.04	0.0001618
45	Piduguralla	Thummalacheruvu	472/B-1/B	0.24	0.0009710
46	Piduguralla	Thummalacheruvu	472/B-6/A	0.01	0.0000405
47	Piduguralla	Thummalacheruvu	472/B-2A	0.03	0.0001214
48	Piduguralla	Thummalacheruvu	472/B-3	0.11	0.0004451
49	Piduguralla	Thummalacheruvu	472/B-4A	0.03	0.0001214
50	Piduguralla	Thummalacheruvu	472/B-6/B1	0.24	0.0009710
51	Piduguralla	Thummalacheruvu	472/B-8	0.07	0.0002832
52	Piduguralla	Thummalacheruvu	472/B-9	0.11	0.0004451
53	Piduguralla	Thummalacheruvu	472/B-10	0.04	0.0001618
54	Piduguralla	Thummalacheruvu	472/B-11	0.03	0.0001214
55	Piduguralla	Thummalacheruvu	472/B-12A	0.13	0.0005260
56	Piduguralla	Thummalacheruvu	472/B-13	0.04	0.0001618
57	Piduguralla	Thummalacheruvu	472/B-14A	0.07	0.0002832
58	Piduguralla	Thummalacheruvu	472/B-15A	0.26	0.0010520
59	Piduguralla	Thummalacheruvu	472/C	0.18	0.0007283
60	Piduguralla	Thummalacheruvu	485/B	2.19	0.0088607
61	Piduguralla	Thummalacheruvu	487/B	0.04	0.0001618
62	Piduguralla	Thummalacheruvu	488-1A	0.66	0.0026704
63	Piduguralla	Thummalacheruvu	490-A1	0.05	0.0002023
64	Piduguralla	Thummalacheruvu	490-B1	0.43	0.0017398
65	Piduguralla	Thummalacheruvu	491	0.06	0.0002428
66	Piduguralla	Thummalacheruvu	500/B-1A	0.28	0.0011329
67	Piduguralla	Thummalacheruvu	500/B-1B	0.88	0.0035605
68	Piduguralla	Thummalacheruvu	500/B-1C	0.10	0.0004046
69	Piduguralla	Thummalacheruvu	541/B	0.18	0.0007283
70	Piduguralla	Thummalacheruvu	542/B-1A1	0.07	0.0002832
71	Piduguralla	Thummalacheruvu	542/B-1A2	0.09	0.0003641
72	Piduguralla	Thummalacheruvu	542/B-1A3	0.13	0.0005260
73	Piduguralla	Thummalacheruvu	542/B-1A4	0.13	0.0005260
74	Piduguralla	Thummalacheruvu	542/B-1A5	0.14	0.0005664
75	Piduguralla	Thummalacheruvu	545/B-1A	0.25	0.0010115
76	Piduguralla	Thummalacheruvu	546/B-1A	0.35	0.0014161
77	Piduguralla	Thummalacheruvu	546/B-1B	0.39	0.0015779
78	Piduguralla	Thummalacheruvu	547/B-1	0.06	0.0002428
79	Piduguralla	Thummalacheruvu	548/B-1	0.32	0.0012947
80	Piduguralla	Thummalacheruvu	549/2B	0.07	0.0002832
81	Piduguralla	Thummalacheruvu	550-1B	0.13	0.0005260
82	Piduguralla	Thummalacheruvu	550-2B	0.34	0.0013756
83	Piduguralla	Thummalacheruvu	576/A-1B	0.33	0.0013352
84	Piduguralla	Thummalacheruvu	576/A-1C	0.31	0.0012543
85	Piduguralla	Thummalacheruvu	576/A-1D	0.39	0.0015779
86	Piduguralla	Thummalacheruvu	576/B-1A	0.09	0.0003641
87	Piduguralla	Thummalacheruvu	576/B-1B	0.12	0.0004855
88	Piduguralla	Thummalacheruvu	577/B-1A1	0.18	0.0007283
89	Piduguralla	Thummalacheruvu	577/B-1A2	0.10	0.0004046
90	Piduguralla	Thummalacheruvu	577/B-2A1	0.07	0.0002832
91	Piduguralla	Thummalacheruvu	577/B-2A2	0.16	0.0006474
92	Piduguralla	Thummalacheruvu	578-1B	0.06	0.0002428
93	Piduguralla	Thummalacheruvu	578-2B	0.06	0.0002428
94	Piduguralla	Thummalacheruvu	580/B-1A	0.14	0.0005664
95	Piduguralla	Thummalacheruvu	580/B-2A	0.12	0.0004855
96	Piduguralla	Thummalacheruvu	580/B-3A	1.31	0.0053003
97	Piduguralla	Thummalacheruvu	581/B-1	0.19	0.0007687
98	Piduguralla	Thummalacheruvu	619/A-2	0.03	0.0001214
99	Piduguralla	Thummalacheruvu	621/B	0.02	0.0000809
100	Piduguralla	Thummalacheruvu	665/3B-1	0.14	0.0005664
101	Piduguralla	Thummalacheruvu	666/3B	0.02	0.0000809
102	Piduguralla	Thummalacheruvu	668/B-1A1	0.13	0.0005260
103	Piduguralla	Thummalacheruvu	668/B-1A2	0.26	0.0010520
104	Piduguralla	Thummalacheruvu	669/A-1A	0.05	0.0002023
105	Piduguralla	Thummalacheruvu	669/A-1B	0.12	0.0004855
106	Piduguralla	Thummalacheruvu	671/A-1	0.24	0.0009710
107	Piduguralla	Thummalacheruvu	672/1B-2	0.06	0.0002428
108	Piduguralla	Thummalacheruvu	672/2A-1	0.02	0.0000809
109	Piduguralla	Thummalacheruvu	679/1B-1	0.13	0.0005260
110	Piduguralla	Thummalacheruvu	679/2B-1	0.25	0.0010115
111	Piduguralla	Thummalacheruvu	680/B	0.01	0.0000405
112	Piduguralla	Thummalacheruvu	682/A-1B	0.17	0.0006878
113	Piduguralla	Thummalacheruvu	682/A-1C	0.19	0.0007687
114	Piduguralla	Thummalacheruvu	682/B-3A	0.83	0.0033582
115	Piduguralla	Thummalacheruvu	840/B-1	0.61	0.0024681
116	Piduguralla	Thummalacheruvu	842/B-1	0.43	0.0017398
		Thummalacheruvu Sub Total:		**22.04**	**0.0891738**
1	Piduguralla	Karalapadu	9/2/B-1A	0.15	0.0006069
2	Piduguralla	Karalapadu	9/2/B-1B	0.12	0.0004855
3	Piduguralla	Karalapadu	9/2/B-1C	0.28	0.0011329
4	Piduguralla	Karalapadu	16/B-1	0.14	0.0005664
5	Piduguralla	Karalapadu	18/B-1A	0.24	0.0009710
6	Piduguralla	Karalapadu	18/B-2A	0.25	0.0010115
7	Piduguralla	Karalapadu	19-B	0.15	0.0006069
8	Piduguralla	Karalapadu	24/1-A	0.02	0.0000809
9	Piduguralla	Karalapadu	24/2/B-1A	0.05	0.0002023
10	Piduguralla	Karalapadu	25/1/B-1	0.05	0.0002023
11	Piduguralla	Karalapadu	25/2/B-1A	0.15	0.0006069
12	Piduguralla	Karalapadu	26/B-1	0.01	0.0000405
13	Piduguralla	Karalapadu	46/B-1A	0.11	0.0004451
14	Piduguralla	Karalapadu	46/B-1B	0.32	0.0012947
15	Piduguralla	Karalapadu	49/B-1A	0.04	0.0001618
16	Piduguralla	Karalapadu	49/B-1B	0.12	0.0004855
17	Piduguralla	Karalapadu	49/B-1C	0.08	0.0003237
18	Piduguralla	Karalapadu	68/B-1A	0.03	0.0001214
19	Piduguralla	Karalapadu	68/B-2A	0.05	0.0002023
20	Piduguralla	Karalapadu	68/B-3A	0.04	0.0001618
21	Piduguralla	Karalapadu	68/B-4	0.01	0.0000405
22	Piduguralla	Karalapadu	71/B-1	0.21	0.0008497
23	Piduguralla	Karalapadu	76/C-1A	0.18	0.0007283
24	Piduguralla	Karalapadu	76/C-1B	0.13	0.0005260
25	Piduguralla	Karalapadu	76/C-1C	0.18	0.0007283
26	Piduguralla	Karalapadu	79/B-1A	0.09	0.0003641
27	Piduguralla	Karalapadu	79/B-1B	0.14	0.0005664
28	Piduguralla	Karalapadu	80/B-1A	0.11	0.0004451
29	Piduguralla	Karalapadu	80/B-1B	0.02	0.0000809
30	Piduguralla	Karalapadu	81/B-1A	0.01	0.0000405
31	Piduguralla	Karalapadu	182-A	0.08	0.0003237
32	Piduguralla	Karalapadu	188/B-1	0.07	0.0002832
33	Piduguralla	Karalapadu	189/B-1A	0.53	0.0021444
34	Piduguralla	Karalapadu	190/A-2	0.15	0.0006069
35	Piduguralla	Karalapadu	191-C1	0.24	0.0009710
36	Piduguralla	Karalapadu	206/B-1	0.08	0.0003237
37	Piduguralla	Karalapadu	207/A-1	0.04	0.0001618
38	Piduguralla	Karalapadu	208/B-1	0.01	0.0000405
39	Piduguralla	Karalapadu	208/B-2A	0.68	0.0027513
40	Piduguralla	Karalapadu	208/B-3B	0.20	0.0008092
41	Piduguralla	Karalapadu	208/B-2B	0.08	0.0003237
42	Piduguralla	Karalapadu	208/B-3A	0.40	0.0016184
43	Piduguralla	Karalapadu	209/3/B-1	0.02	0.0000809
44	Piduguralla	Karalapadu	209/3/B-2A1	0.04	0.0001618
45	Piduguralla	Karalapadu	209/3/B-2B1	0.02	0.0000809
46	Piduguralla	Karalapadu	209/6-A	0.02	0.0000809
47	Piduguralla	Karalapadu	236/B-1	0.05	0.0002023
48	Piduguralla	Karalapadu	237/B-1A	0.50	0.202343
49	Piduguralla	Karalapadu	237/B-1B	0.11	0.0004451
50	Piduguralla	Karalapadu	238/B-1A1	0.02	0.0000809
51	Piduguralla	Karalapadu	238/B-2A	0.19	0.0007687
52	Piduguralla	Karalapadu	243/A-2	0.02	0.0000809
		Karalapadu Sub Total:		**7.03**	**0.0284434**
1	Piduguralla	Piduguralla	130/30A-3A2 130/30A-4A2 130/30A-5A2	0.64	0.0025894
2	Piduguralla	Piduguralla	130/30A-3A2		
3	Piduguralla	Piduguralla	130/30A-4A2		
4	Piduguralla	Piduguralla	130/30A-5A2		
5	Piduguralla	Piduguralla	130/30A-6A2	0.03	0.0001214
6	Piduguralla	Piduguralla	130/30A-6A3	0.01	0.0000405
7	Piduguralla	Piduguralla	130/30A-6A4	0.01	0.0000405
8	Piduguralla	Piduguralla	130/30A-6A5	0.01	0.0000405
9	Piduguralla	Piduguralla	130/30A-6A6	0.01	0.0000405
10	Piduguralla	Piduguralla	130/30A-6A7	0.04	0.0001618
11	Piduguralla	Piduguralla	130/30A-6A8	0.04	0.0001618
12	Piduguralla	Piduguralla	131/A-1B	0.01	0.0000405
13	Piduguralla	Piduguralla	131/A-1D	0.01	0.0000405
14	Piduguralla	Piduguralla	131/A-1C	0.01	0.0000405
15	Piduguralla	Piduguralla	131/A-1E	0.22	0.0008901
16	Piduguralla	Piduguralla	131/A-1F	0.07	0.0002832
17	Piduguralla	Piduguralla	131/A-1G	0.10	0.0004046
18	Piduguralla	Piduguralla	132/A-1	0.03	0.0001214
19	Piduguralla	Piduguralla	130/26-2B	0.06	0.0002428
20	Piduguralla	Piduguralla	130/26-2C	0.26	0.0010520
21	Piduguralla	Piduguralla	385-2B	0.14	0.0005664
22	Piduguralla	Piduguralla	385-3B	0.28	0.0011329
23	Piduguralla	Piduguralla	384-2	0.15	0.0006069
24	Piduguralla	Piduguralla	383/A-2	0.07	0.0002832
25	Piduguralla	Piduguralla	382/A-3C2	0.08	0.0003237
26	Piduguralla	Piduguralla	382/A-5B	0.10	0.0004046
27	Piduguralla	Piduguralla	346/A-3B	0.24	0.0009710
28	Piduguralla	Piduguralla	348/1A-1A2	0.02	0.0000809
29	Piduguralla	Piduguralla	348/1A-2A2	0.59	0.0023871
30	Piduguralla	Piduguralla	348/1A-1C	0.07	0.0002832
31	Piduguralla	Piduguralla	348/1A-1B2	0.52	0.0021039
32	Piduguralla	Piduguralla	892/17A-2	0.17	0.0006878
33	Piduguralla	Piduguralla	892/15A-3A2	0.07	0.0002832
34	Piduguralla	Piduguralla	892/15A-3A3	0.46	0.0018612
35	Piduguralla	Piduguralla	892/15A-3A4	0.17	0.0006878
36	Piduguralla	Piduguralla	892/15A-3A5	0.13	0.0005260
37	Piduguralla	Piduguralla	892/14A-3A2	0.03	0.0001214
38	Piduguralla	Piduguralla	892/14A-4A3	0.01	0.0000405
39	Piduguralla	Piduguralla	892/14A-2A2	0.03	0.0001214
40	Piduguralla	Piduguralla	892/14A-3A3	0.14	0.0005664
41	Piduguralla	Piduguralla	892/14A-4A2	0.05	0.0002023
42	Piduguralla	Piduguralla	892/15A-3B	0.13	0.0005260
43	Piduguralla	Piduguralla	892/14A-2B	0.12	0.0004855
44	Piduguralla	Piduguralla	892/4-1B	0.08	0.0003237
45	Piduguralla	Piduguralla	892/4-2	0.04	0.0001618
46	Piduguralla	Piduguralla	892/13A-1B	0.14	0.0005664
47	Piduguralla	Piduguralla	892/13A-2	0.11	0.0004451
48	Piduguralla	Piduguralla	892/31A-1B2	0.01	0.0000405
49	Piduguralla	Piduguralla	892/7A	0.03	0.0001214
50	Piduguralla	Piduguralla	892/31A-1A2	0.15	0.0006069
51	Piduguralla	Piduguralla	1094-8B	0.02	0.0000809
52	Piduguralla	Piduguralla	892/49A-A2	0.67	0.0027108
53	Piduguralla	Piduguralla	892/49A-C2	2.33	0.0094272
54	Piduguralla	Piduguralla	1001-2	7.40	0.0299404
55	Piduguralla	Piduguralla	892/15B-2	0.21	0.0008497
56	Piduguralla	Piduguralla	8/B-2	0.06	0.0002428
57	Piduguralla	Piduguralla	8/B-3	0.05	0.0002023
58	Piduguralla	Piduguralla	8/B-4	0.05	0.0002023
59	Piduguralla	Piduguralla	22/B-1A	0.03	0.0001214
60	Piduguralla	Piduguralla	22/B-2A	0.04	0.0001618
61	Piduguralla	Piduguralla	22/B-1B1	0.16	0.0006474
62	Piduguralla	Piduguralla	24/B-1B	0.12	0.0004855
63	Piduguralla	Piduguralla	24/B-1C	0.14	0.0005664
64	Piduguralla	Piduguralla	24/B-2A2	0.01	0.0000405
65	Piduguralla	Piduguralla	24/B-2A3	0.03	0.0001214
66	Piduguralla	Piduguralla	24/B-2C	0.02	0.0000809
67	Piduguralla	Piduguralla	24/B-2B2	0.11	0.0004451
68	Piduguralla	Piduguralla	37-1A	0.11	0.0004451
69	Piduguralla	Piduguralla	44/B-A	0.22	0.0008901
70	Piduguralla	Piduguralla	44/B-B1	0.04	0.0001618
71	Piduguralla	Piduguralla	52/B-2A1	0.06	0.0002428
72	Piduguralla	Piduguralla	52/B-2B2	0.02	0.0000809
73	Piduguralla	Piduguralla	52/B-2C2	0.02	0.0000809
74	Piduguralla	Piduguralla	54/B-2	0.05	0.0002023
75	Piduguralla	Piduguralla	56/B-1	0.04	0.0001618
76	Piduguralla	Piduguralla	56/B-2A	0.04	0.0001618
77	Piduguralla	Piduguralla	130/16A-7B1B	0.18	0.0007283
78	Piduguralla	Piduguralla	130/16A-7B1C	0.53	0.0021444
79	Piduguralla	Piduguralla	130/20A-1A2	0.13	0.0005260
80	Piduguralla	Piduguralla	130/34-2	0.02	0.0000809
81	Piduguralla	Piduguralla	130/34-3	0.04	0.0001618
82	Piduguralla	Piduguralla	130/34-4	0.08	0.0003237
83	Piduguralla	Piduguralla	130/34-5	0.12	0.0004855
84	Piduguralla	Piduguralla	130/36A-1B	0.43	0.0017398
85	Piduguralla	Piduguralla	188/A-2	0.21	0.0008497
86	Piduguralla	Piduguralla	231/A-2	0.12	0.0004855
87	Piduguralla	Piduguralla	233/A-1B	0.15	0.0006069
88	Piduguralla	Piduguralla	234/2A-2	0.02	0.0000809
89	Piduguralla	Piduguralla	246/A-2	0.04	0.0001618
90	Piduguralla	Piduguralla	247/A-2	0.06	0.0002428
91	Piduguralla	Piduguralla	248-2	0.08	0.0003237
92	Piduguralla	Piduguralla	253-2B	0.01	0.0000405
93	Piduguralla	Piduguralla	254/A-2	0.01	0.0000405
94	Piduguralla	Piduguralla	255/A-2	0.02	0.0000809
95	Piduguralla	Piduguralla	258/A-1B	0.12	0.0004855
96	Piduguralla	Piduguralla	258/A-2B	0.12	0.0004855
97	Piduguralla	Piduguralla	259/A-2	0.06	0.0002428
98	Piduguralla	Piduguralla	292/A-2	0.04	0.0001618
99	Piduguralla	Piduguralla	293/A-2B	0.04	0.0001618
100	Piduguralla	Piduguralla	295/A-2	0.14	0.0005664
101	Piduguralla	Piduguralla	302/A-2	0.29	0.0011733
102	Piduguralla	Piduguralla	53/B-1A	0.07	0.0002832
103	Piduguralla	Piduguralla	53/B-1D	0.01	0.0000405
104	Piduguralla	Piduguralla	53/B-1F	0.04	0.0001618
105	Piduguralla	Piduguralla	130/10A-1B	0.01	0.0000405
106	Piduguralla	Piduguralla	130/10A-1C	0.41	0.0016589
107	Piduguralla	Piduguralla	130/35A-1A	0.67	0.0027108
108	Piduguralla	Piduguralla	130/35A-1B	0.47	0.0019016
109	Piduguralla	Piduguralla	130/35A-1C	0.29	0.0011733
110	Piduguralla	Piduguralla	130/35A-2	0.49	0.0019825
111	Piduguralla	Piduguralla	7/B-1A	0.18	0.0007283
112	Piduguralla	Piduguralla	41/B-B2	0.05	0.0002023
113	Piduguralla	Piduguralla	41/B-A	0.31	0.0012543
114	Piduguralla	Piduguralla	44/A-2	0.04	0.0001618
115	Piduguralla	Piduguralla	44/A-3	0.02	0.0000809
116	Piduguralla	Piduguralla	38/B-1B2	0.03	0.0001214
117	Piduguralla	Piduguralla	38/B-2B2	0.02	0.0000809
118	Piduguralla	Piduguralla	165/A-3B	0.01	0.0000405
		Piduguralla Sub Total:		**24.12**	**0.0975895**
1	Piduguralla	Kamepalli	182/B-1	0.15	0.0006069
2	Piduguralla	Kamepalli	187/A-2	0.03	0.0001214
3	Piduguralla	Kamepalli	199-1	0.03	0.0001214
4	Piduguralla	Kamepalli	198/B-1A1	0.03	0.0001214
5	Piduguralla	Kamepalli	198/B-1A2	0.03	0.0001214
6	Piduguralla	Kamepalli	198/B-1A3	0.18	0.0007283
7	Piduguralla	Kamepalli	198/B-1A4	0.07	0.0002832
8	Piduguralla	Kamepalli	198/B-2A	0.02	0.0000809
9	Piduguralla	Kamepalli	198/B-3A	0.01	0.0000405
10	Piduguralla	Kamepalli	197/B-1	0.37	0.0014970
11	Piduguralla	Kamepalli	195/B-1	0.44	0.0017802
12	Piduguralla	Kamepalli	204/1-1B2	0.06	0.0002428
13	Piduguralla	Kamepalli	204/1-2A1	0.37	0.0014970
14	Piduguralla	Kamepalli	204/1-2A2	0.04	0.0001618
15	Piduguralla	Kamepalli	204/5/B-1	0.35	0.0014161
16	Piduguralla	Kamepalli	205/B-1A1	0.62	0.0025085
17	Piduguralla	Kamepalli	205/B-1B1	0.07	0.0002832
18	Piduguralla	Kamepalli	205/B-1A3	0.13	0.0005260
19	Piduguralla	Kamepalli	205/B-1C1	0.23	0.0009306
20	Piduguralla	Kamepalli	205/B-2A	0.08	0.0003237
21	Piduguralla	Kamepalli	205/B-3A	0.08	0.0003237
22	Piduguralla	Kamepalli	206/B-1	0.13	0.0005260
23	Piduguralla	Kamepalli	209/B-1	0.50	0.202343
24	Piduguralla	Kamepalli	222/B-1	0.63	0.0025490
25	Piduguralla	Kamepalli	224/B	0.01	0.0000405
26	Piduguralla	Kamepalli	223/B-1	0.51	0.0020635
27	Piduguralla	Kamepalli	583/B	0.02	0.0000809
28	Piduguralla	Kamepalli	580/B-1A1	0.13	0.0005260
29	Piduguralla	Kamepalli	580/B-1A2	0.28	0.0011329
30	Piduguralla	Kamepalli	580/B-1A3	0.31	0.0012543
31	Piduguralla	Kamepalli	580/B-2A1	0.18	0.0007283
32	Piduguralla	Kamepalli	580/B-2A2	0.08	0.0003237
33	Piduguralla	Kamepalli	577/A-2	0.02	0.0000809
34	Piduguralla	Kamepalli	577/B	0.01	0.0000405
35	Piduguralla	Kamepalli	578/B-1A	0.16	0.0006474
36	Piduguralla	Kamepalli	578/B-1B	0.1	0.0004046
37	Piduguralla	Kamepalli	578/B-1C	0.27	0.0010924
38	Piduguralla	Kamepalli	578/B-1D	0.11	0.0004451
39	Piduguralla	Kamepalli	578/A-2	0.05	0.0002023
40	Piduguralla	Kamepalli	576-1A2	0.04	0.0001618
		Kamepalli Sub Total:		**6.93**	**0.0280388**
1	Piduguralla	Konanki	279/12-1B1	0.10	0.0004046
2	Piduguralla	Konanki	279/12-1B2	0.09	0.0003641
3	Piduguralla	Konanki	279/12-2	0.35	0.0014161
4	Piduguralla	Konanki	279/13A-1B	0.07	0.0002832
5	Piduguralla	Konanki	279/13A-2	0.21	0.0008497
6	Piduguralla	Konanki	279/16-1C1	0.6450	0.0026097
7	Piduguralla	Konanki	279/16-1C2	0.07	0.0002832
8	Piduguralla	Konanki	279/16-2	0.10	0.0004046
9	Piduguralla	Konanki	279/16-3A1	0.19	0.0007687
10	Piduguralla	Konanki	279/16-3A2	0.39	0.0015779
11	Piduguralla	Konanki	279/17A-1	0.01	0.0000405
12	Piduguralla	Konanki	279/17A-2	0.49	0.0019825
13	Piduguralla	Konanki	280/16A-2	0.30	0.0012138
14	Piduguralla	Konanki	280/33A-1B	0.32	0.0012947
15	Piduguralla	Konanki	280/33A-2B1	0.21	0.0008497
16	Piduguralla	Konanki	280/33A-2B2	0.10	0.0004046
17	Piduguralla	Konanki	280/34A-2	0.12	0.0004855
18	Piduguralla	Konanki	280/35A-2	0.04	0.0001618
19	Piduguralla	Konanki	280/35B-1B	0.70	0.0028322
20	Piduguralla	Konanki	280/35B-2	0.12	0.0004855
21	Piduguralla	Konanki	280/36-2	0.08	0.0003237
22	Piduguralla	Konanki	280/41-2	0.02	0.0000809
23	Piduguralla	Konanki	280/42A-1B1	0.02	0.0000809
24	Piduguralla	Konanki	280/42A-1B2	0.16	0.0006474
25	Piduguralla	Konanki	280/42A-1B3	0.15	0.0006069
26	Piduguralla	Konanki	280/42A-1B4	0.25	0.0010115
27	Piduguralla	Konanki	280/42A-1B5	0.10	0.0004046
28	Piduguralla	Konanki	280/42A-1B6	0.10	0.0004046
29	Piduguralla	Konanki	280/42A-1B7	0.04	0.0001618
30	Piduguralla	Konanki	280/42A-2B1	0.02	0.0000809
31	Piduguralla	Konanki	280/42A-2B2	0.07	0.0002832
32	Piduguralla	Konanki	280/43A-2	0.12	0.0004855
33	Piduguralla	Konanki	280/1	0.07	0.0002832
34	Piduguralla	Konanki	280/2A-1	0.22	0.0008901
35	Piduguralla	Konanki	280/2A-2	0.10	0.0004046
36	Piduguralla	Konanki	280/3A	0.01	0.0000405
37	Piduguralla	Konanki	280/7A-2	0.09	0.0003641
38	Piduguralla	Konanki	280/7A-3	0.11	0.0004451
39	Piduguralla	Konanki	280/7A-4	0.06	0.0002428
40	Piduguralla	Konanki	280/7A-5	0.02	0.0000809
41	Piduguralla	Konanki	280/7A-6	0.07	0.0002832
42	Piduguralla	Konanki	280/7A-7	0.63	0.0025490
43	Piduguralla	Konanki	280/44-1	0.02	0.0000809
44	Piduguralla	Konanki	280/44-2	0.08	0.0003237
45	Piduguralla	Konanki	280/44-3	0.10	0.0004046
		Konanki Sub Total:		**7.3350**	**0.0296774**
1	Dachepalli	Pedagarlapadu	2/B-2	0.02	0.0080937
2	Dachepalli	Pedagarlapadu	7/B-2	0.09	0.0364217
3	Dachepalli	Pedagarlapadu	8/A-1B1	0.09	0.0364217
4	Dachepalli	Pedagarlapadu	8/A-1B2	0.16	0.0647497
5	Dachepalli	Pedagarlapadu	8/A-1B3	0.14	0.0566559
6	Dachepalli	Pedagarlapadu	8/A-1B4	0.22	0.0890308
7	Dachepalli	Pedagarlapadu	8/A-3B	0.02	0.0080937
8	Dachepalli	Pedagarlapadu	11/A-3B	0.21	0.0849839
9	Dachepalli	Pedagarlapadu	12/A-2A	0.02	0.0080937
10	Dachepalli	Pedagarlapadu	12/A-2B	0.08	0.0323748
11	Dachepalli	Pedagarlapadu	13/A-2A	0.03	0.0121405
12	Dachepalli	Pedagarlapadu	13/A-2B	0.19	0.0768902
13	Dachepalli	Pedagarlapadu	13/A-2C	0.18	0.0728434
14	Dachepalli	Pedagarlapadu	24/A-2B1	0.01	0.0040468
15	Dachepalli	Pedagarlapadu	24/A-2B2	0.11	0.0445154
16	Dachepalli	Pedagarlapadu	24/A-3B	0.09	0.0364217
17	Dachepalli	Pedagarlapadu	24/A-4B1	0.01	0.0040468
18	Dachepalli	Pedagarlapadu	24/A-4B2	0.05	0.0202342
19	Dachepalli	Pedagarlapadu	26-A2	0.01	0.0040468
		Pedagarlapadu Sub Total:		**1.73**	**0.7001062**
1	Dachepalli	Kesanupalli	33/82		
2	Dachepalli	Kesanupalli	33/82		
3	Dachepalli	Kesanupalli	33/82	0.19	0.0768902
4	Dachepalli	Kesanupalli	34/B		
5	Dachepalli	Kesanupalli	34/B	0.15	0.0607028
6	Dachepalli	Kesanupalli	35/B	0.01	0.0040468
7	Dachepalli	Kesanupalli	109-1B	0.28	0.113312
8	Dachepalli	Kesanupalli	221/B	0.02	0.0080937
9	Dachepalli	Kesanupalli	221/B	0.01	0.0040468
10	Dachepalli	Kesanupalli	225/B	0.09	0.0364217
11	Dachepalli	Kesanupalli	225/B	0.10	0.0040468
12	Dachepalli	Kesanupalli	229/B	0.015	0.0060702
13	Dachepalli	Kesanupalli	229/B	0.105	0.0424919
14	Dachepalli	Kesanupalli	230/B	0.13	0.0526091
15	Dachepalli	Kesanupalli	230/B	0.06	0.0242811
16	Dachepalli	Kesanupalli	236/B	0.01	0.0040468
17	Dachepalli	Kesanupalli	236/B	0.06	0.0242811
18	Dachepalli	Kesanupalli	237/1-B	0.02	0.0080937
19	Dachepalli	Kesanupalli	238/B	0.06	0.0242811
20	Dachepalli	Kesanupalli	238/B	0.07	0.0283279
21	Dachepalli	Kesanupalli	336/17-B	0.01	0.0040468
22	Dachepalli	Kesanupalli	336/17-B	0.03	0.0121405
23	Dachepalli	Kesanupalli	336/17-B	0.04	0.0161874
24	Dachepalli	Kesanupalli	336/17-B	0.03	0.0121405
25	Dachepalli	Kesanupalli	81/B2	0.03	0.0121405
		Kesanupalli Sub Total:		**1.52**	**0.6151222**
1	Dachepalli	Nadikudi	218/16-2B2	0.32	0.1294994
2	Dachepalli	Nadikudi	218/24-A2A	0.06	0.0242811
3	Dachepalli	Nadikudi	220-3A	0.07	0.0283279
4	Dachepalli	Nadikudi	224/1-3C1	0.36	0.1456868
5	Dachepalli	Nadikudi	224/1-3C1	0.18	0.0728434
6	Dachepalli	Nadikudi	218/17-1B	0.03	0.0121405
7	Dachepalli	Nadikudi	218/17-3A1	0.11	0.0445154
8	Dachepalli	Nadikudi	218/17-3C1	0.06	0.0242811
9	Dachepalli	Nadikudi	218/19-A1B	0.03	0.0121405
10	Dachepalli	Nadikudi	218/19-A3A1	0.14	0.0566559
11	Dachepalli	Nadikudi	218/23-B1B1A	0.03	0.0121405
		Nadikudi Sub Total:		**1.39**	**0.562513**
1	Dachepalli	Ramapuram	19-1C1A2	0.05	0.0202342
2	Dachepalli	Ramapuram	19-1C1A2	0.13	0.0526091
3	Dachepalli	Ramapuram	27-1A1B	0.13	0.0526091
4	Dachepalli	Ramapuram	27-1C1	0.05	0.0202342
5	Dachepalli	Ramapuram	27-3C2B	0.07	0.0283279
6	Dachepalli	Ramapuram	27-3C2B	0.05	0.0202342
		Ramapuram Sub Total:		**0.48**	**0.1942491**
1	Dachepalli	Pondugala	57-1C2	0.05	0.0202342
2	Dachepalli	Pondugala	57-3A2	0.42	0.169968
3	Dachepalli	Pondugala	58-3A2	0.28	0.113312
4	Dachepalli	Pondugala	58-5B2	0.09	0.0364217
5	Dachepalli	Pondugala	62-A3C2	0.39	0.1578274
6	Dachepalli	Pondugala	62-B3B	0.42	0.169968
7	Dachepalli	Pondugala	68/3A3	0.01	0.0040468
8	Dachepalli	Pondugala	71-2B	0.19	0.0768902
9	Dachepalli	Pondugala	71-2B	0.24	0.0971245
10	Dachepalli	Pondugala	71-1-1	0.01	0.0040468
11	Dachepalli	Pondugala	84-1B2	0.22	0.0890308
12	Dachepalli	Pondugala	84-3A	0.01	0.0040468
13	Dachepalli	Pondugala	86-2B2	0.18	0.0728434
14	Dachepalli	Pondugala	88-2C2	0.16	0.0647497
15	Dachepalli	Pondugala	247-1C2	0.10	0.0404686
16	Dachepalli	Pondugala	775-1B	0.10	0.0404686
17	Dachepalli	Pondugala	775/2-2A2B	0.02	0.0080937
18	Dachepalli	Pondugala	775/2-3A2	0.19	0.0768902
19	Dachepalli	Pondugala	777-1B	0.36	0.1456868
20	Dachepalli	Pondugala	778-1A2	0.01	0.0040468
21	Dachepalli	Pondugala	787-1A3	0.06	0.0242811
22	Dachepalli	Pondugala	787-1C1B	0.04	0.0161874
23	Dachepalli	Pondugala	788-1A2	0.35	0.14164
24	Dachepalli	Pondugala	791-1A1B	0.12	0.0485622
25	Dachepalli	Pondugala	791-1A1C1	0.11	0.0445154
26	Dachepalli	Pondugala	791-1A1C2	0.05	0.0202342
27	Dachepalli	Pondugala	791-1A1C3	0.02	0.0080937
		Pondugala Sub Total:		**4.20**	**1.69968**
			Grand Total:	**76.775**	**31.0697402**

Place: Gurazala.
Date: 26-01-2026.


Sd/-**V.Murali Krishna,**
Competent Authority for LA &
Revenue Divisional Officer
Gurazala, Palnadu District.

(c) eenadu

ఆర్థిక వృద్ధిలో 'వినియోగం' కీలకాంశం

- నిరుటి కేంద్ర బడ్జెట్‌ను దీన్ని దృష్టిలో పెట్టుకునే రూపొందించారు
- ఆదాయపన్ను, జీఎస్టీలో మార్పులకూ అదే కారణం
- 'ఈనాడు' ప్రత్యేక ముఖాముఖీలో ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు

ఎం.ఎల్.నరసింహారెడ్డి
ఈనాడు – హైదరాబాద్



"భారత్ వృద్ధిరేటు ప్రస్తుతం మెరుగ్గానే ఉన్నా వృద్ధి నాణ్యత, ఉత్పాదకత ఆశాజనకంగా లేవు. ప్రైవేటు పెట్టుబడులు తగినంతగా లేకపోవడంతో తయారీ రంగం ఎక్కువ మంది కార్మికులకు అవకాశం కల్పించేదిగా మారడంలేదు" అని రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అభిప్రాయపడ్డారు. మధ్య తరగతితో ఎక్కువ వ్యయం చేయించేలా ప్రోత్సహించి, ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా గత బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం రూపొందించినా... ఆశించిన మేరకు పూర్తి ప్రయోజనాలు దక్కలేదన్నారు. దిగువ మధ్యతరగతి వర్గాల వినియోగం పెరగకుండా జాతీయ స్థూల ఉత్పత్తి(జీడీపీ) సుస్థిర వృద్ధిని సాధించలేదని స్పష్టంచేశారు. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ రానున్న నేపథ్యంలో గత బడ్జెట్ సాధించిన ఫలితాలు, రానున్న ఆర్థిక వార్షిక పద్దుపై ప్రభావం చూపే అంశాలపై 'ఈనాడు'కు దువ్వూరి సుబ్బారావు ముఖాముఖి ఇచ్చారు. అందులోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి...

ప్రశ్న: మధ్య తరగతితో ఎక్కువ వ్యయం చేయించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇస్తున్నట్లు 2025 బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించింది. వాస్తవంలో ఏం జరిగింది?

జవాబు: గత బడ్జెట్‌లో మధ్యతరగతిని దృష్టిలో పెట్టుకొని ఆదాయపన్నులో మార్పులు చేశారు. ట్రంప్ సుంకాల ప్రభావం, మరో కారణంతో జీఎస్టీ శ్లాబుల్లోనూ మార్పులు చేశారు. వీటివల్ల మధ్యతరగతి వర్గాల్లో వినియోగం పెరుగుతుందని ఆశించారు. ఆర్థికవృద్ధికి వినియోగమే కీలకం. దేశం సుస్థిర వృద్ధి సాధించాలంటే వినియోగం పెరగాల్సిందే. గత బడ్జెట్‌లో చేసిన మార్పుల ప్రభావం ఎగువ మధ్యతరగతి వర్గాలకు వెళ్లింది. కానీ, దిగువ మధ్యతరగతి వర్గాలకు ఆశించిన స్థాయిలో వెళ్లలేదు. వారి ఆదాయం నిలకడగా లేకపోవడంతో బడ్జెట్ ప్రయోజనం చేకూరలేదని తెలుస్తోంది. దీనికి కారణం... దిగువ మధ్యతరగతి వర్గాల జీతాలు అంతగా పెరగలేదు. వారు ఆరోగ్యం, విద్యతోసహా అన్నింటిపై చేస్తున్న ఖర్చులు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. దీర్ఘకాలంలో దిగువ మధ్యతరగతి వర్గాల వినియోగం పెరిగితే కానీ జీడీపీ సుస్థిరంగా పెరగదు.

◆ జీడీపీ... వినియోగం, పెట్టుబడులు, ప్రభుత్వ వ్యయం, నికర ఎగుమతులపై ఆధారపడి ఉంటుంది. నాలుగైదేళ్లుగా ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ పెట్టుబడిపైనే జీడీపీ నడుస్తోంది. ప్రభుత్వానికి ఖర్చు పెట్టే క్రమంగా స్తోమత తగ్గిపోతోంది. ఎందుకంటే ద్రవ్య లోటు ఇబ్బంది కూడా ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే వినియోగం పెరిగేలా బూస్ట్ ఇవ్వాలని గత ఆర్థిక సంవత్సరంలో పన్నుల తగ్గింపు, జీఎస్టీ ధరల్లో మార్పు వంటి చర్యలు తీసుకొన్నారు.

ట్రంప్ సుంకాల ప్రభావం భారత్‌పై ఏ మేరకు పడింది. జీడీపీ వృద్ధిపై ప్రభావం చూపాయా?

భారత్‌కు అమెరికా పెద్ద వ్యాపార భాగస్వామి. మన ఎగుమతుల్లో యూఎస్ వాటా 20%. సుంకాలను 50 శాతానికి పెంచినపుడు 0.5% నుంచి 0.8% వరకు జీడీపీపై ప్రభావం పడొచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేశారు. ఈ మేరకు ప్రభావం పడకుండా మనం తట్టుకోగలిగాం. ఎందుకంటే... దిగుమతిదారులు, ఎగుమతిదారులు కొంత భారాన్ని భరించారు. ఎగుమతులు అంతగా తగ్గలేదు. వ్యాపారాన్ని ఇతర దేశాలకూ కొంత మేర మళ్లించగలిగాం. మనది పెద్దదేశం కావడంతో ప్రభావం ప్రస్తుతానికి ఎక్కువగా కనిపించడం లేదు. దీన్ని చూసి ధీమాగానూ ఉండలేం. దీర్ఘకాలంలో ఎగుమతులు తగ్గిపోయే ప్రమాదముంది.

◆ ట్రంప్ చైనాపైనా సుంకాలు వేయడంతో వాళ్లు ఇతర దేశాల్లో తమ వస్తువులను కుమ్మరిస్తున్నారు. అంటే... ఆయా మార్కెట్లలో మనకు చైనా పోటీదారుగా మారింది. ఇదొక పెద్ద సమస్య. అమెరికా సుంకాలతో చైనా నుంచి మనదేశానికి పరిశ్రమ తరలి వస్తుందని ఎదురుచూశాం. అదీ దెబ్బతినే అవకాశముంది. ఎందుకంటే 50% సుంకాలతో మనం గ్లోబల్ వాల్యూ చైన్‌లో మిళితం(ఇంటిగ్రేట్) అయ్యే అవకాశం తక్కువ. ఈ కారణంగా మనకు పెట్టుబడులు వచ్చే అవకాశం తగ్గిపోతుంది.

డాలర్‌తో రూపాయి విలువ ఈ ఏడాది గణనీయంగా పడిపోయింది. ఇతర దేశాల కరెన్సీతో పోల్చినా ఇలాగే ఉంది. దీనికి కారణమేంటి.. ఈ ప్రభావం ఏయే రంగాలపై పడింది. వచ్చే బడ్జెట్‌పై ఏమైనా ప్రభావం ఉంటుందా?

డాలర్‌తో రూపాయి విలువ 92కు పడిపోయింది. ఏడాది క్రితం వరకు రూపాయి విలువ పడిపోకుండా విదేశీ మారకపు మార్కెట్‌లో ఆర్బీఐ జోక్యం చేసుకొంది. ఏడాది నుంచి ఆ జోక్యాన్ని తగ్గించారు. ఒకస్థాయి వరకు పడిపోయినా పర్వాలేదని సహిస్తున్నారు. విలువ పడిపోవడానికి అనేక కారణాలున్నాయి. ముఖ్యంగా బయట నుంచి వచ్చేదాని కంటే దేశం నుంచి వెళ్లేది ఎక్కువగా ఉంది. భారత మార్కెట్‌లో ఆదాయం వచ్చే అవకాశం తక్కువగా ఉండటంతోనే పెట్టుబడులు బయటకు వెళ్తున్నాయి. మనకు ప్రత్యక్ష పెట్టుబడులూ తక్కువగానే ఉన్నాయి. దీంతోపాటు మనదగ్గరా కొన్ని లోపాలున్నాయి. ప్రధానంగా పన్నుల విధానం. ఇండియన్ క్యాపిటల్ గెయిన్స్, ఫారన్ విత్‌హోల్డ్ ట్యాక్సెస్‌పై నిలకడ లేని విధానం మనది. ప్రతి సంవత్సరం ఏదో ఒక మార్పు చేస్తుంటాం. విదేశీ పెట్టుబడిదారులకు వచ్చే ఏడాది పన్నుల విధానం ఎలా ఉంటుందో తెలియకపోవడం, వాళ్లకు మనపై అనుమానాలు ఉండటంతో పెట్టుబడి వెళ్లిపోతోంది. బంగారం, చమురు కారణంగానూ రూపాయి కొంత పడింది. మరో అంశం బయట ఉన్న అస్థిరత. వివిధ దేశాల్లో ఉద్రిక్తతలు, సుంకాలూ కారణమే. అన్నింటికంటే ముఖ్యమైంది మన రూపాయి ఫండమెంటల్‌గానే బలహీనంగా ఉంది. స్వదేశీ మార్కెట్ సానుకూలతలపైనా విదేశీ పెట్టుబడులు ఆధారపడి ఉంటాయి. ఇక్కడ వినియోగం పెరుగుతుందా... లేదా అనే దానిపై విదేశీ పెట్టుబడుదారులు లెక్కలేసుకుంటారు. ఇక చమురు, ఎరువుల ధరల ప్రభావం కూడా బడ్జెట్‌పై ఉంటుంది. వీటి అవసరాలు పెరిగితే ద్రవ్య లోటు నియంత్రించడానికి పన్నులు పెంచుతారా... ఖర్చు తగ్గిస్తారా చూడాలి.

'యువగళా'నికి మూడేళ్లు.. కార్మికులకు ఆటోలు

పంపిణీ చేసిన ఎంపీ కేశినేని శివనాథ్



మాట్లాడుతున్న మంత్రి సుభాష్. వేదికపై రఘురామరాజు, అశోక్‌బాబు, శివనాథ్, నాగుల్ మీరా తదితరులు



పంపిణీకి సిద్ధంగా ఉన్న ఆటోలు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: గత ప్రభుత్వ అరాచక పాలనపై సమర శంఖం పూరించి మంత్రి నారా లోకేశ్ చేసిన యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ ప్రత్యేక సహకారంతో, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలోని 50 మంది కార్మికులకు ఆటోలు పంపిణీ చేశారు. విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులో జరిగిన కార్యక్రమానికి కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఎంపీ శివనాథ్ కార్మికులకు ఆటోలను అందజేశారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ.. ఎంపీ శివనాథ్ అందజేసిన రూ.25 లక్షలు, బ్యాంకు రుణాలతో 50 మంది కార్మికులు ఆటో యజమానులుగా మారుతున్నారన్నారు. ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ.. ఈనెల 30 నాటికి మరో 20 ఆటోలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్ మీరా, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించండి

- మోన్‌శాంటోకు వినియోగదారుల కమిషన్ ఆదేశం
- నాణ్యత లేని విత్తనాలు అమ్మిన కేసులో..

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: నాణ్యత లేని విత్తనాలు అమ్మినందుకు బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలని మోన్‌శాంటోతో పాటు విక్రయ దుకాణ నిర్వాహకుడిని గుంటూరు జిల్లా వినియోగదారుల కమిషన్ మంగళవారం ఆదేశించింది. పల్నాడు జిల్లా వినుకొండ మండలం వెంకటకుప్పం గ్రామానికి చెందిన రైతులు బాబు, తాళ్లూరి ఏడుకొండలు 2022 జులై 8న వినుకొండలోని సాయి కిసాన్ సీడ్స్ దుకాణంలో మోన్‌శాంటో సంస్థకు చెందిన మిర్చి విత్తనాలను కొన్నారు. ఎకరానికి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని దుకాణదారు నమ్మించారు. ఇద్దరు రైతులు 4.5 ఎకరాల్లో విత్తనాలు చల్లగా, ఎలాంటి దిగుబడి రాలేదు. నకిలీ విత్తనాలు అంటగట్టారంటూ ఆ దుకాణ నిర్వాహకుడితో పాటు మోన్‌శాంటో సంస్థపై బాధిత రైతులు జిల్లా వినియోగదారుల కమిషన్‌లో వేర్వేరుగా రెండు కేసులు దాఖలు చేశారు. విచారణ అనంతరం కమిషన్ తీర్పు వెలువరించింది. విత్తనాల కోసం రైతులు చెల్లించిన ధరతో పాటు పరిహారం కింద ఎకరాకు రూ.3 లక్షల చొప్పున ఇవ్వాలని, వారిని మానసిక వేదనకు గురిచేసినందుకు చెరో రూ.10 వేలు, న్యాయ ఖర్చుల కింద తలో రూ.3 వేలు కలిపి ఆ మొత్తాలను 9 శాతం వడ్డీతో ఆరు వారాల్లోగా చెల్లించాలని ఆదేశించింది.

ఎవరికీ పట్టని మూగజీవాల వేదన

- ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి యథేచ్ఛగా పశువుల అక్రమ రవాణా
- ఏటా రూ.250 కోట్ల వ్యాపారం

ఈనాడు డిజిటల్, శ్రీకాకుళం; న్యూస్‌టుడే, సోంపేట: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల్లో పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఈ దందాతో ఇక్కడ ఏటా రూ.250 కోట్ల వ్యాపారం సాగుతుందని అంచనా. ఇందుకు ఒక ప్రత్యేక నెట్‌వర్క్ గ్రామాల్లో తిరుగుతోంది. దళారులు గ్రామాల్లో పశువులను కొనుగోలు చేసి.. వాటిని జాతీయ రహదారి సమీపంలో మందలుగా పెట్టి.. ఆ తర్వాత రాత్రికిరాత్రే ఇతర రాష్ట్రాల్లోని కబేళాలకు తరలిస్తున్నారు. ఇలా శ్రీకాకుళం మీదుగా నెలకు 8 వేల నుంచి 10 వేల మూగజీవాలు తరలుతున్నాయి. ఈ దందాను అడ్డుకోవడానికి రెవెన్యూ, రవాణా, పోలీసు, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

అంతా నెట్‌వర్క్ కనుసన్నల్లోనే..

వైకాపా పాలనలో ఇచ్ఛాపురం, పాతపట్నం నియోజకవర్గాల్లో కొందరు మండల స్థాయి నేతలు సిండికేట్‌గా ఏర్పడి పశువుల అక్రమ రవాణాకు తెర తీశారు. తెలంగాణ, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌ల నుంచి నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నారు.



శ్రీకాకుళం జిల్లా కంచిలి వద్ద కబేళాకు తరలించడానికి సిద్ధం ఉన్న ఆవులు

కొందరు సిబ్బందిని నియమించుకొని ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల్లో తిరుగుతూ రైతుల నుంచి ఆవులు, గేదెలను కొనుగోలు చేస్తున్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే అధిక ధర

వ్యాపారులు, దళారులు రైతుల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని చాలా తక్కువ ధరకు పశుసంపదను కొనుగోలు చేస్తున్నారు. గ్రామాల్లో తిరిగే దళారులు పశువు ఆరోగ్యంగా ఉంటే గరిష్ఠంగా రూ.15 వేలు, బక్క చిక్కితే రూ.5 వేలలోపే రైతుకు చెల్లిస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన పశువులతో కూలీలు జాతీయ రహదారులకు సమీపంలో ఓ మంద పెడుతున్నారు.

◆ దళారులు కంటెయినర్లు లేదా లారీలు ఏర్పాటు చేసి జాతీయ రహదారి పక్కన ముందుగా ఏర్పాటు చేసే మందల్లోని పశువులను ఎక్కించుకుంటూ ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

◆ ఒడిశా సరిహద్దు ప్రాంతాలైన తూటిపురం, బొరంగో, మునసబుపేట, తుంబ, గొంగాపురం, కుశారి, కొనిసి, సురంగి, కొత్తపేట గ్రామాల పరిధిలో తోటలు, మైదాన ప్రాంతాల్లో పశువుల మంద పెడుతున్నారు. ఇక్కడి కవిటి మండలం గొర్లెపాడు, కొజ్జిరియా, మంగళవారం సంత మీదుగా జాతీయ రహదారి వద్దకు తీసుకొచ్చి కంటెయినర్లలో కోల్‌కతా వైపు తరలిస్తున్నారు.

◆ కంచిలి మండలం కొండపోలేరు, మఠంసరియాపల్లి, రేఖాదేవిపురం మీదుగా మఖరాంపురం, అంపురం ఎన్‌హెచ్ మీదకు చేర్చుతున్నారు.

◆ సోంపేట, మందస మండలాల పరిధిలో బాతుపురం, బుషాభద్ర, పొత్తంగి మీదుగా కొర్లాం, బి.మదనాపురం పరిధిలోని జాతీయ రహదారి వద్దకు చేర్చి అక్కడి నుంచి తమిళనాడు, తెలంగాణ, కేరళకు తరలిస్తున్నారు.

◆ అక్రమ రవాణా సాఫీగా సాగేందుకు లోడును బట్టి పోలీసుస్టేషన్‌కు రూ.50 వేలు, తనిఖీ కేంద్రాల వద్ద రూ.10 నుంచి రూ.20 వేల వరకు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ◆ శ్రీకాకుళం జిల్లాలో 2024, 2025లలో 404 పశువుల అక్రమ రవాణా కేసులు నమోదు చేశారు. 831 మందిని అరెస్టు చేశారు. 4,316 పశువుల్ని, 410 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

◆ పదేళ్ల కిందటి వరకు దాడుల్లో పట్టుకున్న పశువులను సంరక్షణకు గోశాలలకు తరలించేవారు. ప్రస్తుతం సోంపేట మండలం బారువ, మెళియాపుట్టి వద్ద ప్రైవేటు గోశాలలు ఉన్నా.. అవి వివాదాలు, నిర్వహణ సమస్యలతో సతమతం అవుతున్నాయి. దీంతో అధికారులు తనిఖీలే తగ్గించేశారు.

తిరుమలలో మల్టీ లెవెల్ కార్ పార్కింగ్!

- నిర్మాణంపై పరిశీలిస్తున్నట్లు తితిదే ఈవో వెల్లడి
- రికార్డు స్థాయిలో రథసప్తమి వాహనసేవల వీక్షణ



మాట్లాడుతున్న తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్. చిత్రంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్‌వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు

తిరుమల, న్యూస్‌టుడే: రథసప్తమి నేపథ్యంలో ఈ ఏడాది రికార్డుస్థాయిలో 3.45 లక్షల మంది భక్తులు మాడ వీధుల్లో వాహన సేవలను దర్శించుకున్నారని తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి వెల్లడించారు. వాహనాల రద్దీ నేపథ్యంలో తిరుమలలో త్వరలోనే మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్నామని, రాంభగీచా వద్ద భక్తుల తోపులాటలు నివారించేందుకు భవిష్యత్తులో పటిష్ఠ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం స్థానిక అన్నమయ్య భవనంలో మీడియా సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో తితిదే, జిల్లా యంత్రాంగం, శ్రీవారి సేవకుల సమష్టి కృషితో ఈ సంవత్సరం రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించామన్నారు. 9.42 లక్షల మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశామన్నారు. లగేజీ కేంద్రాల ద్వారా గతంలో ఎన్నడూ లేనివిధంగా 3.56 లక్షల గ్యాడ్జెట్లు, బ్యాగులు, డిపాజిట్ చేశామని, ఇది గత ఏడాదికంటే 73 శాతం అధికమన్నారు. ఆర్టీసీ బస్సుల ద్వారా 3,864 ట్రిప్పులతో 1,42,666 మంది భక్తులు తిరుమల, తిరుపతి మధ్య ప్రయాణించారన్నారు. సమావేశంలో తితిదే సీవీఎస్‌వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

విశ్రాంత ఐపీఎస్ లక్ష్మీనారాయణ భార్యను మోసగించిన సైబర్ నేరగాళ్ల అరెస్టు

మాయగాళ్లు కాజేసిన రూ.45 లక్షలు ఫ్రీజ్

ఈనాడు, హైదరాబాద్: స్టాక్‌మార్కెట్‌లో ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో.. హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ భార్య ఊర్మిళను మోసగించిన కేసులో నలుగురు అంతర్రాష్ట్ర నిందితులను నగర సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. మయన్మార్ కేంద్రంగా మోసానికి పాల్పడినట్లు గుర్తించారు. బిహార్, పశ్చిమబెంగాల్‌కు చెందిన నలుగురు మ్యూల్ ఖాతాలు సమకూర్చినట్లు నిర్ధారించారు. ట్రాన్సిట్ వారెంట్‌పై నిందితులను హైదరాబాద్‌కు తీసుకొచ్చి రిమాండ్‌కు తరలించారు. మాయగాళ్లు కాజేసిన సొమ్ములో రూ.45 లక్షలను పోలీసులు ఫ్రీజ్ చేయించారు. బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో ఉంటున్న సీబీఐ పూర్వ జేడీ లక్ష్మీనారాయణ భార్య ఊర్మిళ వాట్సప్ నంబరుకు గతేడాది నవంబరులో స్టాక్‌మార్కెట్ పెట్టుబడుల పేరిట ఓ లింక్ వచ్చింది. తమ సంస్థలో పెట్టుబడితో 500 రెట్లు లాభం వస్తుందని నిందితులు ఆశచూపారు. ఆమెకు ట్రేడింగ్‌పై అవగాహన లేకపోవడంతో భర్త సహాయం తీసుకున్నారు. మోసగాళ్లు వారికి స్టాక్‌మార్కెట్ ప్రాఫిట్ గైడ్ ఎక్స్ఛేంజ్ గ్రూప్-20లో సభ్యత్వం ఇచ్చారు. తాము మార్కెట్ నిపుణులమని నమ్మిస్తూ.. డిసెంబరు 24 నుంచి ఈ నెల 5వ తేదీ వరకు 19 విడతలుగా రూ.2.58 కోట్ల పెట్టుబడి పెట్టించారు. రూ.2 కోట్ల లాభం వచ్చినట్టు డిజిటల్ ఖాతాలో చూపుతూ నమ్మకం కలిగించారు. ఆ డబ్బు విత్‌డ్రా చేసుకునే అవకాశం ఇవ్వకుండా మరి కొంత సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన ఊర్మిళ ఈ నెల మొదటివారంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిబంధనల ఉల్లంఘనల్ని ఉపేక్షించం

- ఏపీఈఆర్సీ ఛైర్మన్ పి.వి.ఆర్.రెడ్డి
- కర్నూలులో ప్రజాభిప్రాయ సేకరణ

ఈనాడు, కర్నూలు, కర్నూలు (వెంకటరమణకాలనీ), న్యూస్‌టుడే: డిస్కంల పరిధిలో జరిగే నిబంధనల ఉల్లంఘనలు, అవకతవకలను ఉపేక్షించేది లేదని, భవిష్యత్తులో పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని ఏపీఈఆర్సీ ఛైర్మన్ పి.వి.ఆర్.రెడ్డి అన్నారు. కర్నూలులోని ఏపీఈఆర్సీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన మాట్లాడారు. విద్యుత్ శాఖ కొనుగోళ్లపై ఆరోపణలొస్తున్నాయని.. అలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని హితవు పలికారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగుచోట్ల నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాల్లో 71 మంది తమ అభిప్రాయాలు, ఆందోళనలను వ్యక్తం చేశారని, పలువురు వినతి పత్రాలనూ అందించారని, వాటిని పరిశీలించి కమిషన్ తగిన సూచనలు చేస్తుందన్నారు.

2019-20 నుంచి 2023-24 మధ్యకాలానికి పంపిణీ సంస్థల 'ట్రూ అప్' భారం రూ.4,500 కోట్లుగా తేలగా.. ఆ భారం ప్రజలపై పడకుండా ప్రభుత్వమే భరించేందుకు ముందుకొచ్చిందని ఇంధనశాఖ అదనపు కార్యదర్శి కె.వి.కిశోర్‌కుమార్ చెప్పారు. 'వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2026-27) ఆదాయ అవసరాలు రూ.60 వేల కోట్లు కాగా... రాబడి రూ.44,500 కోట్లే ఉంది. ఆదాయ లోటు రూ.15,500 కోట్లు. ఫలితంగా ఒక యూనిట్ విద్యుత్‌ను వినియోగదారుడికి సరఫరా చేసేందుకు రూ.8 ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. అయినప్పటికీ వ్యవసాయ, ఆక్వా రంగాలకు, ఎస్సీ, ఎస్టీలు, బలహీనవర్గాల చేతివృత్తుల వారికి రాయితీపై విద్యుత్ ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని వివరించారు.



పి.వి.ఆర్.రెడ్డి

విద్యుత్ ఛార్జీలు పెరగవు

రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెరగకుండా ప్రభుత్వం అన్నిరకాల చర్యలూ తీసుకుందని ట్రాన్స్‌కో జేఎండీ, పవర్ పర్చేజ్ కోఆర్డినేషన్ కమిటీ సభ్య కన్వీనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ చెప్పారు. విద్యుత్ సంస్థల బకాయిల వసూళ్లపై దృష్టి సారిస్తామని, ప్రజాభిప్రాయ సేకరణలో పలువురు చేసిన విజ్ఞప్తులను డిస్కంలు సానుకూలంగా పరిశీలిస్తాయని ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్, సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి అన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల అధిక బిల్లులు వస్తున్నాయనేది అపోహ అని... కెపాసిటర్ల నిర్వహణలో లోపాలే అందుకు కారణమని తెలిపారు. విశాఖ నుంచి ఆన్‌లైన్‌లో ప్రజలు అడిగిన ప్రశ్నలకు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ సమాధానాలిచ్చారు.

కల్తీ నెయ్యితో అప్పన్న నెయ్యం

- తితిదేకి సరఫరా, లావాదేవీలలో చిన్న అప్పన్న ప్రధాన సూత్రధారి
- హైకోర్టుకు నివేదించిన సీబీఐ న్యాయవాది సురేశ్‌కుమార్

ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారం, అందుకు సంబంధించి జరిపిన ఆర్థిక లావాదేవీల విషయంలో వైకాపా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి పూర్వ పీఏ చిన్నఅప్పన్న ప్రధాన సూత్రధారి అని సీబీఐ స్టాండింగ్ కౌన్సెల్ పీఎస్‌పీ సురేశ్‌కుమార్ హైకోర్టుకు నివేదించారు. ఆయనపై నేరారోపణలకు సంబంధించిన అన్ని ఆధారాలు లభించాయన్నారు. ఈ కేసులో దర్యాప్తు ముగించి దిగువ కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశామని తెలిపారు. దానికి కోర్టు విచారణ నిమిత్తం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందన్నారు. అభియోగపత్రాన్ని సీల్డ్ కవర్లో హైకోర్టు ముందు ఉంచుతామని వెల్లడించారు. ఛార్జిషీట్‌ను పరిశీలించి బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవాలని కోరారు. సీబీఐ నేతృత్వంలోని సిట్ అధికారులు ఒత్తిడి చేసి తన నుంచి వాంగ్మూలం తీసుకున్నారంటూ అప్పన్న గతంలో సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి.. కేసు డైరీని తమ ముందు ఉంచాలని సిట్‌ను ఆదేశించారు. అప్పన్న బెయిల్ పిటిషన్‌పై విచారణను ఈనెల 29కి వాయిదా వేశారు. కల్తీ నెయ్యి సరఫరా కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చిన్న అప్పన్న హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. మంగళవారం ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా అప్పన్న తరఫు సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుతం సీబీఐ నేతృత్వంలోని సిట్ దర్యాప్తు పూర్తి చేసి అభియోగపత్రం దాఖలు చేసిందన్నారు. ఈ నేపథ్యంలో పిటిషనర్‌కు బెయిలివ్వాలని కోరారు.


తమిళనాట విద్యార్థినులకు గర్భాశయ క్యాన్సర్ నిరోధక వ్యాక్సిన్లు

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడులో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థినులకు గర్భాశయ క్యాన్సర్ నిరోధక వాక్సిన్ (హెచ్‌పీవీ)లు వేసే పథకాన్ని ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ చెన్నైలో మంగళవారం ప్రారంభించారు. తొలి విడతగా గర్భాశయ క్యాన్సర్ ప్రభావం ఎక్కువగా ఉన్న ధర్మపురి, పెరంబలూర్, తిరువణ్ణామలై, అరియలూర్ జిల్లాల్లో ఈ పథకం అమలు చేస్తారు. తర్వాత దశలవారీగా అన్ని జిల్లాలకు విస్తరించనున్నారు.

లంచం కేసులో ఏడాది జైలు, జరిమానా

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: మార్కుల జాబితా అటెస్ట్ చేసేందుకు లంచం తీసుకున్న అధికారికి ఏడాది కఠిన కారాగారం, రూ.10 వేల జరిమానా విధిస్తూ అనిశా ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం తీర్పు చెప్పింది. కర్నూలు జిల్లాకు చెందిన కె.మాధవీలత 2011-13 మధ్య కాలంలో డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పరిధిలో ఎమ్మెస్సీ(నర్సింగ్) చేశారు. ఆమె ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్లు అటెస్ట్ చేయాల్సి రావడంతో భర్త సుమన్ కుమార్ 2014లో విశ్వవిద్యాలయం పీజీ పరీక్షల విభాగం ఇ-సెట్ సూపరింటెండెంట్ శ్రీదేవిని సంప్రదించారు. అటెస్టెడ్ పత్రాలు జారీ చేసేందుకు శ్రీదేవి రూ.2 వేలు లంచం అడగడంతో సుమన్ కుమార్ విజయవాడ అనిశా డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆపై నిఘా ఉంచి శ్రీదేవి లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అధికారులు 2016 జులై 20న ఛార్జిషీట్ వేశారు. అనిశా ప్రత్యేక న్యాయస్థానం కేసు విచారించి తీర్పు చెప్పింది. శ్రీదేవి ప్రస్తుతం అదే వర్సిటీలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నారు. అప్పట్లో అనిశా డీఎస్పీ ఆర్.విజయ్‌పాల్ కేసు నమోదు చేయగా, కె.వి.సత్యనారాయణ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించారు.

మంటలార్పేందుకు వెళ్లి రైతు మృతి



పెనుకొండ, న్యూస్‌టుడే: తన పొలానికి మంటలు వ్యాపించకుండా వాటిని ఆర్పేందుకు వెళ్లిన ఓ రైతు అవే అగ్నికీలల్లో చిక్కుకొని మృతిచెందిన విషాద ఘటన శ్రీసత్యసాయి జిల్లాలో చోటు చేసుకొంది. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల మేరకు.. పెనుకొండ మండలం అడదాకులపల్లి గ్రామానికి చెందిన వెంకటరామనాయక్(60) మంగళవారం మధ్యాహ్నం తన పొలానికి వెళ్తూ సమీపంలో మంటలు చెలరేగడం గుర్తించారు. అవి తన పొలంలోకి వ్యాపిస్తాయని భావించి ఆర్పేయడానికి పరుగులు పెడుతూ అక్కడికి చేరుకున్నారు. ఆయాసంతో పాటు పొగ ధాటికి కళ్లు తిరిగి పడిపోయారు. క్రమంగా మంటలు అతడిని చుట్టుముట్టాయి. సమీప రైతులు, కూలీలు గమనించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించారు.

గోదావరి పుష్కరాలకు.. కీలక రోజుల్లో కోటి మంది చొప్పున స్నానాలు

- మహాకుంభమేళా తరహాలో సన్నాహాలు
- వీటిపై ఇప్పటికే అధ్యయనం
- శాఖల వారీగా ప్రణాళికలపై దృష్టి

ఈనాడు, అమరావతి: గోదావరి పుష్కరాలు వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జులై 7 వరకు జరగనుండగా..వీటిలో కీలక రోజుల్లో (పీక్ డేస్) సగటున కోటి మంది చొప్పున పుష్కర స్నానాలు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. పుష్కరాలు మొదలయ్యే రోజు, చివరి రోజు, వారాంతాలైన శని, ఆదివారాలు, అమావాస్య రోజున.. కోటి మంది చొప్పున భక్తులు వస్తారని భావిస్తున్నారు. మొత్తంగా ఆరు జిల్లాల పరిధిలో ఏర్పాటుచేసే ఘాట్లలో 8 నుంచి 10 కోట్ల మంది పుణ్యస్నానాలు చేస్తారని అధికారులు లెక్కలు వేశారు. 2015లో జరిగిన పుష్కరాల్లో 4.86 కోట్ల మంది పుణ్యస్నానాలు చేశారు. అత్యధికంగా 2015 జులై 18న 58.26 లక్షలు, 19న 56.23 లక్షల మంది భక్తులు వచ్చారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని అధికారులు ఏర్పాట్ల కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



కుంభమేళాపై అధ్యయనం

◆ గత ఏడాది ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు మహా కుంభమేళా జరిగింది. ఇందులో ఎటువంటి ఏర్పాట్లు చేశారో పరిశీలించాలని కొద్దిరోజుల క్రితం సీఎం చంద్రబాబు ఇక్కడి అధికారులను ఆదేశించారు. దీంతో మహాకుంభమేళాలో చేసిన ఏర్పాట్లపై అధికారులు అధ్యయనం చేశారు.

◆ మహా కుంభమేళాలో మొత్తం 66.3 కోట్ల మంది భక్తులు వచ్చారు. కీలక రోజుల్లో సగటున 5 కోట్ల మంది చొప్పున వచ్చారు.

◆ 4 వేల హెక్టార్లలో తాత్కాలిక టౌన్‌షిప్‌లు రూపొందించారు.

◆ 1.5 లక్షల టెంట్లు, అంతే సంఖ్యలో మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

◆ నది మీదుగా నడిచి వెళ్లేందుకు 30 పాంటూన్ వంతెనలు నిర్మించారు.

◆ కొత్తగా రెండు విమానాశ్రయ టెర్మినల్స్ అందుబాటులోకి తెచ్చారు. 14 వంతెనలు (ఫ్లైఓవర్లు) నిర్మించారు. 11 కొత్త ఆసుపత్రులు, 67 వేల ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. 17 ప్రధాన రోడ్లను తీర్చిదిద్దారు.

◆ మొత్తంగా రూ.7,109 కోట్ల మేర నిధులు వెచ్చించారు.

◆ కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట, తాత్కాలిక టెంట్లలో జరిగిన అగ్నిప్రమాదాలు వంటివాటిపై కూడా అధ్యయనం చేశారు.

◆ వీటన్నింటినీ దృష్టిలోపెట్టుకొని.. గోదావరి పుష్కరాలకు ఎటువంటి ఏర్పాట్లు చేస్తే.. భక్తులకు మెరుగైన సేవలు అందించవచ్చునేది అధికారులు పరిశీలిస్తున్నారు.

9,918 మీటర్ల పొడవున ఘాట్లు..

◆ గోదావరి మన రాష్ట్రంలో పోలవరం, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో కలిపి 212 కి.మీ. మేర ప్రవహిస్తుంది.

◆ ఇందులో 2015లో 234 పుష్కర ఘాట్లను ఏర్పాటు చేయగా, వాటిలో 4.5 కి.మీ. మేర పుష్కరస్నానాలు చేసేందుకు అవకాశం కల్పించారు.

◆ ఈసారి ఘాట్ల సంఖ్య 373కి పెంచనున్నారు. ఇవి 9,918 మీటర్లు (9.91 కి.మీ.) మేర ఉండనున్నాయి.

◆ రాజమహేంద్రవరానికి దగ్గరలో ఎక్కడ పుష్కర నగర్ ఏర్పాటుచేయాలి? తాత్కాలిక టెంట్ సిటీలు ఎక్కడెక్కడ, ఎన్ని ఏర్పాటు చేయాలి వంటివి పరిశీలిస్తున్నారు.

◆ తొలుత రాజమహేంద్రవరం వద్ద అక్కడి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒక మోడల్ ఘాట్ సిద్ధం చేస్తారు. ఆ ఘాట్‌లో ఏయే సదుపాయాలు, ఎంతెంత మేరకు ఉండాలనేది స్పష్టంగా ఉంటుంది. దీని ఆధారంగా మిగిలిన ఘాట్లను సిద్ధం చేస్తారు.

◆ 2027 జూన్ 26న పుష్కరాలు మొదలు కానుండగా, దానికి సరిగ్గా ఏడాది ముందు.. అంటే ఈ ఏడాది జూన్ 25న కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించి.. అప్పటికి ఏయే ఏర్పాట్లు జరిగాయి? ఇంకా ఏమి చేయాలన్నది సమీక్షించి, తదుపరి కార్యాచరణ కొనసాగిస్తారు.

వీటి సమాహారమే మానసిక దృఢత్వం



మానసిక దృఢత్వం అంటే బలహీనతలేవీ లేకుండా, కఠినంగా ఉండటం కాదు! కష్టాల్లో ఉన్నప్పుడూ కంగారు పడకుండా ఉండగలగాలి. ఆలోచించి నిర్ణయాలు తీసుకోగలగాలి. ఓపికతో వ్యవహరిస్తూ, పరిస్థితులకు తగ్గట్టు నడుచుకోవాలి. వీటన్నింటి సమాహారమే నిజమైన మానసిక దృఢత్వం.

– స్టీవ్ మాగ్నెస్, పర్ఫార్మెన్స్ కోచ్

(c) eenadu

అమెరికా నుంచి ప్రేమతో... జింకానా!

- చదువుకున్న విద్యాసంస్థకు 45 ఏళ్లుగా తోడ్పాటు
- గుంటూరు వైద్య కళాశాల, జీజీహెచ్‌ల అభివృద్ధిలో పూర్వవిద్యార్థుల ముద్ర
- రూ.150 కోట్లకుపైగా విరాళాలు

ఈనాడు, అమరావతి: జింకానా అంటే... గుంటూరు మెడికల్ కాలేజీ అలూమ్ని ఆఫ్ నార్త్ అమెరికా. 1981లో అతికొద్ది మందితో పురుడు పోసుకున్న ఈ సంఘంలో ఇప్పుడు 2 వేల మందికి పైగా సభ్యులున్నారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల(జీఎంసీ)లో చదువుకుని అమెరికాలో స్థిర పడిన వీరు... తమ కాలేజీతోపాటు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి(జీజీహెచ్) అభివృద్ధికి 45 ఏళ్లుగా కృషిచేస్తున్నారు. విరాళాలు ఇస్తూ... ఆధునిక వసతి సౌకర్యాలు కల్పిస్తూ, శాశ్వత భవనాలను నిర్మిస్తున్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు తమవంతు సాయం చేస్తూ.. రూ.150 కోట్లకు పైగా వెచ్చించడం విశేషం. వైద్య విద్యార్థులకు అవసరమైన మేధో పరిజ్ఞానం, శిక్షణలను అందించడంలోనూ సహకరిస్తున్నారు.



పూర్వవిద్యార్థుల విరాళాలతో ఏర్పాటైన పొదిల ప్రసాద్ జింకానా సూపర్ స్పెషాలిటీ అండ్ ట్రామా సెంటర్



ప్రభుత్వ వైద్య కళాశాలలో 20 ఏళ్ల క్రితం నిర్మించిన జింకానా ఆడిటోరియం

చిన్నపాటి సాయంతో మొదలు...

వైద్య కళాశాలకు మొదట్లో జిరాక్స్ యంత్రాన్ని అందించి దాతృత్వాన్ని చాటారు జింకానా సభ్యులు. వైద్య విద్యాలయంలో సభలు, సమావేశాల నిర్వహణకు రూ.5 కోట్లతో 2005లో ఆడిటోరియాన్ని నిర్మించారు. దీనిని సకల హంగులతో అత్యాధునికంగా తీర్చిదిద్దారు. జీజీహెచ్‌లో పేదల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 2014లో పొదిల ప్రసాద్ జింకానా సూపర్ స్పెషాలిటీ అండ్ ట్రామా సెంటర్‌ను ఏర్పాటు చేశారు. రూ.35 కోట్లతో ఈ నిర్మాణాన్ని సంకల్పించారు. ఇందులో రూ.5 కోట్లను పొదిల ప్రసాద్ విరాళంగా అందించారు. ప్రస్తుతం ఈ భవనం జీజీహెచ్‌కు 'గుండె'గా మారింది. కొవిడ్ కల్లోలం వేళ.. జీజీహెచ్‌కు రూ.కోట్ల విలువైన పరికరాలు, యంత్రాలు సమకూర్చడంలో జింకానా పాత్ర వెలకట్టలేనిది.

తల్లీబిడ్డలకు అండగా..

జీజీహెచ్‌లో మాతాశిశు సంరక్షణ ఏళ్ల తరబడి ఇబ్బందుల్లో కొనసాగింది. సరైన భవన సదుపాయం లేకపోగా.. ఒకే పడకపై ఇద్దరు తల్లులు, వారి పిల్లలను పడుకోబెట్టాల్సి వచ్చేది. ఈ దుస్థితిని స్వయంగా చూసి చలించిన కొందరు జింకానా సభ్యులు.. తల్లీబిడ్డలకు అండగా నిలవాలనుకున్నారు. రూ.100 కోట్లతో సెల్లార్, జీ+5 అంతస్తుల్లో 597 పడకలు, అధునాతన సౌకర్యాలతో కానూరి జింకానా మాతా శిశు సంరక్షణ భవన నిర్మాణానికి పూనుకున్నారు. డాక్టర్ గవిని ఉమాదేవి ఒక్కరే తన భర్త డాక్టర్ కానూరి రామచంద్రరావు పేరిట రూ.22 కోట్ల విరాళం ఇచ్చారు. ప్రభుత్వం రూ.27 కోట్ల విలువైన పరికరాలు అందించేందుకు ముందుకొచ్చింది. ఇతర ఖర్చులు కలిపి రూ.132 కోట్లతో భారీ భవనం అందుబాటులోకి వచ్చింది. దీనిని ఈ నెల 30న సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు.



జీజీహెచ్‌లో నిర్మితమైన కానూరి-జింకానా మాతాశిశు సంరక్షణ భవనం



విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వివిధ బ్యాంక్ ఉద్యోగుల సంఘాల నేతలు కాశీవిశ్వనాథ్, విజయశేఖర్, బాషా, రాజశేఖర్, వీఎస్ఆర్ శేఖర్, నారాయణ, సురేశ్‌రెడ్డి తదితరులు

సమ్మెబాట పట్టిన బ్యాంక్ ఉద్యోగులు

5 రోజుల పని విధానం కోరుతూ విధులకు దూరం



యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్స్ ఆధ్వర్యంలో విజయవాడ వన్‌టౌన్‌లోని యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

ఈనాడు, అమరావతి: బ్యాంకింగ్ రంగంలో వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలని రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు డిమాండు చేశారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) పిలుపు మేరకు మంగళవారం రాష్ట్రంలోని బ్యాంకు ఉద్యోగులు, అధికారులు, గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారుల సంఘం నుంచి కాశీవిశ్వనాథ్, విజయశేఖర్, బాషా, రాజశేఖర్, ఎన్‌సీబీఈ నుంచి వీఎస్ఆర్ శేఖర్, నారాయణ, సురేశ్‌రెడ్డి, బీఈఎఫ్ఐ నుంచి అజయ్‌కుమార్, రమణ, రఘురామ్, ఇతర బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు. ఆర్‌బీఐ, ఎల్ఐసీ, జీఐసీ తదితర ఆర్థిక సంస్థలతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, స్టాక్ ఎక్స్ఛేంజీలు ఇప్పటికే వారానికి ఐదు రోజులు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఎల్‌హెచ్‌ఓ వద్ద జరిగిన కార్యక్రమంలో అమరావతి సర్కిల్ ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఆర్.నరేంద్రకుమార్, డీజీఎస్ ఎన్.శ్రీనివాసాచార్యులు, శ్రీనివాస్, శ్రీధర్‌శర్మ, ఎల్‌హెచ్‌ఓ అధికారుల సంఘ పదాధికారులు మాట్లాడారు. ఉద్యోగులు అధిక ఒత్తిడి మధ్య పని చేస్తున్నారని.. 5 రోజుల పని డిమాండు న్యాయ సమ్మతమైనదని పేర్కొన్నారు. పదేళ్లకు పైగా ఈ డిమాండు పెండింగ్‌లో ఉందని.. అధికారులు పదేపదే హామీలు ఇచ్చినా ఇప్పటి వరకు అమలు జరగలేదన్నారు. అందుకే ఆందోళన బాట పట్టాల్సి వచ్చిందని వివరించారు. ఇప్పటికైనా ఈ న్యాయమైన సమస్యను పరిష్కరించే దిశగా కేంద్ర ప్రభుత్వం, బ్యాంకు అసోసియేషన్ చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు అంతర్వేది లక్ష్మీ నృసింహస్వామి కల్యాణం

అంతర్వేది, మామిడికుదురు, న్యూస్‌టుడే: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి దివ్య కల్యాణోత్సవాన్ని బుధవారం అర్ధరాత్రి (తెల్లవారితే గురువారం) 1:56 గంటలకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు రానున్నందున అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 1,500 మంది పోలీసు సిబ్బంది విధుల్లో నిమగ్నమయ్యారు. తీర్థ స్థలిలో ఎక్కడి నుంచైనా కల్యాణ ఘట్టాలను వీక్షించేలా ముఖ్య ప్రదేశాల్లో ఎల్ఈడీ తెరలను అమర్చారు. వివిధ డిపోల నుంచి 125 ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపనున్నారు. అంతర్వేది సాగర సంగమం వద్ద ప్రత్యేక బారికేడ్లతో పాటు 150 మంది గజ ఈతగాళ్లను అధికారులు సిద్ధం చేశారు.

నేరుగా జీవితఖైదు విధించే అధికారం హైకోర్టు, సుప్రీంకోర్టులకే ఉంటుంది

స్పష్టం చేసిన కర్ణాటక హైకోర్టు

బెంగళూరు(రామమూర్తినగర), న్యూస్‌టుడే: శిక్షలో మినహాయింపు లేకుండా నేరుగా జీవితఖైదు విధించే అధికారం హైకోర్టు, సుప్రీంకోర్టులకే ఉంటుందని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. ఓ హత్య కేసులో నిందితుడికి సెషన్స్ కోర్టు విధించిన 'మరణించేవరకు జీవితఖైదు' శిక్షను సాధారణ జీవిత ఖైదు శిక్షగా మారుస్తూ ఇచ్చిన తీర్పు సందర్భంగా హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. శివమొగ్గ జిల్లా హోసమనె గ్రామానికి చెందిన రుద్రేశ్ (28) ఒక మఠంలో పని చేసేవాడు. ఆ మఠానికి వచ్చే ఒక భక్తుడు ఆహారం వితరణకు సంబంధించి రుద్రేశ్‌తో పలు మార్లు గొడవపడ్డాడు. దాంతో ఆ భక్తుడిపై ఉన్న కోపంతో అతడి మూడున్నరేళ్ల కుమారుణ్ని 2017 ఏప్రిల్ 10న రుద్రేశ్ అపహరించి, హత్య చేశాడు. ఈ కేసులో నిందితుడికి శివమొగ్గ 5వ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయస్థానం మరణించేవరకు జీవితఖైదును విధించింది. దీన్ని రుద్రేశ్ కర్ణాటక హైకోర్టులో సవాల్ చేశాడు. విచారించిన న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌పీ సందేశ్.. రుద్రేశ్‌కు విధించిన మరణించేవరకు జీవిత ఖైదును సాధారణ జీవితఖైదుగా మారుస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు.



పిల్లల ప్రవర్తనను మార్చే ఆయుధాలవి!

పిల్లల ప్రవర్తన బాగుంటేనే వారికి ఆనందాన్నిచ్చే పనులు చేయాలనుకోవడం సరికాదు! నిజానికి చిన్నారుల ప్రవర్తనను సరిదిద్దేందుకు.. ఆటలు ఆడటం, పర్యటనలకు వెళ్లడం వంటివాటిని ఆయుధాలుగా తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలి. 'నీ ప్రవర్తన బాగుంటేనే మనం ఆడుకుందాం' అనడానికి బదులు.. 'నువ్వు ఎలా ఉండాలో నేర్చుకునేందుకు మనం ఆడుకుందాం' అని చెప్పాలి. ఓర్పు, క్రమశిక్షణ, మంచి ప్రవర్తన వంటివి నేర్పేందుకు పిల్లలతో సమయం గడపడం, ఆడటం చేయాలి.

– గోర్, కంటెంట్ క్రియేటర్

గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత నిధి

- కొత్త లేబర్ కోడ్‌లతో కార్మికులకు భరోసా
- కేంద్ర కార్మిక మంత్రి శోభా కరంద్లాజె



విలేకర్లతో మాట్లాడుతున్న శోభా కరంద్లాజె, సుభాష్

ఈనాడు, అమరావతి: అసంఘటిత రంగ కార్మికులు, గిగ్ వర్కర్ల కోసం రాష్ట్రాల స్థాయిలో ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజె సూచించారు. స్విగ్గీ, జొమాటో వంటి సంస్థల్లో పనిచేసే గిగ్ వర్కర్లకు కేంద్రం తీసుకువచ్చిన కొత్త లేబర్ కోడ్‌ల ద్వారా చట్టబద్ధమైన గుర్తింపు దక్కుతుందన్నారు. వారికోసం సామాజిక భద్రత నిధి ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కార్మిక-ఉపాధి, పరిశ్రమల శాఖ కార్యదర్శులతో విజయవాడలో రెండు రోజులపాటు నిర్వహించే దక్షిణ భారత ప్రాంతీయ సదస్సులో మంగళవారం ఆమె పాల్గొన్నారు. 'కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత, వ్యాపార నిర్వహణను సులభతరం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కొత్త లేబర్ కోడ్‌లతో సంస్కరణలు తీసుకొచ్చింది. ఈపీఎఫ్‌వో, ఈఎస్ఐ సౌకర్యాలు అసంఘటిత రంగంలోని 90 శాతం కార్మికులకు చేరువ చేయాలి. కేంద్ర కోడ్‌లకు అనుగుణంగా రాష్ట్రాలు తమ సొంత నిబంధనలు వెంటనే నోటిఫై చేయాలి. లైసెన్సులు, రిజిస్ట్రేషన్ల కోసం సింగిల్ విండో విధానం అమలుచేయాలి' అని మంత్రి సూచించారు.

ఈఎస్ఐ వైద్యకళాశాల, ఆసుపత్రులకు ప్రతిపాదనలు: మంత్రి సుభాష్

ఈ సదస్సులో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ.. 'విశాఖలో 50 సీట్ల ఈఎస్ఐ వైద్య కళాశాల, అమరావతిలో కొత్త ఈఎస్ఐ వైద్య కళాశాల, 500 పడకల సెకండరీ కేర్ ఆసుపత్రి, 150 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. నెల్లూరు, శ్రీసిటీ, కర్నూలు, గుంటూరులో ఈఎస్ఐ ఆసుపత్రులకు ఉచితంగా భూమి కేటాయించాం' అని వెల్లడించారు. సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, దిల్లీ, పుదుచ్చేరి ప్రాంతాల కార్మిక, పరిశ్రమల శాఖల అధికారులు పాల్గొన్నారు.

భాజపా కార్యక్రమాలు భేష్: శోభా కరంద్లాజె

ఆంధ్రప్రదేశ్‌లో భాజపా చేపట్టిన ఏకాత్మ మానవ దర్శనం పునఃస్మరణ, అటల్- మోదీ సుపరిపాలన యాత్ర కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయని కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజె అభినందించారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. రాష్ట్రంలో పార్టీ పరంగా చేపడుతున్న కార్యక్రమాల వివరాలను నాయకులు వివరించారు.

కోర్టు హాల్లోకొచ్చి నిందితుణ్ని అరెస్ట్ చేయడమా?

- ఇలాంటివి అనుమతిస్తే ఏదైనా చేస్తారు
- పోలీసుల వైఖరిని తప్పుపట్టిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: కర్నూలు జిల్లా పత్తికొండ కోర్టులో లొంగిపోవడానికి వచ్చిన ఓ నిందితుణ్ని పోలీసులు మఫ్టీలో వచ్చి అరెస్ట్ చేసిన వ్యవహారాన్ని హైకోర్టు తప్పుపట్టింది. ఇలాంటి చర్యలను అనుమతిస్తే.. రేపటి రోజున ఏదైనా చేస్తారని వ్యాఖ్యానించింది. పత్తికొండ కోర్టు మేజిస్ట్రేట్ అనుమతి తీసుకోకుండా అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించింది. హైకోర్టులోనూ నిందితులను ఇలానే అరెస్ట్ చేస్తారా అని వ్యాఖ్యానించింది. బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకున్నారా అని ఆరా తీసింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న చిప్పగిరి ఎస్ఐ సతీష్ కుమార్, పత్తికొండ ఎస్ఐ విజయ్‌కుమార్ నాయక్, ఇద్దరు కానిస్టేబుళ్లకు నోటీసులిచ్చింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని ఆదేశించింది. విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

◆ చిప్పగిరి మండలం దేగులపాడుకు చెందిన శివయ్య గంజాయి సాగు చేస్తున్నారనే ఆరోపణతో చిప్పగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మేజిస్ట్రేట్ కోర్టులో లొంగిపోయేందుకు ఆయన డిసెంబర్ 24న కోర్టుకు వస్తే పోలీసులు మఫ్టీలో వచ్చి అదుపులోకి తీసుకున్నారని, న్యాయాధికారి అనుమతి తీసుకోలేదని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పత్తికొండ న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి భాస్కర్ హైకోర్టులో వ్యాజ్యం వేశారు. మంగళవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫున న్యాయవాది కేవీ రఘువీర్ వాదనలు వినిపించారు. బాధ్యులైన పోలీసులపై ఏమైనా చర్యలు తీసుకున్నారా అని న్యాయమూర్తి అడిగిన ప్రశ్నకు ఏజీపీ బదులిస్తూ ఛార్జి మెమోలు జారీచేసి వివరణ కోరారన్నారు.

కదిరి రథానికి తాళ్లరేవు తాడు





నాలుగు తాళ్లను సిద్ధం చేస్తూ.. ★ వాటిని కలిపిన తర్వాత ఇలా..

కొబ్బరి తాళ్ల తయారీకి పేరుగాంచిన కాకినాడ జిల్లాలోని తాళ్లరేవులో 30 అంగుళాల మందం, 400 అడుగుల పొడవైన పెద్ద తాడును నేశారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి లక్ష్మీనరసింహస్వామి రథం లాగేందుకు దీనిని వినియోగించనున్నారు. కార్మికులు తొలుత 220 చిన్న తాళ్లను కలిపి ఒక తాడుగా చుట్టారు. అలాంటివి నాలుగు కలిపి పెద్ద తాడును నేశారు. ఇందు కోసం 300 మంది వారం రోజుల పాటు శ్రమించారు. తాడు మొత్తం బరువు 2 టన్నులని, వచ్చే నెలలో జరగనున్న రథోత్సవానికి ప్రత్యేక వాహనంలో కదిరి తరలిస్తామని తాళ్ల వ్యాపారి సూర్యప్రకాష్ తెలిపారు. – న్యూస్‌టుడే, తాళ్లరేవు

విశాఖ వేదికగా యుద్ధనౌకల పండగ!

- పదేళ్ల తర్వాత మళ్లీ ఇక్కడే ఐఎఫ్ఆర్-2026
- వచ్చే నెల 15-20 తేదీల మధ్య నిర్వహణ
- 61 దేశాలు హాజరయ్యే అవకాశం



సాగరంలో యుద్ధ నౌకలు

ఈనాడు, విశాఖపట్నం: యుద్ధనౌకల పండగకు విశాఖ సాగరతీరం మరోసారి వేదికవుతోంది. దేశ చరిత్రలో మొదటి సారిగా ప్రపంచ దేశాలతో అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష (ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ-ఐఎఫ్ఆర్)ను 2016లో ఇక్కడే నిర్వహించారు. దాదాపు పదేళ్ల తర్వాత ప్రతిష్ఠాత్మకమైన ఐఎఫ్ఆర్-2026కు సాగరతీరం రెండోసారి ఆతిథ్యమిస్తోంది. ఫిబ్రవరి 15-20 తేదీల మధ్య దీన్ని నిర్వహించనున్నారు. ఇదే సమయంలో మిలాన్ విన్యాసాలూ జరగనున్నాయి. గతంలో ఐఎఫ్ఆర్‌లో 51 దేశాలు పాల్గొన్నాయి. ఈసారి 100కు పైగా దేశాలకు (చైనా, పాకిస్థాన్‌లకు ఆహ్వానాలు పంపలేదు) ఆహ్వానాలు పంపించగా.. 61 దేశాలు వచ్చేందుకు అంగీకరించినట్లు గతేడాది నేవీ డే రోజు తూర్పు నౌకాదళ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా తెలిపారు. ఐఎఫ్ఆర్‌కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ ఇప్పటికే ఆహ్వానించారు. ఈ ఫ్లీట్ రివ్యూలో ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ విక్రాంత్, దిల్లీ, రాజ్‌పుత్, విశాఖ, ఐఎన్ఎస్ నీలగిరి, ఆర్నాలా, శివాలిక్, బ్రహ్మపుత్ర, తల్వార్ తరగతికి చెందిన స్వదేశీ పరిజ్ఞానంతో చేసిన యుద్ధ నౌకలు, అణు జలాంతర్గాములతో పాటు వివిధ దేశాలకు చెందిన 23 యుద్ధనౌకలు పాల్గొననున్నాయి. అందుకు తగ్గట్లు సన్నద్ధత ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

ఏమిటీ ఫ్లీట్ రివ్యూ: మన దేశంలోని యుద్ధనౌకల శక్తి సామర్థ్యాలను ఒకచోట సమీక్షించడాన్నే ఫ్లీట్ రివ్యూ అంటారు. ఏటా రాష్ట్రపతి ఆధ్వర్యంలో త్రివిధ దళాలకు ఈ సమీక్ష నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అనంతర కాలంలో ఇతర దేశాల నౌకాదళాలతోనూ సంబంధాలు బలపర్చడానికి, సముద్ర రక్షణ రంగ సామర్థ్యాలు ప్రదర్శించడానికి అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూకు ఇది ఎదిగింది. విశాఖ వద్ద సాగరంలో ఇతర దేశ నౌకలపై ఆయా రక్షణ దళాలు నిల్చుని... వారి ముందుగా వెళుతున్న రాష్ట్రపతి నౌకకు సెల్యూట్ చేస్తూ గౌరవ వందనం చేస్తారు. ఆ తర్వాత వివిధ నౌకాదళాల శక్తి సామర్థ్యాలు, తాజా సాంకేతికతలపై ప్రదర్శన నిర్వహిస్తారు. ప్రపంచ దేశాల నుంచి వచ్చిన నావికా సిబ్బందితో బీచ్ రోడ్డులో ప్రత్యేక పరేడ్ నిర్వహిస్తారు. ప్రధాన మంత్రి గౌరవ వందనం స్వీకరిస్తారు. భాగస్వామ్య దేశాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలు ఉంటాయి.

సముద్రాల ద్వారా ఏకమవుదామంటూ

ప్రపంచంలోని పలు దేశాల నౌకాదళాలను ఒక చోట చేర్చి సముద్ర భద్రత, స్థిరత్వం, సహకారం, సమన్వయాన్ని పెంపొందించడం ముఖ్య లక్ష్యంగా ఈ ఫ్లీట్ రివ్యూ ఉంటుంది. రెండోసారి విశాఖలో నిర్వహిస్తున్న ఫ్లీట్ రివ్యూకు 'యునైటెడ్ త్రూ ఓషన్స్' (సముద్రాల ద్వారా ఏకమవుదాం) అనే థీమ్‌ను ఎంచుకున్నారు. తీరప్రాంత భద్రత, కొత్త సాంకేతికత, బ్లూ ఎకానమీ అంశాలపై ఫ్లీట్ రివ్యూలో చర్చించనున్నారు. అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ కోసం నేవీ వర్గాలు ఇటీవల ఓ ప్రచార వీడియోను విడుదల చేశాయి. ఫ్లీట్ రివ్యూ తర్వాత మిలాన్(బహుళ దేశాల నౌకాదళ విన్యాసాలు) కూడా ఉంటుంది. ఈ వేడుకలను సైతం ఫిబ్రవరి 19న ఆర్కే బీచ్ వేదికగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యే అవకాశం ఉంది.

రైల్వే కోడూరు ఎమ్మెల్యేపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ

రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

ఈనాడు, అమరావతి, ఈనాడు డిజిటల్, తిరుపతి: తిరుపతి జిల్లా రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఆరోపణలను రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణించింది. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ బాధితురాలితో మంగళవారం ఫోన్లో మాట్లాడి ఘటన పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరుపుతామని, నిజానిజాలు తేల్చి తగిన చర్యలు తీసుకుంటామని బాధితురాలికి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే శ్రీధర్ తనపై అత్యాచారానికి పాల్పడ్డారని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశారని అదే నియోజకవర్గంలో పని చేస్తున్న ఓ ప్రభుత్వ ఉద్యోగిని ఆరోపణలు చేసిన వీడియో వైరల్ అయింది. అయితే, తన కుమారుడిపై ఓ ఉద్యోగిని ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తోందని ఎమ్మెల్యే శ్రీధర్ తల్లి ప్రమీల విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన నేత తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ.. సదరు మహిళ ఎమ్మెల్యేను రూ.25 కోట్లు డిమాండ్ చేసిందని, ఆమె బెదిరింపులకు పాల్పడిన ఆడియోలు, వీడియోలు తమ వద్ద ఉన్నాయన్నారు.

ఇదంతా దుష్ప్రచారం: ఎమ్మెల్యే శ్రీధర్

కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, తనపై వస్తున్న ఆరోపణలకు న్యాయస్థానంలో బదులిస్తానని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. కొందరు డీప్ ఫేక్ వీడియోలతో తనపై ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. వారిని వదలబోనన్నారు.

కారుణ్య నియామక అభ్యర్థనను... ఏకపక్షంగా తిరస్కరించడానికి వీల్లేదు

- మానవీయ కోణంలో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి
- ఉద్యోగి మృతి.. కుటుంబానికి ఆర్థిక మరణం కాకూడదు
- పిటిషనర్ దరఖాస్తును 3 నెలల్లో పరిగణనలోకి తీసుకోండి
- రైల్వే అధికారులకు హైకోర్టు ఆదేశం



ఈనాడు, అమరావతి: 'ఉద్యోగి మృతి.. ఆయన కుటుంబానికి ఆర్థిక మరణం కాకూడదు. ఉద్యోగులు ఆస్తులనే కాదు.. కొన్నిసార్లు పేదరికాన్నీ వదిలి వెళతారు' అని హైకోర్టు పేర్కొంది. కారుణ్య నియామకం హక్కు కానప్పటికీ ఆ అభ్యర్థనను న్యాయబద్ధంగా, మానవీయ కోణంలో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని అధికారులకు స్పష్టంచేసింది. ఏకపక్షంగా తిరస్కరించకూడదంది. ఉద్యోగి కుటుంబసభ్యుల ఆర్థిక ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోవాలని, తక్షణ సాయం చేయడంలో కారుణ్య నియామకం భాగమని తెలిపింది. 'ఉద్యోగి మరణించినా, అనారోగ్యంతో పదవీ విరమణ చేసినా.. ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోకుండా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. దరఖాస్తు చేయడంలో జాప్యముందన్న కారణంతో కారుణ్య నియామక అభ్యర్థనను తిరస్కరించడం సరికాదు' అని హైకోర్టు పేర్కొంది. కారుణ్య నియామకం కోసం పిటిషనర్ నారాయణమ్మ సమర్పించిన దరఖాస్తును మూడు నెలల్లో పరిగణనలోకి తీసుకోవాలని రైల్వే అధికారులను ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ తుహిన్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఈమేరకు ఇటీవల తీర్పు ఇచ్చింది.

ఇదీ నేపథ్యం..

విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన రాములు గ్యాంగ్‌మన్‌గా పనిచేసేవారు. అనారోగ్యంతో ఉద్యోగం చేయలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. రైల్వే అధికారులు 1999లో రాములుకు ప్రత్యామ్నాయ ఉద్యోగం ఇవ్వదలిచారు. అందుకు నిరాకరించిన రాములు 2000లో స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నారు. 2006లో రాములు కుమార్తె నారాయణమ్మ కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. డివిజనల్ రైల్వే అధికారులు నారాయణమ్మ దరఖాస్తును ఉన్నతాధికారులకు సిఫారసు చేయగా దానిని రైల్వే జనరల్ మేనేజరు తిరస్కరించారు. నిబంధనల ప్రకారం ఐదేళ్లలోపు దరఖాస్తు చేయలేదనే కారణాన్ని చూపారు. ఈ నిర్ణయంపై కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్(క్యాట్)ను ఆశ్రయించినా ఆమెకు ఉపశమనం లభించలేదు. దీంతో 2019లో హైకోర్టులో పిటిషన్ వేశారు.

అసాధారణ జాప్యం కాదు

ఈ వ్యాజ్యంపై హైకోర్టు ఇటీవల తుది విచారణ జరిపింది. పిటిషనర్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, కుటుంబ పోషణ కోసం ఆమె పనిమనిషిగా మారారని.. ఈ విషయాలను రైల్వే అధికారులు, క్యాట్ పరిగణనలోకి తీసుకోలేదని తప్పుబట్టింది. ఐదేళ్ల జాప్యం ఉందన్న కారణంతో దరఖాస్తును అధికారులు తిరస్కరించారని, వాస్తవానికి ఇది అసాధారణ జాప్యమేమీ కాదని తేల్చిచెప్పింది.

రాజధానికి రూ.4,450 కోట్ల హడ్కో రుణానికి ప్రభుత్వ గ్యారంటీ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరగనుంది. రాజధాని అమరావతికి హడ్కో నుంచి రూ.4,450 కోట్ల రుణం తీసుకునేందుకు ప్రభుత్వ గ్యారంటీ, రాజధానిలో భూమి లేని పేదలకు ఇస్తున్న పింఛను పథకాన్ని తల్లిదండ్రులు లేని మైనర్ పిల్లలకు వర్తింపజేయడం, ఎల్‌పీఎస్ లేఅవుట్‌లో వీధిపోటు ఉన్న 112 స్థలాలకు బదులు రైతులకు వేరేచోట స్థలాల కేటాయింపు వంటి అంశాలపై సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.

జగన్‌ను కలిసిన జోగి సోదరులు

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో అరెస్టై ఇటీవల బెయిల్‌పై విడుదలైన వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు రాము మాజీ సీఎం జగన్‌ను కలిశారు. తాడేపల్లిలోని జగన్ నివాసంలో మంగళవారం ఈ భేటీ జరిగింది. నకిలీ మద్యం కేసులో 83 రోజుల పాటు తమను జైల్లో పెట్టారని, కేసులు పెట్టి తమ కుటుంబాన్ని ప్రభుత్వం వేధిస్తోందని జోగి సోదరులు జగన్‌కు వివరించారు. 'కేడర్ ఎవరూ కేసులకు భయపడాల్సిన అవసరం లేదు. వాటిని ధీటుగా ఎదుర్కొందాం. అవసరమైన న్యాయ సహాయాన్ని పార్టీ న్యాయ విభాగం అందిస్తుంది' అని జగన్ వారికి భరోసా ఇచ్చారు.

'జన నాయగన్'కు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలన్న ఉత్తర్వులు రద్దు

మళ్లీ విచారించాలన్న మద్రాసు హైకోర్టు

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: ప్రముఖ తమిళ నటుడు విజయ్ హీరోగా నటించిన 'జన నాయగన్' సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులను మద్రాసు హైకోర్టు రద్దు చేసింది. మళ్లీ సింగిల్ జడ్జి విచారణ చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేసింది. తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధ్యక్షుడు విజయ్ నటించిన 'జన నాయగన్' సినిమాను కేవీఎన్ ప్రొడక్షన్ నిర్మించింది. సినిమాలో మతం, భద్రతా దళాలకు సంబంధించిన సన్నివేశాలు ఉండటంతో సెన్సార్ బోర్డు.. మానిటరింగ్ కమిటీ పరిశీలనకు సిఫారసు చేసింది. దీంతో వెంటనే సెన్సార్ సర్టిఫికెట్ వచ్చేలా చూడాలని నిర్మాణ సంస్థ హైకోర్టులో పిటిషన్ వేసింది. దీన్ని విచారించిన న్యాయమూర్తి జస్టిస్ ఆశ వెంటనే యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డును ఆదేశించారు. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ సెన్సార్ బోర్డు అప్పీల్ చేసింది. ఈ అప్పీల్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎం.శ్రీవాస్తవ, జస్టిస్ అరుళ్‌మురుగన్ ధర్మాసనం ఇటీవల విచారించి సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధించింది. ఆ తీర్పును మంగళవారం వెల్లడించింది. సినిమాకు వెంటనే యూ/ఏ సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేసింది. తగిన వివరణ ఇచ్చేందుకు సెన్సార్ బోర్డుకు గడువు ఇవ్వలేదని, సినిమాలో కొన్ని సన్నివేశాలు సామాజిక సమస్యలు సృష్టించేలా ఉన్నాయని బోర్డు చెబుతోందని పేర్కొంటూ కేసును సమగ్రంగా విచారించి కొత్త ఉత్తర్వులు జారీ చేయాలని జస్టిస్ ఆశను ఆదేశించింది.

EENADU Vol: 52, Issue: 168 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

(c) eenadu

ప్రకృతి ఒడిలో పులకరించే ప్రతి మొక్కా ఒక అద్భుతమే. మనకు బయట కనిపించే ఆకులు, కొమ్మలు కేవలం ట్రైలర్ మాత్రమే. అసలు సినిమా కణాల లోపల దాగున్న అణువుల ప్రపంచంలో నడుస్తోంది. మొక్కలకు మెదడు లేదు, నాడులు లేవు. అయినా అవి మనకంటే తెలివిగా ఎలా ప్రవర్తిస్తున్నాయి? గత ఏడాదో, పోయిన నెలలోనో ఎదురైన కష్టాలను అవెలా గుర్తుపెట్టుకుంటున్నాయి? ఇది మనిషి మేధస్సుకే సవాలు విసురుతోంది. మనం రోజూ చూస్తున్న చెట్టు నిశ్శబ్దంగా నిలబడి ఉంటుంది. కానీ ఆ నిశ్శబ్దం వెనుక పెద్ద లెక్క ఉంది. మొక్కకు కాళ్లు లేవు, పారిపోలేదు, దాక్కోలేదు. అయినా వాతావరణం మారినప్పుడల్లా తన శరీరాన్ని, తన పనిని, తన వేగాన్ని మార్చుకుంటుంది. ఇలా మార్చుకోవడం వెనుక ఏదో 'జ్ఞాపకశక్తి' ఉంది. దాని రహస్యమేంటి?

మనం ఇక్కడ వేడిగా ఉంటే చల్లగా ఉండే చోటుకు వెళ్తాం. ఎండ కాస్తుంటే నీడలోకి వెళ్లి సేద తీరుతాం. కానీ ఒకే చోట పాతుకుపోయి ఉండే చెట్టు మండుటెండలను, గడ్డకట్టే చలిని, ముంచెత్తే వానలను ఎలా భరిస్తోంది? ఆశ్చర్యకరమైన విషయం- గత ఏడాది డిసెంబర్‌లో వచ్చిన చలిని 'గమనించి', ఈ ఏడాది వసంతం రాగానే 'ఇదే పూల కాలం' అని నిర్ణయించి పువ్వులు ఎలా పూయిస్తుంది? 'చలి వచ్చింది' అని అదెలా గుర్తుపెట్టుకుంటుంది? 'ఇప్పుడు వెచ్చదనం వచ్చింది' అని ఎలా నిర్ణయిస్తుంది? దీన్నే శాస్త్రవేత్తలు చలికాలపు అనుభవం లేదా వెర్నలైజేషన్ అంటారు. అంటే, మొక్కలు చలికాలపు తీవ్రతను తమలో దాచుకుని, వెచ్చని ఎండలు రాగానే ఆ జ్ఞాపకంతో పూ మొగ్గలు తొడిగేలా చేసే ప్రక్రియ అన్నమాట. ఇది యాదృచ్ఛికంగా జరిగేది కాదు, మొక్కల లోపల ఒక పక్కా 'డిజిటల్ మెమరీ' లాంటి వ్యవస్థ ఉందని బ్రిటన్‌లోని యార్క్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు తాజాగా నిరూపించారు.

రుతువులు అస్తవ్యస్తమైతే ఎలా?

ఇప్పటి ప్రపంచాన్ని వేధిస్తున్న సమస్య భూతాపం. రుతువులు సమయానికి రావడం లేదు. ఎప్పుడో రావాల్సిన చలి ముందే వస్తోంది. ఉండాల్సినంత కాలం ఉండడం లేదు. ఇలాంటి దోలాయమాన పరిస్థితుల్లో మొక్కలు కూడా తికమకపడతాయి. ఎప్పుడు పూలు పూయాలో, ఎప్పుడు పంట పండాలో? ఒకసారి తప్పు సమయానికి పూలు పూస్తే, పంట నష్టం ఖాయం. అంటే మొక్కల జ్ఞాపకం తడబడి పోతే, మన ఆహార భద్రత కూడా అస్తవ్యస్తం అయిపోతుంది. ఇక్కడే యార్క్ విశ్వవిద్యాలయం కొత్త పరిశోధన ప్రాధాన్యం సంతరించుకుంటోంది. శాస్త్రవేత్తలు ఇప్పుడు మొక్కలు మారుతున్న వాతావరణానికి అనుగుణంగా తమ జ్ఞాపకాన్ని ఎలా మార్చుకుంటున్నాయో పరిశీలిస్తున్నారు. వేడి తట్టుకునే మొక్కల్లో పని చేసే ప్రొటీన్ గుంపులను, చలి తట్టుకునే మొక్కల విధానాలతో పోలుస్తున్నారు. సూటిగా చెప్పాలంటే- ఒక మొక్క ధైర్యాన్ని మరో మొక్కకు నేర్పే అవకాశాలను గుర్తిస్తున్నారు. వాతావరణం ఎటు తిరిగినా తట్టుకునే పంటల దిశగా ఈ పరిశోధన మనల్ని తీసుకెళ్తోంది.

ఆకుపచ్చ డైరీ



కణాల లోపలి మాయాజాలం!

మనలో జ్ఞాపకం మెదడులోని నాడుల మధ్య బంధాలుగా ఏర్పడుతుంది. కానీ మొక్కల్లో జ్ఞాపకమంటే కేవలం రసాయన ముద్రలు. దీనినే శాస్త్రంలో అనువంశిక మార్పుల శాస్త్రం లేదా ఎపిజెనెటిక్స్ అంటారు. పేరే పెద్దగా ఉంది కానీ భావం సులువు. డీఎన్‌ఏ మారకుండానే, దాని మీద 'చిన్న గుర్తులు' పెట్టడం ద్వారా కణం తన పని తీరు మార్చుకుంటుంది. ఒక పుస్తకంలో ముఖ్యమైన పేజీ దగ్గర మనం స్టిక్కర్ అంటించినట్లుగా మొక్కలు కూడా తమ జన్యువుల మీద కొన్ని రసాయన ముద్రలు వేస్తాయి. చలి పెరిగినప్పుడు కణ కేంద్రకంలోని ప్రొటీన్లు గుంపులుగా మారి, 'ఇప్పుడు చలి ఎక్కువ. శక్తిని ఆదా చేయి, పూలు పూయొద్దు' అని మొక్కకు చెబుతాయి. చిత్రమేంటంటే- చలి తగ్గినా ఆ గుంపులు వెంటనే కరిగిపోవు. అలాగే ఉంటాయి. ఇది మన కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లో ఫైల్ సేవ్ అయినట్టు సురక్షితంగా, నిల్వ ఉంటుంది. ఈ విధంగా మొక్కలో ఈ జ్ఞాపకం అన్నది ఒక సున్నితమైన రసాయన ముద్రగా, ఒక ప్రొటీన్ ఏర్పాటుగా నిలిచిపోతుంది.

సూక్ష్మదర్శిని చూపిన కొత్త కన్ను

మొక్కల్లోని ప్రొటీన్ ముద్రల రహస్యాన్ని వెలుగులోకి తెచ్చింది 'స్లిమ్‌వర్' అనే అత్యాధునిక సూక్ష్మదర్శిని. సాధారణ పరికరాలతో కణం పైభాగం మాత్రమే కనిపిస్తుంది. కానీ స్లిమ్‌వర్ ప్రత్యేకత ఏంటంటే- కణం లోపల ఉండే జీవ పదార్థాలు.. అంటే ప్రొటీన్లు ఎలా కదులుతున్నాయి? ఎలా జట్లు కడుతున్నాయి? అన్నది ప్రత్యక్ష వీడియోలా చూపిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, కణం లోపల జరిగే పనిని నేరుగా చూసే వీలు కల్పిస్తుంది అన్నమాట. ఈ ప్రయోగాల కోసం శాస్త్రవేత్తలు ఒక రకమైన చిన్న ఆవజాతి మొక్కను ఎంచుకున్నారు. స్లిమ్‌వర్ సాయంతో దాని కణాల్లోకి తొంగి చూసినప్పుడు, చలి పెరిగిన క్షణాల్లోనే కొన్ని ప్రొటీన్లు గుంపులుగా మారుతున్నట్లు గుర్తించారు. ఇదే మొక్కల జ్ఞాపకశక్తి ఏర్పడే మొదటి అడుగు. మొక్క చలిని గుర్తుపెట్టుకునే ఈ ప్రక్రియ ముందుగా ప్రొటీన్ల 'గుంపు' రూపంలో మొదలవుతుందన్నమాట.

ఎప్పటికప్పుడు 'జ్ఞాపకం' శుభ్రం

మొక్కలకు మెదడు లేదని మనం సరిపెట్టుకుంటాం. కానీ మన మెదడుకు వచ్చే అతిపెద్ద సమస్యకు పరిష్కారం ఆ మొక్కల దగ్గరే ఉందన్నది తాజా నిజం. మతిమరుపును తరిమికొట్టే ఆ రహస్యం చిన్న ఆవ మొక్క కణాల్లో దాగి ఉండటం విశేషం. మన మెదడు ఒక సూపర్ కంప్యూటర్. ఇందులో కోట్లాది నాడులు తీగల్లాగా సమాచారాన్ని చేరవేస్తుంటాయి. కానీ వయసు పెరిగే కొద్దీ వీటి మధ్య 'అమిలాయిడ్' అనే ప్రొటీన్ జిగురులా పేరుకుపోతుంది. ఇంట్లో నీళ్ల పైపులో పాచి పేరుకుపోతే నీళ్లు ఎలా ఆగిపోతాయో, అలాగే మెదడులో ఈ ప్రొటీన్ జిగురు పేరుకు పోతే సమాచార ప్రసారం ఆగిపోతుంది. ఇదే మతిమరుపు, అల్జీమర్స్‌కు దారితీస్తుంది. ఒకరకంగా ఇది మెదడుకు పట్టే తుప్పు లాంటిది అనుకోవచ్చు. దీన్ని మొక్కలు అత్యద్భుతంగా తొలగించుకుంటుండటం విచిత్రం. చలిని తట్టుకోవడానికి మనం దుస్తులను ఒకదానిపై ఒకటి వేసుకున్నట్టు, మొక్కలు చలికాలంలో తమ ప్రొటీన్లను గుంపులుగా మార్చుకుంటాయి. కానీ చిత్రం ఏంటంటే- వసంత కాలం రాగానే మొక్కలు ఆ గుంపులను చాలా పద్ధతిగా విడదీయటం. మొక్కల కణాల్లో ఈ శుభ్రత విద్య అద్భుతంగా పనిచేస్తుండటం విచిత్రం. అవి తమలో పేరుకుపోయిన ప్రొటీన్ చెత్తను ఎప్పటికప్పుడు రీసైకిల్ చేసుకుంటున్నాయి. ఇందుకోసం మొక్కలు వాడే శుభ్రత విద్యను మనం స్లిమ్‌వర్ ద్వారా అర్థం చేసుకుంటే, దానికి సరిపడే ఔషధాలను తయారు చేయవచ్చు. ఆ మందు మనిషి మెదడులోని అల్జీమర్స్ అనే తుప్పును కూడా కరిగించగలదనే ఆశలు రేకెత్తుతున్నాయి. మొక్కల కణాల శుభ్రత పాఠం మన మెదడుకూ ఒక రోజు ఉపయోగపడొచ్చు.

రోబో మొక్కలు- భవిష్య ఊపిరి!

మొక్క అంటే కేవలం ఆకులు కాదు. అదొక జీవ యంత్రం. శాస్త్రవేత్తలు ఇప్పుడు ఆ యంత్రం బ్లూప్రింట్‌ను కాపీ చేసి కృత్రిమ మొక్కలను తయారు చేసే పనిలో పడ్డారు. మొక్కల జ్ఞాపకశక్తి ఎలా పని చేస్తుందో తెలిసినప్పుడే, వాటిని మనకు నచ్చినట్లు ప్రోగ్రామ్ చేయడం సాధ్యమవుతుంది. మొక్క ఏ సంకేతానికి ఎలా స్పందిస్తుందో అర్థమైతే, ఆ స్పందనను మన అవసరాలకు అనుగుణంగా మలచుకోవచ్చు. కాలుష్య తీవ్రత పెరిగిపోయిన నగరాల్లో, కాలుష్యాన్ని పీల్చుకోమని ప్రోగ్రామ్ చేసిన మొక్కలు అలసట లేకుండా ఆ పని చేస్తాయి. ఇవే అంగారక గ్రహంపై చలిని తట్టుకుని ప్రాణవాయువు ఇవ్వగలవు. నగరాల్లోని కాంక్రీట్ గోడలపై పాకుతూ గాలిని శుద్ధి చేసే స్మార్ట్ ప్లాంట్స్‌గా మారగలవు. కాదేది మొక్కలకు అనర్హం అన్న చందంగా శాస్త్రజ్ఞుల ఆలోచన ప్రకారం మొక్కలతో ఇలాంటివి ఇంకా ఎన్నో చేయవచ్చన్నమాట.

పొలాల దాకా

ఈ పరిశోధన ఫలితాలు ప్రయోగశాల గోడల మధ్యే ఉండిపోవు. రైతు పొలానికి చేరే అవకాశం ఉంది. వాతావరణం ఏదైనా సరే, పంట నిర్దిష్ట కాలానికి రావాలంటే మొక్కలోని జ్ఞాపక సంకేతాలను సరిచేయడం లేదా రీసెట్ చేయడం అనే ఆలోచనలు ఇప్పుడు బలపడుతున్నాయి. మొక్క ఏ కాలంలో ఏ పని చేయాలో నిర్ణయించే అంతర్గత సంకేతాలను మనం అర్థం చేసుకుంటే పంట సమయాన్ని ఎక్కువగా నియంత్రించే వీలూ చిక్కుతుంది. హిమాలయాల్లో మాత్రమే పెరిగే కొన్ని మొక్కలు మైదానాల్లో ఎందుకు పెరగవు? ఎందుకంటే అవి చలిని జ్ఞాపకంలో పెట్టుకుని, ఆ చలి లేకపోతే సరిగా ఎదగవు. ఇప్పుడు ఆ జ్ఞాపక కోడ్ అర్థమైతే, అరుదైన ఔషధ మొక్కలను ఇతర ప్రాంతాల్లో కూడా పెంచే అవకాశం వస్తుంది. ఈ సందర్భంలో సర్ జగదీశ్ చంద్రబోస్ గారి మాట గుర్తొస్తుంది- మొక్కలకు ప్రాణం ఉంది. ఇప్పుడు శాస్త్రం చెబుతోంది- ఆ ప్రాణానికి జ్ఞాపకం కూడా ఉందని.

ప్రతి ఆకులో ఓ గ్రంథాలయం

నేడు భూతాపం వల్ల వాతావరణం, కాలాలు గతి తప్పుతున్నాయి. ఇలాంటి సమయంలో మొక్కలు తమ జ్ఞాపకశక్తిని ఎలా మార్చుకుంటున్నాయో మనం అర్థం చేసుకుంటే, రేపు రైతు పొలంలో వాతావరణం ఏదైనా సరే పంట పండేలా చేయవచ్చు. మనం చెట్లను కట్టెలుగానో, నీడగానో మాత్రమే చూస్తాం. కానీ నిజానికి ప్రతి ఆకు లోపల ఒక గ్రంథాలయం ఉంది. అది తమ కణాల్లో రాసుకున్న ఓ జ్ఞాపకాల దొంతర. ప్రకృతి రహస్యాలు అనంతం. వాటిని ఛేదించే కొద్దీ మనం ఎంత అల్ప ప్రాణులమో తెలుస్తుంది. ఈ ఆకుపచ్చని డైరీ నుంచి మనం ఇంకా చాలా నేర్చుకోవాల్సి ఉంది. ప్రకృతి సృష్టించిన ప్రాణానికి, మనిషి సృష్టించిన మేధస్సు తోడైతే మోడు వారిన బీళ్లు మళ్లీ పచ్చదనంతో, నిండైన ఆరోగ్యంతో నిండిపోవడం ఖాయం.

– డా. మొహమ్మద్ నయీమ్, అసోసియేట్ ప్రొఫెసర్, భౌతిక శాస్త్ర విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అద్దంకి

మోటో సరికొత్త సిగ్నేచర్

మోటొరోలా కొత్త ప్రీమియం, ఫ్లాగ్‌షిప్ ఫోన్‌ను పరిచయం చేసింది. పేరు మోటొరోలా సిగ్నేచర్. 165 హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 6,200 నిట్స్ గరిష్ఠ ప్రకాశం, డాల్బీ విజన్ హెచ్‌డీఆర్, కార్నింగ్ విక్టస్ 2 రక్షణతో కూడిన 6.8 అంగుళాల ఎక్స్‌ట్రీమ్ ఎమోలెడ్ ఎల్‌టీపీఓ క్వాడ్ కర్వ్డ్ తెరతో కనువిందు చేస్తోంది. తాజా ఆండ్రాయిడ్ 16 ఆధారిత హెలో యూఐ, స్నాప్‌డ్రాగన్ 8 జెన్ 5 ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. 90డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జర్‌తో కూడిన 5,200 ఎంఏహెచ్ బ్యాటరీతో వచ్చే ఇది 50డబ్ల్యూ వైర్‌లెస్ ఛార్జింగ్‌నూ సపోర్టు చేస్తుంది. ఏడేళ్ల పాటు ఓఎస్, సెక్యూరిటీ అప్‌డేట్స్ అందుతాయి. వెనకాల 50 ఎంపీ మెయిన్ సోనీ లీటియా 828 సెన్సర్, 50 ఎంపీ పెరిస్కోప్ టెలిఫొటో సోనీ లీటియా 600 సెన్సర్, 50 ఎంపీ అల్ట్రావైడ్ లెన్స్‌తో కూడిన మూడు కెమెరాల వ్యవస్థ.. ముందు సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం 50 ఎంపీ కెమెరా ఉన్నాయి. పాంటోన్ కార్బన్, ఆలివ్ రంగుల్లో అందుబాటులో ఉండే ఇది రెండు రకాల్లో లభిస్తుంది. 12జీబీ/256జీబీ రకం ధర రూ.59,999. 16జీబీ/512జీబీ ధర రూ.64,999. 16జీబీ/1టీబీ ధర రూ.69,999.



- ఫోన్‌తో పాటు మోటో వాచ్‌నూ మోటొరోలా పరిచయం చేసింది. పోలార్ వెల్‌నెస్ వేదిక ఆధారంగా పనిచేసే ఇది అల్యూమినియం డిజైన్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 3 రక్షణతో వస్తోంది. దీని బ్యాటరీ 13 రోజుల వరకూ పనిచేస్తుంది.



అమెజాన్ ఎకో షో డిస్‌ప్లే

అమెజాన్ కొత్తగా అలెక్సా ఆధారిత ఎకో షో 11, నాలుగో తరం ఎకో షో 8 స్మార్ట్ డిస్‌ప్లేలను పరిచయం చేసింది. ఈ స్మార్ట్ స్పీకర్లు అలెక్సా+ కంపాటబిలిటీ కలిగుంటాయి. ఎకో షో 11 డిస్‌ప్లే 11 అంగుళాలుంటే.. షో 8 డిస్‌ప్లే 8.7 అంగుళాలు ఉంటుంది. రెండూ టచ్ కంట్రోళ్లతో కూడి ఉన్నాయి. ఇవి ఓమ్నిసెన్స్‌తో పాటు ఏజెడ్3 ప్రొ మీద పనిచేస్తాయి. ఆటో ఫ్రేమింగ్‌తో కూడిన 13 ఎంపీ కెమెరా, నాయిస్ రిడక్షన్ టెక్నాలజీ, ఆడియో, అల్ట్రాసౌండ్, వై-ఫై రాడార్, యాక్సిలోమీటర్, వై-ఫై సీఎస్ఐ వంటి ఫీచర్లతో అలరిస్తున్నాయి. అలెక్సా యాప్ ద్వారా స్మార్ట్‌లైట్లను, కంపాటబుల్ పరికరాలను అడ్జస్ట్ చేసుకోవచ్చు. ఫ్రంట్ ఫేసింగ్ స్టీరియో స్పీకర్లు, కస్టమ్ వూఫర్లు స్పేషియల్ ఆడియోను అందిస్తాయి. డ్రాప్ ఇన్ ఫీచర్ సాయంతో ఇంటిని, కుటుంబాన్ని, పెంపుడు జంతువులను ఓ కంట కనిపెట్టొచ్చు. కంపాటబుల్ సెక్యూరిటీ కెమెరా, వీడియో డోర్‌బెల్స్‌తోనూ వీటిని అనుసంధానం చేసుకోవచ్చు.





స్నాప్‌చాట్ మరింత భద్రంగా..

స్నాప్‌చాట్ తమ ఫ్యామిలీ సెంటర్ హబ్ ద్వారా కొత్త భద్రత ఫీచర్లను ప్రవేశపెట్టింది. తల్లిదండ్రులు తమ పిల్లలు యాప్‌లో ఏమేం చేస్తున్నారో గమనించటానికి, అర్థం చేసుకోవటానికివి తోడ్పడగలవు. వీటి సాయంతో గత వారం పిల్లలు ప్రతిరోజూ సగటున ఎంత సమయం స్నాప్‌చాట్‌ను చూడటానికి వినియోగించారో, యాప్‌లో వేటి కోసం ఎక్కువ సమయం కేటాయించారో తెలుసుకోవచ్చు.

చాటింగ్, పోస్టింగ్, కెమెరా ఫీచర్లతో క్రియేటింగ్, స్నాప్ మ్యాప్ వాడకం, కంటెంట్ వీక్షించటం వంటి వాటి తీరుతెన్నులను గ్రహించొచ్చు. ఆరోగ్యకరమైన స్క్రీన్ టైమ్, ఆన్‌లైన్ అలవాట్ల గురించి తల్లిదండ్రులు తమ పిల్లలతో చర్చించటానికిది వీలు కల్పిస్తుంది. టీన్ యూజర్ స్నేహితులను కూడా ట్రాక్ చేయొచ్చు. వర్చువల్ మీటింగ్ ఎలా జరుగుతుందో మరింత బాగా అర్థం చేసుకోవచ్చు. స్నాప్‌చాట్ మీద కొత్త స్నేహితులు యాడ్ అయినప్పుడు వారు మ్యూచువల్ ఫ్రెండ్సా? గతంలో సేవ్ అయిన కాంటాక్ట్‌లా? అనేవీ తెలుస్తాయి. ఫ్యామిలీ సెంటర్ టూల్స్‌ను వాడుకోవటంలో తల్లిదండ్రులకు సాయం చేయటానికి భద్రత, అవగాహన వీడియోనూ స్నాప్‌చాట్ విడుదల చేసింది.

విదేశీయులు లేదా ఇతర రాష్ట్రాల వారితో మాట్లాడుతున్నప్పుడో, ప్రయాణాలు చేస్తున్నప్పుడో, మీటింగులకు వెళ్లినప్పుడో భాష తెలియక చాలాసార్లు ఇబ్బంది పడుతుంటాం. ఎన్నో భాషలు, మరెన్నో యాసలతో కూడిన మనదేశంలో ఇది మరింత ఎక్కువ. ఇలాంటి పరిస్థితుల్లో గూగుల్ ట్రాన్స్‌లేట్ బాగా ఆదుకుంటుంది. స్మార్ట్‌ఫోన్ సాయంతో దీని ద్వారా అప్పటికప్పుడు మాటలను అనువాదం చేసుకోవచ్చు. ఇందుకోసం ఖరీదైన ఇయర్ బడ్స్, ప్రత్యేక ట్రాన్స్‌లేషన్ పరికరాలేవీ అవసరం లేదు. మామూలు వైర్డ్ లేదా వైర్‌లెస్ హెడ్‌ఫోన్స్ ఉన్నా సరిపోతుంది. దీన్ని ఎలా వాడుకోవాలంటే..


హెడ్‌ఫోన్‌తో అనువాదం



- ఫోన్‌లో గూగుల్ ట్రాన్స్‌లేట్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి, ఓపెన్ చేయాలి.
- పైన ఎడమ వైపున మీరు మాట్లాడే భాషను, కుడి వైపున మీరు అర్థం చేసుకోవాలనుకునే భాషను ఎంచుకోవాలి.
- మెయిన్ స్క్రీన్‌లో అడుగున ఎడమవైపున ఉండే కన్వర్జేషన్ ఆప్షన్ మీద తాకాలి.
- మీతో మాట్లాడుతున్న వ్యక్తికి ఫోన్‌ను దగ్గరగా ఉంచాలి. వారిని స్పష్టంగా, మామూలు వేగంతో మాట్లాడాలని చెప్పటం మరవొద్దు.
- ఎదుటి వ్యక్తి మాటలను ఫోన్ మైక్రోఫోన్ ద్వారా విని, అనువాదం చేస్తుంది. అవి ఆటోమేటిగ్గా హెడ్‌ఫోన్స్ ద్వారా మీకు వినిపిస్తాయి.

జీమెయిల్‌లో నోట్స్ యాప్!

జీమెయిల్‌ను ఎన్నోసార్లు ఓపెన్ చేసి ఉంటారు. మెసేజ్‌లు చూడటం, రాయటం సరే సరి. మరి ఎప్పుడైనా దీంతో నోట్స్ తీసుకున్నారా? మనసులో మెదులుతున్న ఐడియాలు, చేయాల్సిన పనులను రాసుకొని, పదిల పరచుకున్నారా? జీమెయిల్‌లో ఉన్న గూగుల్ కీప్ ఫీచర్‌తో ఇవన్నీ సాధ్యమే. కాకపోతే ఇది డెస్క్‌టాప్ మీద మాత్రమే అందుబాటులో ఉంటుంది. జీమెయిల్‌లో ఇన్‌బాక్స్ కుడివైపున నిలువుగా ఉండే బార్‌లో క్యాలెండర్, కీప్, టాస్క్స్, కాంటాక్ట్స్ గుర్తులు కనిపిస్తాయి. ఇందులో కీప్ మీద నొక్కితే నోట్స్ కనిపిస్తుంది. ప్లస్ గుర్తును నొక్కితే కొత్త నోట్ ఓపెన్ అవుతుంది. మనసులో మెదిలే ఆలోచనల దగ్గరి నుంచి ఐడియాల వరకూ ఏదైనా రాసుకోవచ్చు. ఈమెయిల్స్ చదువుతున్నప్పుడు హఠాత్తుగా ఏదైనా తోచిందనుకోండి. లేదూ అనుబంధ ప్రశ్న వేయాలని అనిపించిందనుకోండి. జీమెయిల్ నుంచి బయటకు రాకుండానే అందులో రాసుకోవచ్చు.



- పెద్ద ఈమెయిళ్ల నుంచి ఏదైనా సమాచారాన్ని తీసుకోవాలనుకున్నా గూగుల్ కీప్‌లోని నోట్ ఫీచర్‌ను వాడుకోవచ్చు. కీలకమైన వివరాలు, తేదీలు, నిర్ణయాల వంటి వాటిని కాపీ, పేస్ట్ చేసుకోవచ్చు. మొత్తం మెయిల్‌ను తిరిగి స్కాన్ చేయాల్సిన అవసరముండదు. ప్రస్తుతం నడుస్తున్న ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను సంగ్రహించి, ఒకదగ్గర చూసుకోవటానికిది బాగా ఉపయోగపడుతుంది.
- ఈమెయిల్‌ను నేరుగా కీప్‌లోకి మూవ్ చేయటం కుదరదు గానీ మెయిల్ యూఆర్ఎల్‌ను కాపీ చేసి, పేస్ట్ చేసుకోవచ్చు. అవసరమైనప్పుడు దాన్ని కాపీ చేసి, యూఆర్ఎల్ బార్‌లో పేస్ట్ చేస్తే మెయిల్ ఓపెన్ అవుతుంది.

త్వరగా ఛార్జింగ్ కాకపోతే ఫోన్ పాతది అయ్యిందనో, అప్‌డేట్ కాలేదనో, బ్రాండ్ మంచిది కాదనో భావిస్తుంటారు. కానీ ఎప్పుడైనా ఛార్జింగ్ పోర్ట్ ఎలా ఉందో గమనించారా? జేబులోనో, బ్యాగులోనో పెట్టినప్పుడు దుమ్ము, వస్త్రం నూగు వంటివి పోర్టులో నెమ్మదిగా చేరుతుంటాయి. ఇది ఛార్జింగ్ వేగాన్ని తగ్గించొచ్చు. కాబట్టి ఫోన్ మరీ నెమ్మదిగా ఛార్జింగ్ అవుతుంటే మెత్తటి టూత్‌పిక్‌తో పోర్ట్‌ను శుభ్రం చేసి చూడండి. దుమ్ము సమస్య అయినట్టయితే ఛార్జింగ్ వేగం పుంజుకుంటుంది.

ఫోన్ ఛార్జింగ్ స్లో అయ్యిందా?

- ఫోన్ చాలా వేడెక్కినప్పుడూ ఛార్జింగ్ వేగం నెమ్మదించొచ్చు. కొన్నిరకాల ఫోన్లు పూర్తిగా చల్లబడే వరకూ ఛార్జింగ్‌ను పూర్తిగా ఆపేస్తుంటాయి కూడా. ఫోన్ దెబ్బతినకుండా ఉండటమే దీని ఉద్దేశం. ఐఫోన్లు, సామ్‌సంగ్ గెలాక్సీ, వన్‌ప్లస్, షావోమీ వంటి పరికరాల్లో దీనికి సంబంధించిన మెసేజ్ కూడా కనిపిస్తుంటుంది.
- చాలా ఫోన్లు సాఫ్ట్‌వేర్ ద్వారానూ ఛార్జింగ్ వేగాన్ని నియంత్రిస్తాయి. ఛార్జింగ్ కొంత వరకూ.. సాధారణంగా 80 శాతానికి చేరుకున్నాక ఛార్జింగ్ నెమ్మదిగా అవటం గమనించే ఉంటారు. దీనికి కారణం పరికరం లోపం కాదు. కావాలనే కంపెనీలు సాఫ్ట్‌వేర్‌ను ఇలా రూపొందిస్తాయి. నెమ్మదిగా ఛార్జింగ్ అవటం వల్ల బ్యాటరీ మీద ఒత్తిడి తగ్గుతుంది. ఎక్కువకాలం బ్యాటరీ మన్నుతుంది. కొన్ని ఫోన్లు ఛార్జింగ్ తీరుతెన్నులను గమనించటం ద్వారానూ వేగాన్ని నియంత్రించుకుంటాయి. ఉదాహరణకు- మీరు ఫోన్‌ను తరచూ రాత్రంతా ఛార్జింగ్ పెట్టి ఉంచుతున్నారనుకోండి. ప్రస్తుత తరం స్మార్ట్‌ఫోన్లు తెల్లారటానికి ముందు ఛార్జింగ్‌ను పాజ్ చేయొచ్చు. లేదా స్టాప్ చేయొచ్చు. బ్యాటరీ ఆరోగ్యంగా ఉండటానికే ఈ రక్షణ ఏర్పాటు.

అడోబ్‌లో కొత్త ఏఐ ఫీచర్లు



డాక్యుమెంట్లను ప్రజెంటేషన్ల రూపంలో మార్చుకోవాలని అనుకుంటున్నారా? పాడ్‌కాస్ట్‌ల మాదిరిగా ఆడియో రివ్యూలుగా మలచుకోవాలని అనుకుంటున్నారా? మామూలుగానైతే ఇవి కష్టమైన పనులే. కానీ అడోబ్ దీన్ని తేలికైన ప్రక్రియలుగా మార్చేసింది. తమ అడోబ్ ఎక్స్‌ప్రెస్, అక్రోబాట్ వేదికల్లో ఇందుకోసమే కొత్త ఏఐ ఫీచర్లను పరిచయం చేసింది.

జనరేట్ పాడ్‌కాస్ట్: ఇది మీటింగ్ ట్రాన్స్‌క్రిప్ట్స్, రిపోర్ట్స్, నోట్స్, అటాచ్‌మెంట్స్ వంటి డాక్యుమెంట్లను చిన్న, పాడ్‌కాస్ట్ మాదిరి ఆడియో సారాంశాలుగా మలుస్తుంది. మీటింగులకు సన్నద్ధం కావటం, చర్చల్లో తప్పిపోయిన భాగాలను అందుకోవటం, సమీక్షించుకోవటంలాంటి పనులకూ దీన్ని వాడుకోవచ్చు. కేవలం ఉద్యోగ పనుల కోసమే కాదు. న్యూస్‌లెటర్స్, గైడ్స్ వంటి వ్యక్తిగత డాక్యుమెంట్లనూ ఆడియో సారాంశాలుగా మార్చుకోవటానికి ఉపయోగించుకోవచ్చు.

జనరేట్ ప్రజెంటేషన్: ప్రస్తుత డాక్యుమెంట్లను చక్కగా అమర్చిన స్లైడ్ డెక్స్ రూపంలోకి మారుస్తుంది. యూజర్లు అక్రోబాట్ ఏఐ అసిస్టెంట్ సాయంతో పీడీఎఫ్స్, వెబ్ పేజెస్, రిపోర్ట్స్‌ను విశ్లేషించుకోవచ్చు. ఆటోమేటిగ్గా ప్రజెంటేషన్ అవుట్‌లైన్‌ను జనరేట్ చేసుకోవచ్చు. అనంతరం అడోబ్ ఎక్స్‌ప్రెస్‌లోని టెంప్లేట్స్‌తో స్లైడ్స్‌ను సృష్టించుకోవచ్చు. ఈ టెంప్లేట్స్‌లో నిడివి, టోన్‌ను కంట్రోల్ చేసుకునే ఆప్షన్లూ ఉంటాయి.

చాట్ ఆధారిత పీడీఎఫ్ ఎడిటింగ్: సహజ మాటలతోనే పేజీలను తొలగించటం, టెక్స్ట్ ఎడిటింగ్, కామెంట్స్ చేర్చటం వంటి పనులు చేసుకోవచ్చు. ఇ-సిగ్నేచర్లను యాడ్ చేయటం, పాస్‌వర్డ్‌లను వర్తింపజేయటమూ చేయొచ్చు.

పీడీఎఫ్ స్పేసెస్‌లో కొలాబరేషన్ టూల్స్: వీటి సాయంతో స్పేసెస్‌లోకి ఇతరులను ఆహ్వానించొచ్చు. స్పేస్‌లో చేరినవారు అవసరమైన ఫైల్స్, నోట్స్ యాడ్ చేయొచ్చు. కామెంట్స్ కూడా చేయొచ్చు. నేర్చుకోవటం, కొలాబరేషన్, కంటెంట్‌ను త్వరగా క్రియేట్ చేయటం వంటి పనులకు ఈ కొత్త చాట్ ఆధారిత ఫీచర్లు బాగా ఉపయోగపడతాయి.

ఫొటోలతోనే మీమ్స్

మీ ఫొటోలతోనే మీమ్స్ సృష్టించుకుంటే? వాటిని కుటుంబ సభ్యులు, స్నేహితులతో పంచుకుంటే? భలేగా ఉంటుంది కదా! ఇందుకోసమే గూగుల్ తమ ఫొటోస్ యాప్‌లో కొత్త ఫీచర్‌ను పరిచయం చేసింది. దీని పేరు మీ మీమ్. ఏఐ సాయంతో పనిచేసే దీని ద్వారా యూజర్లు తమ ఫొటోలను మీమ్స్‌గా మలచుకోవచ్చు. సృజనాత్మకతను చాటుకోవచ్చు. ఈ ఫీచర్‌లో రకరకాల టెంప్లేట్లు ఉంటాయి. ఇష్టమైన టెంప్లేట్‌ను ఎంచుకొని, ఫొటోను అప్‌లోడ్ చేయాలి. అది మీమ్‌గా మారుతుంది. ముఖం స్పష్టంగా కనిపించే సెల్ఫీ, ఫొటో అప్‌లోడ్ చేస్తే మీమ్ చక్కగా వస్తుంది. ప్రస్తుతానికి మీ మీమ్ ఫీచర్ ప్రయోగాత్మక దశలో ఉంది. అమెరికాలోని యూజర్లకే అందుబాటులో ఉంది. క్రమంగా ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లందరికీ విస్తరించనుంది.

చాట్‌జీపీటీలో యూజర్ల వయసును పసిగట్టే వ్యవస్థ

ఓపెన్‌ఏఐ సంస్థ చాట్‌జీపీటీలో యూజర్ల వయసును అంచనా వేసే వ్యవస్థను ప్రవేశపెడుతోంది. దీన్ని తనకుతానే వయసును తనిఖీ చేసేలా, 18 ఏళ్ల కన్నా తక్కువ వయసు గలవారిని గుర్తించేలా డిజైన్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా చిన్నవారికీ జనరేటివ్ ఏఐ టూల్స్ విరివిగా అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో వయసుకు తగినట్టుగా రక్షణ చర్యలు తీసుకునే ప్రయత్నమే ఇది. దీన్ని ఇప్పటికే క్రమంగా అమల్లోకి తీసుకొస్తున్నారు. దీంతో మైనర్ల ఖాతాలుగా గుర్తించిన వాటికి చాట్‌జీపీటీ కంటెంట్, ఫీచర్ల యాక్సెస్‌ను వారి వయసుకు తగినట్టుగా సవరిస్తుంది.

ఇలా పనిచేస్తుంది

సాధారణంగా వయసును ధ్రువీకరించాలంటే ఏదో ఒక డాక్యుమెంట్‌ను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కానీ చాట్‌జీపీటీకి ఇదేమీ అవసరం లేదు. దీనిలోని వయసును అంచనా వేసే వ్యవస్థ ఏదో ఒక డేటా పాయింట్ మీద ఆధారపడకుండా ప్రవర్తన, ఖాతా స్థాయి సంకేతాల వంటి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని చిన్నవారిని గుర్తిస్తుంది. ఇందుకోసం దీర్ఘకాలంగా చాట్‌జీపీటీని ఎలా ఉపయోగించుకుంటున్నారో విశ్లేషిస్తుంది. ఎంతకాలంగా ఖాతా యాక్టివ్‌గా ఉంది? రోజుకు ఎన్నిసార్లు వాడుకుంటున్నారు? ఎంత ఎక్కువసేపు గడుపుతున్నారు? అనేవి పరిశీలిస్తుంది. అన్ని సంకేతాలు సరిపోయినట్టు అనిపిస్తే 18 ఏళ్ల కన్నా చిన్నవారిగా పరిగణించి, మైనర్లుగా ముద్ర వేస్తుంది. అంటే యూజర్లు తమ వయసును ప్రకటించాల్సిన, వెంటనే పత్రాలు సమర్పించాల్సిన అవసరమేమీ ఉండదు. ఈ మోడల్ బ్యాక్‌గ్రౌండ్‌లోనే తన పని తాను చేసుకుపోతుంది. మైనర్లను గుర్తించిన తర్వాతే వయసు ఆధారిత పరిమితులను వర్తింపజేస్తుంది.



పొరపాటున మైనర్లుగా ముద్రవేస్తే?

వయసును అంచనా వేసే మోడల్ కొన్నిసార్లు పొరపడొచ్చు. పెద్దవారినీ మైనర్లుగా ముద్రవేయొచ్చు. అలాంటప్పుడు సవరించుకునే వీలుంటుంది. పర్సోనా ద్వారా వయసును ధ్రువీకరించుకునే ప్రక్రియను పూర్తిచేస్తే యాక్సెస్ లభిస్తుంది. ప్రత్యక్షంగా సెల్ఫీని లేదా ప్రభుత్వం ఇచ్చిన ఐడీని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ధ్రువీకరణ పూర్తయ్యాక పరిమితులను తొలగిస్తుంది. వయసు ధ్రువీకరణ డేటా పర్సోనాలో తాత్కాలికంగానే స్టోర్ అవుతుంది. కాబట్టి గోప్యత, భద్రత గురించి చింతించాల్సిన అవసరం లేదని ఓపెన్‌ఏఐ చెబుతోంది.

(c) eenadu

వేసవికి ఉస్తాద్ ముస్తాబు


పవన్‌కల్యాణ్

ఈ ఏడాది తెలుగు ప్రేక్షకులు ఆత్రుతగా ఎదురు చూస్తున్న చిత్రాల్లో ఒకటి... 'ఉస్తాద్ భగత్‌సింగ్'. వేసవి సందర్భంగా విడుదల కానున్న ఈ సినిమా నిర్మాణానంతర పనులు మొదలయ్యాయి. డబ్బింగ్ పనుల్ని మొదలుపెట్టినట్టు మంగళవారం నిర్మాణ సంస్థ ప్రకటించింది. త్వరలో ఈ చిత్రంలోని మరో పాటని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా... హరీశ్‌శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమే.. 'ఉస్తాద్ భగత్‌సింగ్'. శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విజయవంతమైన 'గబ్బర్‌సింగ్' తర్వాత పవన్‌కల్యాణ్ - హరీశ్‌శంకర్ కలయికలో రూపొందుతున్న చిత్రమిది. ఇప్పటికే ఇందులోని 'దేఖ్ లేంగే సాలా...' అంటూ సాగే పాట విడుదలైంది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, కథనం: దశరథ్, రమేశ్‌రెడ్డి, కళ: ఆనంద్‌సాయి.

ఈనాడు సినిమా

దేవర 2... మే నుంచే!


ఎన్టీఆర్


ఎన్టీఆర్ అభిమానులు, 'దేవర' సినిమాని ఇష్టపడిన సినీ ప్రేమికులు... దాని కొనసాగింపు చిత్రమైన 'దేవర 2' కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. అయితే కథానాయకుడు ఎన్టీఆర్ ఇతర సినిమాలపై దృష్టి పెడుతుండడం...'దేవర2'పై దర్శకనిర్మాతలూ ఈమధ్యకాలంలో ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఆ సినిమా ఉంటుందా లేదా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. ఆ సందేహాల్ని పటాపంచలు చేస్తూ నిర్మాత సుధాకర్ మిక్కిలినేని ఇటీవల 'దేవర2' సినిమాపై స్పష్టతనిచ్చారు. ఓ వేదికపై ఆయన మాట్లాడుతూ "మే నెల నుంచే 'దేవర 2' ప్రారంభం అవుతుంది. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకొస్తుంది. అది మరో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంటుంద"ని చెప్పారు. ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన 'దేవర' ఘన విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. కథ పరంగా చూస్తే... తొలి భాగంతో పోలిస్తే రెండో భాగమే కీలకమని దర్శకనిర్మాతలు ఇదివరకు చెప్పిన విషయం తెలిసిందే. దాంతో ఆ సినిమా కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ప్రశాంత్‌నీల్ దర్శకత్వం వహిస్తున్న సినిమాతో ఎన్టీఆర్ బిజీగా ఉన్నారు. ఆ సినిమా పూర్తయిన వెంటనే, 'దేవర 2' కోసమే ఆయన రంగంలోకి దిగనున్నట్టు తెలుస్తోంది.

రామోజీ ఫిల్మ్‌సిటీలో కింగ్ 100


నాగార్జున

గతేడాది 'కూలీ', 'కుబేర' లాంటి చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరించిన అగ్రహీరో నాగార్జున.. త్వరలో తన వందో చిత్రంతో తెరపైకి రావడానికి సన్నద్ధమవుతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో తమిళ దర్శకుడు రా. కార్తీక్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తోంది. 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో పట్టాలెక్కిన ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టాకీ పార్ట్ సన్నివేశాలను రామోజీ ఫిల్మ్ సిటీలో చిత్రీకరిస్తున్నారు. నాగార్జునతో పాటు ఇతర తారాగణంపై ఈ సన్నివేశాల్ని తీర్చిదిద్దుతున్నారు. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ చిత్రంలో నాగార్జున కనిపించే విధానం కొత్తగా ఉంటుందని, ఇందులో ముగ్గురు కథానాయికలు ఉండనున్నట్లు సమాచారం.

డిస్నీ అడ్వెంచర్ నౌకలో షారుక్



సినీప్రియులకు కుటుంబ సమేతంగా వినోదం అందించేందుకు సింగపూర్ నుంచి డిస్నీ క్రూయిజ్ లైన్ నౌకను అందుబాటులోకి తీసుకురాబోతున్నట్టు డిస్నీ అడ్వెంచర్ ప్రతినిధులు ఇటీవలే వెల్లడించారు. మార్చి 10న సింగపూర్‌లో జరిగే క్రూయిజ్ ప్రారంభోత్సవంలో బాలీవుడ్ అగ్రహీరో షారుక్ ఖాన్ 'ది లయన్ కింగ్ సెలబ్రేషన్ ఇన్ ది స్కై' అనే కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నట్టు మంగళవారం డిస్నీ అడ్వెంచర్ ప్రకటించింది. ఈ సందర్భంగా షారుక్ మాట్లాడుతూ.. "ది లయన్ కింగ్‌కి ఎప్పటికీ నా హృదయంలో ప్రత్యేక స్థానం ఉంటుంది. నేను.. నా కుటుంబం ఇంతకు ముందే ఈ అద్భుతమైన కథలో భాగమయ్యాం. ఇప్పుడే కొత్త పునఃసృష్టికి నా గాత్రాన్ని అందించడం మంచి అనుభూతి కలుగుతుంది. 'ది లయన్ కింగ్: సెలబ్రేషన్ ఇన్ ది స్కై' అనేది కుటుంబం, సమాజానికి ఒక శక్తి లాంటిది. డిస్నీ అడ్వెంచర్ నౌకలో విహారయాత్ర చేసేవారికి ఇదొక మాయాజాలంలా ఉంటుంది. ఈ అందమైన వేడుకలో అభిమానుల కుటుంబాలతో కలిసి పాల్గొనడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని అన్నారు. తొలిసారి ఈ డిస్నీ షిప్‌ను ఆసియాలో ప్రవేశపెడుతున్నారు.

రిటైర్మెంట్ ప్రకటించిన గాయకుడు అర్జిత్ సింగ్



ప్రముఖ గాయకుడు అర్జిత్ సింగ్ ఇకపై ప్లేబ్యాక్ సింగర్‌గా కొనసాగనని మంగళవారం సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు. తనపై ప్రేమ చూపించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకు తన ప్రయాణం అద్భుతంగా సాగిందన్నారు. ప్లే బ్యాక్ సింగర్‌గా తన రిటైర్మెంట్‌కి కారణాలను మాత్రం వెల్లడించలేదు. పలు భాషల్లో ఎన్నో పాటలు పాడిన అర్జిత్‌కు పద్మశ్రీ పురస్కారంతో పాటు రెండు జాతీయ అవార్డులు దక్కాయి. అర్జిత్ ఇండిపెండెంట్ సింగర్‌గా కొనసాగుతారని సమాచారం.

"ది రాయల్స్' సిరీస్‌ను ప్రేక్షకులు చూడటం సంతోషంగా ఉన్నప్పటికీ.. దాని గురించి వచ్చిన విమర్శలు నన్ను కదిలించాయి" అని అంటోంది బాలీవుడ్ కథానాయిక భూమి పెడ్నేకర్. వైవిధ్యమైన పాత్రలతో వెండితెరపై మెరుస్తూనే.. థ్రిల్ పంచే సిరీస్‌లతో ఓటీటీ వేదికగా కూడా సత్తా చాటుతోంది. భూమి ప్రధాన పాత్రలో నటించిన సిరీస్ 'దల్దాల్'. ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో డీసీపీ రీటా పాత్రలో నిందితుల్ని పరుగులు పెట్టించడానికి సన్నద్ధమవుతోంది. ఈ సిరీస్ ఈ నెల 30న రానుంది. ఈ నేపథ్యంలోనే రాబోయే సిరీస్, తనపై వచ్చిన విమర్శల గురించి కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకొంది భూమి.

నిజంగా నేను నటించగలనా?


భూమి

"దల్దాల్ అనేది ఒక క్రైమ్ థ్రిల్లర్. ఇందులో నేను యాంటీ హీరోగా కనిపిస్తా. అధిక ప్రాధాన్యత ఉన్న ఈ పాత్రలో నటించేందుకు చాలా థ్రిల్‌గా ఫీల్ అయ్యాను. ఇలా మహిళలే కేంద్రంగా చేసుకొని మరిన్ని కథలు రావాలని కోరుకుంటున్నా. నేను ఎంచుకునే ప్రతి పాత్రలోనూ నా ప్రాణం పెట్టి పని చేస్తా. ఇందులో నటించడం ఎంత సంతోషంగా ఉందో అన్ని సవాళ్లను కూడా ఎదుర్కొన్నాను".

ఏ షూటింగ్‌కు వెళ్లలేదు

"గతేడాది నేను నటించిన 'ది రాయల్స్' సిరీస్‌పై ఎన్నో విమర్శలు వచ్చాయి. అవన్నీ నన్ను చాలా నిరుత్సాహపరిచాయి. మానసికంగా అలసిపోయాను. ఆ ఎదురుదెబ్బతో.. ఒక నటిగా, వ్యక్తిగా నేను ఎవరో అనే దానిపై అవగాహనను పూర్తిగా కోల్పోయా. అందుకే నేను వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఆ విమర్శలు.. నన్ను సినిమా సెట్ నుంచి దాదాపు తొమ్మిది నెలల పాటు దూరంగా ఉండేలా చేశాయి. జూన్ నుంచి ఏ షూటింగ్‌కు వెళ్లలేదు. వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఎన్నో ప్రశ్నల్ని ఎదుర్కొన్నాను".


నాలో ప్రతిభ ఉందా?

"నా నటనకు ఉపయోగపడే నిజమైన అనుభవం నాలో ఏమీ మిగల్లేదు అనిపించింది. అది నన్ను ఇంకా భయపెట్టింది. నాకు ఎప్పుడూ ఒక భయం ఉంటుంది. అదేంటంటే.. నేను ఎప్పుడూ ఒక సాధారణ నటిగా మిగిలిపోకూడదని అనుకుంటా. ఆ స్థాయికి కూడా చేరుకున్నా. కానీ వాస్తవాల్ని, విమర్శల్ని అంగీకరించడం ముఖ్యం. అయినా నేను ఏం చేయగలనో నాకు తెలుసు. 'ది రాయల్స్'పై వచ్చిన ట్రోలింగ్స్ వల్ల అయోమయంలో పడ్డాను. దాంతో నా పాత సినిమాలను తిరిగి చూశా. నేను నిజంగా నటించగలనా? నాలో ఆ ప్రతిభ ఉందా? అని నన్ను నేను ప్రశ్నించుకున్నా. అంతగా ఆ విమర్శలు నన్ను కదిలించాయి".

అన్నింటికీ దూరమైనా..

"నేనెప్పుడూ సినిమాల నుంచి ఇంత విరామం తీసుకోలేదు. చిత్రీకరణల నుంచి దూరంగా ఉన్నప్పుడు అడ్వాన్స్‌గా తీసుకున్న డబ్బును కూడా తిరిగి ఇవ్వాల్సి వచ్చింది. ఇది కేవలం సినిమాలను తిరస్కరించడం మాత్రమే కాదు.. మీడియాలో నా ఉనికిని తగ్గించుకోవడం. నేను అవార్డు కార్యక్రమాలు, ఫ్యాషన్ ఈవెంట్‌లకు కూడా హాజరు కానని చెప్పా. ఇలా నేను అన్నింటికీ దూరమైనా కూడా నా సొంతంగా నేను బతకగలనో లేదో తెలుసుకున్నా. విరామ సమయాల్లో ఖాళీగా లేను. పుస్తకాలు చదవడం, సినిమాలు చూడటం ప్రయాణించడం లాంటివి చేశా".

యానిమల్ పార్క్ వచ్చే ఏడాది ప్రారంభం!


రణ్‌బీర్ కపూర్

బాలీవుడ్ కథానాయకుడు రణ్‌బీర్ కపూర్ ప్రస్తుతం దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ రూపొందిస్తున్న 'లవ్ అండ్ వార్' అనే రొమాంటిక్ డ్రామాలో నటిస్తున్నాడు. ఈ సినిమాలో ఆయన.. అలియా భట్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రణ్‌బీర్ 'అసలు.. యానిమల్ పార్క్ సినిమా ఉంటుందా?' అనే ప్రశ్నకు స్పందించారు. 'యానిమల్'కు సీక్వెల్‌గా ఈ సినిమా రానుందని.. నిర్మాణానికి కొంత సమయం పడుతుందని వెల్లడించారు. "దర్శకుడు సందీప్ రెడ్డి ప్రస్తుతం మరో సినిమా చేస్తున్నారు. 'యానిమల్ పార్క్'ని 2027లో ప్రారంభించాలనుకుంటున్నాం. దీనిని మూడు భాగాలుగా రూపొందించాలనుకున్నాడు సందీప్. నేను కథానాయకుడిగా, ప్రతినాయకుడిగా రెండు పాత్రలనూ పోషించగలను. మంచి ప్రాజెక్ట్ ఇది. నేను ఇందులో భాగమవ్వడానికి చాలా ఉత్సాహంగా ఉన్నాను" అన్నారు. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రణ్‌బీర్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'యానిమల్'. ఆయన తదుపరి చిత్రం 'రామాయణ'లో రాముడి పాత్రలో కనిపించనున్నారు.

ముగ్గురు స్నేహితుల కథ... దేవగుడి


రఘు కుంచె, బెల్లం రామకృష్ణారెడ్డి

ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్నప్పటికీ... ప్రధానంగా ముగ్గురు స్నేహితుల కథగానే మా 'దేవగుడి' ప్రేక్షకుల మనసుల్లో గుర్తుండిపోతుందని చెప్పారు బెల్లం రామకృష్ణారెడ్డి. ఆయన దర్శకనిర్మాణంలో రూపొందిన సినిమానే 'దేవగుడి'. అభినవ్ శౌర్య, నరసింహ, అనుశ్రీ, రఘు కుంచె ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా దర్శకనిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి, నటుడు, సంగీత దర్శకుడు రఘు కుంచె మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. బెల్లం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ..."దర్శకుడిగా ఇదివరకు 'దృశ్యకావ్యం' తెరకెక్కించా. అంతకుముందు ఓ సినిమాని శ్రీకాంత్ కథానాయకుడిగా తెరకెక్కించా. అప్పుడే నీలో దర్శకుడు ఉన్నాడని శ్రీకాంత్ చెప్పారు. గత చిత్రాల అనుభవానికితోడు, నేను ఇంజినీర్‌ని కావడంతో పక్కా ప్లానింగ్‌తో అనుకున్న కథని అనుకున్నట్టుగా 'దేవగుడి' సినిమాని తెరకెక్కించా. సురేష్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ నుంచి చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. దేవగుడి వీరారెడ్డిగా రఘు కుంచె కనిపిస్తారు. ఆయన కొడుకు, కూతురు, ఆయన కార్ డ్రైవర్ కొడుకు... ఈ ముగ్గురి మధ్య స్నేహం ఈ సినిమాకి కీలకం" అని చెప్పారు. "దేవగుడి వీరారెడ్డిగా నేను తెరపై కనిపిస్తా. 'పలాస' తర్వాత నాకు అలాంటి శక్తివంతమైన పాత్రలొస్తున్నాయి. ఇందులోని వీరారెడ్డి పాత్ర కోసం రాయలసీమ యాసలో సంభాషణలు చెప్పా. ఇందులో నేనొక పాట స్వరపరిచి పాడాను కూడా. నటుడు కావాలని నేనెప్పుడూ కోరుకోలేదు. గాయకుడు కావాలనే పరిశ్రమకొచ్చా. దాదాపు 40 సినిమాలకి సంగీత దర్శకత్వం చేశా. నటుడిగా వచ్చిన అవకాశాల్ని వదులుకోకుండా చేస్తున్నా. మనోజ్ బాయ్‌పాయ్ 'ఫ్యామిలీమ్యాన్' తరహా పాత్రలొస్తే చేయాలని ఉంది. ప్రస్తుతం నాలుగైదు సినిమాల్లో నటిస్తున్నా" అని చెప్పారు రఘు కుంచె.

చిత్ర పరిశ్రమలో అదే ప్రధాన సమస్య


చాలామంది మగవాళ్లు తమ హోదాని అడ్డం పెట్టుకుని మహిళల నుంచి లైంగిక ప్రయోజనాల్ని ఆశిస్తున్నారని... నేటి చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్య అదే అన్నారు ప్రముఖ గాయని చిన్మయి శ్రీపాద. అగ్ర కథానాయకుడు చిరంజీవి ఇటీవల జరిగిన 'మన శంకరవరప్రసాద్‌గారు' వేడుకలో చిత్ర పరిశ్రమ అద్దం లాంటిదనీ, ఇక్కడ వృత్తిపరంగా నిక్కచ్చిగా, నిబద్ధతతో ఉంటే ఎవ్వరూ అవకాశంగా తీసుకోరని, చిత్ర పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్‌లాంటివి ఉండవంటూ మహిళల్ని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై చిన్మయి సామాజిక మాధ్యమాల్లో స్పందించారు. "చిత్ర పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ అనేది సర్వసాధారణంగా మారింది. కమిట్‌మెంట్ అనే మాటకి అర్థం నిబద్ధత అని భావిస్తే అది తప్పు అవుతుంది. చిత్ర పరిశ్రమలో ఆ మాటకు భిన్నమైన అర్థం ఉంది. గతంలో ఓ ప్రముఖ గాయనికి ఎదురైన చేదు అనుభవం తర్వాత భయపడి ఈ రంగాన్నే వదిలి వెళ్లిపోయారు. నేను నా తల్లి సమక్షంలోనే ఒక పెద్ద మనిషి నుంచి వేధింపులు ఎదుర్కొన్నా. కానీ ఆరోపణలు ఎదుర్కొన్న అలాంటివాళ్లే వేదికలెక్కి మాట్లాడుతున్నారు. కథానాయకుడు చిరంజీవి ఓ లెజెండ్. ఆయన ఒక తరానికి చెందిన నటులు. వాళ్లంతా మహిళా నటులతో స్నేహితులు, కుటుంబ సభ్యులుగా మెలుగుతూ ఒకరినొకరు గౌరవించుకునేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. తల్లిదండ్రులు చుట్టూ ఉన్నా వేధించేవాళ్లలో ఎలాంటి మార్పూ ఉండదు. ఇప్పుడు చిత్ర పరిశ్రమ మనల్ని ప్రతిబింబించే అద్దం ఎంత మాత్రం కాదు" అంటూ ఆమె ఓ పోస్ట్‌ని పంచుకున్నారు. చిరంజీవి అభిప్రాయంపై తానూ విభేదిస్తున్నట్టు చెప్పారు లైంగిక నేరాలు, మహిళల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న సునీత కృష్ణన్. సినీ నేపథ్యం లేని కుటుంబాల నుంచి వచ్చే ఆశావహులైన మహిళలు పలు ఇబ్బందికరమైన పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారంటూ ఆమె ఎక్స్‌లో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు. - న్యూస్‌టుడే, చెన్నై

నిశ్శబ్దంగా నిజం


'గాంధీ టాక్స్'

శబ్దాలతో నిండిన ఈ ప్రపంచంలో మౌనం కూడా మన అంతరాత్మని కదిలించగలదని గుర్తు చేసే సినిమానే 'గాంధీ టాక్స్' అంటున్నారు అరవింద్ స్వామి. ఆయనతోపాటు విజయ్ సేతుపతి, అదితీరావు హైదరీ, సిద్ధార్థ్ జాదవ్ ప్రధాన పాత్రధారులుగా నటించిన మూకీ చిత్రమిది. కిశోర్ పాండురంగ్ బేలేకర్ తెరకెక్కించారు. ఈ చిత్రం ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకొస్తోంది. మంగళవారం ట్రైలర్‌ని విడుదల చేశారు. పాత్రలు మాట్లాడకపోయినా సరే, భావోద్వేగాలతో మనసుకు హత్తుకునేలా సినిమా రూపొందినట్టు ట్రైలర్ చాటుతోంది. "అరుదైన ఇలాంటి ఓ సినిమాలో నటించడం నాకొక పెద్ద సవాలు. మౌనమే ఇందులో అత్యంత బలమైన సంభాషణ" అన్నారు విజయ్ సేతుపతి. మాటలు లేకపోయినా నిజాన్ని నిశ్శబ్దంగా బయటకు తీసుకొచ్చే సినిమా ఇదన్నారు అరవింద్ స్వామి. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూర్చారు.

ప్రేమ కోసం.. ప్రేమికుల కాలనీలో


దిశా పటానీ

ప్రేమ అనే పరిమళం ఖరీదైనది.. అంటూ నటుడు షాహిద్‌తో కలిసి ప్రత్యేక స్టెప్పులతో కుర్రకారుని ఉర్రూతలూగిస్తోంది దిశా పటానీ. బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్, త్రిప్తి దిమ్రీ జంటగా నటిస్తున్న చిత్రం 'ఓ రోమియో'. తాజాగా ఈ సినిమా నుంచి 'ప్రేమ కషాయం ఖరీదైనది.. అయినా దాన్ని కొన్నాను ప్రేమికుల కాలనీలో.. అనే వ్యాఖ్యతో 'ఆషిఖో కీ కాలనీ' అనే రెండవ గీతాన్ని విడుదల చేసింది చిత్రబృందం. 'నా మనసుపై నాకు హక్కు ఉంది.. దాన్ని నేనడిగి తీసుకున్నాను.. కానీ ఆలోపే మునిగిపోయాను' అంటూ హీరో షాహిద్ ఫిర్యాదులకు దిశా చెప్పిన ప్రేమ పాఠాలతో సాగుతున్న ఈ పాట ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉంది. విశాల్ భరద్వాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 13న థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాలో విక్రాంత్ మాస్సే, తమన్నా, దిశా పటానీ, నానా పటేకర్, అవినాశ్ తివారీ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు.

కుటుంబమంతా కలిసి చూసే చిత్రం!


విష్వక్‌సేన్, తరుణ్‌భాస్కర్, ఈషారెబ్బా, ఎ.ఆర్.సజీవ్

ఈ సినిమాలో నటిస్తున్నప్పుడు నిద్రలో కూడా నాకు గోదావరి యాస, ఆ ప్రాంతమే కలలోకి వచ్చేదన్నారు తరుణ్‌భాస్కర్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఈషారెబ్బా కథానాయిక. ఎ.ఆర్.సజీవ్ దర్శకుడు. సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనూప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ శనివారపు నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. కథానాయకులు విష్వక్‌సేన్, ప్రియదర్శి, దర్శకులు బి.వి.ఎస్.రవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేడుకని ఉద్దేశించి తరుణ్‌భాస్కర్ మాట్లాడుతూ "ఈ సినిమాని అందరూ రీమేక్ అంటున్నారు. కానీ కథని ఎంతో ఒరిజినల్‌గా ఆవిష్కరించే ప్రయత్నం చేశాడు దర్శకుడు. కుటుంబమంతా కలిసి చూసే ఓ మంచి సినిమా ఇది" అన్నారు. అభినవ్, శ్రీనాథ్ మాగంటి, వెంకటేశ్, నిర్మాతలు సృజన్, అనూప్, వివేక్ తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

గులాబీ ముల్లు గుచ్చుకుందా?


రాజేంద్రప్రసాద్

అందమైన గులాబీ కావాలంటే దాని కింద ఉన్న ముల్లును భరించాల్సిందే. కానీ ఆ ముల్లు గుచ్చుకోకుండానే గులాబీ ముల్లు తీస్తానంటాడు ఆ పోలీసు అధికారి. అలాగే ముల్లులు, చిక్కుముడులతో కూడిన ఓ కేసు పరిశోధనలో ఆయనకు ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయో తెలియాలంటే 'బ్లడ్ రోజెస్' చూడాల్సిందే. ధర్మకీర్తి రాజు, అప్సర రాణి ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రమిది. ఎంజీఆర్ దర్శకత్వం వహిస్తున్నారు. హరీశ్ కామర్తి నిర్మాత. కె.నాగన్న, కె.లక్ష్మమ్మ సమర్పకులు. ఫిబ్రవరి 6న రానుంది ఈ చిత్రం. ఇటీవల హైదరాబాద్‌లో ఈ సినిమా ట్రైలర్‌ని ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "నేర నేపథ్యంలో ఆద్యంతం థ్రిల్‌ని పంచుతూ సాగే కథ ఇది. ట్రైలర్ చాలా బాగుంది. ఇందులో భాగమైన నటీనటులు, సాంకేతిక బృందానికి మంచి గుర్తింపు దక్కాలని కోరుకుంటున్నా" అన్నారు.

(c) eenadu

ఈనాడు బిజినెస్

ఏషియన్ పెయింట్స్ లాభం రూ.1,074 కోట్లు

దిల్లీ: ఏషియన్ పెయింట్స్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో రూ.1073.92 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.1,128.43 కోట్లతో పోలిస్తే ఇది 4.83% తక్కువ. కొత్త లేబర్ కోడ్ అమలుతో పాటు అనుబంధ సంస్థ వైట్ టీక్ కొనుగోలు వల్ల వచ్చిన నష్టంతో లాభం తగ్గిందని కంపెనీ ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది. కార్యకలాపాల ఆదాయం రూ.8,549.44 కోట్ల నుంచి 3.71% పెరిగి రూ.8,867.02 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు రూ.3.12% తగ్గి రూ.7,447.07 కోట్లకు పరిమితమయ్యాయి. స్టాండలోన్ ప్రాతిపదికన దేశీయ విక్రయాలు రూ.7,389.90 కోట్ల నుంచి 2.9% పెరిగి రూ.7,601.5 కోట్లకు చేరాయి. అంతర్జాతీయ వ్యాపారం 6.3% పెరిగి రూ.869.6 కోట్లకు చేరింది. శ్రీలంక, ఇథియోపియా, యూఏఈల్లో కంపెనీకి యూనిట్లు ఉన్నాయి.

హల్వా వేడుకలో ఆర్థిక మంత్రి



2026-27 సాధారణ బడ్జెట్‌ను రూపొందించే ప్రక్రియ చివరి దశను సూచిస్తూ నిర్వహించే సంప్రదాయ 'హల్వా' వేడుకలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పాల్గొన్నారు. దిల్లీ నార్త్‌బ్లాక్‌లోని రైసినా హిల్‌లో ఈ వేడుక నిర్వహించారు. ఆర్థిక శాఖ కొత్త కార్యాలయం అయిన కర్తవ్య భవన్-1లో ముద్రణాలయం లేకపోవడంతో, బడ్జెట్ పత్రాల ముద్రణ నార్త్‌బ్లాక్‌లోనే చేస్తున్నారు కనుక.. ఈ వేడుక ఇక్కడ జరిగింది. బడ్జెట్ తయారీలో పాలుపంచుకున్న అధికారులందరికీ ఆర్థిక మంత్రి స్వయంగా హల్వా పంచారు. ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి, అధికారులు పాల్గొన్నారు.

తగ్గిన వొడాఫోన్ ఐడియా నష్టం

దిల్లీ: రుణ కష్టాల్లో ఉన్న టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా, డిసెంబరు త్రైమాసికంలో రూ.5,286 కోట్ల ఏకీకృత నికర నష్టాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల నష్టం రూ.6,609 కోట్లతో పోలిస్తే ఈసారి తగ్గింది. ఇదే సమయంలో కార్యకలాపాల ఏకీకృత ఆదాయం రూ.11,117 కోట్ల నుంచి రూ.11,323 కోట్లకు పెరిగింది. ఎబిటా రూ.4,712 కోట్ల నుంచి రూ.4,816 కోట్లకు మెరుగైంది. ఒక్కో వినియోగదారుపై సగటు ఆదాయ (ఆర్పు) రూ.173 నుంచి 7.3% పెరిగి రూ.186కు చేరింది. కంపెనీకి మొత్తం రూ.2.09 లక్షల కోట్ల అప్పులున్నాయి.

కోడి గుడ్డు

28న ఫారం వద్ద రిటైల్ అమ్మకం ధరలు (నెక్) (100 గుడ్లు రూపాయల్లో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	550
తూ/గో గోదావరి	515
విశాఖపట్నం	515
చిత్తూరు	573

బొండాడ ఇంజినీరింగ్ ఆదాయంలో 89% వృద్ధి

బొండాడ ఇంజినీరింగ్ సంస్థ, డిసెంబరు త్రైమాసికంలో రూ.712.28 కోట్ల ఏకీకృత ఆదాయాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల ఆదాయం రూ.376.05 కోట్ల కంటే ఇది 89.4% అధికం. ఇదే సమయంలో నికరలాభం రూ.24.73 కోట్ల నుంచి 119.17% వృద్ధితో రూ.54.20 కోట్లకు చేరింది. ఈపీసీ విభాగ ఆదాయం రూ.627.91 కోట్లకు చేరడం వల్లే, ఈ స్థాయి పనితీరు కనబరిచినట్లు సంస్థ తెలిపింది. ఈపీఎస్ రూ.2.25 నుంచి రూ.4.76కు పెరిగింది.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో రూ.6.9 లక్షల కోట్ల లబ్ధి!

- 90% ఉత్పత్తులకు సుంకమే పడదు
- ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు లబ్ధి
- ఐరోపా చాకొలెట్లు, వైన్ చౌక అయ్యే అవకాశం
- మన విద్యార్థులు, వృత్తినిపుణులకు సులువుగా వర్క్‌వీసా

ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన మనదేశం, ఐరోపా సమాఖ్య (ఈయూ) మధ్య సుదీర్ఘంగా సాగుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద (ఎఫ్‌టీఏ) చర్చలు విజయవంతంగా ముగిశాయి. దీనివల్ల 27 దేశాల సమాఖ్య అయిన ఈయూలోకి 99% భారత ఎగుమతులకు ప్రాధాన్య ప్రవేశం లభించనుంది. ఇక్కడి సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి కంపెనీ (ఎంఎస్ఎంఈ)లకు సరికొత్త అవకాశాలు కలగనున్నాయి. మన మహిళలు, కళాకారులు, యువత, వృత్తినిపుణులకు ఉద్యోగాలు లభించనున్నాయి. కార్మిక ఆధారిత రంగాలకు భారీ ప్రయోజనాలు దక్కనున్నాయి. వచ్చే 5-7 నెలల్లో ఒప్పందంపై అధికారికంగా సంతకాలు జరగొచ్చు. కాబట్టి ఈ ఏడాదిలో, లేదా 2027 మొదట్లో ఒప్పందం అమల్లోకి వచ్చిన తొలిరోజు నుంచే, ఈ లబ్ధి చేకూరనుంది. అమెరికా మన ఉత్పత్తులపై 50% భారీ సుంకం విధించిన ప్రస్తుత తరుణంలో, తాజా పరిణామానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈయూ కూడా అమెరికా నుంచి అధిక టారిఫ్ బెదిరింపులను ఎదుర్కొంటుండడం గమనార్హం.



మనకు దక్కేదేమిటి?

మనదేశానికి చెందిన చెందిన 75 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.6.9 లక్షల కోట్ల) విలువైన ఎగుమతులకు ఎఫ్‌టీఏ కింద ప్రయోజనాలు దక్కనున్నాయి.

- 93% పైగా భారత వస్తువులపై సుంకమే ఉండదు. అయితే వాహన, ఉక్కు మినహా అన్ని భారతీయ వస్తువులు ఉన్నాయి.
- 6% పైగా మిగిలిన వస్తువులపై టారిఫ్ తగ్గింపు, కోటా ఆధారిత సుంకం మినహాయింపులు(వాహనాల వంటి వాటికి) లభిస్తాయి.
- భారత వస్తువులపై సగటున ఈయూ టారిఫ్ 3.8 శాతంగా ఉంది. ఒప్పందం కింద ఇది 0.1 శాతానికి తగ్గనుంది.
- ఈ రంగాలకు మేలు: జౌళి, దుస్తులు, సముద్ర ఉత్పత్తులు, పాదరక్షలు, తోళ్లు, రసాయనాలు, ప్లాస్టిక్స్, స్పోర్ట్స్ వస్తువులు, బొమ్మలు, రత్నాభరణాలు వంటి 33 బి. డాలర్ల (సుమారు రూ.3 లక్షల కోట్ల) విలువైన ఎగుమతులకు ప్రస్తుతం 4-26% సుంకం ఉండగా.. ఎఫ్‌టీఏ అమల్లోకి వచ్చిన వెంటనే 0% సుంకం వర్తిస్తుంది.

ఈ రాష్ట్రాలకు ప్రయోజనం: ఈయూలో వస్త్ర మార్కెట్ 263.5 బి. డాలర్ల (సుమారు రూ.24.24 లక్షల కోట్ల) స్థాయిలో ఉండగా, మనం 7.2 బి. డాలర్ల (దాదాపు రూ.66,000 కోట్ల) ఎగుమతులు చేస్తున్నాం. ఇకపై సుంకమే లేకపోతే, మన వస్త్ర ఎగుమతిదార్లకు ప్రయోజనాలు లభిస్తాయి. ఆర్డర్లు పెరిగితే, ఇక్కడ మరిన్ని ఉద్యోగాలూ వస్తాయి. ముఖ్యంగా తెలంగాణ (హైదరాబాద్, వరంగల్), తమిళనాడు (తిరుపూర్), మహారాష్ట్ర (ఇచ్చల్కరంజి), గుజరాత్ (సూరత్), పంజాబ్ (లుథియానా) వంటి రాష్ట్రాల్లోని జౌళి మార్కెట్లకు ప్రయోజనం లభించనుంది.

- ఆంధ్రప్రదేశ్ (విశాఖ, కాకినాడ), గుజరాత్, కేరళ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల నుంచి ఈయూకు సముద్ర ఉత్పత్తులు ఎక్కువగా వెళుతుంటాయి. అస్సాం నుంచి టీ; కేరళ నుంచి మిరియాలు, యాలకులు ఎగుమతి అవుతుంటాయి. తక్కువ టారిఫ్‌తో ఆయా రాష్ట్రాలకూ మేలు జరగనుంది.
- తోలు-పాదరక్షల రంగంలోని సూక్ష్మ-చిన్న-మధ్యస్థాయి సంస్థలకు మద్దతు లభించనుంది. తమిళనాడు(వేలూరు-అంబూరు), ఉత్తరప్రదేశ్(కాన్పూర్, ఆగ్రా)లోని క్లస్టర్లకు మేలు కలగనుంది.
- ఎలక్ట్రానిక్స్‌పై టారిఫ్ ఉండదు కనుక, 99.6% ఎగుమతులకు ప్రయోజనం దక్కనుంది.
- రత్నాభరణాలపై 4% సుంకం మినహాయింపు లభిస్తుంది కనుక, తయారీదార్లు ఎక్కువగా ఉండే ముంబయి, సూరత్, జయపురకు మేలు.

ఈయూకు ప్రయోజనాలివీ..

టారిఫ్ కోతలు, మినహాయింపుల కారణంగా 2032 కల్లా ఈయూ ఎగుమతులు సైతం రెట్టింపు కానున్నాయి. ఐరోపా వస్తువులపై దశలవారీగా టారిఫ్‌లను మనదేశం తగ్గిస్తుంది. ఈయూ కంపెనీలకు సైతం మనదేశంలో 102 ఉప రంగాలు అందుబాటులోకి వస్తాయి.

- ఈయూ ఎగుమతుల్లో 97.54% సుంకం మినహాయింపు వరకు కవర్ చేసే 92.14% టారిఫ్ లైన్లకు భారత్ మినహాయింపులిస్తుంది. ఇందులో హైటెక్ వస్తువులతో పాటు యాపిల్, కివీ, పియర్ వంటి పళ్లు; పారిశ్రామిక, వినియోగదారు ఉత్పత్తులున్నాయి.
- ఈయూ ఎగుమతులకు దశలవారీ సుంకాల కోత వల్ల వ్యయాలు తగ్గుతాయి. భారత సరఫరాదార్లతో మమేకం కావడానికి అవకాశాలు లభిస్తాయి.
- ప్రస్తుతం 11-44% టారిఫ్ ఉన్న మెషినరీ, కెమికల్స్, ఫార్మా, వైద్య పరికరాలు, విమానాలు, ప్లాస్టిక్స్, ఇనుము-ఉక్కు వంటి వస్తువులను ఎగుమతి చేసే ఐరోపా ఎగుమతిదార్లకు భారీ పన్ను కోతల వల్ల ప్రయోజనం దక్కనుంది.
- భారత్‌కు విమానాలు, విమాన విడిభాగాలు, ఎలక్ట్రికల్ మెషినరీ, వజ్రాలు, రసాయనాలను అధికంగా ఎగుమతి చేయడం ద్వారా ఈయూ ప్రయోజనం దక్కించుకోగలదని మేధో సంపత్తి సంస్థ జీటీఆర్ఐ అంటోంది.

విలాస కార్ల ధరలు తగ్గవా?

ఎఫ్‌టీఏ కింద ఏటా 2.5 లక్షల వాహనాలను దిగుమతి చేసుకునేందుకు, వాటిపై ప్రస్తుతం ఉన్న పన్నును 110% నుంచి 10 శాతానికి క్రమంగా తగ్గించడానికి మన దేశం అంగీకరించింది. బ్రిటన్‌తో అంగీకరించిన 37,000 వాహనాలతో పోలిస్తే, ఈయూకు ఆరింతల ఎక్కువ కోటాను మనదేశం ఆఫర్ చేయడం విశేషం. ప్రస్తుతం మనదేశంలోకి దిగుమతయ్యే, 40,000 డాలర్ల పైబడిన ధర ఉన కార్ల (సీబీయూ)పై 110% పన్ను ఉంది. ఆ ధరలోపు కార్లపై 70% పన్ను వర్తిస్తుంది. కోటాకు వెలుపల ఎటువంటి మినహాయింపులూ భారత్ ఇవ్వదు. ఈయూ కంపెనీలు భారత్‌లో తయారీ చేపట్టాలన్నది మన ఉద్దేశంగా ఉంది. విద్యుత్తు వాహనాల (ఈవీ)కు కోటా.. ఒప్పందం జరిగిన అయిదో ఏడాది నుంచి ప్రారంభమవుతుంది. మన ఈవీ మార్కెట్ ఇపుడిపుడే వృద్ధి చెందుతున్నందున, ఈ నిర్ణయం తీసుకున్నారు. అంటే అయిదేళ్ల పాటు మనకు రక్షణ ఉంటుంది.

- తాజా పరిణామాన్ని మెర్సిడెజ్ బెంజ్, బీఎమ్‌డబ్ల్యూ, ఆడి, స్కోడా, స్టెలాంటిస్ వంటి దిగ్గజాలు ఆహ్వానించాయి. అయితే కార్ల ధరలు తగ్గే అవకాశం లేదని అంటున్నాయి. కేవలం 5% విక్రయాలు మాత్రమే, పూర్తిగా తయారై దిగుమతి అయిన మోడళ్ల (సీబీయూ) రూపంలో జరుగుతున్నందున, తమ వాహన ధరలేమీ తగ్గవని మెర్సిడెజ్ బెంజ్ పేర్కొంది. మార్కెట్ పరిస్థితులను మదించాకే ఏ విషయమైనా చెప్పగలమని ఆడి ఇండియా తెలిపింది.

చాకొలెట్లు, కాస్మొటిక్స్: ఐరోపా వైన్లు, ఆల్కహాళ్లకు కోటా పద్ధతిన టారిఫ్ కోతలు వర్తిస్తాయి. చాకొలెట్లు, ఇతర ప్రాసెస్డ్ ఆహార వస్తువులకూ తగ్గింపులున్నాయి. దీంతో ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, బెల్జియం నుంచి మనదేశానికి ఎగుమతులు పెరగనున్నాయి. అక్కడి ఖరీదైన కాస్మొటిక్స్‌కూ ఊతం లభించనుంది. దీంతో ఆయా ఉత్పత్తుల ధరలు మనదేశంలో తగ్గే అవకాశం ఉంది.

- 2.5 యూరోల కంటే తక్కువ ధర ఉన్న వైన్‌లకు ఎటువంటి సుంకం మినహాయింపులు ఉండవు. అంత కంటే ధర ఎక్కువ ఉన్న వాటికి మాత్రం సుంకం 150% నుంచి 20 శాతానికి తగ్గుతుంది.

సున్నా సుంకం వర్తించబోయే మన ఎగుమతులు

	సముద్ర ఉత్పత్తులు	పాదరక్షలు-తోళ్లు	దుస్తులు, జౌళి	రసాయనాలు	రత్నాభరణాలు	ప్రాథమిక లోహాలు	రైలు ఉత్పత్తులు, నౌకలు	వినియోగదారు వస్తువులు	బొమ్మలు, స్పోర్ట్స్ వస్తువులు
ప్రస్తుత టారిఫ్(%లో)	26	17	11–12	12.8	4	10	7	10.5	4.7

ఈ ఐరోపా వస్తువులు చౌక

	వైన్	ఆల్కహాల్స్	ఆలివ్ ఆయిల్	కివీస్, పియర్స్	పళ్ల రసాలు	ప్రాసెస్డ్ ఆహారం	గొర్రె మాంసం
ప్రస్తుత టారిఫ్(%)	150	150 వరకు	45 వరకు	33	55 వరకు	50 వరకు	33
భవిష్యత్ సుంకం(%)	40	50	0	0 (కోటా)	0	0	0

సేవల రంగాలకూ మేలే..

ఎఫ్‌టీఏలో 144 ఈయూ ఉప రంగాలు భారత ఎగుమతిదార్లకు అందుబాటులోకి వస్తాయి. కీలక వృత్తినైపుణ్య, సాంకేతిక సేవలు ఇందులో ఉన్నాయి. ఈయూ నుంచి మన విద్యార్థుల రాకపోకలపై పరిమితి ఉండదు. వృత్తి నిపుణులకు వర్క్ వీసా హామీ లభిస్తుంది. ఎగుమతి అయ్యే మన వైన్‌కు ఎటువంటి సుంకాలు ఉండవు. 100 మి. డాలర్లు/85,000 టన్నుల ద్రాక్షకు సుంకం ఉండదు.

భారత ఫార్ములేషన్లు, మందులకు: తక్కువ టారిఫ్‌ల కారణంగా భారత ఫార్ములేషన్లు, ఏపీఐ, వాల్యూ యాడెడ్ మందుల స్థానం మరింత బలోపేతం అవుతుందని ఫార్మెగ్జిల్ ఛైర్మన్ నమిత్ జోషి పేర్కొన్నారు. ఔషధాలపై 11% వరకు ఉన్న టారిఫ్ తొలగింపు వల్ల వాణిజ్యం పెరుగుతుందని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయన్స్ (ఐపీఏ) సెక్రటరీ జనరల్ సుదర్శన్ జైన్ అన్నారు.

ఆర్థిక సర్వే అంచనాలను వాస్తవ వృద్ధి అధిగమిస్తోంది!

దిల్లీ: మనదేశ ఆర్థిక వృద్ధి గణాంకాలను పరిశీలిస్తే, ఆర్థిక సర్వేలో ప్రకటించిన అంచనాలను తరచుగా అధిగమిస్తున్నాయి. బడ్జెట్ ముందస్తు పత్రం (ప్రీ-బడ్జెట్ డాక్యుమెంట్)లో అంచనా వేసిన 6.3-6.8% వృద్ధికి మించి 2025-26 ఆర్థిక సంవత్సరంలో 7.4% వృద్ధి రేటు నమోదవుతుందని అంచనా. 2023-24 ఆర్థిక సర్వేలో జీడీపీ వృద్ధి 6-6.8 శాతమని అంచనా వేయగా, అది 9.2 శాతంగా నమోదైంది. 2024-25లో మాత్రం ఆర్థిక సర్వే అంచనా 6.5-7 శాతానికి అనుగుణంగా, 6.5 శాతంగా నమోదైంది. 2022-23లో లక్ష్యం నెరవేరలేదు. వాస్తవిక ఆర్థిక వృద్ధి 7.65% ఉండగా, ఆర్థిక సర్వే అంచనా 8-8.5 శాతంగా ఉంది. 2021-22లో కొవిడ్ కారణంగా ఆర్థిక సర్వే ఎలాంటి అంచనాలను వేయలేదు. కానీ బేస్ ప్రభావం కారణంగా 9.7% వృద్ధి నమోదైంది. 2020-21లో కొవిడ్ ప్రభావం, తదనంతర లాక్‌డౌన్‌ల కారణంగా 5.8% ప్రతికూల వృద్ధి నమోదైంది. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండగా, దీనికి ఒకరోజు ముందు ఆర్థిక సర్వేను వెల్లడిస్తారు.



రూ.21000 కోట్లతో హిందాల్కో అల్యూమినియం స్మెల్టర్ విస్తరణ

ADITYA BIRLA HINDALCO

ఒడిశాలో తమ అల్యూమినియం స్మెల్టర్‌ను రూ.21,000 కోట్ల పెట్టుబడులతో విస్తరించనున్నట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థ హిందాల్కో ఇండస్ట్రీస్ ప్రకటించింది. ఫ్లాట్ రోల్డ్ ఉత్పత్తులు, బ్యాటరీ గ్రేడ్ అల్యూమినియం ఫాయిల్ ఉత్పత్తి కోసం రూ.4,500 కోట్ల తయారీ కేంద్రాన్ని కంపెనీ మంగళవారం ప్రారంభించింది. దీంతో 23,000 మందికి ఉపాధి లభిస్తుందని, తదుపరి దశలో అదనంగా 15,000 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాల సృష్టి జరిగే అవకాశం ఉందని కంపెనీ తెలిపింది.

బ్రెజిల్ కేంద్రంపై రూ.330 కోట్లు: టీసీఎస్

tcs TATA CONSULTANCY SERVICES

బ్రెజిల్‌లో కొత్త కేంద్రం ఏర్పాటుకు రూ.330 కోట్లు పెట్టుబడి పెడతామని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ప్రకటించింది. లాండ్రినా ప్రాంతంలో ఏర్పాటు చేసే ఈ కేంద్రం ప్రధాన డెలివరీ, వినూత్నతలకు ప్రాధాన్యమిస్తుందని.. 1,600 కొత్త ఉద్యోగాలు లభిస్తాయని సంస్థ తెలిపింది. 9,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఈ కేంద్రం 2027లో అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం బ్రెజిల్‌లో 200 మంది క్లయింట్లకు 2,500 మంది నిపుణులు సేవలందిస్తున్నట్లు టీసీఎస్ వివరించింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
మైండ్‌స్పేస్ రీట్	180.09	135.52	832.76	674.47
మారికో	460.00	406.00	3537.00	2794.00
సీజీ పవర్[1]	284.00	238.00	3175.00	2516.00
రేమండ్ రియాల్టీ	66.79	3.01	765.97	93.26
టీసీపీఎల్	384.52	281.92	5112.00	4443.56
రేమండ్ లైఫ్‌స్టైల్	42.86	64.17	1848.72	1754.21
హిందుస్థాన్ మీడియా వెంచర్స్	0.89	17.99	212.24	197.47

1) మధ్యంతర డివిడెండు - రూ.1.30

రెండో అంచె నగరాల్లోనూ సీనియర్లకు వేతనాలు అదుర్స్

ర్యాండ్‌స్టాడ్ నివేదిక



దేశీయ ఉద్యోగ విపణిలో మార్పులు వస్తున్నాయని.. ప్రతిభావంతుల కేంద్రాలుగా మారుతున్న రెండో అంచె నగరాల సంఖ్య అధికమవుతోందని ఒక నివేదిక వెల్లడించింది. సీనియర్ స్థాయి ఉద్యోగుల వేతనాలు ఈ నగరాల్లోనూ గణనీయంగా పెరుగుతున్నట్లు ర్యాండ్‌స్టాడ్ వార్షిక వేతన ధోరణి నివేదిక 2025-26 తెలిపింది. ఈ నివేదిక ప్రకారం.. కోచి, తిరువనంతపురం, థానే, సూరత్, జయపుర, భోపాల్, ఇండోర్ వంటి రెండో అంచె నగరాలు అధిక వృద్ధి ప్రతిభా కేంద్రాలుగా ఆవిర్భవించాయి. ప్రథమ శ్రేణి నగరాల్లో లభిస్తున్న వేతనంతో సమానంగా, ఇక్కడా సీనియర్ స్థాయి ఉద్యోగుల జీతాల్లో పెరుగుదల కనిపిస్తోంది.

- రెండో అంచె నగరాల్లో డొమైన్, గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాలు (జీసీసీ) వేగంగా వృద్ధి చెందుతున్నాయి. నాయకత్వం, ప్రత్యేక డొమైన్ నైపుణ్యం, అధునాతన సాంకేతిక నైపుణ్యాలకు గిరాకీ పెంచుతున్నాయి. సంస్థలు పోటీతత్వంతో అనుభవజ్ఞులకు జీతాలు చెల్లించే పరిస్థితులు నెలకొన్నాయి.
- మౌలిక సదుపాయాల పెట్టుబడులు, ప్రగతిశీల రాష్ట్ర విధానాలు, వేగవంతమైన డిజిటల్ పరివర్తన, అధునాతన తయారీ వృద్ధి, జీసీసీ, స్టార్టప్‌ల మద్దతుతో.. భవిష్యత్తు వృద్ధికి రెండో అంచె నగరాలు సిద్ధమవుతున్నాయి.
- ఇంధనం-యుటిలిటీస్, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ), టెలికాం, మీడియా-వినోదం వంటి రంగాల్లో మంచి వేతనాలు కనిపిస్తున్నాయి. ఆర్థిక, భౌగోళిక రాజకీయ అస్థిరతలు ఉన్నా ప్రథమ శ్రేణి నగరాల్లో వేతనాల సగటు బాగుంది. జాతీయ సగటు వార్షిక వేతనం జూనియర్ స్థాయిలో రూ.5.92 లక్షలు, మధ్య స్థాయిలో రూ.16.70 లక్షలు, సీనియర్ స్థాయిలో రూ.32.40 లక్షలుగా ఉన్నాయి. అగ్ర శ్రేణి రెండో అంచె నగరాల్లో, సీనియర్లకు సగటు వార్షిక వేతనం రూ.28.38 లక్షలకు చేరింది.

వేతనాలు అధికంగా చెల్లిస్తున్న పరిశ్రమలు

ఇంధనం-యుటిలిటీస్	రూ.18.38 లక్షల వరకు (మధ్యస్థం) రూ.24 లక్షల వరకు (సీనియర్)
ఐటీ-ఆధారిత సేవలు (ఐటీఈఎస్)	రూ.24.70 లక్షలు (సీనియర్)
మౌలిక సదుపాయాలు, స్థిరాస్తి, నిర్మాణం	రూ.24.11 లక్షలు (సీనియర్)
మీడియా, వినోదం (డిజిటల్, ఓటీటీ)	రూ.17.03 లక్షలు

దేశంలో అధికంగా వేతనాలు చెల్లిస్తున్న మధ్య స్థాయి వృత్తి నిపుణులు

1. సాఫ్ట్‌వేర్ డెవలపర్	రూ.17.27 లక్షలు
2. పీహెచ్‌పీ డెవలపర్	రూ.16.86 లక్షలు
3. జావా స్క్రిప్ట్ డెవలపర్	రూ.16.72 లక్షలు
4. ప్రొడక్ట్ మేనేజర్	రూ.16.25 లక్షలు
5. జావా ప్రొఫెషనల్	రూ.16.06 లక్షలు
6. క్లౌడ్ ఆర్కిటెక్ట్/క్లౌడ్ కంప్యూటింగ్	రూ.16.03 లక్షలు
7. నెట్ డెవలపర్	రూ.15.81 లక్షలు
8. సీ++ డెవలపర్	రూ.15.70 లక్షలు
9. పైథాన్ స్పెషలిస్ట్	రూ.15.30 లక్షలు
10. బిగ్ డేటా ఇంజినీర్	రూ.15.17 లక్షలు

ఖాతాలో సగటు నిల్వ రూ.2,000 ఉంటే చాలు: బంధన్ బ్యాంక్

కోల్‌కతా: పొదుపు ఖాతాలో నెలవారీ సగటు నిల్వ (ఎంఏబీ) మొత్తాన్ని రూ.5,000 నుంచి రూ.2,000కు తగ్గించనున్నట్లు బంధన్ బ్యాంక్ తెలిపింది. ఫిబ్రవరి 1 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానుంది. నెలవారీ సగటు నిల్వ కింద బ్యాంకులు నిర్ణయించిన మొత్తం పొదుపు ఖాతా (ఎస్‌బీ అకౌంట్)లో లేకపోతే, బ్యాంకులు జరిమానా విధిస్తుంటాయన్న సంగతి విదితమే. ఎంఏబీని తగ్గించినా, ఖాతాదార్లకు లభిస్తున్న సదుపాయాలు, ప్రయోజనాల్లో ఎటువంటి మార్పు ఉండదని బంధన్ బ్యాంక్ పేర్కొంది. చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారికి బ్యాంకింగ్ సేవలు మరింతగా అందుబాటులోకి తెచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు బంధన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ), చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రాజిందర్ కుమార్ బబ్బర్ వెల్లడించారు.

2030 కల్లా భారత్‌లో 3-5% మార్కెట్ వాటా

రెనో బ్రాండ్ సీఈఓ ఫ్యాబ్రిస్ కాంబోలివ్

చెన్నై: భారత కార్ల విభాగంలో 2030 కల్లా 3-5% మార్కెట్ వాటా దక్కించుకోవాలన్నది తమ లక్ష్యమని ఫ్రాన్స్‌కు చెందిన వాహన దిగ్గజం రెనో బ్రాండ్ సీఈఓ, ముఖ్య వృద్ధి అధికారి ఫ్యాబ్రిస్ కాంబోలివ్ వెల్లడించారు. ఇందుకోసం కొత్త మోడళ్ల ఆవిష్కరణతో పాటు విక్రయాలు - సేవల నెట్‌వర్క్‌ను విస్తరించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ కంపెనీ మన దేశంలో క్విడ్, కైగర్, ట్రైబర్ మోడళ్లను విక్రయిస్తోంది. 2022 నుంచి ఉత్పత్తి నిలిపివేసిన ఎస్‌యూవీ డస్టర్‌ను, సరికొత్తగా తాజాగా తీసుకొచ్చింది. ఏప్రిల్ నుంచి ఈ కారు డెలివరీలు మొదలు కానున్నాయి. ప్రస్తుతం మన దేశంలో ఏడాదికి 43 లక్షల కార్లు అమ్ముడుపోతుండగా, రెనో మార్కెట్ వాటా 1% కంటే తక్కువగా ఉంది. 'మా పని మేము సక్రమంగా చేసుకుంటూ పోతే 2030 నాటికి 3-5% వాటా సాధిస్తాం. ఇదే లక్ష్యంతో ఉన్నాం. దీన్ని చేరుకోవడానికి మాకు ఒక విద్యుత్ వాహనం కూడా ఉండాలి. కొత్త మోడళ్లు మరిన్ని తీసుకొస్తామ'ని ఫ్యాబ్రిస్ వెల్లడించారు.

మార్కెట్లకు ఈయూ ఒప్పంద లాభాలు

సెన్సెక్స్ ▲ 320 **81857** | నిఫ్టీ ▲ 127 **25175**

మనదేశం, ఐరోపా సమాఖ్య (ఈయూ) మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదరడంతో మంగళవారం దేశీయ సూచీలు లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, లోహ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. దిగుమతి అయ్యే కార్ల ధరలు తగ్గుతాయనే వార్తలతో, వాహన షేర్లు నష్టపోయాయి. కార్పొరేట్ కంపెనీల త్రైమాసిక ఫలితాలు నిరుత్సాహపరచడం, విదేశీ మదుపర్ల అమ్మకాలతో సూచీలకు లాభాలు పరిమితమయ్యాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 22 పైసలు పుంజుకుని 91.68 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.15% లాభంతో 65.49 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఐరోపా సూచీలు మిశ్రమంగా ట్రేడయ్యాయి.

- బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.2.11 లక్షల కోట్లు పెరిగి రూ.453.67 లక్షల కోట్ల (4.94 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.
- సెన్సెక్స్ ఉదయం 100 పాయింట్ల (క్రితం ముగింపు 81,537.70) నష్టంతో 81,436.79 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా ఒడుదొడుకుల మధ్య కదలాడిన సూచీ, ఇంట్రాడేలో 81,088.59 వద్ద కనిష్ఠాన్ని తాకింది. తదుపరి పుంజుకున్న సెన్సెక్స్, 82,084.92 వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది. చివరకు 319.78 పాయింట్ల లాభంతో 81,857.48 దగ్గర ముగిసింది. నిఫ్టీ 126.75 పాయింట్లు పెరిగి 25,175.40 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,932.55- 25,246.65 పాయింట్ల మధ్య కదలాడింది.
- సెన్సెక్స్ 30 షేర్లలో 17 లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్ 4.33%, యాక్సిస్ బ్యాంక్ 4.31%, టాటా స్టీల్ 2.64%, టెక్ మహీంద్రా 2.58%, ఎన్‌టీపీసీ 2.48%, ఎస్‌బీఐ 2.28%, అల్ట్రాటెక్ 1.81%, బీఈఎల్ 1.57%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.49%, ఇండిగో 1.40% రాణించాయి. కోటక్ బ్యాంక్ 3.14%, ఏషియన్ పెయింట్స్ 2.86%, ఎటర్నల్ 1.97%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.69%, మారుతీ 1.48% నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. లోహ 3.11%, సేవలు 1.96%, కమొడిటీస్ 1.87%, పీఎస్‌యూ బ్యాంక్ 1.76%, యుటిలిటీస్ 0.93%, చమురు-గ్యాస్ 0.92% పెరిగాయి. మన్నికైన వినిమయ వస్తువులు 1.18%, వినియోగ 0.68%, ఎఫ్ఎమ్‌సీజీ 0.48% తగ్గాయి. బీఎస్ఈలో 1803 షేర్లు లాభపడగా, 2510 స్క్రిప్‌లు నష్టపోయాయి. 171 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

పుంజుకున్న అదానీ షేర్లు: గౌతమ్ అదానీకి సమన్లు జారీ చేసేందుకు అమెరికా సెక్ కోర్టు అనుమతి కోరిందన్న వార్తలతో శుక్రవారం కుదేలైన అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు, మంగళవారం మళ్లీ పుంజుకున్నాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ 5.24%, అదానీ పోర్ట్స్ 4.33%, అదానీ ఎనర్జీ 4.26%, అదానీ గ్రీన్ ఎనర్జీ 3.45%, సంఘీ ఇండస్ట్రీస్ 2.93%, అంబుజా 2.35%, అదానీ టోటల్ గ్యాస్ 1.62%, అదానీ పవర్ 1.09%, ఏసీసీ 1.09%, ఎన్‌డీటీవీ 0.82% చొప్పున లాభాలు నమోదుచేశాయి.

భారత్-ఈయూ ఎఫ్‌టీఏ నేపథ్యంలో

- **వాహన షేర్లకు నష్టాలు:** ఐరోపా నుంచి దిగుమతి అయ్యే కార్ల ధరలు తగ్గి, పోటీ పెరగొచ్చన్న అంచనాలతో దేశీయ వాహన కంపెనీల షేర్లు డీలాపడ్డాయి. ఎం అండ్ ఎం 4.19%, హ్యుందాయ్ 4.02%, మారుతీ 1.48%, టీఎంపీవీ 1.22% చొప్పున నష్టపోయాయి.
- **రాణించిన జౌళి షేర్లు:** ఎగుమతులకు అవకాశాలు పెరుగుతాయనే ఆశలతో జౌళి షేర్లు మెరిశాయి. ఇండోకౌంట్ ఇండస్ట్రీస్ 6.02%, కేపీఆర్ మిల్ 5.96%, వెల్‌స్పన్ లివింగ్ 4.22%, అలోక్ ఇండస్ట్రీస్ 2.50%, ట్రైడెంట్ 1.85%, అరవింద్ 0.52% రాణించాయి.



- ఆకర్షణీయ త్రైమాసిక ఫలితాలు ప్రకటించడంతో అల్ట్రాటెక్ సిమెంట్ షేరు 3.72% లాభపడి రూ.12,829.40 వద్ద ముగిసింది.
- **ముత్తూట్ పప్పాచాన్ గ్రూప్** (ముత్తూట్ బ్లూ) కింద ముత్తూట్ ఫిన్‌కార్ప్, ఇతర గ్రూప్ కంపెనీలతో రూ.500 కోట్ల డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు అమెరికా టెక్నాలజీ సంస్థ యూఎస్‌టీ ప్రకటించింది. ముత్తూట్ గ్రూప్ ఐటీ మౌలిక సదుపాయాలు, క్లౌడ్, డేటా కేంద్రం, సైబర్ భద్రతా కార్యకలాపాలను యూఎస్‌టీ బలోపేతం చేయనుంది.

(c) eenadu



దరఖాస్తు చేశారా?

☛ ఈఎస్ఐసీ దిల్లీలో సీనియర్ రెసిడెంట్ ఉద్యోగాలు
చివరి తేదీ: 30.01.2026

☛ ఐవోసీఎల్ వెస్టర్న్ రీజియన్‌లో అప్రెంటిస్ ఖాళీలు (405)
చివరి తేదీ: 31.01.2026

కరెంట్ అఫైర్స్



★ మొదటి ఫిఫా (ఎఫ్ఐఎఫ్ఏ) శాంతి బహుమతిని ఇటీవల ఎవరికి ప్రదానం చేశారు?
జ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (ప్రపంచ వ్యాప్తంగా శాంతి, ఐక్యతను ప్రోత్సహించినవారికి ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నట్లు ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్ఫాంటినో ప్రకటించారు.)

మాదిరి ప్రశ్నలు

★ పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) తన మొదటి మహిళా బ్రాండ్ అంబాసిడర్‌గా ఇటీవల ఎవరిని నియమించింది?
జ: భారత్ మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్

★ 2025 డిసెంబరు 2 నుంచి 15 వరకు కేరళలోని తిరువనంతపురంలో 'ఎకువేరిన్' పేరిట ఏ రెండు దేశాల 14వ ఎడిషన్ జాయింట్ మిలిటరీ విన్యాసాలు నిర్వహించారు?
జ: భారత్-మాల్దీవులు

★ అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం (ఐడీపీడీ- ఇంటర్నేషనల్ డే ఆఫ్ పర్సన్స్ విత్ డిసేబిలిటీస్)ను ఏటా ఏ రోజున నిర్వహిస్తారు?
జ: డిసెంబరు 3 (2025లో ఈ దినోత్సవాన్ని 'ఫోస్టరింగ్ డిసేబిలిటీ ఇంక్లూజివ్ సొసైటీస్ ఫర్ అడ్వాన్సింగ్ సోషల్ ప్రోగ్రెస్' అనే థీమ్‌తో నిర్వహించారు.

★ దేశంలోని మొదటి వాటర్ పాజిటివ్ విమానాశ్రయంగా ఇటీవల ఏ అంతర్జాతీయ విమానాశ్రయం ఘనత సాధించింది?
జ: ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, దిల్లీ

మరింత సమాచారం

పెరిగినా.. తగ్గినా.. పరిమాణం మారినా!



పానీయం రుచిగా ఉండాలి అంటే ఒక నిమ్మకాయను పిండినప్పుడు, మూడు గ్లాసుల నీళ్లు కలపాలి. అంటే ఇక్కడ ఒక రాశికి మరో రాశి ఎన్ని రెట్లు ఉండాలో తెలియజేస్తోంది. ఈ విధంగా ఒకే రకమైన రెండు రాశులను పోల్చడాన్ని నిష్పత్తి అంటారు. పదిమంది అతిథులకు పానీయం ఇవ్వాలంటే పది నిమ్మకాయలు పిండాలి, ముప్పై గ్లాసుల నీళ్లు పోయాలి. ఇక్కడ రుచి మారకుండా జాగ్రత్త పడుతూ పానీయం పరిమాణాన్ని పెంచారు. దీనినే అనుపాతంగా వ్యవహరిస్తారు. అంటే రెండు నిష్పత్తుల సమానత్వమే అనుపాతం. అంకగణితంలో అత్యంత ప్రధానమైన ఈ ప్రాథమిక అంశాలపై పట్టు పెంచుకోవాలంటే అభ్యర్థులు భిన్నాలను కూడటం, తీసివేయడం, గుణించడం నేర్చుకోవాలి. నిష్పత్తులను సరళీకరించడం తెలుసుకోవాలి. శాతాలపై పట్టు పెంచుకోవాలి. దాంతోపాటు అనులోమానుపాతం, విలోమానుపాతం మధ్య తేడాను స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

నిష్పత్తి - అనుపాతం

నిష్పత్తి - అనుపాతం అనేవి గణితంలో రెండు ముఖ్యమైన ప్రాథమిక భావనలు. వీటి అవసరం నిత్య జీవితంలోని దాదాపు అందరికీ ఉంటుంది. వాటిని అర్థం చేసుకోవడం, ఉపయోగించడం వల్ల తగిన నిర్ణయాలు తీసుకోవచ్చు. సమస్యలను సమర్థంగా పరిష్కరించవచ్చు. పరిస్థితులను చక్కగా విశ్లేషించవచ్చు.

ముఖ్యాంశాలు: ★ రెండు నిష్పత్తులు సమానమైతే ఆ నిష్పత్తుల్లోని పదాలు అనుపాతంలో ఉన్నాయని అంటారు. ★ అనుపాతం చివర ఉన్న రెండు పదాలను 'అంత్యాలు' అని మధ్య ఉన్న పదాలను 'మధ్యమాలు' అని అంటారు.
★ అనుపాతంలో అంత్య పదాల లబ్ధం = మధ్య పదాల లబ్ధం

$a : b = c : d \Rightarrow ad = bc$

అనులోమానుపాతం: ఏదైనా రెండు రాశుల్లో ఒక రాశిలో పెరుగుదల (లేదా తగ్గుదల), రెండో రాశిలో కూడా నిర్ణీత పద్ధతిలో పెరుగుదల (లేదా తగ్గుదల) కు కారణమైతే ఆ రాశులు అనుపాతంలో ఉన్నాయని అంటారు.



★ x, y అనే రాశుల్లో $\frac{x}{y}$ విలువ ఎప్పుడూ స్థిరంగా ఉంటే x, y లు అనులోమానుపాతంలో ఉన్నాయని అంటారు.
★ దీనినే $x \propto y$ అని రాస్తారు.


విలోమానుపాతం: రెండు రాశుల్లో ఒక రాశిలోని పెరుగుదల (లేదా తగ్గుదల), రెండో రాశిలో నిర్ణీత పద్ధతిలో తరుగుదల (లేదా పెరుగుదల) కు దారితీస్తే ఆ రెండు రాశులు విలోమానుపాతంలో ఉన్నాయని చెప్పవచ్చు. ★ x, y అనే రాశుల్లో $xy = K$ (ఒక స్థిరాంకం) అయితే అవి విలోమానుపాతంలో ఉన్నాయని అర్థం.

మిశ్రమానుపాతం: ఒక రాశిలో మార్పు రెండు లేదా ఎక్కువ రాశుల్లోని మార్పులతో ఏదో ఒక అనుపాతంలో ఉంటుంది.

జనరల్ స్టడీస్ - అరిథ్‌మెటిక్

మాదిరి ప్రశ్నలు

1. న్యూదిల్లీలోని 36 మీటర్ల ఎత్తున్న ఒక ఎలక్ట్రికల్ పోల్ ఉదయం 10 గంటల సమయానికి 24 మీటర్ల నీడను ఏర్పరుస్తుంది. అదే సమయంలో ఆ స్తంభానికి దగ్గరగా ఉన్న కుతుబ్‌మినార్ 48 మీటర్ల నీడను ఏర్పరిస్తే, దాని ఎత్తు ఎంత ఉంటుంది?



1) 62 మీ. 2) 72 మీ. 3) 48 మీ. 4) 24 మీ.

వివరణ: దత్తాంశం నుంచి ఎలక్ట్రికల్ పోల్ ఎత్తు = 36 మీ.
దాని నీడ పొడవు = 24 మీ.
కుతుబ్‌మినార్ నీడ పొడవు = 48 మీ.
కుతుబ్‌మినార్ ఎత్తు = x మీ. అనుకుంటే
$\therefore 36 : x = 24 : 48$
⇒ అంత్యాల లబ్ధం = మధ్యమాల లబ్ధం
$\Rightarrow 36 \times 48 = 24 \times x \Rightarrow x = \frac{36 \times 48}{24}$
$\Rightarrow 36 \times 2 = 72$ మీ. **జ: 2**

2. ఒక కార్మికుడు 30 రోజులకు ఒక ఒప్పందం కుదుర్చుకున్నాడు. అతడు పనికి వెళితే రోజుకు రూ.50 వస్తాయి. అతడు పని మానేస్తే రోజుకు రూ.15 చొప్పున అతడి వేతనం నుంచి తగ్గిస్తారు. ఈ ఒప్పందం ప్రకారం అతడు 30 రోజుల్లో రూ.850 సంపాదించాడు. అయితే అతడు పనిచేసిన రోజులెన్ని?



1) 30 2) 40 3) 20 4) 50

వివరణ: దత్తాంశం నుంచి కార్మికుడు హాజరైన రోజుల సంఖ్య = x అనుకుంటే
హాజరుకాని రోజుల సంఖ్య = (30 – x) అవుతుంది.
$\Rightarrow 50x - (30 - x)15 = 850$
$\Rightarrow 50x - 450 + 15x = 850$
$\Rightarrow 65x = 850 + 450 \Rightarrow 65x = 1300$
$\therefore x = \frac{1300}{65} = 20$ **జ: 3**

3. ఒక మిశ్రమంలో రాగి, జింక్ 11 : 9 నిష్పత్తిలో ఉన్నాయి. ఆ మిశ్రమంలోని జింక్ బరువు 32.4 కిలోగ్రాములైతే రాగి బరువు ఎంత?



1) 29.6 కి.గ్రా. 2) 39.6 కి.గ్రా. 3) 35 కి.గ్రా. 4) 45 కి.గ్రా.

వివరణ: రాగి, జింక్‌ల నిష్పత్తి = 11 : 9
ఆ లోహాల మొత్తం బరువు = x గ్రా. అనుకుంటే
రాగి బరువు $= \frac{11}{(11+9)} \times x = \frac{11}{20}x$
జింక్ బరువు $= \frac{9}{20}x$
దత్తాంశం నుంచి $\frac{9}{20}x = 32.4$
$\Rightarrow x = 32.4 \times \frac{20}{9} = \frac{648}{9} = 72$
∴ రాగి బరువు $= \frac{11}{20} = \frac{11}{20} \times 70$
= 39.6 కి.గ్రా. **జ: 2**

4. ఒక పెట్టెలో రూ.5, రూ.2, రూ.1 నాణేల నిష్పత్తి 4 : 3 : 2, వాటి మొత్తం విలువ రూ.280. అయితే ఆ పెట్టెలో ఉన్న నాణేల సంఖ్య?



1) 40, 30, 20 2) 30, 40, 20 3) 20, 30, 40 4) 40, 20, 30

వివరణ: దత్తాంశం నుంచి
రూ.5, రూ.2, రూ.1 నాణేల నిష్పత్తి = 4 : 3 : 2
∴ రూ.5 నాణేలు = 4x ⇒ విలువ = 5 × 4x = 20x
రూ.2 నాణేలు = 3x ⇒ విలువ = 2 × 3x = 6x
రూ.1 నాణేలు = 2x
విలువ = 1 × 2x = 2x
$\therefore 20x + 6x + 2x = 280$
$28x = 280 \Rightarrow x = \frac{280}{28} = 10$
∴ ఆ పెట్టెలో ఉన్న
రూ.5 నాణేలు = 4x = 40
రూ.2 నాణేలు = 3x = 30
రూ.1 నాణేలు = 2x = 20 **జ: 1**

5. $x^2 + 6y^2 = 5xy$ అయితే $\frac{x}{y}$ విలువ ఎంత?

1) 2 2) 3 3) 2, 3 4) ఏదీకాదు



వివరణ: దత్తాంశం నుంచి
$x^2 + 6y^2 = 5xy$
సమీకరణాన్ని y^2తో భాగిస్తే
$\left(\frac{x}{y}\right)^2 + 6 = 5\left(\frac{x}{y}\right)$
$\frac{x}{y} = t$ అనుకుంటే
$t^2 + b = 5t$
$t^2 - 5t + 6 = 0$ లేదా
⇒ t – 2 లేదా t – 3
⇒ t = 2 లేదా t = 3
$\frac{x}{y} = 2$ లేదా $\frac{x}{y} = 3$ **జ: 3**



రచయిత: జె.వి.ఎస్.రావు

TENTH Mathematics — Probability



Final Exams-2026 IMPORTANT Q & A

4 Marks

1. There is a well-shuffled deck of 52 cards. Create four questions based on this data. For example, "Calculate the probability that the card will be an ace".

A: 1. Calculate the probability that the card will be a red king.
2. Calculate the probability that the card will be a black jack.
3. Calculate the probability that the card will be a diamond queen.
4. Calculate the probability that the card will be a black numbered card.

2. A box contains 3 blue, 2 white, and 4 red marbles. One marble is drawn at random from the box. Create four questions based on this data. For example, what is the probability that the marble will be white?

A: 1. What is the probability that the marble will be green?
2. What is the probability that the marble will be blue?
3. What is the probability that the marble will be red?
4. What is the probability that the marble will be black?

3. A die is thrown once. Create four questions based on this data. For example, Find the probability of getting a prime number.

A: 1. Find the probability of getting a composite number.
2. Find the probability of getting a number lying between 2 and 6.
3. Find the probability of getting an odd number.
4. Find the probability of getting an even number.

1 Mark

1. Give an example for an impossible event.

A: Getting 7 on a single throw of a dice.

2. Which of the following can not be the probability of an event

A) 15% B) $\frac{3}{8}$ C) 0.799 D) $1\frac{2}{3}$


A: D

3. If p is the probability of an event A, then p satisfies-

A) $0 < p < 1$
B) $0 \leq p \leq 1$
C) $0 \geq p \geq 1$
D) $0 > p > 1$

A: B

More Imp Q & A



Writer: Dr. T.S.V.S. Suryanarayana Murty

ఏకీకృతం.. సమీకృతం.. సమున్నతం!




భారత ప్రజాస్వామ్యానికి పునాదులైన మూడు వ్యవస్థల్లో న్యాయవ్యవస్థ అత్యంత కీలకమైంది. అందులో అన్నింటి కంటే పైన శిఖర స్థానంలో సుప్రీంకోర్టు ఉంటుంది. దేశ రాజధానిలో కొలువై ఉండే ఈ అత్యున్నత ధర్మపీఠం రాజ్యాంగానికి అసలైన సంరక్షకురాలిగా వ్యవహరిస్తుంది. సామాన్యుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు, చట్టాల అమలులో సందిగ్ధత ఏర్పడినప్పుడు ఆ న్యాయస్థానం ఇచ్చే తీర్పు అంతిమంగా ఉంటుంది. దేశంలో ఏకీకృత న్యాయవ్యవస్థ అమలులో ఉండటం వల్ల సుప్రీంకోర్టు నిర్ణయాలన్నీ దిగువ కోర్టులకు శిరోధార్యంగా నిలుస్తాయి. ఈ విధంగా సంపూర్ణ క్రమశిక్షణతో సాగే భారత న్యాయవ్యవస్థ గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. ముఖ్యంగా సుప్రీంకోర్టు నిర్మాణం, న్యాయమూర్తుల అర్హతలు, నియామకాలను నిర్వహించే కొలీజియం వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలి. రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం, కింది కోర్టుల తీర్పులపై అప్పీళ్లను విచారించే పద్ధతులనూ అర్థం చేసుకోవాలి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

సుప్రీంకోర్టు - నిర్మాణం

1. భారతదేశంలో న్యాయ వ్యవస్థను ప్రవేశపెట్టింది?
1) కారన్ వాలీస్
2) వారన్ హేస్టింగ్స్
3) డల్హౌసీ
4) విలియం బెంటింక్




2. భారతదేశంలో న్యాయ వ్యవస్థను అభివృద్ధి పరచి, న్యాయ వ్యవస్థకు పితామహుడిగా ఎవరు పేరొందారు?
1) సర్ ఎలిజా ఇంపే 2) హరిలాల్ జే కానియా
3) కారన్ వాలీస్ 4) ఎం.హెచ్. బేగ్

3. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
ఎ) రెగ్యులేటింగ్ చట్టం, 1773 ప్రకారం భారత్‌లో తొలిసారిగా సుప్రీంకోర్టును ఈస్టిండియా కంపెనీ పాలనా కాలంలో ఏర్పాటు చేశారు.
బి) కోల్‌కతాలోని పోర్ట్ విలియంలో 1774, మార్చిలో తొలి సుప్రీంకోర్టు ఏర్పడింది.
సి) కోల్‌కతాలో ఏర్పడిన సుప్రీంకోర్టుకు తొలి ప్రధాన న్యాయమూర్తి - సర్ ఎలిజా ఇంపే
1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి

4. కోల్‌కతాలో ఏర్పాటు చేసిన తొలి సుప్రీంకోర్టులో ఇతర న్యాయమూర్తులను గుర్తించండి.
ఎ) సీజర్ లైమెస్టర్ బి) జాన్ హైడ్
సి) రాబర్ట్ ఛాంబర్స్ డి) విలియం జోన్స్
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

5. కోల్‌కతాలో ఉన్న సుప్రీంకోర్టును భారత ప్రభుత్వ చట్టం–1935 ద్వారా ఫెడరల్ కోర్టుగా మార్చు చేసి దిల్లీలో ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1935 2) 1936 3) 1937 4) 1938

6. దిల్లీలో ఏర్పాటు చేసిన 'ఫెడరల్ కోర్టు'లో తొలి ప్రధాన న్యాయమూర్తిగా ఎవరు నియమితులయ్యారు?




1) రాబర్ట్ విలియమ్స్
2) సర్ మారిస్ గ్వేయర్
3) సర్ రాడిసన్ జోన్స్ 4) సర్ విలియం జోన్స్

7. స్వాతంత్ర్యానంతరం 'ఫెడరల్ కోర్టు'ను సుప్రీంకోర్టుగా ఎప్పుడు మార్చారు?
1) 1950, జనవరి 28
2) 1950, జనవరి 26
3) 1950, జనవరి 30 4) 1950, ఏప్రిల్ 1

8. దిల్లీలో ఏర్పాటు చేసిన తొలి సుప్రీంకోర్టులోని న్యాయమూర్తుల సంఖ్య?
1) ఒక ప్రధాన న్యాయమూర్తి, ఐదుగురు ఇతర న్యాయమూర్తులు
2) ఒక ప్రధాన న్యాయమూర్తి, ఆరుగురు ఇతర న్యాయమూర్తులు
3) ఒక ప్రధాన న్యాయమూర్తి, ఏడుగురు ఇతర న్యాయమూర్తులు
4) ఒక ప్రధాన న్యాయమూర్తి, ఎనిమిది మంది ఇతర న్యాయమూర్తులు

9. దిల్లీలో ఏర్పడిన సుప్రీంకోర్టుకు తొలి ప్రధాన న్యాయమూర్తి?



1) హరిలాల్ జే కానియా
2) పి.ఎన్.భగవతి
3) కె.ఎస్.హెగ్డే
4) విలియం మారిస్

10. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
ఎ) భారతదేశం ఏకీకృత, సమీకృత న్యాయ వ్యవస్థను అనుసరిస్తుంది.
బి) జాతీయ స్థాయిలో సుప్రీంకోర్టు అత్యున్నత న్యాయ స్థానంగా కొనసాగుతుంది.
సి) రాష్ట్ర స్థాయిలో హైకోర్టులు; జిల్లా స్థాయిలో సబార్డినేట్ కోర్టులు కొనసాగుతున్నాయి.
డి) దేశంలో న్యాయ వ్యవస్థలన్నీ సుప్రీంకోర్టు పర్యవేక్షణలో పనిచేస్తాయి.
1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

11. సుప్రీంకోర్టు గురించి రాజ్యాంగంలో ఎక్కడ వివరించారు?
1) IVవ భాగం, ఆర్టికల్స్ 123 నుంచి 146
2) Vవ భాగం, ఆర్టికల్స్ 124 నుంచి 147
3) VIవ భాగం, ఆర్టికల్స్ 125 నుంచి 148
4) VIIవ భాగం, ఆర్టికల్స్ 124 నుంచి 151

12. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
ఎ) సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పార్లమెంటు చట్టం ద్వారా నిర్ణయిస్తుంది.
బి) సుప్రీంకోర్టు ప్రధాన, ఇతర న్యాయమూర్తులను రాష్ట్రపతి అధికార ముద్రతో, స్వయంగా సంతకం చేసిన ఆదేశం ద్వారా నియమిస్తారు.
సి) సాధారణంగా సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయమూర్తిని ప్రధాన న్యాయమూర్తిగా నియమిస్తారు.
1) ఎ, బి, సి 2) ఎ, సి 3) ఎ, బి 4) బి, సి

13. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
ఎ) సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రాష్ట్రపతి సమక్షంలో ప్రమాణస్వీకారం చేస్తారు.
బి) సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు 65 సంవత్సరాలు.
సి) సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తమ రాజీనామాను ప్రధాన న్యాయమూర్తికి సమర్పించాలి.
డి) సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వేతనాన్ని భారత సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు.
1) ఎ, బి, సి 2) ఎ, బి, డి
3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి




14. రాజ్యాంగంలోని ఆర్టికల్, 124(3) ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమింపబడటానికి ఉండాల్సిన అర్హతలను గుర్తించండి.
ఎ) భారతీయ పౌరుడై ఉండాలి.
బి) రాష్ట్రపతి దృష్టిలో న్యాయశాస్త్రంలో నిష్ణాతుడై ఉండాలి.
సి) 35 ఏళ్ల వయసు నిండి ఉండాలి.
డి) ఏదైనా హైకోర్టులో న్యాయమూర్తిగా ఐదేళ్ల అనుభవం ఉండాలి లేదా ఏదైనా హైకోర్టులో 10 ఏళ్లు న్యాయవాదిగా పనిచేసి ఉండాలి.
1) ఎ, సి, డి 2) ఎ, బి, సి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

15. న్యాయమూర్తులను నియమించే సందర్భంలో ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని కొలీజియాన్ని రాష్ట్రపతి సంప్రదించాల్సిన అవసరం లేదని ఏ కేసు సందర్భంగా సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది?
ఎ) చంపకం దొరైరాజన్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1952)
బి) ఎస్.పి.గుప్తా Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1982)
సి) ఎ.కె.షా Vs యూనియన్ ఆఫ్ ఇండియా
డి) డి.కె. పాటిల్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా

16. న్యాయమూర్తులను నియమించే సందర్భంలో ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని కొలీజియాన్ని రాష్ట్రపతి తప్పనిసరిగా సంప్రదించాలని ఏ కేసు సందర్భంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది?
ఎ) సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1993)
బి) మేనకా గాంధీ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1978)
సి) ఎస్.ఆర్.బొమ్మై Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1994)
డి) పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1999)

17. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.



ఎ.ఎన్ రే

ఎ) సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయమూర్తిని ప్రధాన న్యాయమూర్తిగా నియమించే సాంప్రదాయం 1950 నుంచి 1973 వరకు కొనసాగింది.
బి) 1973లో ముగ్గురు సీనియర్ న్యాయమూర్తులను కాదని జూనియర్ అయిన ఎ.ఎన్ రేను ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు.
సి) 1977లో సీనియర్ న్యాయమూర్తి అయిన హెచ్.ఆర్ ఖన్నాను విస్మరించి ఎం.హెచ్ బేగ్‌ను ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు.
డి) సాధారణంగా పదవీ విరమణ చేస్తున్న ప్రధాన న్యాయమూర్తి తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా ఎవరిని నియమించాలనే అంశాన్ని ప్రభుత్వానికి సూచిస్తారు.
1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

18. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవికి ఆకస్మికంగా ఖాళీ ఏర్పడినా లేదా అనివార్య కారణాల వల్ల విధులను నిర్వహించే స్థితిలో లేనప్పుడు సుప్రీంకోర్టులో ఉన్న సీనియర్ న్యాయమూర్తుల్లో ఒకరిని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా రాష్ట్రపతి రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ ప్రకారం నియమిస్తారు?
1) 125 2) 126 3) 127 4) 128

19. సుప్రీంకోర్టులో నియమించే 'తాత్కాలిక న్యాయమూర్తుల'కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) ఆర్టికల్ 127 ప్రకారం తాత్కాలిక న్యాయమూర్తులను అవసరమైన సందర్భంలో నియమిస్తారు.
బి) రాష్ట్రపతి పూర్వానుమతితో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తాత్కాలిక న్యాయమూర్తులను నియమిస్తారు.
సి) తాత్కాలిక న్యాయమూర్తుల పదవీకాలం రెండేళ్లు.
డి) తాత్కాలిక న్యాయమూర్తులుగా నియమితులయ్యే వారికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమితులు కావడానికి ఉండాల్సిన అన్ని అర్హతలు ఉండాలి.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

20. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల జీతభత్యాలకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) న్యాయమూర్తుల జీతభత్యాలను పార్లమెంటు ఒక చట్టం ద్వారా నిర్ణయిస్తుంది.
బి) రాజ్యాంగంలోని రెండో షెడ్యూల్‌లో, ఆర్టికల్ 125లో పేర్కొన్నారు.
సి) ఆర్థిక అత్యవసర పరిస్థితిలో కూడా వీరి జీతభత్యాలను తగ్గించరాదు.
1) ఎ, సి 2) ఎ, బి 3) బి, సి 4) ఎ, బి, సి

21. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల జీతభత్యాలకు సంబంధించి 2018లో చేసిన మార్పులను గుర్తించండి.
ఎ) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వేతనం నెలకు రూ.2,80,000.
బి) సుప్రీంకోర్టు సాధారణ న్యాయమూర్తి వేతనం నెలకు రూ.2,50,000.
సి) సుప్రీంకోర్టు తాత్కాలిక న్యాయమూర్తి వేతనం నెలకు రూ.2,25,000.
1) ఎ, సి 2) ఎ, బి 3) బి, సి 4) ఎ, బి, సి

22. సుప్రీంకోర్టు న్యాయమూర్తులను తొలగించే విధానానికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) అసమర్థత, అక్రమ ప్రవర్తన అనే కారణాలతో తొలగించవచ్చు.
బి) అభిశంసన ప్రక్రియను ఉపయోగించి తొలగిస్తారు.
సి) తొలగింపు తీర్మానాన్ని పార్లమెంటు ఉభయసభల్లో ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు.
డి) పార్లమెంటు ఉభయసభలు విడివిడిగా 2/3వ వంతు ప్రత్యేక మెజార్టీతో తీర్మానాన్ని ఆమోదిస్తే రాష్ట్రపతి తొలగిస్తారు.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి


సమాధానాలు

1-2; 2-3; 3-4; 4-1; 5-3; 6-2; 7-1; 8-3; 9-1; 10-4; 11-2; 12-1; 13-2; 14-3; 15-2; 16-1; 17-4; 18-2; 19-4; 20-2; 21-2; 22-4.

(c) eenadu

రక్త సంబంధాలు

కుటుంబ సభ్యుల మధ్య ఉండే బంధాలే రక్తసంబంధాలు. తండ్రి, తల్లి, కూతురు, కొడుకు, అమ్మమ్మ, నానమ్మ, తాత, మేనత్త, మేనమామ ఇవన్నీ రక్త సంబంధాలుగానే పరిగణిస్తారు. దాదాపుగా ఈ వరుసలు అందరికీ పరిచయమైనవే. కానీ పరీక్ష సమయంలో అదిగే ప్రశ్నలు కొన్నిసార్లు గందరగోళానికి గురిచేస్తాయి. దీన్ని అధిగమించి సరైన సమాధానాలు కనిపెట్టాలంటే వంశ వృక్షాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. ప్రశ్నలోని దత్తాంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి, ఇచ్చిన సమాచారాన్ని కోడ్‌ల రూపంలో రాసుకోవాలి. బంధాల వరుస క్రమాన్ని పటాలుగా గీస్తే సమాధానాలు సులువుగా కనిపెట్టొచ్చు.



సంబంధం కనిపెడితే సమాధానం దొరికినట్లే!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

సూచన (ప్ర. 1 – 2): కింది దత్తాంశం ఆధారంగా ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించండి.

ఒక కుటుంబంలో మూడు తరాలకు చెందిన ఏడుగురు వ్యక్తులు ఉన్నారు. కుటుంబంలో రెండు జంటలు ఉన్నాయి. B అనేవారు C కి ఏకైక సంతానం. C అనే వ్యక్తి Dకి తాత. A అనే వ్యక్తి Bకి వదిన. E కి కుమార్తె B. Fకి ఏకైక కుమార్తె G

1. F అనే వ్యక్తికి E ఏమవుతారు?

1) తల్లి 2) అత్త 3) మామ 4) తండ్రి

సాధన: $C^{(+)} \Leftrightarrow E^{(-)}$

|

$B^{(-)} \Leftrightarrow F^{(+)} — A^{(-)}$

|

$D^{(+)} — G^{(-)}$

F అనే వ్యక్తికి E అత్త అవుతుంది.

సమాధానం: 2

2. H అనే వ్యక్తి C కి సోదరుడు అయితే H కి E ఏమవుతారు?

1) కోడలు 2) సోదరి 3) సోదరుడు 4) ఏదీకాదు

సాధన: $H^{(+)} — C^{(+)} \Leftrightarrow E^{(-)}$

|

$B^{(-)} \Leftrightarrow F^{(+)} — A^{(-)}$

|

$D^{(+)} — G^{(-)}$

దత్తాంశం ప్రకారం, Hకి E వదిన/మరదలు అవుతుంది. సమాధానం ఐచ్ఛికాల్లో ఏదీకాదు

సమాధానం: 4

3. కింది దత్తాంశం ఆధారంగా ఇచ్చిన ప్రశ్నకు జవాబు గుర్తించండి.

$P \times Q$ అంటే P అనేవారు Qకి తల్లి

$P + Q$ అంటే P అనేవారు Qకి సోదరుడు

$P - Q$ అంటే P అనేవారు Qకి సోదరి

$P \div Q$ అంటే P అనేవారు Qకి తండ్రి

$A \times B - C \div D$. దీని ప్రకారం A అనేవారు D కి ఏమవుతారు.?

1) సోదరుడు 2) సోదరి 3) నానమ్మ 4) మేనల్లుడు

సాధన: $A^{(-)}$

|

$B^{(-)} — C^{(+)}$

|

D

B కి A తల్లి, Cకి B సోదరి, Dకి C తండ్రి. అంటే Dకి A నానమ్మ అవుతారు.

సమాధానం: 3

సూచన (ప్ర. 4 – 5): కింది దత్తాంశం ఆధారంగా ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించండి.

ఒక కుటుంబంలో P, Q, R, S, E , F, G, H అనే ఎనిమిది మంది వ్యక్తులు ఉన్నారు. ఇందులో రెండు వివాహిత జంటలు ఉన్నాయి. కుటుంబంలో నలుగురు పురుషులు మాత్రమే ఉన్నారు. Q అనే వ్యక్తి Rకి మనవరాలు. S అనే వ్యక్తి Rకి కుమారుడు, Pకి సోదరుడు. Pకి ఇద్దరు పిల్లలు ఉన్నారు. F అనే వ్యక్తి Gకి మామ. Q అనే వ్యక్తి Eకి సోదరి. Gకి H సోదరి. S అవివాహితుడు. Eకి P తల్లి కాదు.

4. E కి F ఏమవుతారు?

1) భార్య 2) మనవడు 3) కొడుకు 4) తాత

సాధన: $R^{(-)} \Leftrightarrow F^{(+)}$

|

$S^{(+)} — P^{(+)} \Leftrightarrow G^{(-)} — H^{(-)}$

|

$Q^{(-)} \Leftrightarrow E^{(+)}$

E అనే వ్యక్తి P, Gల కుమారుడు. G కి మామ F. అంటే Eకి F తాత అవుతాడు.

సమాధానం: 4

5. E కి M అనే వ్యక్తి సోదరుడు అయితే Rకి M ఏమవుతాడు?

1) మనవడు 2) కొడుకు 3) కూతురు 4) ఏదీకాదు

సాధన: E అనే వ్యక్తి Rకి మనవడు. E సోదరుడు M. అప్పుడు Rకి M కూడా మనవడే అవుతాడు.

సమాధానం: 1

సూచన (ప్ర. 6 – 7): కింది దత్తాంశం ఆధారంగా ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించండి.

A, B, C, I, J, K ఆరుగురు కుటుంబ సభ్యులు. J అనే వ్యక్తి I కి కుమారుడు, కానీ J కి I తల్లి కాదు. B అనే వ్యక్తి I కి సోదరుడు. K, I వివాహిత జంట. C అనే వారు Kకి కూతురు. K అనే వ్యక్తి Aకి సోదరి.

6. J అనే వ్యక్తి Cకి ఏమవుతారు?

1) తండ్రి 2) సోదరుడు 3) సోదరి 4) తల్లి

సాధన: $A — K^{(-)} \Leftrightarrow I^{(+)} — B^{(+)}$

|

$C^{(-)} — J^{(+)}$

J అనే వ్యక్తి Cకి సోదరుడు.

సమాధానం: 2

7. కుటుంబంలో ఎంత మంది మహిళలున్నారు?

1) 2 2) 3 3) 4 4) నిర్ణయించలేం

సాధన: దత్తాంశంలో A జెండర్‌ను వెల్లడించలేదు. కాబట్టి మొత్తం ఎంత మంది మహిళలు ఉన్నారో చెప్పలేం.

సమాధానం: 4

8. ఫ్లాట్‌ఫామ్‌పై ఉన్న ఒక మహిళను చూపిస్తూ మంజు "ఆమె నా తల్లి కొడుకు తండ్రి సోదరి" అని చెప్పింది. మంజుకి ఆ మహిళ ఏమవుతుంది?

1) తల్లి 2) సోదరి 3) మేనత్త 4) మేనకోడలు

సాధన: నా తల్లి కొడుకు అంటే - మంజు తల్లి కొడుకు, మంజుకు సోదరుడు. సోదరుడి తండ్రి - మంజుకు కూడా తండ్రి. తండ్రి సోదరి - మంజు మేనత్త.

సమాధానం: 3

9. దీపక్ నితిన్‌తో "ఫుట్‌బాల్ ఆడుతున్న ఆ అబ్బాయి నా తండ్రి భార్య కుమార్తె ఇద్దరు సోదరుల్లో చిన్నవాడు" అని అన్నాడు. అయితే ఫుట్‌బాల్ ఆడుతున్న ఆ అబ్బాయి దీపక్‌కు ఏమవుతాడు?

1) కుమారుడు 2) సోదరుడు 3) తండ్రి 4) మేనల్లుడు

సాధన: నా తండ్రి భార్య - దీపక్ తల్లి, తల్లి కుమార్తె - దీపక్ సోదరి, సోదరి సోదరుడు - దీపక్‌కు కూడా సోదరుడే.

సమాధానం: 2

10. ఒక వ్యక్తిని తన భర్తకు పరిచయం చేసిన మల్లిక 'అతడి సోదరి తండ్రి నా తాతగారికి ఏకైక కుమారుడు' అని చెప్పింది. ఆ వ్యక్తికి మల్లిక ఏమవుతుంది?

1) తల్లి 2) అత్త 3) సోదరి 4) కూతురు

సాధన: అతడి సోదరి తండ్రి - వ్యక్తి తండ్రి, నా తాతగారి ఏకైక కుమారుడు - మల్లిక తండ్రి. వ్యక్తి, మల్లిక అన్నాచెల్లెళ్లు/అక్కాతమ్ముళ్లు అవుతారు.

సమాధానం: 3



రచయిత
బూసర గణేష్, విషయ నిపుణులు

Word of the Day

904

Meagre

Telugu meaning: తక్కువ, స్వల్ప

English meaning: The word meagre (మీగర్) is an adjective that describes something that is very small in quantity or insufficient.

Synonyms: Scanty, Insufficient

Antonyms: Abundant, Plentiful


Usage: 1. Despite working long hours, the workers received a meagre salary that barely covered basic expenses.

2. The relief fund was meagre compared to the scale of damage caused by the natural disaster.

కరెంట్ అఫైర్స్



77వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని 2026, జనవరి 26న దిల్లీలోని కర్తవ్యపథ్‌లో నిర్వహించిన ప్రధాన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సైనిక బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దాదాపు 10,000 మంది రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొన్నారు. ఈ ఏడాది రిపబ్లిక్ డే పరేడ్ థీమ్‌గా 150 ఏళ్ల వందేమాతరాన్ని ఎంచుకున్నారు. కర్నల్ ఫ్రెడ్రిక్ సైమన్ స్ప్రూజ్ నేతృత్వంలోని ఈయూ సైనిక దళం వేడుకలకు హాజరైంది.



బీసీసీఐ మాజీ అధ్యక్షుడు ఇందర్‌జిత్ సింగ్ బింద్రా కన్నుమూశారు. ఆయన వయసు 84 ఏళ్లు. బింద్రా 1993 నుంచి 1996 వరకు బీసీసీఐ అధ్యక్షుడిగా పనిచేశారు. 1978 నుంచి 2014 వరకు పంజాబ్ క్రికెట్ సంఘం (పీసీఏ) అధ్యక్షుడిగా వ్యవహరించారు.



అభివృద్ధి చెందుతున్న దేశాలు కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను గణనీయ స్థాయిలో వినియోగిస్తున్నాయని కన్సల్టింగ్ సంస్థ పీడబ్ల్యూసీ తెలిపింది. 'ఏఐ ఎడ్జ్ ఫర్ వికసిత్ భారత్' పేరుతో ఈ నివేదికను సంస్థ విడుదల చేసింది. దీని ప్రకారం 2035 నాటికి మనదేశంలో 5 ప్రాధాన్యతా రంగాల్లో ఏఐ వాటా 550 బిలియన్ డాలర్ల (రూ. 50.6 లక్షల కోట్లు)కు చేరుతుందని అంచనా వేసింది. దేశంలో ప్రాధాన్యతా రంగాలైన వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, ఇంధనం, విద్య, తయారీ రంగాల వృద్ధిలో ఏఐ కీలకపాత్ర పోషించే అవకాశం ఉందని వెల్లడించింది.

2025-26 సీజన్‌లో జనవరి 15 వరకు భారత్‌లో చక్కెర ఉత్పత్తి 22 శాతం పెరిగి 15.9 మిలియన్ టన్నులకు చేరింది. చెరకు సరఫరా పెరగడం, అధిక దిగుబడి ఇందుకు దోహదం చేశాయని ఇండియన్ షుగర్ అండ్ బయో-ఎనర్జీ మ్యాన్‌ఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐఎస్ఎంఏ) తెలిపింది. జనవరి 15 వరకు దేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న చక్కెర మిల్లుల సంఖ్య 518 కాగా.. గత సీజన్‌లో ఈ సంఖ్య 500గా ఉంది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

స్టడీ జోన్

భారత సుప్రీంకోర్టు

మన దేశంలో సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు. ఇది రాజ్యాంగం ప్రకారం ఏర్పాటై, స్వయంప్రతిపత్తితో వ్యవహరిస్తూ దేశ పాలన రాజ్యాంగబద్ధంగా కొనసాగడంలో కీలకపాత్ర పోషిస్తోంది. రాజ్యాంగ పరిరక్షణ, పౌరుల ప్రాథమిక హక్కుల రక్షణకు బాధ్యత వహిస్తుంది. దేశ పరిపాలన చట్టబద్ధంగా, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా జరిగే విధంగా చేయడంలో సుప్రీంకోర్టు ముఖ్య భూమిక పోషిస్తుంది. **బ్రిటిష్ కాలంలో ఫెడరల్ కోర్టుగా ఉన్న అత్యున్నత న్యాయస్థానం 1950 జనవరి 28న 'సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా'గా మారింది.** పోటీపరీక్షల నేపథ్యంలో దీనికి సంబంధించిన ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!

చారిత్రక నేపథ్యం

బ్రిటిష్ గవర్నర్ జనరల్ వారన్ హేస్టింగ్స్ 1772లో భారతదేశంలో ఒక వ్యవస్థీకృత న్యాయవ్యవస్థను ప్రవేశపెట్టారు. దేశంలో తొలి సుప్రీంకోర్టును ఈస్టిండియా కంపెనీ ఏర్పాటు చేసింది. 'రెగ్యులేటింగ్ చట్టం-1773' ప్రకారం 1774, మార్చి 16న కలకత్తాలోని ఫోర్ట్ విలియంలో ఇది ప్రారంభమైంది. తొలి ప్రధాన న్యాయమూర్తి సర్ ఎలిజా ఇంఫే కాగా, ఇతర న్యాయమూర్తులు సీజర్ లైమెస్టర్, జాన్‌హైడ్, రాబర్ట్ చాంబర్స్.

- 'భారత ప్రభుత్వ చట్టం 1935' ప్రకారం కలకత్తాలోని సుప్రీంకోర్టును 'ఫెడరల్ కోర్టు'గా మార్చి 1937లో దిల్లీలో ఏర్పాటు చేశారు. దీని తొలి ప్రధాన న్యాయమూర్తి సర్ మారిస్ గ్వేయర్.
- స్వాతంత్ర్యానంతరం 'ఫెడరల్ కోర్టు' 1950, జనవరి 28 నుంచి సుప్రీంకోర్టుగా మారింది. ఇందులో ఒక ప్రధాన న్యాయమూర్తి, ఏడుగురు ఇతర న్యాయమూర్తులు ఉన్నారు. తొలి ప్రధాన న్యాయమూర్తి 'హరిలాల్ జె కానియా'.




సుప్రీంకోర్టు గురించి కొన్ని ముఖ్యాంశాలు, గతంలో ఏపీపీఎస్సీ గ్రూప్-2, టీఎస్ సబ్ ఇన్‌స్పెక్టర్స్, ఏపీ సబ్ ఇన్‌స్పెక్టర్స్ పరీక్షలతోపాటు యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్‌లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

EENADU Epratibha

జనరల్ స్టడీస్ - బయాలజీ

ఆవరణ కారకంగా ఉష్ణోగ్రత



వేడి లేదా చల్లదనం స్థాయిని సూచించే ఒక భౌతిక పరిమాణమే ఉష్ణోగ్రత. దీన్ని వస్తువులోని అణువుల కదలిక శక్తి ఆధారంగా నిర్ణయిస్తారు. ఉష్ణోగ్రతను సెల్సియస్ (°C), ఫారెన్‌హీట్ (°F) లేదా కెల్విన్ (K) యూనిట్లలో కొలుస్తారు. ఆవరణ కారకంగా ఉష్ణోగ్రత జీవుల జీవన విధానం, పర్యావరణ ప్రక్రియలు, రసాయన చర్యలపై గణనీయమైన ప్రభావం చూపుతుంది. ఇది జీవుల జీవక్రియ, పెరుగుదల, పునరుత్పత్తి, పంపిణీని నిర్ణయిస్తుంది.

జీవులపై ఉష్ణోగ్రత ప్రభావం

ప్రతి జీవికి ఒక నిర్దిష్ట ఉష్ణోగ్రత పరిధి ఉంటుంది. దీన్నే సహనశీలత అంటారు. ఈ పరిధి పెరిగితే జీవనం కష్టతరమవుతుంది.

మొక్కల జీవన ప్రక్రియలు – ఉష్ణోగ్రత ప్రాథమిక ప్రభావం

మొక్కల జీవన విధానంలో ఉష్ణోగ్రత కీలకమైన ఆవరణ కారకం. ఇది పెరుగుదల, జీవక్రియ, పునరుత్పత్తి, సహనశీలతను నిర్ణయిస్తుంది. మొక్కలు ఎక్టోథర్మ్ జీవులుగా ఉంటాయి. బాహ్య వాతావరణంపై ఆధారపడి ఇవి తమ శరీర ఉష్ణోగ్రతను నియంత్రిస్తాయి.

✦ ఉష్ణోగ్రత మొక్కల్లో జరిగే కిరణజన్య సంయోగక్రియ, శ్వాసక్రియ, బాష్పోత్సేకం లాంటి ప్రక్రియలను ప్రభావితం చేస్తుంది.

పర్యావరణ ప్రక్రియలు – ఉష్ణోగ్రత ప్రభావం

పర్యావరణ ప్రక్రియల్లో ఉష్ణోగ్రత కీలకపాత్ర పోషిస్తుంది.

✦ నీటిచక్రంలో సాంద్రీకరణం, ఘనీభవనం ఉష్ణోగ్రతపై ఆధారపడతాయి.

ఎక్టోథర్మ్‌లు, ఎండోథర్మ్‌లపై ఉష్ణోగ్రత ప్రభావం, గ్లోబల్ వార్మింగ్ - పరిణామాలు మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Senior Resident jobs

The Employees' State Insurance Corporation (ESIC), Delhi, is conducting interviews for filling Senior Resident and Full-Time Specialist posts in various departments on a contract basis. The total number of posts is 45. Eligible candidates can appear for the interview on 30 January 2026.

Trade & Inter Vocational Apprentice Posts

Hindustan Aeronautics Limited (HAL), Transport Aircraft Division (TAD), Kanpur, has released a notification for the engagement of Apprentices under the Apprentices Act for ITI Pass and Intermediate Vocational (10 + 2) candidates. The last date for online applications is 31 January 2026.

Posts at Bharat Electronics Limited

Bharat Electronics Limited (BEL) is inviting applications for Diploma and Graduate Apprentice positions in various departments at its Chennai unit. The total number of posts is 84. Eligible candidates can appear for the interview on 5, 6, 7 February 2026.

Did You Apply..?

Today (January 28) is the last date for the following Jobs

☛ 82 Faculty Jobs at ESIC Ranchi. ***Eligibility:*** MBBS/ MD/ MS/ DNB.

☛ Senior Project Associate posts at CCMB. ***Eligibility:*** Degree, Postgraduate degree, or PhD.

☛ Young Professional posts at National CAMPA. ***Eligibility:*** Postgraduate degree.

For more information and other notifications - scan QR code

Bank Exams

English

One Word Substitution

Directions (Qs. 1 - 22): *Choose the correct one-word substitution of the given phrase/sentence.*

1. A person who deliberately starts arguments or stirs up trouble
A) Arbitrator B) Instigator
C) Mediator D) Pacifist
E) Recluse

2. A situation in which there is a great shortage of food
A) Famine B) Drought
C) Scarcity D) Deprivation
E) Inflation

3. A person who cannot be corrected or reformed
A) Insecure B) Impulsive
C) Insolent D) Inflexible
E) Incorrigible

4. A person who speaks many languages fluently
A) Linguist B) Interpreter
C) Polyglot D) Translator
E) Orator

5. An act of officially cancelling or withdrawing a decision, law, or agreement
A) Ratification B) Endorsement
C) Abolition D) Rescission
E) Amendment

6. A person who shows excessive pride in oneself or one's achievements
A) Humble B) Arrogant C) Boaster
D) Egoist E) Narcissist

7. A person who abandons his or her religious faith
A) Heretic B) Agnostic
C) Skeptic D) Apostate
E) Atheist

8. A place where public records are stored
A) Library B) Repository
C) Archive D) Registry
E) Vault

9. A speech delivered without prior preparation
A) Impromptu B) Rhetorical
C) Scripted D) Persuasive
E) Narrative

10. One who is indifferent to pleasure or pain
A) Optimist B) Stoic C) Cynic
D) Ascetic E) Fatalist

11. A person who is unable to pay his or her debts
A) Indigent B) Insolvent
C) Pauper D) Destitute
E) Recluse

12. A government ruled by a king or queen
A) Monarchy B) Oligarchy
C) Republic D) Autocracy
E) Democracy

13. A person who spends money excessively and carelessly
A) Thrifty B) Economical
C) Extravagant D) Miser
E) Frugal

14. A statement that is deliberately misleading or false
A) Fact B) Error
C) Truth D) Fallacy
E) Revelation

15. A person who speaks less and keeps thoughts to oneself
A) Talkative B) Gregarious
C) Frank D) Loquacious
E) Reserved

16. A person who is unwilling to change opinions or attitudes
A) Flexible B) Adaptable
C) Obstinate D) Amiable
E) Compliant

17. A person who secretly listens to private conversations
A) Detective B) Informer
C) Spy D) Eavesdropper
E) Observer

18. A situation in which people panic and leave in a hurry
A) Migration B) Stampede
C) Commotion D) Evacuation
E) Agitation

19. One who pretends to have feelings or beliefs that he or she does not really have
A) Hypocrite B) Honest
C) Imposter D) Traitor
E) Opportunist

20. A speech delivered at the beginning of a ceremony or event
A) Epilogue B) Monologue
C) Soliloquy D) Dialogue
E) Prologue

21. A person who spends money carefully and avoids waste
A) Frugal B) Miser
C) Extravagant D) Spendthrift
E) Lavish

22. A person who is excessively concerned with minor details or rules
A) Genius B) Pedant
C) Critic
D) Analyst
E) Scholar

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

(c) eenadu



రైలు ఆలస్యంతో చేజారిన పరీక్ష..
విద్యార్థినికి రూ.9 లక్షల పరిహారం

ఇంటర్నెట్ డెస్క్: ఉత్తర్‌ప్రదేశ్‌లో రైలు సమయానికి రాకపోవడంతో ఓ విద్యార్థినికి తన కెరీర్‌కు కీలకమైన ప్రవేశ పరీక్ష చేజారింది. దీనిపై ఆమె న్యాయపోరాటం చేయగా దాదాపు ఏడేళ్ల తర్వాత.. రూ.9.10 లక్షల పరిహారం లభించింది. బస్తీ జిల్లాకు చెందిన సమృద్ధి 2018లో బీఎస్సీ బయోటెక్నాలజీ ప్రవేశ పరీక్షకు హాజరయ్యేందుకు ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ రైలుకు టికెట్టు తీసుకుంది. ఉదయం 11.00 గంటలకు లఖ్‌నవూ చేరాల్సి ఉండగా.. రైలు రెండున్నర గంటలు ఆలస్యంగా వచ్చింది. పరీక్ష కేంద్రంలో మధ్యాహ్నం 12.30 వరకే విద్యార్థులను అనుమతించడంతో సమృద్ధి ఆ పరీక్ష అవకాశాన్ని కోల్పోయింది. రైలు ఆలస్యం కారణంగా పరీక్ష రాయలేకపోవడంతో తాను ఏడాది కాలాన్ని నష్టపోయానంటూ జిల్లా వినియోగదారుల ఫోరంలో ఆమె పిటిషను దాఖలు చేసింది. విచారణ జరిపిన ఫోరం రైల్వే మంత్రిత్వశాఖకు నోటీసులు జారీ చేసింది. రైలు ఆలస్యాన్ని ధ్రువీకరించిన మంత్రిత్వశాఖ అందుకు సరైన కారణాన్ని మాత్రం చూపలేకపోయింది. దాదాపు ఏడేళ్లు కొనసాగిన ఈ విచారణపై ఫోరం తాజా ఉత్తర్వులు జారీ చేస్తూ.. విద్యార్థినికి 45 రోజుల్లోపు రూ.9.10 లక్షల పరిహారం అందించాలని ఆదేశించింది.

పారిశ్రామికవేత్త కుమారుడి కిడ్నాప్

- రెండు వారాల తర్వాత సురక్షితంగా ఇంటికి
- ఝార్ఖండ్‌లో వెలుగు చూసిన ఘటన

జంషెడ్‌పుర్: అపహరణకు గురైన ఓ పారిశ్రామికవేత్త కుమారుణ్ని రెండు వారాల తర్వాత దుండగులు విడిచిపెట్టారు. ఝార్ఖండ్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 13న జంషెడ్‌పుర్‌కు చెందిన పారిశ్రామికవేత్త దేవాంగ్ గాంధీ కుమారుడు కైరవ్ (24) ఆఫీస్ నుంచి వస్తుండగా దుండగులు కిడ్నాప్ చేశారు. సరాయ్‌కేలా-ఖర్సావాన్ జిల్లాలోని ఆదిత్యపుర్ పారిశ్రామికవాడలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేయడంతో నిందితులు గందరగోళానికి గురయ్యారు. పట్టుబడిపోతామని భయపడి మంగళవారం తెల్లవారుజామున కైరవ్‌ను హజారీబాగ్ జిల్లా బర్హి ప్రాంతంలో వదిలేసి పరారయ్యారు. అతడిని పోలీసులు రక్షించి, ఇంటికి పంపించారు. నిందితుల కోసం గాలింపు కొనసాగుతుందని పోలీసులు ప్రకటనలో పేర్కొన్నారు.



వందేళ్లనాటి పాత పాళీ

ఈటీవీ భారత్: కోల్‌కతాలో జరుగుతున్న 49వ అంతర్జాతీయ పుస్తక ప్రదర్శనలో వందేళ్లనాటి అరుదైన పాళీ (పెన్ నిబ్) సందర్శకులను ఆకట్టుకుంటోంది. వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వాహకులు దీనికి 'వందేమాతరం' అని పేరు పెట్టారు. దేశవ్యాప్తంగా దాదాపు ఏడాది వెతికి ఈ రకమైన వంద పెన్ నిబ్‌లు సేకరించామని 'సులేఖ' సంస్థ తెలిపింది. ఈ నిబ్‌ను దేశానికి స్వాతంత్ర్యం రాకముందు ఎఫ్.ఎం.గుప్తా అనే సంస్థ తయారుచేసింది. పాతకాలంలో పెన్నుల కోసం ప్రత్యేకమైన పెట్టెలు ఉండేవి. అలాంటి పెట్టెలో ఒక పెన్ను, పాళీ, రెండు ఇంక్ బాటిళ్లు, చెక్క పెన్‌స్టాండు అమర్చారు. ఇంకా సోద్‌పుర్ ఖాదీ సంస్థకు చెందిన కొత్త లోగోను కూడా చేర్చారు. ఉప్పు - నిప్పులా ఉన్న రష్యా, ఉక్రెయిన్ దేశాల స్టాల్‌లు ఈ బుక్ ఫెయిర్‌లో ఒకే వరుసలో ఉన్నాయి. చైనా కూడా దాదాపు 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ ప్రదర్శనకు వచ్చింది. మొత్తం 21 దేశాలు ఈ పుస్తక ప్రదర్శనలో పాల్గొంటున్నాయి.

ఇరాన్‌పై యుద్ధ మేఘం!

- పశ్చిమాసియాలో విమాన వాహకనౌకను మోహరించిన అమెరికా



మాపై దాడిచేస్తే తగిన మూల్యం తప్పదంటూ అగ్రరాజ్యాన్ని హెచ్చరిస్తూ ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో వెలిసిన బిల్‌బోర్డు



దుబాయ్: పశ్చిమాసియాపై మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. అగ్ర రాజ్యానికి చెందిన విమాన వాహకనౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్ ఈ ప్రాంతానికి చేరుకుంది. దీంతో ఇరాన్‌పై అమెరికా ఏ క్షణం దాడి చేస్తుందోనన్న భయాందోళనలు నెలకొన్నాయి. అబ్రహం లింకన్‌తో పాటు యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ. పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయెన్స్ డిస్ట్రాయర్స్, యూఎస్ఎస్ మైకేల్ మర్ఫీ చేరుకున్నాయని అమెరికా సెంట్రల్ కమాండ్ ధ్రువీకరించింది. ప్రాంతీయ భద్రత, సుస్థిరతల కోసం వీటిని మోహరించినట్లు పేర్కొంది. పలు ఫైటర్ జెట్లు, మిలిటరీ కార్గో విమానాలను పశ్చిమాసియా ప్రాంతానికి పెంటగాన్ తరలించనున్నట్లు మీడియా కథనాలు తెలియజేస్తున్నాయి. ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్న క్రమంలో జరిగిన ఘర్షణల్లో వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఆందోళనకారులకు వ్యతిరేకంగా ఇరాన్ ప్రభుత్వం ఏదైనా చర్య తీసుకుంటే జోక్యం చేసుకుంటామని అమెరికా హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే అమెరికా భారీగా బలగాలను మోహరిస్తోంది. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.

చర్చలకు సిద్ధం: అమెరికా

ఇరాన్ చర్చలకు రావాలనుకుంటే సిద్ధంగా ఉన్నామని అమెరికాకు చెందిన అధికారి ఒకరు పేర్కొన్నారు. చర్చలు ముందుకు సాగేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఇరాన్‌కు ఇప్పటికే తెలుసని వ్యాఖ్యానించారు.

ఒడెసా నగరంపై డ్రోన్ దాడి



ఒడెసాలో ధ్వంసమైన అపార్ట్‌మెంట్

కీవ్: దక్షిణ ఉక్రెయిన్‌లోని ఒడెసా నగరంపై రష్యా జరిపిన డ్రోన్ దాడిలో ఇద్దరు పిల్లలు, ఒక గర్భిణి సహా 23 మంది గాయపడ్డారని అధికారులు మంగళవారం తెలియజేశారు. ఈ దాడికి 50 డ్రోన్లను ఉపయోగించారని వెల్లడించారు. ఉక్రెయిన్‌లోని పవర్ గ్రిడ్ లక్ష్యంగా ఈ దాడి జరిగిందని వివరించారు. రష్యా దాడిలో ఐదు అపార్ట్‌మెంట్లు దెబ్బతిన్నాయని తెలిపారు. సహాయ కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయని అపార్ట్‌మెంట్ శిథిలాల కింద చిక్కుకున్నవారి పరిస్థితి తెలియాల్సి ఉందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ తెలిపారు. యుద్ధాన్ని నిలిపేందుకు ప్రయత్నాలను అమెరికా వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేనూ ప్రవాస భారతీయుడినే..

- నాకూ ఓసీఐ కార్డుంది..
- ఐరోపా కౌన్సిల్ అధ్యక్షుడు కోస్టా వెల్లడి



మీడియా సమావేశంలో ఓసీఐ కార్డు చూపుతున్న ఆంటోనియో కోస్టా. చిత్రంలో మోదీ

దిల్లీ: తాను ప్రవాస భారతీయుడనేనని, తనకు ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డుందని ఐరోపా కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా తెలిపారు. తన మూలాలు గోవాలో ఉండటం తనకు గర్వకారణమని వ్యాఖ్యానించారు. తన తండ్రి కుటుంబం ఐరోపాకు వలస వెళ్లిందని వెల్లడించారు. ప్రధాని మోదీ, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులాతో కలిసి సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన తన ఓసీఐ కార్డును విలేకరులకు చూపించారు. విదేశీ పాస్‌పోర్టులున్న ప్రవాస భారతీయులకు ఓసీఐ కార్డులను కేంద్ర ప్రభుత్వం జారీ చేస్తుంటుంది. దాంతో వారు జీవిత కాలంలో ఎప్పుడైనా, ఎన్నిసార్లైనా భారత్‌కు రావొచ్చు.. వెళ్లొచ్చు. ఇక్కడ స్థిరాస్తులను సమకూర్చుకోవచ్చు. కానీ వ్యవసాయ భూములను కొనడానికి వీల్లేదు. రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడానికీ అవకాశముండదు. ఎన్నో శతాబ్దాలపాటు పోర్చుగీస్ కాలనీగా ఉన్న గోవా 1961 డిసెంబరు 19వ తేదీన భారత్ వశమైంది. కోస్టా.. 1961 జులై 17వ తేదీన పోర్చుగల్‌లోని లిస్బన్‌లో జన్మించారు. గోవాను భారత్‌కు అప్పగించడానికి 5 నెలల ముందు ఆయన పుట్టారు.

వాస్తవాలను దేశం ముందుంచండి: కాంగ్రెస్

దిల్లీ: రాష్ట్రపతి ప్రసంగం, ఆర్థిక సర్వే, కేంద్ర బడ్జెట్ రూపాల్లో ప్రచారం చేసుకునేబదులు ఆర్థిక పరిస్థితిపై వాస్తవాలనే ప్రజల ముందు ఉంచాలని కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. దేశంలో అసమానతలు పెరుగుతున్నాయని, సంక్షేమం తిరోగమనంలో ఉందని తెలిపింది. కేంద్ర బడ్జెట్‌కు ముందు విడుదల చేసే ఆర్థిక సర్వేను దృష్టిలో పెట్టుకుని పార్టీ 'అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పరిశోధన విభాగం' మంగళవారం ఒక నివేదిక వెలువరించింది. విభాగం ఛైర్మన్ రాజీవ్ గౌడ, పార్టీ నేత అమితాబ్ దుబే విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ గణాంకాలు నమ్మశక్యమేనా అని వారు అనుమానం వ్యక్తంచేశారు. ప్రజల్ని తప్పుదోవ పట్టించవద్దని హితవు పలికారు. "ఆర్థిక రంగానికి అంతా స్వర్ణయుగం అని ప్రభుత్వం, మోదీ మద్దతుదారులు చెబుతున్నా వాస్తవాలు దానికి చాలా దూరంగా ఉన్నాయి. ఐఎంఎఫ్ మనకు సీ గ్రేడు ఇచ్చింది. ద్రవ్యోల్బణం 0.5 శాతమని చెబుతున్నా అది నిజమేనా? స్థూల జాతీయోత్పత్తిని ప్రభుత్వం కనీసం 2.5% పెంచి చూపిందని అరవింద్ సుబ్రమణియన్ వంటి ఆర్థికవేత్తలే చెబుతున్నారు. తయారీ రంగం 8.4% వృద్ధిని సాధించిందని చెబుతున్నా కీలక పరిశ్రమలు 2.9% మాత్రమే ఎదుగుదల నమోదుచేశాయి. ఆర్థిక రంగం అంత బాగుంటే రూపాయి ఎందుకు పతనమవుతోంది? స్థూల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తిరోగమనంలో ఉన్నాయి. ఏటా దాదాపు 5 వేల మంది సంపన్నులు మన దేశం నుంచి వేరేచోటుకు వెళ్లిపోతున్నారు. ప్రతి ఐదుగురిలో నలుగురి రోజువారీ ఆదాయం రూ.200 కంటే తక్కువే. ప్రజల పొదుపు పడిపోయింది" అని గౌడ, దుబే వివరించారు.

ఉత్తర కొరియా క్షిపణుల ప్రయోగం

సియోల్: ఉత్తర కొరియా మంగళవారం తమ తూర్పుతీరం వైపుగా సముద్రంలోకి రెండు స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని దక్షిణ కొరియా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ క్షిపణులు దాదాపు 350 కిలోమీటర్లు ప్రయాణించాయని తెలిపింది. ఉత్తరకొరియా చేసే ఎలాంటి రెచ్చగొట్టే చర్యలనైనా తిప్పికొట్టడానికి తాము సిద్ధంగా ఉన్నామని దక్షిణ కొరియా తెలిపింది. దక్షిణ కొరియా అధ్యక్షుడు చైనా పర్యటనకు వెళ్లే కొన్ని గంటల ముందే ఈ ప్రయోగం జరగడం గమనార్హం. జపాన్ రక్షణ మంత్రిత్వ శాఖ ఈ ప్రయోగాన్ని ఖండించింది. జపాన్ శాంతికి, అంతర్జాతీయ సమాజానికి దీన్ని ముప్పుగా పేర్కొంది.

ట్రంప్ వలస విధానాలపై అసంతృప్తి

- పోల్‌లో వెల్లడి

వాషింగ్టన్: అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వలస విధానాలపై అమెరికన్లు అసంతృప్తితో ఉన్నారు. ఈ అంశంలో ట్రంప్ నిర్ణయాలకు ప్రజల మద్దతు భారీగా తగ్గింది. రాయిటర్స్-ఇప్సోస్ నిర్వహించిన పోల్‌లో ఈ విషయం వెల్లడైంది. అక్రమ వలసల పేరుతో ఆయన తీసుకుంటున్న కఠిన చర్యలు చాలా దూరం వెళ్లాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

అక్రమ వలస దారుల్ని అడ్డుకోవడానికి అమెరికాలోని పలు ప్రాంతాల్లో ఇమ్మిగ్రేషన్ అధికారులను ట్రంప్ యంత్రాంగం మోహరించింది. దీనికి నిరసనగా శనివారం మినియాపొలిస్‌లో జరిగిన ఘర్షణల్లో మరో అమెరికా పౌరుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనకు ముందు, తర్వాత అంటే శుక్రవారం నుంచి ఆదివారం మధ్య ఈ పోల్ చేపట్టగా.. ట్రంప్ నిర్ణయాలను ఆమోదించేవారి సంఖ్య తగ్గిపోయింది. తాజాగా 39 శాతం మంది ఆమోదించగా.. అంతకు ముందు ఆ రేటు 41 శాతంగా ఉంది. 53 శాతం మంది ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి వలసలకు సంబంధించిన నిబంధనలను కఠినతరం చేశారు. ఈ విషయంలో తొలుత ఆయనకు ప్రజల నుంచి భారీ ఆమోదం లభించింది. గత ఫిబ్రవరిలో 50 శాతం మంది ఆయన విధానాలకు అనుకూలంగా స్పందించడం గమనార్హం.

స్వరం మార్చిన ట్రంప్



మిన్నెసోటా రాష్ట్రంలోని మినియాపొలిస్ నగరంలో వలస అధికారులు జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో ఇప్పటిదాకా ఇద్దరు అమెరికన్ పౌరులు చనిపోయారు. ఈ నెల 7న రేనీ నికోల్ గుడ్ అనే 37 ఏళ్ల మహిళ, 24న అలెక్స్ ప్రెట్టీ అనే 37 ఏళ్ల యువకుడు ప్రాణాలను కోల్పోయారు. ఈ వరుస ఘటనలతో ట్రంప్ సర్కారుపై అమెరికన్లలో ఆగ్రహం పెరుగుతోంది. దీన్ని గుర్తించిన అధ్యక్షుడు దిద్దుబాటు చర్యలను మొదలుపెట్టారు. నిన్నటిదాకా మిన్నెసోటా గవర్నర్, విపక్ష డెమోక్రటిక్ పార్టీ నేత టిమోతి జేమ్స్ వాల్జ్‌ను తిడుతూ వచ్చిన ట్రంప్.. ఇప్పుడు లా అండ్ ఆర్డర్ కోసం ఆయనతో కలిసి పని చేస్తానని అంటున్నారు. మినియాపొలిస్ నగరంలో ఐసీఈ ఏజెంట్ల అతి వెనుక సరిహద్దు పెట్రోలింగ్ సీనియర్ కమాండర్ గ్రెగ్ బోవినో ఉన్నారని గుర్తించారు. దీంతో ఆయనసహా పలువురు ఐసీఈ ఏజెంట్లను అక్కడి నుంచి వెనక్కి వచ్చేయాలని ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు.

అందరికీ అన్నీ తెలియవు..
ప్రధాని మోదీ పరీక్షాపే చర్చ షార్ట్ వీడియో

ఇంటర్నెట్‌డెస్క్: పరీక్షల సమయంలో విద్యార్థుల్లో భయాందోళన, ఒత్తిడిని పోగొట్టేందుకు ప్రధాని మోదీ 'పరీక్షా పే చర్చ'ను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఈ కార్యక్రమానికి సంబంధించిన షార్ట్ వీడియోను మోదీ తన అధికారిక యూట్యూబ్ ఛానెల్‌లో విడుదల చేశారు. ఇందులో పాల్గొనేందుకు 4.5కోట్లకు మందికిపైగా రిజిస్టర్ చేసుకున్నారు. ఈ వీడియోలో మోదీ మాట్లాడుతూ.. 'మీ పద్ధతిని మీరు నమ్మండి. అందరికీ అన్నీ తెలియవు. కానీ ప్రతిఒక్కరికీ ఏదో ఒక విషయంపై అవగాహన ఉంటుంది. పరీక్షలు రాయడం అనేది తప్పనిసరి.' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మోదీని కొన్ని ప్రశ్నలు అడిగారు. 'లక్ష్యానికి చేరువయ్యేందుకు.. మనం ఎలాంటి వాటిని అలవాటుగా చేసుకోవాలి?'. 'ఇందుకు మనకి ప్రేరణ అవసరమా లేక క్రమశిక్షణ?'. 'ఆత్మవిశ్వాసం పెరిగేందుకు మీరు ఎలాంటి సలహాలు ఇస్తారు?' అని విద్యార్థులు మోదీని ప్రశ్నించారు. ప్రధాని మోదీ 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో వీటికి సమాధానం ఇవ్వనున్నారు.

కూలీలను శక్తిహీనుల్ని చేయడమే మోదీ లక్ష్యం
రాహుల్‌గాంధీ ఆరోపణ



దిల్లీ: వేతనం కోసం బేరమాడే శక్తిని కూలీలకు లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే ప్రధాని నరేంద్ర మోదీ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ (ఎంజీనరేగా) పథకాన్ని నాశనం చేస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం ఆరోపించారు. పంచాయతీలకు అధికారాలు లేకుండా చేయడం, అధికారం కొందరి చేతుల్లో కేంద్రీకృతమై ఉండే అలనాటి రాచరిక దశకు మళ్లీ దేశాన్ని నెట్టివేయడం కూడా మోదీ ఆంతర్యమని ఆయన పేర్కొన్నారు. ఎంజీనరేగా కూలీలతో ఇటీవలి తన సంభాషణకు సంబంధించిన వీడియోను రాహుల్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఉపాధి హామీ పథకం తమ జీవితాలకు వెలుగునిచ్చిందని చెప్పిన కొందరు కూలీలు మోదీ ప్రభుత్వం తమను బానిసలుగా మారుస్తోందని తెలిపారన్నారు. ఉపాధి హామీ పథకం తమకు కనీస వేతనాలతో పాటు, ఏడాది మొత్తం పని హామీని, గౌరవంగా పని చేసుకునే అవకాశాన్ని కల్పించిందని దేశంలోని ఉపాధి కూలీలు ముక్తకంఠంతో చెబుతున్నారని రాహుల్ పేర్కొన్నారు.

భార్య కోరితే భర్త ఆదాయం వివరాలు వెల్లడించాల్సిందే
ఆదాయపుపన్ను శాఖకు కేంద్ర సమాచార కమిషన్ ఆదేశం

దిల్లీ: విడాకులు తీసుకున్న భార్య తన మనోవర్తి కోసం మాజీ భర్త ఆదాయ వివరాలను కోరితే వాటిని అందించాల్సిన బాధ్యత ఆదాయపుపన్ను (ఐటీ) శాఖపై ఉంటుందని కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) స్పష్టం చేసింది. వైవాహిక వివాదాల్లో ఇలాంటి సమాచారాన్ని గోప్యంగా ఉంచరాదని పేర్కొంది. మనోవర్తిని ఎగవేయడానికి తన మాజీ భర్త ఆదాయ వివరాలను దాచిపెడుతున్నారనీ, అతడి ఐదేళ్ల ఆదాయపన్ను రిటర్నులను తనకు ఇవ్వాలని ఓ వివాహిత సమాచార హక్కు చట్టం కింద ఐటీ శాఖను కోరింది. అదే చట్టంలోని 8 (1)(జె) సెక్షన్ ఈ సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని నిర్దేశిస్తోంది కాబట్టి భార్య దరఖాస్తును తిరస్కరిస్తున్నామని ఐటీ శాఖ తెలిపింది. దీన్ని సీఐసీ తోసిపుచ్చింది. భార్యకు ఆ సమాచారం ఇవ్వాల్సిందేనని ఆదేశించింది. విడిపోయిన భర్త స్థూల ఆదాయం, పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం వివరాలను ఐటీ అధికారులు వెల్లడిస్తే భార్య మనోవర్తి పరిమాణాన్ని నిర్ణయించడం సాధ్యమవుతుందని పేర్కొంది.

అక్రమ వలసదారులకు స్పెయిన్‌లో చట్టబద్ధత!

బార్సిలోనా: ఎలాంటి అనుమతులూ లేకుండా తమ దేశంలో నివసిస్తున్న లక్షల మంది అక్రమ వలసదారులకు చట్టబద్ధత కల్పించాలని స్పెయిన్ నిర్ణయించింది. అమెరికాతోపాటు ఐరోపాలోని కొన్ని దేశాలు అక్రమ వలసదారులకు వ్యతిరేకంగా అనుసరిస్తున్న కఠిన వైఖరికి భిన్నంగా స్పెయిన్ ఈ నిర్ణయం తీసుకుంది. మంగళవారం మంత్రివర్గ సమావేశం అనంతరం ఆ దేశ ప్రవాస వ్యవహారాల మంత్రి ఎల్మా సెయిజ్ ఒక ప్రకటన చేశారు. స్పెయిన్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా నివసిస్తున్న వారికి ఏడాది వరకూ చట్టబద్ధ ఆవాసంతోపాటు, పని చేసుకునేందుకు అనుమతులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. 2025 డిసెంబరు 31కి ముందు స్పెయిన్‌కు వచ్చిన వారికి, తాము స్పెయిన్‌లో కనీసం 5 నెలలపాటు నివాసం ఉన్నట్లు నిరూపించుకోగలిగిన వారికి కొత్తగా జారీ చేయనున్న అనుమతులు వర్తిస్తాయి. అనుమతి కోరుకునేవారు తమకు ఎలాంటి నేర రికార్డు లేదని నిరూపించుకోవాలి. దేశ ఆర్థిక రంగానికి వలసదారులు మేలు చేస్తారని స్పెయిన్ ప్రధాని సాంచెజ్, ఆయన మంత్రివర్గ సహచరులు పేర్కొంటున్నారు.

ఆస్ట్రేలియాను ఠారెత్తిస్తున్న ఎండలు

వెలింగ్టన్: ఆస్ట్రేలియాలో భానుడి భగభగలతో జనం అల్లాడిపోతున్నారు. ఆ దేశంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉష్ణోగ్రతలు దాదాపు 50 డిగ్రీల సెంటిగ్రేడ్ (122 డిగ్రీల ఫారెన్ హైట్)కు చేరాయి. 2019లో ప్రచండ ఎండల వల్ల ఆస్ట్రేలియాను కార్చిచ్చులు చుట్టుముట్టాయి. న్యూ సౌత్ వేల్స్, దక్షిణ ఆస్ట్రేలియాలలోని కొన్ని ప్రాంతాలలో అప్పటికన్నా ఇప్పుడు ఎక్కువ ఎండలు కాస్తున్నాయి. ఈ నెల మొదటి నుంచి ఇప్పటి వరకు ఎండల తీవ్రత కొనసాగుతూనే ఉంది. మెల్‌బోర్న్ నగరంలో ఎండల ధాటికి వీధులన్నీ నిర్మానుష్యమయ్యాయి. ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ జరుగుతున్న మెల్‌బోర్న్ పార్క్ స్టేడియంలో వేడి తీవ్రతకు ప్రేక్షకులు పలచబడిపోయారు. ఆటగాళ్ల విరామ సమయంలో నెత్తిన ఐస్ ప్యాక్‌లు, ముఖానికి పోర్టబుల్ ఫ్యాన్ల గాలి తగిలే ఏర్పాట్లు చేసుకున్నారు. ఫోటోగ్రాఫర్లకు చుర్రుమనిపించే ఎండల్లో కూర్చోవడానికి కుషన్లు ఇచ్చారు.

నిధులిచ్చే విధుల్లో ఇవేం మార్పులు?

- ఆలస్యం నివారణకే అంటూ మార్పుచేర్పులు
- గతంలో ఒక కార్యదర్శి వద్దే మూల్యాంకనం
- ఇప్పుడు ఇద్దరు కార్యదర్శులకూ ఆ బాధ్యత
- మరింత ఆలస్యం.. నిర్ణయాలు కేంద్రీకరణ

ఈనాడు-అమరావతి: ఆర్థికశాఖలో అదనపు బడ్జెట్ విడుదల నిర్ణయాలు, విడుదల ఉత్తర్వులు ఇచ్చే ప్రక్రియలో మార్పులు జరిగాయి. ఆర్థిక సంఘం గ్రాంట్లు, వడ్డీల చెల్లింపులకు సంబంధించి, తుపానులు, కరవుల సమయంలో నిధులు విడుదల చేయడంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా ఉండేందుకే ఈ మార్పులు చేస్తున్నామని ఆర్థికశాఖ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఈ మేరకు జనవరి 22న ఉత్తర్వులు ఇచ్చారు. ఒకవైపు కొన్ని అంశాల్లో ఆలస్యాన్ని నివారించేందుకే ప్రస్తుత విధానాలను మారుస్తున్నామని పేర్కొంటూనే.. మరింత ఆలస్యమయ్యే ప్రక్రియను రూపొందించడం విశేషం.

ఏమిటీ.. ఎలా?: రాష్ట్రంలో మొత్తం 33 మంది సెక్రటరీలు, 187 మంది విభాగాధిపతులు, కార్పొరేషన్లు, సొసైటీలు, యూనివర్సిటీల నుంచి వచ్చే వివిధ ఆర్థిక ప్రతిపాదనలు, బడ్జెట్ కేటాయింపులు, అదనపు బడ్జెట్ మంజూరులు, ఆయా శాఖల మధ్యే బడ్జెట్ సర్దుబాట్లకు సంబంధించిన అంశాలను రాష్ట్ర ఆర్థికశాఖలో 20 ఫైనాన్స్ మానిటరింగ్ సెక్షన్లు పరిశీలిస్తున్నాయి. ఒకో సెక్షన్ ఐదారు ప్రభుత్వశాఖలకు సంబంధించిన అంశాలను పర్యవేక్షిస్తాయి.

- ఈ ఎఫ్ఎంయూ సెక్షన్లను ఇద్దరు కార్యదర్శులు పర్యవేక్షిస్తారు. ఆ ఇద్దరు కార్యదర్శులపైనా ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి ఉండి నిర్ణయాలు తీసుకుంటారు. ఈ ఇద్దరు కార్యదర్శుల్లో ఒకరు ఖర్చులకు సంబంధించిన అంశాలు పర్యవేక్షిస్తారు. మరొకరు బడ్జెట్ వ్యవహారాలు పర్యవేక్షిస్తారు.


ఉత్తర్వులు ఎలా విడుదలవుతాయి?

- ఇంతవరకు ఉన్న ప్రక్రియ ప్రకారం.. ఇద్దరు కార్యదర్శులకు కొన్ని ప్రభుత్వశాఖలను అప్పజెప్పారు. వారి పరిధిలో ఉన్న ఫైనాన్స్ మానిటరింగ్ సెక్షన్లు ఆ ప్రతిపాదనలు పరిశీలించి కార్యదర్శికి పంపుతారు. అక్కడ నిర్ణయం తీసుకున్నాక ముఖ్య కార్యదర్శి వద్దకు ఆ ఫైలు వెళ్తుంది. అప్పటికే కార్యదర్శి మూల్యాంకనం చేసి తన నిర్ణయం తెలియజేస్తారు. ముఖ్య కార్యదర్శి పరిశీలించి ఆ నిర్ణయాన్ని ఆమోదిస్తారు.
- అక్కడి నుంచి బడ్జెట్ చూసే కార్యదర్శి వద్దకు ఆ ఫైలు వెళ్తుంది. అక్కడ మళ్లీ ఆ బడ్జెట్ కేటాయింపు అవసరమా? లేదా అన్న మూల్యాంకనం చేయబోరు. ముఖ్య కార్యదర్శి నిర్ణయానికి అనుగుణంగా బడ్జెట్ సెక్షన్‌కు వెళ్లి బడ్జెట్ విడుదల ఉత్తర్వులు ఇచ్చేందుకు ఆ సెక్షన్ చేయాల్సిన ప్రక్రియ పూర్తి చేసి తొలుత ఆ బడ్జెట్ అంశం పరిశీలించిన కార్యదర్శి వద్దకు పంపుతారు. అక్కడ ఫైనాన్స్ మానిటరింగ్ సెక్షన్ ద్వారా బడ్జెట్ విడుదల ఉత్తర్వులు జారీ అవుతాయి.

ఇప్పుడు రెండుసార్లు మూల్యాంకనం

ఒకవైపు నిధుల విడుదల ఆలస్యమవుతోందని మార్పులు చేశారు. అయితే ఇప్పుడు రెండుసార్లు మూల్యాంకనం చేసేలా మార్చడం విశేషం. ఫైనాన్స్ మానిటరింగ్ సెక్షన్ పరిశీలించి కార్యదర్శి నిర్ణయం తీసుకుని మళ్లీ బడ్జెట్ కార్యదర్శికి పంపాలి. అక్కడ కూడా ఆ బడ్జెట్ ఇవ్వడం అవసరమా లేదా అనే అంశాన్ని బడ్జెట్ సెక్షన్ పరిశీలించి వారి కార్యదర్శి వద్దకు పంపుతుంది. బడ్జెట్ కార్యదర్శి అధ్యయనం చేసి నిర్ణయం తీసుకుంటారు. అదే హోదాలో ఉన్న ఒక అధికారి నిర్ణయం తీసుకున్న తర్వాత మళ్లీ అదే హోదాలో ఉన్న మరో అధికారి దాన్ని మూల్యాంకనం చేయడం ఒక ఇబ్బంది అయితే.. రెండోసారి మూల్యాంకనానికి నిర్దేశించడం ఆలస్యాన్ని మరింత పెంచబోతోంది. పైగా 20 ఎఫ్ఎంయూ సెక్షన్లు చేయాల్సిన పనిని వదిలేసి మొత్తం పరిశీలన రెండు బడ్జెట్ సెక్షన్లకే అప్పచెబుతున్నారు. ఇది ప్రక్రియను ఆలస్యం చేస్తుందా? లేక త్వరగా పూర్తయ్యేలా చేస్తుందా? మొత్తం నిర్ణయాలన్నీ బడ్జెట్ కార్యదర్శికి అప్పజెప్పడం అధికారాల కేంద్రీకరణ కాదా? అనే ప్రశ్నలు వస్తున్నాయి. బడ్జెట్ విడుదల ఉత్తర్వులు గత విధానం ప్రకారం ఆయా ఎఫ్ఎంయూ సెక్షన్ల నుంచే విడుదలయ్యేవి. దీని వల్ల 20 సెక్షన్లు ఆ ప్రక్రియ చేపట్టేవి. ఇప్పుడు బడ్జెట్ విడుదల ఉత్తర్వులు 2 బడ్జెట్ సెక్షన్లకే అప్పచెబుతున్నారు. 20 సెక్షన్లు చేసే పని రెండు సెక్షన్లు చేయడం ఆలస్యం నివారిస్తుందా? పెంచుతుందా అనే చర్చ సాగుతోంది.

హత్య కేసు నిందితుడిని పట్టించిన ఏఐ



మహారాష్ట్ర రాజధాని ముంబయిలోని లోకల్ రైల్లో జరిగిన హత్య కేసులో నిందితుడిని కృత్రిమ మేధ (ఏఐ) పట్టించింది. ఈ టెక్నాలజీ ద్వారా 12 గంటల్లోనే నిందితుడిని పోలీసులు అరెస్టు చేయగలిగారు. ముంబయిలోని మలద్ రైల్వే స్టేషన్లో అలోక్ సింగ్ అనే ప్రొఫెసర్ లోకల్ రైలు ఎక్కారు. ఈ సమయంలో రద్దీగా ఉండటంతో ఓంకార్ శిందే అనే వ్యక్తికి తగిలారు. దీంతో ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. అది భౌతిక దాడులకు దారితీసింది. చివరకు కత్తి తీసిన శిందే.. అలోక్ సింగ్ పొట్టలో పొడిచాడు. ఆ వెంటనే మరో రైలెక్కి పారిపోయాడు. అలోక్ సింగ్ ప్లాట్‌ఫాంపై పడిపోయాడు. పోలీసులు, ప్రయాణికులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించారు. అయినా రక్తం ఎక్కువగా పోవడంతో మరణించారు. ఈ కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు.. మలద్ స్టేషన్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. ఏఐ సాయంతో విశ్లేషించారు. నిందితుడు వసాయ్‌లో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు.

ఈటీవీ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

ఎందరికో ప్రేరణ..
ఆర్గానిక్ తేనె వ్యాపారం



అనుకున్నది సాధించాలనే ధృఢ సంకల్పం ఉంటే ఎప్పుడైనా, దేన్నయినా సాధించవచ్చు. మహారాష్ట్రకు చెందిన 60 ఏళ్ల విశ్వాస్ నెరూర్కర్ దీనికి చక్కని ఉదాహరణ. ఆయన సంకల్ప్ తేనెను తయారు చేస్తూ, స్థానికులకు ఉపాధి కల్పిస్తూ, ఎంతో మందికి స్ఫూర్తి దాయకంగా నిలుస్తున్నారు.

మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లా ఘోల్వాడ్ గ్రామాన్ని ఎక్కువగా తేనె లభించే మూడో గ్రామంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ అవకాశాన్ని విశ్వాస్ నెరూర్కర్ సద్వినియోగం చేసుకున్నారు. ప్రకృతి నుంచి తీసుకుని, తిరిగి ప్రకృతికి, మనిషికి మేలు చేయాలనే లక్ష్యంతో 'సంకల్ప్ హనీ' సంస్థను స్థాపించారు. విశ్వాస్ నెరూర్కర్ 12వ తరగతి దాకా చదువుకున్నారు. ఆయనకు ఉద్యోగంపై ఆసక్తి లేదు. దీంతో కొన్నేళ్లు విద్యుత్ పరికరాలకు సంబంధించిన వ్యాపారం చేశారు. ఆయన తేనె విషయంలో కల్తీని సహించలేకపోయారు. దీంతో విద్యుత్ వ్యాపారాన్ని వదిలి కోస్బాద్‌లో తేనెటీగల పెంపకంలో శిక్షణ పొందారు. ఆ తర్వాత సంకల్ప్ హనీని స్థాపించి, అందులో ఇతరులను భాగస్వాములుగా చేర్చుకున్నారు. అందులో విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదుగుతూ ఎంతో మందికి ప్రేరణగా నిలుస్తున్నారు.

పాములు పట్టే చేతులతో
పలకాబలపం



రాజస్థాన్‌లోని సపేరో కీ బస్తీ గ్రామానికి చెందిన బాలికలు చదువు కోసం పోరాటం చేస్తూ స్ఫూర్తి నింపుతున్నారు. ఎన్నో కష్టాలకు ఓర్చి ఉన్నత విద్యను పూర్తి చేయగలుగుతున్నారు. అలవర్‌కు సమీపంలోనే సపేరో కీ బస్తీ గ్రామం ఉంటుంది. ఇక్కడి వారు పాములను పట్టి ఆడించి జీవనం సాగిస్తుంటారు. ఆ గ్రామానికి సరైన రోడ్లు లేవు. దీంతో గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలోనే బాలికలు చదువుకునేవారు. ఆ తర్వాత 3, 4 కిలోమీటర్ల దూరంలోని ఉన్నత పాఠశాలకు వెళ్లలేక చదువు ఆపేసేవారు. అయితే గ్రామానికి చెందిన సంగీత అనే విద్యార్థిని.. పట్టుబట్టి తల్లిదండ్రులను ఒప్పించి 10వ తరగతి వరకూ చదివారు. ఇందుకోసం ఆమె గ్రామంలోని నలుగురు విద్యార్థినులను ఒప్పించారు. గ్రామంలో 10వ తరగతి పూర్తి చేసిన తొలి విద్యార్థినిగా సంగీత నిలిచారు. ఆ తర్వాత ఆమె గ్రామంలోని బాలికలకు చదువు చెబుతున్నారు. ప్రస్తుతం ఆమె 30 మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. మరింత ఉన్నత చదువులను కొనసాగించాలని సంగీత భావిస్తున్నారు.

(c) eenadu

నీటి పారుదల ప్రాజెక్టుల్ని.. వేగంగా పూర్తిచేయండి

- అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణానికి.. ప్రణాళికలు రూపొందించండి
- సీమలో ఉద్యాన క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చిన డీపీ వరల్డ్
- పూర్వోదయ, సాస్కీ పథకాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు



ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో ఉద్యానరంగ అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో వివిధ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారుల్ని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఉద్యాన హబ్‌గా రాయలసీమతో పాటు, ప్రకాశం, మార్కాపురం జిల్లాలు అభివృద్ధి చెందే అవకాశాలున్నాయని, రాష్ట్రంలో ఉద్యాన క్లస్టర్ ఏర్పాటు కోసం దుబాయికి చెందిన డీపీ వరల్డ్ సంస్థ ముందుకొచ్చిందని వెల్లడించారు. పూర్వోదయ, సాస్కీ, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో 10 జిల్లాల్ని ఉద్యాన రంగానికి కేంద్ర బిందువులుగా మార్చే లక్ష్యంతో రూపొందించిన అభివృద్ధి ప్రణాళికలపై సీఎం చంద్రబాబు మంగళవారం క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. 'రాయలసీమ.. ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని నీటి పారుదల ప్రాజెక్టుల్ని త్వరితగతిన పూర్తిచేయాలి. తక్కువ నిధులతో త్వరగా పూర్తయ్యే వాటిని తొలుత చేపట్టాలి. గాలేరు-నగరి ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాల్ని కడపకు తీసుకెళ్లడంపై దృష్టి సారించాలి. ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ ప్రాజెక్టులు చేపట్టాలి. పోలవరం ఎడమ కాల్వ పనులు పూర్తయితే గోదావరి జలాల్ని ఉత్తరాంధ్రకు తీసుకెళ్లొచ్చు. అప్పుడు పోలవరం-వంశధార నదుల అనుసంధానాన్ని చేపట్టవచ్చు' అని అన్నారు.

ప్రపంచ మార్కెట్‌కు అనుగుణంగా...

ప్రపంచ మార్కెట్‌లో డిమాండుకు అనుగుణంగా ఉద్యాన ఉత్పత్తులు పండించేలా ప్రణాళికలు తయారు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. 'ఉద్యాన ఉత్పత్తుల్లో రాయలసీమ ప్రాంతం దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. అందుకు అనుగుణంగా ఎకోసిస్టంను అభివృద్ధి చేయాలి. ఉద్యానరంగంలో ప్రైవేటు పెట్టుబడులను సాధించాలి. ఆహార శుద్ధి యూనిట్లు, పోర్టుల అనుసంధానం, గోదాములు, లాజిస్టిక్స్ ప్రణాళికలు రూపొందించాలి' అని చెప్పారు. 'నీటి పారుదల రంగాన్ని వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. చాలా ప్రాజెక్టుల్ని పెండింగ్‌లో పెట్టింది' అని సమీక్షలో పాల్గొన్న జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. 'నీటి పారుదల ప్రాజెక్టులు పూర్తయితే రాయలసీమ.. ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో ఉద్యాన పంటల సాగు అపారంగా పెరుగుతుంది. 10 జిల్లాల్లోని 201 క్లస్టర్లు, 303 మండలాల్లో ఉద్యాన సాగు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం' అని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. సమావేశంలో సీఎస్ విజయానంద్, ఆర్థిక, జలవనరులు, వ్యవసాయ, ఉద్యాన, పోర్టులు, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

10 జిల్లాల్లో పూర్తిచేయనున్న ప్రాజెక్టులు

● వెలిగొండ ● కొరిశపాడు ఎత్తిపోతల పథకం ● పాలేరు జలాశయం ● మల్లెమడుగు ఎత్తిపోతల, రిజర్వాయర్ ● శ్రీబాలాజీ జలాశయం ● కుప్పం బ్రాంచి కాల్వ ● పుంగనూరు బ్రాంచి కాల్వ ● మూలపల్లి ఎత్తిపోతల పథకం ● హంద్రీ-నీవా ప్రధాన కాల్వ పనులు ● అట్లూరుపాడు-మెర్లపాక ఎస్ఎస్ఎల్సీ ● నీవా బ్రాంచి కాల్వ పనులు ● జీడిపల్లి-భైరవానితిప్ప ఎత్తిపోతల పథకం ● జీడిపల్లి-అప్పర్‌పెన్నార్ ఎత్తిపోతల ● అనంతపురంలో కమ్యూనిటీ సూక్ష్మసేద్య ప్రాజెక్టు ● మడకశిర బ్రాంచి కెనాల్ విస్తరణ పనులు ● పేరూరు ఎత్తిపోతల పథకం ● కడప, కోడూరు వరకు గాలేరు-నగరి సుజల స్రవంతి ● అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు ● పశ్చిమ కర్నూలుకు నీరిచ్చే వేదవతి-అలగనూరు-గాజులదిన్నె ప్రాజెక్టులు ● ఏడు జిల్లాల్లో 1,011 మైనర్ ఇరిగేషన్ చెరువుల అభివృద్ధి.

వేసవిలో కోతల్లేకుండా కరెంట్!

- గరిష్ఠ డిమాండ్ 14,500 మెగావాట్లుగా అంచనా
- తదనుగుణంగా ఇంధన శాఖ ప్రణాళిక
- రికార్డు స్థాయిలో బొగ్గు నిల్వ
- అధిక ధరలపై కొనుగోళ్లకు చెక్

ఈనాడు, అమరావతి వేసవిలో విద్యుత్ కోతలను నివారించేలా, అవసరాల మేరకు ఉత్పత్తి పెంచేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక గతేడాది వేసవిలో కరెంటు కోతలకు చెక్ పెట్టారు. ఈ ఏడాది కూడా సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే తప్ప, 'కొరత కారణంగా విద్యుత్ ఇవ్వలేదు' అన్న మాట రాకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందుకోసం రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరుల నుంచి గరిష్ఠ విద్యుత్ ఉత్పత్తి దిశగా కార్యాచరణ ప్రారంభించారు. రాష్ట్రంలో 21,153 మెగావాట్ల స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉంది. అందులో పునరుత్పాదక విద్యుత్ 37 శాతం. ఈ ఏడాది ఫిబ్రవరి రెండో వారం నుంచే కరెంటు వాడకం క్రమేణా పెరిగి, వేసవిలో గ్రిడ్ గరిష్ఠ డిమాండ్ సుమారు 14,500 మెగావాట్లకు చేరొచ్చని అంచనా. గతేడాది 13,712 మెగావాట్లుగా నమోదైంది.

గరిష్ఠ వినియోగం 270 ఎంయూలు

వేసవిలో గరిష్ఠ విద్యుత్ వాడకం 265-270 మిలియన్ యూనిట్లు (ఎంయూ)గా ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. స్థానిక వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకుని, బహిరంగ మార్కెట్‌లో కొనుగోళ్లు సాధ్యమైనంత మేరకు తగ్గించాలని భావిస్తున్నారు. గతంలో వైకాపా ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు విచ్చలవిడిగా కొనుగోళ్లు జరిపింది. 2023-24లో ఇలా రూ.8,600 కోట్లు వెచ్చించింది. ఆ మొత్తమే ట్రూఅప్ రూపేణా ప్రజలు ప్రస్తుతం భరించాల్సి వస్తోంది.

● స్వాపింగ్ ద్వారా హరియాణా, జమ్మూ నుంచి విద్యుత్ తీసుకోనున్నారు. ఈ లెక్కన కొన్ని టైం బ్లాక్ (ప్రతి 15 నిమిషాలు ఒక టైం బ్లాక్)లలో మాత్రమే స్వల్పంగా కొనాల్సి రావొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఉదయం, సాయంత్రం పీక్ డిమాండ్ వేళల్లో జెన్‌కో థర్మల్ కేంద్రాల నుంచి గరిష్ఠ విద్యుత్ ఉత్పత్తి చేయాలని యోచిస్తున్నారు.

ఇదీ అధికారుల ప్రణాళిక

ఉత్పత్తి సంస్థ	విద్యుత్ ఉత్పత్తి (ఎంయూల్లో)
ఏపీ జెన్‌కో (థర్మల్, హైడల్ కలిపి)	128
ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్లు	50
సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్లు	40
సౌర విద్యుత్	28
పవన విద్యుత్	10
మొత్తం	**256**

థర్మల్ కేంద్రాల్లో భారీగా బొగ్గు నిల్వలు

వేసవిలో కరెంటు కోతలను నివారించడంలో ఏపీ జెన్‌కోదే కీలక బాధ్యత. థర్మల్ కేంద్రాల ఉత్పత్తి సామర్థ్యం 80-85% వరకు ఉండేలా అధికారులు ప్రణాళికలు రచించారు. తదనుగుణంగా రికార్డు స్థాయిలో బొగ్గు నిల్వలను జెన్‌కో సిద్ధం చేసింది. విజయవాడ వీటీపీఎస్, కడప ఆర్‌టీపీపీ, కృష్ణపట్నంలో ఇప్పటికే 12.88 లక్షల టన్నుల బొగ్గు నిల్వ చేసింది. అవి 15-18 రోజుల పాటు విద్యుత్ ఉత్పత్తికి సరిపోతాయి. గత పదేళ్లలో ఇంతమొత్తంలో బొగ్గు నిల్వలు ఉంచడం ఇదే మొదటిసారి. బొగ్గు సరఫరా సంస్థలకు గడువులోగా బిల్లులు చెల్లిస్తుండటంతో బొగ్గు నాణ్యత కూడా పెరిగింది. జెన్‌కో థర్మల్ ప్లాంట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 6,610 మెగావాట్లు. గతంలో వైకాపా ప్రభుత్వం థర్మల్ కేంద్రాలకు సరిపడా బొగ్గు సమకూర్చకుండా ఇబ్బందులు పెట్టింది. వ్యాగన్లలో బొగ్గు వస్తేనే ఉత్పత్తి చేసే పరిస్థితి ఉండేది. అప్పట్లో జెన్‌కో ఉత్పత్తి సామర్థ్యం వేసవిలోనూ 50-60 శాతానికి మించలేదు. అందుకే బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు కొని, ఆ భారాన్ని డిస్కంలపై.. అంతిమంగా వినియోగదారులపై మోపారు.

● రాష్ట్ర ప్రభుత్వం 5 లక్షల టన్నుల విదేశీ బొగ్గు కోసం అదానీ సంస్థతో ఇప్పటికే ఒప్పందాన్ని కుదుర్చుకుంది. జూన్ నాటికి విదేశీ బొగ్గు రానుంది. ఇప్పటికే 75 వేల టన్నుల బొగ్గు కృష్ణపట్నానికి చేరింది.

పర్యాటక ప్రాజెక్టులకు నజరానా!

- ఏడాదిలోగా పనులు పూర్తిచేస్తే 2% ప్రోత్సాహకం
- రెండేళ్లలో పూర్తయితే 1 శాతం
- గడువులోగా ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం కొత్త విధానం

ఈనాడు, అమరావతి: పర్యాటక ప్రాజెక్టుల ఏర్పాటుకు పెద్దఎత్తున అనుమతులిస్తున్న ప్రభుత్వం.. వాటిని సకాలంలో పూర్తి చేసే యజమానులకు ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించింది. పనులు ప్రారంభించాక ఏడాదిలో ప్రాజెక్టు పూర్తి చేస్తే స్థిర మూలధన పెట్టుబడి (ఎఫ్‌సీఐ)పై 2 శాతం ప్రోత్సాహకాలు ఇవ్వనుంది. రెండేళ్లలో పూర్తిచేస్తే శాతం అందించనుంది. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడంతో పాటు పలు రాయితీలతో పారిశ్రామిక విధానాన్ని (2024-29) ప్రకటించిన తర్వాత ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక సంస్థలు ముందుకొస్తున్నాయి. ప్రైవేటు/ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ)లో ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులిస్తోంది. గత ఎనిమిది నెలల్లో పర్యాటక రంగంలో 31 ప్రాజెక్టులకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) అనుమతులిచ్చింది. వీటిలో అత్యధికం స్టార్ హోటళ్లు, రిసార్ట్‌లు ఉన్నాయి. రూ.5 వేల కోట్లకుపైగా పెట్టుబడి అంచనాలతో నిర్మాణ పనులు కూడా మొదలయ్యాయి.

◆ సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) మదింపు తర్వాత పర్యాటకశాఖ ఖరారు చేసిన ప్రాజెక్టు విలువపైనే ప్రోత్సాహకాలు అందిస్తారు.

◆ ఏడాది నుంచి రెండేళ్లలో పూర్తి చేసిన ప్రాజెక్టులపై వాటి యాజమాన్యాలు ప్రోత్సాహకాల కోసం క్లెయిమ్ చేయాలి.

ఎంఎస్ఎంఈలకూ ప్రోత్సాహకాలు

పర్యాటక రంగంలో రూ.50 కోట్లలోపు పెట్టుబడితో చేపట్టే ప్రాజెక్టులను సూక్ష్మ, చిన్న, మధ్యతరహా క్యాటగిరీకి చెందినవిగా (ఎంఎస్ఎంఈ) పరిగణించి వాటికి కూడా ప్రోత్సాహకాలు అందించనున్నారు. ఇలాంటి వాటికి పెట్టుబడి (ఎఫ్‌సీఐ)పై 25% రాయితీ ఇవ్వనున్నారు. మైక్రో యూనిట్లకు రూ.25 లక్షలు, చిన్న ప్రాజెక్టులకు రూ.1.5 కోట్లు, మధ్య తరహా ప్రాజెక్టులకు రూ.7.5 కోట్ల వరకు ప్రోత్సాహకాలు అందించనున్నారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీలు, వికలాంగులకు అదనంగా మరో రూ.10 లక్షలు అందిస్తారు.

పారిశ్రామిక హోదాతో లాభం ఇలా..

◆ పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం ద్వారా పరిశ్రమలకు అందిస్తున్న రాయితీలన్నీ పర్యాటక ప్రాజెక్టులకూ వర్తిస్తాయి.

◆ పరిశ్రమలకు అమలు చేస్తున్న విద్యుత్తు టారిఫ్ రేట్లే పర్యాటక ప్రాజెక్టులకు కూడా వర్తిస్తాయి. ఐదేళ్ల పాటు ఎలక్ట్రిసిటీ డ్యూటీ యూనిట్‌కు రూ.1కి పరిమితం చేస్తారు.

◆ పరిశ్రమలకు విధిస్తున్న ఆస్తి పన్ను, నీటి సరఫరా, యూజీడీ ఛార్జీలు పర్యాటక ప్రాజెక్టులకూ అమలు చేస్తారు.

◆ పెట్టుబడి-ఉద్యోగాల కల్పన నిష్పత్తి ఆధారంగా రాయితీలను ప్రభుత్వం అందిస్తుంది.

ఎస్క్రో ఖాతా ప్రారంభించేందుకు సన్నాహాలు

వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టే సంస్థలకు ప్రోత్సాహకాలు నేరుగా అందిచేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతా త్వరలో ప్రారంభించనుంది. దేశంలో ఎక్కడాలేని విధంగా ఈ విధానాన్ని రాష్ట్రంలో తొలిసారి అమలు చేయనున్నామని సీఎం చంద్రబాబు ఇటీవల ప్రకటించారు. ఈ మేరకు అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నారు.

ట్రిపుల్‌ఐటీల్లో నిలిచిపోయిన స్నాతకోత్సవాలు

- ఒరిజినల్ డిగ్రీ పట్టాల కోసం 16 వేల మంది విద్యార్థుల ఎదురుచూపులు

వేంపల్లె, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో నాలుగేళ్లుగా స్నాతకోత్సవాలు నిర్వహించడం లేదు. దాంతో ఆయా ట్రిపుల్‌ఐటీల్లో ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సు పూర్తిచేసిన 16 వేల మంది విద్యార్థులు ఒరిజినల్ డిగ్రీ పట్టాల(ఓడీ) కోసం ఎదురుచూస్తున్నారు. వర్సిటీ కార్యకలాపాలు అస్తవ్యస్తంగా ఉండటం, పట్టించుకునేవారు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొన్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

◆ నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో కలిపి సుమారు 24 వేల మంది ఇంజినీరింగ్ చదువుతున్నారు. ఒక్కో ట్రిపుల్ ఐటీ నుంచి ఏటా 1000 మంది విద్యార్థులు బీటెక్ పూర్తిచేస్తున్నారు. ప్రతిసారి ఇడుపులపాయ లేదా నూజివీడు ట్రిపుల్‌ఐటీలో వేదిక ఏర్పాటు చేసి స్నాతకోత్సవం నిర్వహిస్తుంటారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆహ్వానించి.. ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖ విశ్వవిద్యాలయాల అధికారులను పిలిచి వారి సమక్షంలో ఒరిజినల్ డిగ్రీ పట్టాలు అందిస్తుంటారు.



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ

2021లో బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులకు 2022 ఫిబ్రవరి 26న ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో అప్పటి ఉన్నత విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో చివరిగా స్నాతకోత్సవం నిర్వహించారు. ఆ తర్వాత 2022, 2023, 2024, 2025 సంవత్సరాలకు సంబంధించిన వారికి ఆ దిశగా అడుగులు పడలేదు. నిబంధనల ప్రకారం ఏటా స్నాతకోత్సవాలు నిర్వహించి.. విద్యార్థులకు ఓడీతో పాటు ప్రతిభ చూపిన వారికి బంగారు పతకాలు అందించాలి. ఈ విషయంపై ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య అమరేంద్రకుమార్ మాట్లాడుతూ.. వర్సిటీకి రెగ్యులర్ వీసీ వచ్చిన తర్వాత స్నాతకోత్సవం నిర్వహించి విద్యార్థులకు అధికారికంగా ఒరిజినల్ డిగ్రీ పట్టాలు ఇస్తామని వెల్లడించారు.

'ప్రతి నర్సింగ్ విద్యార్థి విపత్తు స్వచ్ఛంద సేవకులుగా నమోదు కావాలి'

ఈనాడు, అమరావతి: ప్రతి నర్సింగ్ విద్యార్థి విపత్తు స్వచ్ఛంద సేవకులుగా నమోదు చేసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట్ దీపక్ సూచించారు. 'ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రి సంసిద్ధత' అనే అంశంపై మంగళవారం కుంచనపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి మంగళగిరి ఎయిమ్స్ నుంచి నర్సింగ్ చివరి సంవత్సర విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వెంకట్ వివరించారు. ఆసుపత్రి ప్రణాళిక, ముందస్తు సంరక్షణ చర్యలు, అగ్ని ప్రమాదాలు, విపత్తుల సంసిద్ధత, ప్రతిస్పందన, ముందస్తు పరికరాల అవసరం తదితర అంశాలపై ప్రాజెక్టు మేనేజర్లు బస్వంత్, సతీశ్ మాట్లాడారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై కేంద్రానికి వైకాపా లేఖ సిగ్గుచేటు

మాజీ మంత్రి సోమిరెడ్డి ధ్వజం

ఈనాడు, అమరావతి: ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో సామాన్యుల ఆస్తి హక్కులను వైకాపా ప్రభుత్వం బలిపీఠం ఎక్కించిందని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దుచేస్తే.. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు కేంద్రానికి లేఖ రాయడం సిగ్గుచేటన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ధర్మాన రాసిన లేఖపై కేంద్రం లోతుగా విచారణ జరిపితే వైకాపా హయాంలో జరిగిన భూ అక్రమాలకు శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. నీతి ఆయోగ్ మహారాష్ట్ర విధానాన్ని అధ్యయనం చేయమంటే.. వైకాపా ప్రభుత్వం దానికి విరుద్ధంగా ప్రజల హక్కులను హరించే సెక్షన్లు చేర్చిందని, ఇష్టారీతిన తమకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుందన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన..ధర్మాన ప్రజల ఆస్తి హక్కులను హరించే దుర్మార్గమైన చట్టాన్ని ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వంలో రీసర్వే పేరుతో లక్షల ఎకరాలను 22ఏ జాబితాలో చేర్చారని గుర్తుచేశారు. మంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి అనుచరులు సర్వేపల్లి నియోజకవర్గంలో మర్రిపల్లిలో 2023లో జరిగిన రీసర్వేలో 566 ఎకరాల భూమిని వివాదాల్లోకి నెట్టారని, ఎఫ్ఎల్ఎం నంబర్ల మార్పు వల్ల వందల మంది రైతులు సొంత భూములపై హక్కులు కోల్పోయారని ఆరోపించారు. పర్లపల్లిలో 445 మంది రైతులకు చెందిన 254 ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా 22ఏలో పెట్టారని మండిపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన 57 ఎకరాల భూమికి తప్పుడు రికార్డులు సృష్టించారని, చిన్నచిన్న కమతాలూ వదల్లేదన్నారు. పొదలకూరు మండలంలో భూ అక్రమాలపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించిందని సోమిరెడ్డి తెలిపారు.

ఈయూ వాణిజ్య ఒప్పందం కీలక మలుపు

మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: 'భారతదేశ వాణిజ్యంలో ఒక కొత్త అధ్యాయం, పెద్ద ముందడుగు పడింది. భారత్ - యూరోపియన్ యూనియన్ (ఈయూ) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) అనేక భారతీయ పరిశ్రమలకు కీలక మలుపు అవుతుంది. ప్రపంచ వాణిజ్యానికి సంబంధించి వ్యూహాత్మక పురోగతి ఏర్పడుతుంది. ఏపీలోని పలు రంగాలు.. సముద్ర ఉత్పత్తులు, వ్యవసాయ వస్తువులకు ఈయూ మార్కెట్‌లో తక్షణ ప్రాధాన్యం దక్కుతుంది. ఎఫ్‌టీఏ వల్ల 75 బిలియన్ల విలువైన ఎగుమతులకు అవకాశం ఏర్పడుతుంది. దీనివల్ల రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు, మహిళలు, యువత, వృత్తి ఉద్యోగులకు ప్రోత్సాహం లభిస్తుంది. భారత్-ఈయూ సమ్మిట్‌లో ఈ ప్రకటన చేసిన ప్రధాని నరేంద్రమోదీ, ఈయూ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయన్‌కు కృతజ్ఞతలు.. అభినందనలు' అని మంత్రి లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

ఏపీలో తుక్కు వాహనాలు 2.39 లక్షలు

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో తుక్కుగా మార్చేందుకు వీలైన వాహనాలు 2,39,560 దాకా ఉన్నట్లు నీతి ఆయోగ్ అంచనా వేసింది. దేశవ్యాప్తంగా ఇలాంటి వాహనాలు 45.61 లక్షల దాకా ఉన్నట్లు పేర్కొంది. కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్‌లో అత్యధికంగా 5 లక్షలకుపైగా ఉన్నట్లు తెలిపింది. కాలం తీరిన వాహనాలను తుక్కుగా మార్చి సర్క్యులర్ ఎకానమీని పెంచడంపై నీతి ఆయోగ్ మంగళవారం విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ వాహనాలను తుక్కుగా మార్చే కేంద్రాల ఏర్పాటు లాభదాయకంగానే ఉంటుందని పేర్కొంది. అయితే దేశంలో ఉన్న వాహన తుక్కు కేంద్రాలు కేవలం 20%లోపు సామర్థ్యంతోనే పనిచేస్తుండటం వాటి లాభదాయకతను దెబ్బతీస్తోందని నీతి ఆయోగ్ అభిప్రాయపడింది.

6న నీటి వినియోగ సంఘాలతో సీఎం సమావేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర నీటి విధానం తయారీకి సంబంధించి నీటి వినియోగ సంఘాల సభ్యులతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించనున్నారు. వచ్చే నెల 6న మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 4:30 వరకు సమావేశం ఉంటుందని జలవనరుల శాఖ అధికారులు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనే వారు తమ వివరాలు, ప్రెజెంటేషన్ పంపాలని సూచించారు.

2న బ్రిటన్‌కు మంత్రి నారాయణ

ఈనాడు, అమరావతి: పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఆ శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఫిబ్రవరి 2 నుంచి ఐదో తేదీ వరకు బ్రిటన్, ఖతార్‌లలో పర్యటించనున్నారు. అమరావతిలో ప్రతిపాదిత క్రీడా నగరం అభివృద్ధికి సంబంధించి అధ్యయనం కోసం వారు ఈ పర్యటనకు వెళుతున్నారు. క్రీడానగరాల నిర్మాణంలో అంతర్జాతీయంగా అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాల్ని వారు పరిశీలిస్తారు.

తమిళనాడు సరిహద్దు వరకు రోడ్డు విస్తరణకు రూ.18.30 కోట్లు

ఈనాడు, అమరావతి: చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గ పరిధిలోని మల్లనూరు నుంచి అడవిబుడుగూరు మీదుగా తమిళనాడు సరిహద్దు వరకు ఉన్న 7.2 కి.మీ రోడ్డు విస్తరణకు రూ.18.30 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వీసీఐసీ ప్రాజెక్టు పెండింగ్ బిల్లుల కోసం రూ.255 కోట్లు కేటాయింపు

ఈనాడు, అమరావతి: విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ (వీసీఐసీ) ట్రాంచ్ 1, 2 సబ్ ప్రాజెక్టుల పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు రూ.255 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ నిధుల నుంచి ఈ మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

రూ.2,500 కోట్ల రుణ సమీకరణ

ఈనాడు, అమరావతి: రిజర్వుబ్యాంకు మంగళవారం నిర్వహించిన సెక్యూరిటీల వేలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాల్గొని రూ.2,500 కోట్ల రుణం తీసుకుంది. తొమ్మిదేళ్ల కాలపరిమితితో తిరిగి తీర్చేలా 7.48% వడ్డీ ధరకు రూ.1,000 కోట్లు, మరో 17 ఏళ్లలో తిరిగి తీర్చేలా 7.59% వడ్డీకి రూ.1,500 కోట్ల రుణం సమీకరించింది. ఈ మొత్తం బుధవారం రాష్ట్ర ఖజానాకు జమకానుంది.

ఏపీ ఫార్మసీ కౌన్సిల్ ఇన్‌ఛార్జిగా చక్రధర్‌బాబు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ ఇన్‌ఛార్జిగా సెకండరీ హెల్త్ సంచాలకులు కె.వి.ఎన్.చక్రధర్‌బాబును ప్రభుత్వం నియమించింది. గతంలో ఫార్మసీ కౌన్సిల్‌కు ఇన్‌ఛార్జిగా వ్యవహరించిన ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ గిరీషా బదిలీ కావడంతో.. చక్రధర్‌బాబుకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

స్వచ్ఛ హరిత విద్యాలయ రేటింగ్‌లో.. జాతీయస్థాయికి 20 పాఠశాలల ఎంపిక

ఈనాడు, అమరావతి: 'స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్-2025' కార్యక్రమంలో భాగంగా జాతీయస్థాయికి ఎంపికైన 20 పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు మంగళవారం అభినందించారు. వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. పాఠశాలల్లో సురక్షితమైన తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, సబ్బుతో చేతులు కడుక్కునే అలవాటు, వ్యర్థాల నిర్మూలన, మొక్కలు నాటడం లాంటి అంశాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యాసంస్థలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేస్తుంది. దేశవ్యాప్తంగా ఎంపికయ్యే 200 పాఠశాలలకు రూ.లక్ష చొప్పున నగదు పురస్కారాన్ని మంజూరు చేస్తుంది. ఆయా బడుల ప్రధానోపాధ్యాయులకు విజ్ఞానయాత్రకు అవకాశం కల్పిస్తుంది. ఈ సందర్భంగా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. "మంచి పద్ధతులను ఆయా బడులకే పరిమితం చేయకుండా క్లస్టర్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలకు విస్తరించాలి. వాటిని సైతం హరిత పాఠశాలలుగా తీర్చిదిద్దాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ సీమ్యాట్ డైరెక్టర్ వీఎన్ మస్తానయ్య పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీతో షర్మిల భేటీ

2న ఏపీలో నిర్వహించే ఆందోళన కార్యక్రమానికి ఆహ్వానం



ఈనాడు, దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం ఇక్కడి 10-జన్‌పథ్‌లో భేటీ అయ్యారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దుకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టబోతున్న ఆందోళన కార్యక్రమాల గురించి ఆయనకు వివరించినట్లు షర్మిల విలేకర్లతో చెప్పారు. "పేదల పొట్టకొట్టడానికి భాజపా చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని నిర్ణయించాం. నరేగా పథకాన్ని సరిగ్గా 20 ఏళ్ల కిందట ఫిబ్రవరి 2న ఆంధ్రప్రదేశ్‌లో నాటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్, సోనియాగాంధీ, వైఎస్ రాజశేఖరరెడ్డిలు మొదలుపెట్టారు. ఆ పథకాన్ని కాపాడుకోవడానికి అదేరోజు ఏపీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించబోతున్నాం. దీనికి రాహుల్‌గాంధీని ఆహ్వానించాం. తప్పకుండా వస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో కూడా భేటీ అయ్యాను" అని షర్మిల వెల్లడించారు.

డిజిటల్ అంతరాలను తగ్గించేందుకు జియో ఏఐ ఎడ్యుకేషన్

ఈనాడు, అమరావతి: విద్యా రంగానికి అధునాతన కృత్రిమ మేధ (ఏఐ) నైపుణ్యాలను అందించడం ద్వారా డిజిటల్ వ్యత్యాసాన్ని తగ్గించేందుకు రిలయన్స్ జియో ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతమైన విద్యా ప్రచారాన్ని ప్రారంభించింది. ఆధునిక యుగంలో అభ్యాస, బోధన పద్ధతులను మెరుగుపరిచేందుకు 'గూగుల్ జెమిని ప్రో' అప్లికేషన్‌పై దృష్టి సారించినట్లు ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. అత్యాధునిక ఏఐ సాధనాలను తరగతి గదుల్లోకి తీసుకురావడం ద్వారా డిజిటల్ నైపుణ్యం కలిగిన విద్యార్థులు, ఉపాధ్యాయులను తయారు చేయడమే లక్ష్యంగా జియో ఈ ప్రచారాన్ని కొనసాగిస్తోంది. ఏపీలో 1500కు పైగా పాఠశాలల్లో ఈ ప్రచారం నిర్వహించింది. 20,000కు పైగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. యువతకు నైపుణ్యాలు అందించేందుకు 'జియో ఏఐ క్లాస్ రూమ్' అనే నాలుగు వారాల ఉచిత ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రాంను ప్రవేశపెట్టింది. విద్యార్థులు jio.com/ai-classroom పోర్టల్ ద్వారా ఈ శిక్షణ పొందవచ్చు.

దేశం కోసం కాళ్లు పోగొట్టుకున్న.. సైనికాధికారికి దక్కే గౌరవం ఇదేనా?

- టోల్ సిబ్బంది అమానుష ప్రవర్తన దారుణం
- కర్ణాటకలో మాజీ అధికారి ఆవేదన



వీడియోలో మాట్లాడుతున్న శ్యామరాజ్

ఈనాడు, బెంగళూరు: ఆపరేషన్ పరాక్రమ్‌లో కాళ్లు కోల్పోయిన మాజీ సైనికాధికారితో టోల్ సిబ్బంది అమానుషంగా ప్రవర్తించిన సంఘటన కర్ణాటకలో చోటు చేసుకుంది. బాధితుడు శ్యామరాజ్(42) స్వయంగా రికార్డు చేసి పోస్టు చేసిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. టోల్ సిబ్బంది పట్ల పలువురు నెటిజన్లు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక-కేరళ సరిహద్దు ప్రాంతం కాసరగోడ్‌లో ఉంటున్న మాజీ ఆర్మీ కమాండర్ శ్యామరాజ్ సోమవారం ఉడుపి జిల్లా కుందాపురలోని సస్తాన టోల్ ప్లాజా మీదుగా వెళ్తుండగా అక్కడి సిబ్బంది అడ్డుకున్నారు. మాజీ సైనికుడిగా తనకు దేశంలో ఏ టోల్ ప్లాజా నుంచైనా స్వేచ్ఛగా వెళ్లే వీలుందని సిబ్బందితో ఆయన చెప్పారు. తన గుర్తింపు కార్డు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన టోల్ ఫ్రీ కార్డులనూ వారికి చూపారు. అయినప్పటికీ టోల్ చెల్లించాల్సిందేనని వారు పట్టుబట్టారు. సైనికులకు ఉన్న మినహాయింపుల గురించి సిబ్బందికి తెలిసినా తెలియనట్లే ప్రవర్తిస్తున్నారని శ్యామరాజ్ ఆరోపించారు. 'నేను దేశం కోసం యుద్ధం చేసి కాళ్లు కోల్పోయాను. మాలాంటి సైనికులకు ఈ దేశంలో దొరికే గౌరవం ఇదేనా?' అని శ్యామరాజ్ ప్రశ్నించారు. కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్‌గడ్కరీ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని మనవి చేశారు. దురుసుగా ప్రవర్తించిన టోల్ సిబ్బందిపై కేసు నమోదు చేసుకున్నట్లు కుందాపుర పోలీసులు వెల్లడించారు.

85.43 లక్షల టన్నుల వ్యర్థాల తొలగింపునకు రూ.672.83 కోట్లు

ఈనాడు, అమరావతి: పుర, నగరపాలక సంస్థల డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన 85.43 లక్షల టన్నుల వ్యర్థాల (బయో మైనింగ్) తొలగింపునకు అవసరమైన రూ.672.83 కోట్లకు పరిపాలన అనుమతులిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వు జారీచేసింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లెగసీ వేస్ట్ మేనేజ్‌మెంట్‌ల కింద ఈ నిధులు మంజూరు చేసింది. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.167.28 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.110.48 కోట్లు, పుర-నగరపాలక సంస్థల వాటా రూ.395.07 కోట్లుగా ఉత్తర్వులో పేర్కొంది. బయో మైనింగ్ చేపట్టనున్నవిగాక.. అదనంగా 21.22 లక్షల టన్నుల వ్యర్థాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిని తొలగించే విషయంలో అన్ని అంశాలు పరిశీలించేందుకు సాంకేతిక కమిటీని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వు జారీచేసింది. దీనికి ప్రజారోగ్య శాఖ ఈఎన్‌సీ ఛైర్మన్‌గా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సీఈ కన్వీనర్‌గా ఉంటారని పేర్కొంది.

13 సమీకృత ప్రజారోగ్య ప్రయోగశాలలు

మంత్రి సత్యకుమార్ యాదవ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 13 ప్రాంతీయ ఆసుపత్రుల్లో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీ (ఐపీహెచ్ఎల్)లను ఈ ఏడాది ఏప్రిల్ నాటికి అందుబాటులోకి తేనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వ్యాధులకు సంబంధించిన 134 రకాల పరీక్షలు ఈ ల్యాబ్‌లలో జరుగుతాయని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీతంపేట, గుంతకల్లు, పలమనేరు, అరకు, నరసరావుపేట, అగనంపూడి, బనగానపల్లి, చీరాల, నందిగామ, జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రుల్లో నిర్మాణాలు కొలిక్కి వచ్చాయని, తుని, గూడూరు, అనపర్తి ఆసుపత్రుల్లో నిర్మాణ దశలో ఉన్నట్లు వెల్లడించారు.

కాల్వల్లో పూడికలు తొలగించాలి

ఈనాడు, అమరావతి: వర్షాకాలానికి ముందు మాత్రమే కాల్వల్లో పూడిక తొలగింపు చేపట్టకుండా.. కాల్వలను బట్టి ఎప్పుడెప్పుడు, ఎన్నిసార్లు తొలగించాలో పేర్కొంటూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. వీటిని రాష్ట్రంలోని అన్ని పుర, నగరపాలక సంస్థలు పాటించాలని పేర్కొంది.

◆ చిన్న కాల్వల్లో మూడు రోజులకోసారి పూడిక తొలగించి, శుభ్రం చేయాలి.

◆ మధ్యస్థాయి కాల్వల్లో నెలకోసారి.. ప్రధాన కాల్వలు, వాగులు, వంకలు, నాలాలు, స్ట్రీమ్స్‌లో వర్షాకాలానికి ముందు, తర్వాత పూడిక తొలగించాలి.

(c) eenadu